# శ్రీమద్భాగవతం

రచయిత :

ఉషశ్రీ

ప్రచురణ :

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

# ముందుమాట

ఏ దేశంలో అయినా ఏ కాలంలో కానివ్వండి, ఏ మతం ప్రచారంలో వుంటుందో దాని ప్రభావమే ఆ దేశాకాలాలకు సంబంధించిన సాంఘిక రాజకీయ సారస్వతాది సర్వ విషయాల మీద ప్రసరిస్తుంటుంది. హిందువులయిన భారతీయులకు శ్రుతిస్మృతి పురాణేతిహాసాలు పరమ పవిత్రాలు. వేదహితాలైన ధర్మాలే ధర్మశాస్త్రాలలో చెప్పబడ్డాయి. అవే పురాణేతిహాసాలలో అనేక ఆఖ్యానాల మూలంగా, విధి నిషేధ వివరణ పూర్వకంగా వివరించారు. మొత్తం మీద హిందువులందరికీ వైదిక ధర్మాలు ఆదరణీయాలు.

పంచమవేదంగా ప్రసిద్ధిచెందిన మహాకావ్యాన్ని ఆదికవి నన్నయ ఆంధ్రవాణి రూపంలో అవతరింపజేసి సుమారు వేయేళ్లయింది. ఆ గ్రంథం సకల విషయ సంభరితమై ఆనాటి ఆంధ్ర సంస్కృతినంతనూ అక్షరరూపంలో సంతరించుకున్నది. ఈ వేయి వసంతాలలో ఎన్నో కావ్యాలు ఆవిర్భవించాయి. అయితే నేటికీ, రకరకాల రాజకీయ సాంఘిక పరిస్థితుల ధాటికి మిగిలినవి కొన్ని మాత్రమే.

కావ్యాల ద్వారా నీతిని ఉపదేశించడం మనదేశంలో అనాది సిద్ధమైన ఆచారం. బహుళ ప్రచారంలో వున్న ఉత్తమ శ్రేణికి చెందిన ప్రాచీన కావ్యాలు ప్రజలలో వేదాలపట్ల, వేదాంత సిద్ధాంతాలపట్ల విశ్వాసం పెంపొందిస్తున్నాయి. ఈ లోకంలో మానవులకు అవసరమైన ఆత్మగౌరవం, అభినివేశం, దృఢప్రవృత్తి, కార్యదీక్ష, ధర్మానుష్ఠానం, సాంఘికసేవ, పరోపకారం వంటి సద్గుణాలను అవి అతిసుందరంగా, భావగంభీరంగా విశదీకరిస్తున్నాయి. రామాయణ భారత భాగవతాది గ్రంథాలు పఠన పాఠనాల మూలంగా అక్షరాస్యులందరికీ ఆనందం కలగజేస్తూ అసాధారణంగా వన్నెకెక్కాయి.

సంప్రదాయ సాహిత్యంలో వర్తమానకాలాన్ని ఉజ్జీవింపజేయుగల ఉజ్జ్వల సత్యాలను గుర్తించేటట్లు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం సంకల్పం. సాహిత్య రసికులకు ఆనందం, విద్యార్థులకు అవబోధం కలిగించడానికి అందరికీ అందుబాటులో వుండే విధంగా ప్రాచీన గ్రంథాల ప్రచురణకు కూడా పూనుకున్న కొద్దికాలంలోనే వీటిపట్ల ప్రజలలో చక్కని అభిరుచి, ఆదరణ కానవచ్చాయి.

ప్రజలకు — ముఖ్యంగా విద్యార్థులకు విషయ పరిజ్ఞానం కలిగించి, భావ వికసనంకూర్చేందుకు, మేధాశక్తిని పెంచేందుకు ఈ గ్రంథాలు మిక్కిలి ప్రయోజనకారులు కాగలవని మా ప్రగాఢ విశ్వాసం. ఈ పుస్తకం ప్రథమ ముద్రణ 1979లో శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ I.A.S., గారు కార్యనిర్వహణాధికారిగా ఉన్న సమయంలో జరిగింది. ఆ తరువాత 1982, సంవత్సరములో పునర్ముద్రణ జరిగింది. ప్రతులన్ని అనతి కాలంలో అయిపోవడం వల్ల మరల ముద్రింపబడుతున్న ఈ గ్రంథాన్ని మునుపటిలాగే ఆంధ్ర పాఠక మహాశయులు ఆదరించగలరని ఆశిస్తున్నాము.

ఎమ్.వి.యస్. ప్రసాద్,

తిరుపతి, కార్యనిర్వహణాధికారి,

22-8-1992. తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# సత్యభామ

సౌవర్ణ కంకణ ఝుణ ఝుణ నినదంబు
శింజినీ రవముతో చెలిమిసేయ
తాటంక మణి గణ ధగ ధగ దీప్తులు
గండమండల రుచి గప్పికొనగ
ధవళేత రాపాంగ ధళ ధళ రోచులు
బాణజాల ప్రభావటలి నడప
శరపాత ఘుమ ఘుమ శబ్దంబు
పరవంధి సైనిక కలకల స్వనము నుడుప

వీర శృంగార భయ రౌద్ర విస్మయములు
గలసి భామిని యయ్యెనో కాక యనగ
ఇషువు దొడగుట దివుచుట యేయు టెల్ల
నెరుగ రాకుండ అని సేసె నిందు వదన.

పరు జూచున్ వరు జూచు నొంప నలరింపన్
రోష రాగోదయా
విరత భ్రూకుటి మందహాసములతో
వీరంబు శృంగారమున్
జరగన్ గన్నుల గెంపు సొంపు బరగం
జండాస్త్ర సందోహమున్
సరసాలోక సమూహమున్
నెరపుచుం జంద్రాస్య హేలాగతిన్

అలినీలాలక చూడ నొప్పెసగె ప్రత్యాలీఢ పాదంబుతో
అలిక స్వేద వికీర్ణకాలకలతో ఆకర్ణికాసీత
నల్లలిత జ్యా నఖ పుంఖ దీధితులతో లక్ష్యావలోకంబుతో
వలయాకార ధనుర్విముక్త విశిఖ వ్రాతాహ తారాతియై.

బొమ్మ పెండ్లిండ్లకు బో నొల్ల నను
        బాల రణరంగమున కెట్లు రాదలంచె!
మగవారి గనిన దా మరుగు జేరెడు
        ఇంతి పగవారి గెల్వ నే పగిది జూచె!
పసిడి యుయ్యెల లెక్క భయమందు భీరువు
        ఖగపతి స్కంధ మే కడిది నెక్కె!
సఖుల కోలాహల స్వనము లోర్వని
        కన్య పటహ ఝాంకృతుల కెబ్బంగి నోర్చె!

నీలకంఠములకు నృత్యంబు గరపుచు
నలసి తలగి పోవు నలరుబోడి
ఏ విధమున నుండె నెలమి నాలీఢాది
స్థానములను రిపుల మాన మడప.

వీణ జక్కగబట్ట వెర వెరుంగని కొమ్మ
        బాణాసనం బెట్లు పట్ట నేర్చె!
ప్రామినుస దీగె గూర్పంగ నేరని లేమ
        గుణము నేక్రియ ధనుఃకోటి గూర్చె!
సరవి ముత్యము గ్రువ్వజాలని యబల
        యే నిపుణత సంధించె నిశిత శరము!
చిలుకకు పద్యంబు చెప్పనేరని తన్వి
        యస్త్ర మంత్రము లెన్న డభ్యసించె!

పలుకు మనిన బెక్కు పలుకని ముగుద
యే గతి నొనర్చె సింహగర్జనములు!
అనగ మెరసె త్రిజగదభిరామ గుణధామ
చారు సత్య భామ సత్యభామ.

జ్యావల్లీధ్వని గర్జనంబుగ
        సురల్ సారంగయూథంబుగా
ఆవిల్లింద్రశరాసనంబుగ
        సరోజాక్షుండు మేఘంబుగా

తావిద్యుల్లతభంగి సింతి
        సురజిద్దావాగ్ని మగ్నంబుగా
ప్రావృట్కాలము సేసె
        బాణచయ మంభశ్శీకరశ్రేణిగాన్ !

రాకేందుబింబమై రవిబింబమై
        యొప్పు నీరజాతేక్షణ నెమ్మొగంబు ;
కందర్పకేతువై ఘన ధూమకేతువై
        యలరు పూబోడి చేలాంచలంబు
భాశజు షరిధియై ప్రళయార్క పరిధియై
        మెరయు నాకృష్టమై మెలతచాప
మమృతప్రవాహమై యనల సందోహమై
        తనరారు సింతి సందర్శనంబు ;

హర్షదాయియై మహారోషదాయియై
పరగు ముద్దరాలి బాణవృష్టి
హారిక అరిక జూడ
నందంద శృంగార వీరరసము లోలి విస్తరిల్ల.

— పోతన మహాకవి

భాగవతము – దశమస్కంధము

# స్వస్తి ప్రజాభ్యః

I

శ్రీమద్భాగవతంతోనే నాకు అక్షరజ్ఞానం చేసింది మా అమ్మ. జ్ఞానం కంటె అక్షరదీక్ష అనడం ఉచితంగా ఉంటుంది. నాకు కొద్దిగా మాటలు వచ్చే రోజులలోనే —

ఇందుగల డందు లేడని
సందేహమువలదు చక్రి సర్వోపగతుం
డెం దెందు వెదకి చూచిన
అందందే కలడు దానవాగ్రణి వింటే !

కల డందురు దీనుల యెడ
కల డందురు పరమయోగి గణములపాలన్
కల డందు రన్నిదిశలను
కలడు కలం డనెడువాడు కలడో లేడో !

ఈ పద్యాలు నాచేత కంఠపాఠం చేయించింది అమ్మ యాభైయేళ్ళక్రితం మాట అది. పన్నెండేళ్ళుదాటాక నా చేత గజేంద్రమోక్షం పారాయణం చేయించారు నాన్నగారు. ఇప్పటికీ "శ్రీకంఠ చాపఖండన" దగ్గరనుంచి

"గజరాజ మోక్షణమును
నిజముగ పఠియించునట్టి నియతాత్ములకున్
గజరాజ వరదుఁడిచ్చును
గజ తురగస్యందనములు కైవల్యంబున్"

అన్నంత వరకూ వచనంతో సహా మనసులో చెరిగిపోలేదు.

ఇది నలభైయేళ్ళుగా నలుగుతున్న విషయం.

అయినా —

కూచిభొట్ల కృష్ణావధానులుగారు, వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు, దర్భా సర్వేశ్వరశాస్త్రిగారు, వండూరు రామకృష్ణమాచార్యులవారూ, దిగుమర్తి సీతారామస్వామిగారలు నన్ను వ్యాకరణంలో ముంచి, సాహిత్యంలో తేల్చిన ఫలంగా —

ఆదిలో ఛందోబద్ధంగా పద్యాలు అల్లాను.

అది మనపనికాదని తెలిసి కట్టుకథలు రాశాను. అదీ కాదని తెలిసి రేడియోలో చేరాను. అప్పుడు తెలిసింది నేను రచయితను కాను నోరున్న వాడినని.

నా పదహారో ఏట కాబోలు —

మహానుభావుడు శ్రీధర వెంకయ్యగా రన్నారు.

రావుడూ! (మా నాన్నగారిని అలా పిలిచేవారు పెద్దలు)

మీవాడు నోరుపెట్టుకు బ్రతుకుతాడోయ్ అని.

ఆయన నవద్వీపంలో జ్యోతిశ్శాస్త్రిం చదివిన మహనీయుడు.

ఆయన మాటే నిజ మయింది —

నోరున్నవాడికి పనికివచ్చే రేడియో ఉద్యోగం 1965లో లభించినా 1973లో బెజవాడచేరి, రజనిగారి ఆధిపత్యంలో ఆయనమాట కాదనలేక భారతం చెప్పడం మొదలు పెట్టాను. రామాయణం కూడా చెప్పాను.

భాగవతం చెప్ప అన్నారు రజని

చెప్పలేదు.

ఆ తరువాయి వాలుగేళ్ళకు —

అంటే జీవితభానుడు నడిమింటినుండి పశ్చిమానికి దిగిన యాభై రెండో యేట, ప్రశాంతంగా రామనామస్మరణతో సుందరకాండ పారాయణం చేసే రోజులలో తిరుపతి నుంచి భాగవతం వ్రాస్తావా! అని పిలుపు వచ్చింది.

ఎవరు నమ్మినా నమ్మకపోయినా —

అంతకు రెండురోజులక్రితం వ్యాసపూర్ణిమనాడు దశమస్కంధం వ్రాయడం మొదలుపెట్టాను; మనశ్శాంతి కోసం.

మూడోనాడు ఈ వార్త.

అంతే!

దీక్షగా కూర్చున్నాను.

వ్రాసింది నేను కాదు

వ్రాయించినవాడు తిరుపతి వెంకన్న.

నేను నిమిత్త మాత్రుణ్ణి.

పరమేశ్వరుడు ఈ ప్రాణికి ఆ అవకాశం యిచ్చాడు.

ఇప్పించేటట్టు చేశాడు ప్రసాద్‌గారి చేత! అంతా ఆయన లీల!

(శ్రావణపూర్ణిమ)

# II

శ్రీమద్భాగవతం చదివిన భగవద్భక్తు లందరికీ ప్రణామాలు - సంస్కృతభాగవతం చదివిన వారికీ, పోతన్నగారు భక్తిరసభరితంగా అందించిన పద్యభాగవతం చదవగల వారికి ఈ వచనం అవసరంలేదు· వారు ధన్యులు.

మానవానికి భాగవతం యీమాత్రమయినా అందించగలనని అనుకోలేదు. అనుకుని ఉంటే లక్షశ్లోకాల భారతం, ఇరవైనాలుగువేల శ్లోకాల రామాయణం హాయిగా సుఖంగా వ్రాయగలిగిన వాణ్ణి అయిదుసంవత్సరాలు యిది విడిచిపెట్టేవాణ్ణి కాదు.

కా దు కా ని—

కవిత్రయం తరువాయి భారతాన్నీ, పోతన్నగారి అనంతరం భాగవతాన్నీ తెలుగు వారికి అందించబూనడం బాలచేష్ట కావాలి; దుస్సాహసం కావాలి, అని తెలిసినా—

భారతప్రవచనానికి సాహసించినప్పుడు అది విన్న దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారి వంటి వ్యాకరణశాస్త్రవేత్త మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి వంటి ఆంధ్రపురాణ కర్త ఆనందంతో ఆశీర్వదించగా తెలిసింది. నాజన్మ చరితార్థం కావాలంటే భారత రామాయణాలు పలకాలనీ, పలికి నా తెలుగు సోదరులను పులకింపజేసి కవిత్రయానికీ వాల్మీకికీ సన్నిహితులను చెయ్యాలని; తెలుసుకున్నాను.

మూడు సంవత్సరాలవ్యవధిలో ఆకాశవాణి (విజయవాడ)లో పలికే అవకాశం కలిపించి, యథాతథం ప్రచురించుకోవడానికి ఆదరంతో అనుమతించిన సంస్కార రసహృదయులు బాలాంత్రపు రజనీకాంతరావుగారికి నేనే కాదు రేడియోశ్రోతలందరూ ఋణపడి వున్నారు.

భాగవతంకూడా వినిపించి పూనిఋణం తీర్చుకో! అన్నా రాయన. పోతన్నగారికి భయపడి అటు పోలేదు.

ఎందుకంటే ఆయనే భయపడ్డాడు—

భాగవతము తెలిసి పలుకుట కష్టంబు
శూలికైన తమ్మిచూలి కైన——అని

అయినా ఆయన సాహసించాడు, భక్తితో.

ఎంత భక్తితో సాగించినా ఏ ఏ ఘట్టాలలో తెలిసి పలకడం కుదరదనుకు అవి వదిలిపెట్టా డాయన. ఆ వేదాంత సాంఖ్య యోగశాస్త్ర విషయాలను న సింగయ్య వ్రాశారు. తనకు తెలియనిది చెప్పడానికి ఆయన మనను అంగీకరిం నా విశ్వాసం. ఆ విశ్వాసంతోనే ఆ ఘట్టాలను పూర్తిగా విడిచిపెట్టకపోయినా సంక్షిప్తం చేశాను.

మరొకటి భారతకథ కొంత యిందులో వుంది. అది పూర్తిగా విడిచిపె వర్ణాశ్రమధర్మాలు ఈ కాలానికి అనవసరం కనక అవీ చాలా తగ్గించాను. ఈ వి చేయడం న్యాయమా అంటే—

కంటెలూ కట్లకానులపేరులూ యీనాడు నచ్చని వారు బంగారాన్ని పారేస్తున్నా ఒంటిపేట గొలుసులూ, చంద్రహారాలూ చేయిస్తున్నారు. నేను చేసిందీ అదే!

ఇది బంగారం; ఎన్నిదేశాలకుపోయినా ఎన్ని కాలాలు మారినా పసిడి పసిడియే శరీరానికి అలంకారం; ఇది ఆత్మకు అవసరం.

* * * *

వ్యాసపూర్ణిమకు ఆరంభించాను.

ఆరంభించిన మూడురోజులకు తిరుపతి వేంకటేశ్వరుడు పూర్తిచేసి పంపమన్నాడు, నిర్వహణాధికారి ప్రసాద్ గారు ఉత్తరం వ్రాశారు. మూడు మాసాలలో పూర్తి ఈ గ్రంథాన్ని ముత్యాలకోవవంటి అక్షరాలతో భారత, రామాయణాలు వ్రాసి చిరంజీవి పేరి కామేశ్వరరావు చక్కగా దీక్షతో దిద్ది తీర్చాడు. అతనిని ఆశీర్వది వాలో ఈ సంస్కారం కలిగించిన జననీ జనకులు పురాణపండ రామమూర్తి, కాశీ పూర్ణలకు అభివాదాలర్పిస్తూ, తిరుమలేశుని పాదాలమ్రోల తలవంచుతూ—

ఉష

(దుర్గాష్ట

లలితస్కంధము
కృష్ణమూలము శుకాలాపాభిరామంబు
మంజులతాశోభితమున్
సువర్ణసుమనస్సుజ్ఞేయమున్
సుందరోజ్జ్వలవృత్తంబు
మహాఫలంబు విమలవ్యాసాలవాలంబునై
వెలయున్
భాగవతాఖ్య కల్పతరువుర్విన్
సద్ద్విజశ్రేయమై.

— పోతన మహాకవి
భాగవతము

# పోతనామాత్యుల

# కవిత్వ వచనాలు

# నైమిశారణ్యవర్ణనం

మధువైరి మందిరంబునుం బోలె
మాధవీ మన్మధ హితంబై
బ్రహ్మ గేహంబునుం బోలె
శా ర దా న్వి త ం బై

నీలగళ సభా నికేతనంబునుం బోలె
వహ్ని వరుణ సమీరణ చంద్ర రుద్ర హైమవతీ కుబేర
వృషభ గాలవ శాండిల్య పాశుపత జటి వటల మండితంబై
బలభేది భవనంబునుం బోలె

ఐరావ తామృత రంభా గణి కాభిరామంబై
సురాసుర నిలయంబునుం బోలె
ఉన్మత్త రాక్షస వంశ సంకులంబై
ధన దాగారంబునుం బోలె
శంఖ పద్మ కుంద ముకుంద సుందరంబై

రఘురాము యుద్ధంబునుం బోలె
నిరంతర శరానల శిఖా బహుళంబై
పరశురాము భండనంబునుం బోలె
అర్జు నోద్భేదనంబై

దానవ సంగ్రామంబునుం బోలె
అరిష్ట జంభ నికుంభ శక్తి యుక్తంబై
కౌరవ సంగరంబునుం బోలె
ద్రోణార్జున కాంచన స్యందన కదంబ సమేతంబై

కర్ణు కలహంబునుం బోలె
మహెూన్నత శల్య సహకారంబై
సముద్ర సేతు బంధనంబునుం బోలె
నల నీల పన సాద్యద్రి ప్రదీపితంబై

భర్గు భజనంబునుం బోలె
నానా శ్లోక లేఖా ఫలితంబై
మరుని కోదండంబునుం బోలె
పున్నాగ శిలీముఖ భూషితంబై

నరసింహ రూపంబునుం బోలె
కేసర కరజ కాంతంబై
నాట్య రంగబునుం బోలె
నట నటీ సుమి రాన్వితంబై

శైలజా నిటలంబునుం బోలె
చందన కర్పూరతిల కాలంకృతంబై
వర్షాగమనబునుం బోలె
ఇంద్ర బాణాసన మేఘకర కమనీయంబై

నిగమంబునుం బోలె
గాయత్రీ విరాజితంబై
మహా కావ్యంబునుం బోలె
సరల మృదులతా కలితంబై

వినతా నిలయంబునుం బోలె
సు పర్ణ రుచిరంబై
అమరావతీ పురంబునుం బోలె
సు మ నో ల లి తం బై

కైటభోద్యోగంబునుం బోలె
మధు మానితంబై
పురుషోత్తమ సేవనంబునుం బోలె
అమృత ఫలదంబై

ధనంజయ సమీకంబునుం బోలె
అభంకష వరాగంబై

వైకుంఠ పురంబునుం బోలె
ఖడ్గ పుండరీక విలసితంబై
నంద ఘోషంబునుం బోలె
కృష్ణసార సుందరంబై

లంకానగరంబునుం బోలె
రామమహిషీ వంచక సమంచితంబై
సుగ్రీవ సైన్యంబునుం బోలె
గజ గవయ శరభ శోభితంబై

నారాయణ స్థానంబునుం బోలె
నీలకంఠ హంస కౌశిక భరద్వాజ తిత్తిరి భాసురంబై
మహాభారతంబునుం బోలె
ఏక చక్ర బక కంక ధార్తరాష్ట్ర

శకుని నకుల సంచార సమ్మిళితంబై
సూర్య రథంబునుం బోలె
గురుతర ప్రవాహంబై
జలదకాల సంధ్యా ముహూర్తంబునుం బోలె
బహువితత జాతి సౌమనస్యంబై
ఒప్పు నైమిశారణ్యంబు

— పోతన మహాకవి

భాగవతము – ప్రథమస్కంధము

# నృసింహావతారం

ఇట్లు దానవేంద్రుండు :

పరిగృహ్యమాణ వైరుండును
వైరానుబంధ జాజ్వల్యమాన రోషానలుండును
రోషానల జంఘన్యమాన విజ్ఞాన వినయుండును
వినయ గాంభీర్య ధైర్య జేగీయమాన హృదయుండును
హృదయచాంచల్యమాన తామసుండును
తామసగుణ చంక్రమ్యమాణ స్థైర్యుండును నై
విస్రంభంబున హుంకరించి
బాలుని ధిక్కరించి
హరి నిందు జూపు మని
కనత్కనక మణిమయ కంకణక్రేంకార శబ్ద పూర్వకంబుగా
దిగ్దంతి దంతభేదన పాటవ ప్రశస్తంబగు హస్తంబున
సభామండప స్తంభంబు వ్రేసిన
వ్రేటుతోడన దశదిశలను మిడుంగురులు చెదరం
జిటిలి పెటిలి పడి
బంభజ్యమానంబగు అమ్మహాస్తంభంబు వలన
ప్రళయవేళాసంభూత సప్తస్కంధ బంధుర సమీరణ
సంఘటిత ఘోరజోఘుష్యమాణ మహావలాహక వర్గనిర్గత
నిబిడ నిష్ఠుర దుస్సహ నిర్ఘాత సంఘ నిర్ఘోష నికాశంబులైన
చటచ్చటిస్ఫుటస్ఫుట ధ్వనిప్రముఖ భయంకరారావ పుంజంబులు
జంజన్యమానంబు లయి ఎగసి
ఆకాశ కుహరాంతరాళంబు నిరవకాశంబు సేసి
నిండినం బట్టు సాలక

దోధూయమాన హృదయంబులయి
పరవశంబులై పితామహ మహేంద్ర వరుణ వాయు శిఖి ప్రముఖ
చరాచర జంతుజాలంబుల తోడ
బ్రహ్మాండ కటాహంబు పగిలి పరిస్ఫోటితంబుగా
ప్రఫుల్ల పద్మయుగళ సంకాశ
భాస్వర చక్ర చాప హల కులిశ జలచర రేఖాంకిత
చారు చరణ తలుండును
చరణ చంక్రమణ ఘనవినమిత
విశ్వవిశ్వంభరా భార ధౌరేయ
దిక్కుంభి కుంభీనస కుంభినీధర కూర్మ కులశేఖరుండును
దుగ్ధ జలధిజాత శుండాల శుండాదండ మండిత ప్రకాండ
ప్రచండ మహోరుస్తంభ యుగళుండును
ఘణ ఘణాయమాన మణికింకిణీ గణ ముఖరిత
మేఖలావలయ వలయిత
పీతాంబర శోభిత కటి ప్రదేశుండును
నిర్ఝర నిమ్నగావర్త వర్తుల
కమలాకర గంభీరనాభి వివరుండును
ముష్టి పరిమేయ వినుత తనుతర స్నిగ్ధ మధ్యుండును
కులాచల సానుభాగ సదృశ కర్కశ విశాలవక్షుండును
దుర్జన దనుజ భట ధైర్య లతికా లవిత్రాయమాణ
రక్షోరాజ వక్షోభాగ విశంకటక్షేత్ర విలేఖన
చంచులాంగలాయమాన ప్రతాప జ్వలన జ్వాలాయమాన
శరణాగత నయన చకోర చంద్రరేఖాయమాణ
వజ్రాయుధ ప్రతిమాన భాసమాన
నిశాత నఖర తర ముఖ నఖరుండును
శంఖ చక్ర గదా ఖడ్గ కుంత తోమర ప్రముఖ
నానాయుధ మహిత మహోత్తుంగ మహీధరశృంగ సన్నిభ

క్షీరసాగర వేలాయమాన మాలికా విరాజమాన
నిరర్గళానేక నత భుజార్గళుండును
మంజు మంజీర మణిపుంజ రంజిత మంజుల హార కేయూర
కంకణ కిరీట మకర కుండలాది భూషణ భూషితుండును
త్రివళీయుత శిఖి శిఖరాభ పరిణద్ధ బంధుర కంధరుండును
ప్రకంపన కంపిత పారిజాత పాదపల్లవ ప్రతీకాశ
కోపావేశ సంచలిత అధరుండును
శరత్కాల మేఘజాల మధ్య ధగద్ధగాయమాన
తటిల్లతా సమాన దేదీప్యమాన దంష్ట్రాంకురుండును
కల్పాంతకాల సకలభువన గ్రసన విజృంభమాణ
సప్తజిహ్వ జిహ్వా తులిత తరల తరాయమాణ
విభ్రాజమాన జిహ్వుండును
మేరు మందర మహా గుహాంతరాళ విస్తార
విపుల వక్త్ర నాసికా వివరుండును
నాసికా వివర నిస్సర న్నిబిడ నిశ్శ్వాస నికర సంఘట్టన
సంక్షోభిత సంతప్యమాన సప్త సాగరుండును
పూర్వపర్వత విద్యోతమాన ఖద్యోత మండల
సదృక్ష సమంచిత లోచనుండును
లోచనాంచల సముత్కీర్యమాణ విలోల కీలాభీల
విస్ఫులింగ వితాన రోరుధ్యమాన తారకాగ్రహ మండలుండును
శక్రచాప సురుచిరోదగ్ర మహా భ్రూ లతాబంధ
బంధుర భయంకర వదనుండును
ఘనతర గండశైల తుల్య కమనీయ గండభాగుండును
సంధ్యారాగ రక్తధారాధరమాలికా ప్రతి మహాభ్రంకష
తంతన్యమాన పటుతర సటా జాలుండును
సటాజాల సంచాలన సంజాత వాత డోలాయమాన
వైమానిక విమానుండును

# గంగావతరణం

ఇట్లమ్మహానది
పురారాతి జటాజూట రంధ్రంబుల వలన దిగంబడి
నిరర్గళప్రవాహంబై నేలకు జల్లించి నెరసి నిండి
పెల్లు వెల్లిగొని పెచ్చుపెరిగి
విచ్చలవిడిం గ్రేపువెంబడి నురక క్రేళ్ళురుకు
మరకప్రాయంపు కామధేనువు చందంబున
ముందరికి నిగుడుచు
ముద్దు చందురు తోడి నెయ్యంబున క్రయ్యనదరి
చొప్పుదప్పక సాగి చనుచెంచు
సుధార్ణవంబు కైవడి పెంపు కలిగి
మహేశ్వరు వదనగహ్వరంబు వలన
ఓం కారంబు పిరుంద వెలువడు
శబ్ద బ్రహ్మంబు భంగి-నదభ్ర విభ్రమంబై
అమ్మహీపాల తిలకంబు తెరువు వెంటనంటి వచ్చు
వెలిఏనుగు తొండంబుల ననుకరించి
పరచు వరద మొగంబులును
వరద మొగంబుల పిరుంద
అందంద క్రందుకొని పొడచూపి
తొలంగు బాలశారదా కుచ కుంభంబులకు
అగ్గలంబైన బుగ్గలును, బుగ్గల సంగడంబునం
పారిజాత కుసుమ స్తబకంబుల
చెలువంబుల దెగడు వెలినురుపులును
వెలి నురువుల చెంగట
అర్ధోన్మీలిత కర్పూర తరు కిసలయంబులం

నిష్కంపిత శంఖవర్ణ మహోర్ధ్వ కర్ణుండును
మంథ దండాయమాన మందర వసుంధరాధర
పరిభ్రమణవేగ సముత్పద్యమాన వియన్మండల మండిత
సుధారాశి కల్లోల శీకరాకార భాసుర కేసరుండును
పర్వాఖర్వ శిశిరకిరణ మయూఖ గౌర తనూరుహుండును
నిజగర్జా నినద నిర్దళిత కుముద సుప్రతీక
వామన సైరావణ సార్వభౌమ ప్రముఖ
దిగిభరాజ కర్ణ కోటరుండును
ధవళ ధరాధర దీర్ఘ దురవలోకనీయ దేహుండును
దేహప్రభా పటల నిర్మథ్యమాన పరి పంథి
యాతుధాన నికురంబ గర్వాంధకారుండును
ప్రహ్లాద హిరణ్యకశిపు రంజన భంజన
నిమిత్తాంతరంగ బహిరంగ
జేగీయమాన కరుణా వీరరస సంయుతుండును
మహాప్రభావుండును అయిన
శ్రీ నృ సిం హ దే వుం డావిర్భవించిన.

— పోతన మహాకవి

భాగవతము — ప్రథమస్కంధము

కేలికొను సుళ్ళును
సుళ్ళ కెలంకుల ధవళ జలధర రేఖాకారంబుల
బాగు మెచ్చని నిడుద యేరులును
ఏరులం కలిసి వాయుజవంబున నొండొంటిం దాకి
బిట్టు మిట్టించి మీఁది కెగయు దురిత భంగంబులైన
భంగంబులును
భంగంబులకొనల ఛిన్న భిన్నంబులై కుప్పించి
ఉవ్వరం బెగసి ముత్తియంపు నరుల వడుపున
మల్లికా దామంబుల తెరంగున
కర్పూర ఖండ కదంబంబుల చెలువంబున
ఇందు శకలంబుల తేజంబున
తారకా నికరంబుల పోలుపున మెరయుచు
ముక్తికన్యా వశీకరంబులైన శీకరంబులునుం గలిగి
మధ్యమలోక శ్రీకరంబై
శ్రీకరంబు తెరంగున విష్ణుపదంబు ముట్టి
విష్ణుపదంబు భాతి నుల్లసిత హంస రుచిరంబై
రుచిరపక్షంబు రీతి అతిశోభిత కువలయంబై
కువలయంబు చెన్నున బహు జీవనంబై
జీవనంబులాగున నుమనో వికాస ప్రధానంబై
ప్రధాన పర్వంబు పోలుపున
ఏకచక్ర బక భీమ మహాభంగ సుభద్రార్జున
చరిత్రాభిరామంబై
రామ చిత్తంబు మెలపునం తనవారిలో చొచ్చిన
దోషాచరుల కభయప్రధాన చణంబై
ప్రధానచణ వర్తనంబు భాతి
సముపాసిత మృత్యుంజయంబై
మృత్యుంజయ రూపంబు పోలిక

విభూతి సుకుమారంబై
కుమార చరిత్రంబు లేవను
క్రౌంచ ప్రముఖ విజయంబై
విజయ రథంబు బాతి
హరిహయా మంథరంబై
మంథర విచారంబు గ్రద్దన
మహారామ గిరి వన ప్రవేశ కామంబై
కామకేతనంబు పెల్లున
ఉద్దీపిత మకరంబై
మకరకేతను బాణంబు కెవడి
విలీన వరవాహినీ కలిత శంబరంబై
శంబ రారాతి చిగురు గొంతంబు నూటి
అధ్వగవేదనా శమనంబై
శమనదండంబు జాడ
నిమ్నోన్నత సమవృత్తంబై
వృత్తశాస్త్రంబు విధంబున వడిగలిగి
సదా గురు లఘు వాక్య చ్ఛటా పరిగణితంబై
గణితశాస్త్రంబు కొలదిని
ఘన ఘనమూల వర్గమూల సంకలిత
భిన్న మిశ్ర ప్రకీర్ణ ఖాత భీష్మంబై
భీష్మ పర్వంబు పెంపున
అనేక భగవద్గీతంబై
గీత శాస్త్రంబు నిలుకడను
మహా సుషిరతను ఘన నానా శబ్దంబై
శబ్ద శాస్త్రంబు మర్యాద అచ్చు వడి హల్లు కలిగి
మహాభాష్య రూపావతార వృత్తి వృద్ధి గుణ సమర్థంబై
అర్థశాస్త్రంబు మహిమను

బహు ప్రయోజన ప్రమాణ దృష్టాంతంబై
దృష్టాంతంబు తెరంగున
సర్వసామాన్య గుణ విశేషంబై
శేష వ్యాపారంబు కరణిని
సుస్థిరోద్ధరణ తత్పరంబై
పరబ్రహ్మంబు గరిమ నతిక్రాంతానేక నిగమంబై
నిగమంబు నడవడిని బ్రహ్మవర్ణ పదక్రమ సంగ్రహంబై
గ్రహ శాస్త్రంబు పరిపాటిని
కర్కట మీన మిథున మకరరాశి సుందరంబై
సుందరీ ముఖంబు పోడిమిని
నిర్మల చంద్ర కాంతంబై
కాంతాధరంబు రుచిని
శోణచ్ఛాయా విలాసంబై
విలాసవతి కొప్పు చొప్పున
కృ ష్ణ నా గా ధి కం బై
అధికమతి శాస్త్ర సంవాదంబు సొంపున
అపార సరస్వతీ విజయ విభ్రమంబై
విభ్రమవతి చనుదోయి పగిది
నిరంతర పయోవ్యాప్తాఖిలలోక జీవనప్రద
తుంగభద్రాతిరేఖా సలలితంబై
లలితవతి నగవు మించున
అపహసిత చంద్ర భాగధేయంబై
భాగధేయవంతుని వివాహంబు లీల
మహామేఖల కన్యకా విస్తారంబై
తార కెంగేలి యొడికంబున
ఆక్రాంత సూర్యతనయంబై
సూర్యతనయు శరవర్షంబు పోలిక

భీమ రథ్యాటోప వారణంబై
వారణంబు వరుసునం బుష్కరోన్నత సంరంభంబై
రంభ నెమ్మోము డాలున
ను రసాతిశయ దశంబై
దశరథ తనయు బొమముడి చాడ్పున
సింధు గర్వ ప్రభంజ నంబై
ప్రభంజన తనయు గద పెట్టు మాడ్కిని
సమీపగత దుశ్శాసన దుర్మద నివారకంబై
వారకన్యక ముంజేతి గతిని
ము హు ర్ము హు రు చ్చలిత కంకణాలంకృతంబై
కృతయుగంబు నోజ నపంకంబై
పంకజాసన ముఖంబు నొరవున
ప్రభూత ముఖ్య వర్ణంబై
వర్ణగుణితంబు తెరకువను బహు దీర్ఘ బిందు విసర్గంబై
సర్గబంధకావ్యంబు ననువున
గంభీరభావ మధురంబై
మధురాపురంబు సొబగున మహానందనంబై
నందనవనంబు పొందున విహరమాణ కౌశికంబై
కౌశిక హయంబురీతి సుదశ ధ్రువంబై
ధ్రువు తలంపుక్రియం గ్రియాపరిశీలిత విశ్వంభరంబై
విశ్వంభరుని శంఖంబు రూపున
దక్షిణావర్తోత్తరంబై
ఉత్తరా వివాహంబు చందంబున
ప్ర ము ది త న ర ం బై
నరసింహు నఖరంబుల భాతి
ఆశ్రితప్రహ్లాద గురువిభవ ప్రదానంబై
దానవకాండంబు సిరిం

కామధేను కల్పలతా ద్యభినవంబై
నవ నూతికా కుచంబు పేర్మిని
నిరంతర పయోవర్ధనంబై
ధనదు నిలయంబు తూనికను
సంభృత మకర పద్మ మహాపద్మ కచ్ఛపంబై
కచ్ఛకర్పరంబు బలిమిని
పతిత శైల సముద్ధరణంబై
ధరణిధరంబు సాటి
ఉత్తుంగ తట ముఖ్యంబై
ముఖ్యవరాహంబు గరిమ
ఉ న్న త క్ష మ ం బై
క్షమాసుర హస్తంబు గరగరికను
సత్పవిత్ర మనోభిరామంబై
రామచంద్రు బాణంబు కడింది
అభ్యాగత ఖర దూషణ మదాపహరణ ముఖరంబై
ముఖరరామ కుఠారంబు రీతిని
భూ భృన్మూలచ్ఛేదవ ప్రబలంబై
బలరామ హలంబు భాతిని
ప్రతికూల సన్నికర్షణ ప్రబుద్ధంబై
బుద్ధదేవుని మేని యొరపున
అభియాతి రక్షోదార మనోహారంబై
హర తాండవంబుమేర నుల్లసి తానిమిషంబై
అనిమిషావతారంబు కీర్తిని శ్రుతి మంగళప్రదంబై
ప్రదాత యీగి నూటి
అర్థపరంపరా వామనంబై
వామన చరణరేఖను బలి వంశ వ్యపనయంబై
నయశాస్త్రంబు మార్గంబున

సామ భేద మాయోపాయ చతురంబై
చతురాననాండంబు భావంబున
అపరిమిత భువన జంతుజాల సేవ్యమానంబై—
మానిని యన లోతు సూపక
గరిత యన నడి చప్పుడు సేయక
ముగుద యన బయట పడక
ప్రమద యన గ్రయ్యం బారుచు
పతివ్రత యన నిట్టట్టు చనక
తల్లి యన నెవ్వియైన లోగొనుచు
దైవం బన భక్త మనోరథంబు లిచ్చుచు
అంత కంతకు గురి గడచి
అవాఙ్మనన గోచరంబై ప్రవహించె. — పోతన మహాకవి

భాగవతము – నవమస్కంధము

* * *

పోతన్నగారి వచనం ఎంత గంభీరంగా ఉంటుందో
చూడడంతో, తెలుగువచనాన్ని ఎలా కదం తొక్కించ
వచ్చునో విద్యార్థియువకులు గ్రహించి తమ
భాషాజ్ఞానాన్ని వృద్ధిచేసుకుంటారని ఆశ.
ముఖ్యంగా పెద్దలు తమ పిల్లలచేత ఈ మూడు
వచనలు కంఠపాఠంచేయించి గుక్కత్రిప్ప
కుండా అప్పగించుకొనేరీతిలో శిక్షణ
యిస్తే ఉ చ్చా ర ణ దో షా లు రాకుండా
చక్కగా శబ్దాలు పలక గలుగుతారని సూచన.

పిల్లలు చదువుకోవడానికి వీలుగా ఉంటుందని యిలా అచ్చువేశాం. అంతేకాని యిది వచన కవిత్వం కాదు. పోతన్నగారి "కవిత్వవచనం" అని గ్రహింప ప్రార్థన.

ఉషశ్రీ

(ఆశ్వయుజ బహుళ దశమి)

# ప్రథమ ద్వితీయ తృతీయ స్కంధములు

శ్రీ కైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్ దానవో
ద్రేక స్తంభకు కేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా
నాకంజాత భవాండకుంభకు మహానందాంగనాడింభకున్.

శ్రీ మన్నారాయణ కథాశ్రవణ కుతూహల చిత్తులైన నైమిశారణ్యవాసులు, శౌనకాది మునిముఖ్యులు సత్రయాగం సాగిస్తూ నిఖిల పురాణ గాథాకథన దక్షుడైన సూతమహర్షిని చేరి;

శ్రీమద్భాగవతం సర్వపాపహరమూ కర్ణరసాయనమూ, కనక దానిని వినిపించండి అని కోరగా ఆ పౌరాణికసూతుడు నర, నారాయణులకు, వాగ్దేవి సరస్వతికీ, శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాస, ఆగమాదుల పారము ముట్టిన వ్యాసమునికీ అంజలి ఘటించి, ఆరంభించాడు :

ఓ మహామునులారా !

కలియుగంలో మానవులు శరీరబలం లేని నీరసులవుతారు. అది కారణంగా ధైర్యశూన్యులూ, మందబుద్ధులూ, అల్పకాలజీవులూ, దుర్బలులూ అవుతారు. ఈ దశలో వారికి సత్కార్యాలూ, సత్క్రతువులూ చేసే శక్తి ఉండదు. అటువంటి వారు తరించాలంటే హరినామస్మరణమూ, హరికథాశ్రవణమూ యీ రెండే మార్గాలు. అందుకోసమే వ్యాసమహర్షి నారాయణ కథలతో భాగవత గ్రంథాన్ని తన కుమారుడైన శుకయోగీంద్రునికి అనుగ్రహించారు. ఆయన దీనిని భాగవతోత్తముడైన పరీక్షిన్మహారాజుకు వినిపించాడు. మా గురువుల అనుజ్ఞతో నేను విన్నదానిని, అందులో నాకు తెలిసిన దానిని మీకు వినిపిస్తాను. సావధానులై వినండి.

అభిమన్యుని పుత్రుడైన పరీక్షిత్తును సింహాసనం ఎక్కించి, ధర్మరాజాదులు మహాప్రస్థానం చేశారు. అంతవరకూ భారతంలో మీరు విని ఉన్నారు.

పరీక్షిత్తు ధర్మమార్గం తప్పకుండా ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ రాజ్యాన్ని పాలిస్తున్నాడు.

ఒకనా డాయన వేటకు వెళ్ళి, క్రూరమృగాలను సంహరించి అలసటతో దప్పిక తీర్చుకోవడానికి శమీక మహాముని ఆశ్రమానికి వచ్చాడు. ముని ధ్యానసమాధిలో వున్నారు మహారాజు దాహబాధలో ముని కదలక మెదలక ఉండడం చూసి, ఆ బాధలో ఆవేశం రాగా సమీపంలో వున్న ఒక పాము మృత కళేబరాన్ని ఆయన మెడలో వేసి వెళ్ళాడు. కొంత సేపటికి ఆ మునికుమారుడు శృంగి వచ్చి :

నా తండ్రిని పరాభవించినవాడు వారం రోజులలో తక్షక సర్పదష్టుడై మరణిస్తాడు అని శపించాడు.

సమాధినుంచి లేచిన శమీకముని విషయమంతా గ్రహించి :

నాయనా! ధర్మపరిపాలన చేసే ప్రభువును శపించడం అనుచితం. ఆయన ప్రతీకారం చేసుకోగలడేమో, ఈ శాపానికి. కనక వెళ్ళి ఆయనకు శాపవిషయం చెప్పిరా, అన్నాడు.

పరీక్షిత్తు శాపం మాట విని రాజధానిని విడిచి, సర్వభోగాలూ పరిత్యజించి, గంగానదీ తీరాన దర్భాసనం మీద కూర్చుని శ్రీమన్నారాయణుని ధ్యానిస్తున్నాడు.

ధర్మప్రభువు పరీక్షిత్తు దీక్ష విని ఎందరో మునులూ, ఋషులూ, అక్కడకు వచ్చారు. వారందరికీ అభివాదా లర్పించి తన సంకల్పం తెలిపి, ఈ వారంలో వైకుంఠం చేరే మార్గం చెప్పవలసిందని అడిగాడు. అంతలో అక్కడకు శుకయోగి వచ్చాడు. ఆయనను చూస్తూనే ఎదురువెళ్ళి నమస్కరించి, తీసుకువచ్చి, ఆసీనుని చేసి, ఆయన పాదాల వ్రాలి;

యోగీంద్రా! నా అదృష్టవశాన ఈ సమయానికి వచ్చావు. ఆవు పాలుపితికే సమయంకంటె, ఒకచోట ఆగని మీ దర్శనం కంటె మా బోంట్లకు ఏం కావాలి. నా యందు అనుగ్రహం ఉంచి, వారం రోజుల వ్యవధిలో నేను శ్రీమన్నారాయణుని చేరే దారి చూపించండి అని ప్రార్థించగా శుకుడు చిరునవ్వుతో :

రాజేంద్రా! ఈ ప్రపంచంలో నరజన్మ కంటె దుర్లభమైనది లేదు. అటువంటి మంచిపుట్టుక దొరికినందుకు జీవితాంతం నారాయణచరణ సేవ చేసుకోవాలి. కాని జీవితంలో సగభాగం నారీసంగమంతో, నిద్రతో, వ్యర్థమై పోతున్నది. మిగిలిన పగటికాలం అంతా పశు, పుత్ర, బంధు, బంధన, రక్షణకోసం ధనార్జనతో సరిపోతుంది. ఇక వీరికి హరి నామస్మరణకు అవకాశం లేదే!

అశాశ్వత మయిన దారా పుత్ర ధనాలమీద వ్యామోహం లేకుండా శాశ్వతానందం ఇచ్చే శ్రీమన్నారాయణుని యందు మనసు లగ్నం చేయడం కంటె కోరతగినదిలేదు.

మా పితృపూజ్యులు బాదరాయణులు నా మీది అనుగ్రహంతో భాగవతం వినిపించారు, దానినే నీకు వినిపిస్తాను.

భాగవతశ్రవణం వల్ల భవబంధాలు తెగి, మోక్షసామ్రాజ్యం పొందుతారు. ఎన్ని సంవత్సరాలు జీవించినా హరిస్మరణ లేనివారు పుడుతూ, చస్తూ సంసారసముద్రంలో కొట్టుమిట్టాడుతూనే ఉంటారు.

నీ మనస్సు సర్వబంధాలూ వదిలించుకుంది కనక నీకు ఆ పురుషోత్తముని గాథలు వినిపిస్తాను. సావధానుడవై విను, నీకు ఏడురోజుల గడువుంది.

పూర్వకాలంలో ఖట్వాంగుడనే మహారాజు దేవతలకు సాయపడి రాక్షసులందరినీ సంహరించాడు. దేవతలు సంతోషంతో వరం కోరుకోమన్నారు. అప్పుడాయన యింక నా ఆయుర్దాయం ఎంత ఉంది? అని అడిగాడు. వారు రెండుఘడియలు! అన్నారు.

ఆమాట వింటూనే ఆయన రాజధానికి చేరి తన సర్వసంపదలూ, ధన ధాన్యాలూ ధారపోసి, భార్యాపుత్ర వ్యామోహబంధం తెంపుకుని శ్రీమన్నారాయణుని యందే మనసు లగ్నంచేసి ముహూర్తకాలం ముగియగానే వైకుంఠం చేరాడు.

బంధనాలు త్రెంచుకున్న వాడికి క్షణకాలం చాలు హరిస్మరణకు అదే ముక్తిహేతువు. నీకు ఏడు రోజుల వ్యవధి ఉంది.

ధారణవల్ల కొందరు, ధారణతో యోగీంద్రులై కొందరు మోక్షం పొందుతారు.

ధారణ — అంటే సర్వబంధాలూ వదలి, ఇంద్రియాలను జయించి, ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలను నియమబద్ధంగా సాగిస్తూ, శ్రీమన్నారాయణుని యందు మనసు నిలిపి, అక్కడే బుద్ధిని కేంద్రీకరించాలి.

విరాట్పురుషుడైన శ్రీహరి యందు లగ్నమయిన మనసుకు భూత, వర్తమాన, భవిష్యత్కాలాలలో వుండే విశాలవిశ్వం అంతా గోచరిస్తుంది.

ఈ శరీరం ఉన్నదే — యిది పృథివి, ఆపస్సు, తేజము, వాయువు, ఆకాశము, అహంకారము, 'మహత్తత్త్వము అనే ఏడు ఆవరణలతో నిండి ఉంటుంది. అటువంటి శరీరంలో వైరాజపురుషుడు ప్రకాశించాలంటే ధారణ కావాలి, అంటే ఆ విరాట్పురుషుడే యీ చతుర్దశభువనరూపి. సర్వవ్యాపకుడైన ఆయనను మనసులో నిలుపుకున్నవాడే ముముక్షువు.

హరిమయము విశ్వ మంతయు
హరి విశ్వమయుండు సంశయము పని లే దా
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువులేదు, వంశపావన, వింటే.

మనిషికి కలలు వస్తాయి. అందులో ఏవో ఆకారాలు చూస్తాడు, తాను ధరిస్తాడు ఎక్కడెక్కడో తిరుగుతాడు. మెలకువ వస్తుంది. అదంతా కలే అని గ్రహిస్తాడు. అలానే పరమేశ్వరుడు సర్వజీవకోటిలోనూ వున్నా యివేవీ ఆయనను అంటవు.

అంతటివాడు కనకనే ఆయన అనుగ్రహంతో బ్రహ్మ ఈ బ్రహ్మాండభాండాలు సృష్టిస్తున్నాడు.

మహారాజా! అజ్ఞానంవల్ల ఏవేవో సుఖాలనీ, భోగాలనీ కొట్టుమిట్టాడుతున్నారు.

సుఖంగా తినడానికి రెండుచేతులూ కలిపితే దోసిలి అవుతుంది కదా, బంగారు పాత్రలు దేనికి. అలాగే ఆచ్ఛాదనకు నారచీరలూ, చర్మాంబరాలూ ఉండగా చీనాంబరా లెందుకు! వానయోగ్యమైన కొండగుహ లెన్నో ఉండగా భవనాలూ, సౌధాలూ నిర్మించు కోవలసిన అవసరం ఏవిటి!

హాయిగా విశ్రాంతి తీసుకోవాలంటే విశాలమైన పృథివి వున్నదే, నిద్రకోసం హంస తూలికాతల్పాలు కావాలా!

మంచి రుచిగల పళ్ళు చెట్లు యిస్తున్నాయి. స్వాదువులయిన జలాలు నదులలో దొరుకుతున్నాయి. అతిథి, అభ్యాగతులకు ఆదరంతో అన్నంపెట్టే పుణ్యసతీమతల్లులున్నారు. ఇన్ని ఉండగా అధికారగర్వాంధులైన ధన మదోన్మత్తుల దగ్గర తలవంచి సేవలు చేయవలసిన దుస్థితి దేనికయ్యా!

రక్షకులు లేని వారల
రక్షించెద ననుచు చక్రి రాజై యుండన్
రక్షింపు మనుచు ఒక నరు
నక్షము ప్రార్థింప నేల ఆత్మజ్ఞులకున్.

అటువంటి నారాయణుని శరణువేడక ప్రాపంచిక తుచ్ఛసుఖాలకోసం అన్యాయాలూ, అక్రమాలూ చేసే వారందరూ నరకద్వారం దగ్గర వైతరణీ నదీతీరంలో తీవ్రాగ్నిజ్వాలా శిఖలలో కాలుతూ ఉంటారు.

విజ్ఞానులై భక్తితో ఉండే వారి సంగతి వేరు. వెన్నెలల చల్లదనం కురిసే చిరు నవ్వుల పురుషోత్తముని తమ హృదయంలోనే దర్శించడానికి ధ్యానం చేస్తుంటారు.

యతీశ్వరులుంటారు.

వారికి ఏ క్షణంలో శరీరం విడిచి పెట్టాలనిపిస్తే ఆ క్షణంలో పద్మాసనం వేసి కూర్చుని, ప్రాణవాయువును మనస్సుతో నిరోధించి మనస్సును బుద్ధితో బంధించి దాన్ని జీవునితో చేర్చి ఆ జీవుని ఆత్మలోకి తెచ్చి, ఆత్మను బ్రహ్మపదార్థంతో ఏకీభవింపజేసి తనువు చాలిస్తారు.

యోగీశ్వరులుంటారు.

వీరు పాదాలతో మూలాధారచక్రాన్ని వేధించి ప్రాణాయామంతో నాభిదేశానికి తెచ్చి, క్రమంగా హృదయందాకా నడిపి, కంఠాన్ని దాటించి భ్రూమధ్యానికి నడిపించి, కనులు, చెవులు, ముక్కు బంధించి, అర్ధముహూర్తకాలంలో బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి బ్రహ్మమందు కలుస్తారు.

ప్రాణాలు పోతున్నా ఇంద్రియాలను వశం చేసుకోలేని వారు మరణానంతరం ఈ వాంఛలతో పరమేష్ఠిలోకం చేరుతారు.

వీరందరిలో ఎవడు పాంచభౌతికవికారాలకు లొంగకుండా ఉంటాడో వాడు ఆనంది మయుడై వాసుదేవునిలో లయ మవుతాడు. ఇది పరమభాగవతులు అనుసరించే దారి, అని శుకయోగి చెప్పగా విని పరీక్షిత్తు :

యోగీంద్రా! మీ మధురవాక్కులతో నాకు సర్వవాంఛలూ వైదొలగాయి. పురు షోత్తముని అవతారలీలలు వినాలనే ఉత్కంఠ పెరుగుతున్నది. ఆ శ్రీమన్నారాయణుని దివ్యగాథలు వినిపించండి, అనగా యోగిపుంగవుడు :

పరుడై ఈశ్వరుడై మహామహిముడై
ప్రాదుర్భవస్థాన సంహరణ క్రీడకుడై త్రిశక్తియుతుడై
అంతర్గతజ్యోతియై పరమేష్ఠి ప్రముఖామరాధిపులకుం
ప్రాపింప రాకుండు దుస్తర మార్గంబున తేజరిల్లు
హరికిం తత్త్వార్థినై మ్రొక్కెదన్.

అని నారాయణ స్మరణ చేశాడు, అంటూ సూతుడు శౌనకాది మునిగణానికి భాగవతక వినిపిస్తున్నాడు.

సృష్టి స్థితి లయాలకు ఆయనే కారణం.

ఒకానొక భవనంగా ఉండే ఈ బ్రహ్మాండాన్ని ఆయన పదునాలుగులోకాలుగా విభజించి అంతటా ఆయనే వ్యాపించి వున్నాడు.

ఆయన ధరించే అవతారాలలో మొదటిది సహస్రశీర్షాలతోఉండి ఆదిపురుషరూపంగా ఉంటుంది. అది యీ ప్రకృతిని నడుపుతుంది.

అనంతరం యజ్ఞవరాహంగా ఆవిర్భవించాడు. నారదావతారంతో వైష్ణవభక్తి ప్రబోధించాడు. నరనారాయణరూపం నాలుగవది. అయిదవరూపంలో కపిలనామంతో సాంఖ్యయోగం ఉపదేశించాడు.

అనసూయ, అత్రిదంపతుల గర్భాన కుమారుడైనది ఆరవది. తదుపరి యజ్ఞుడయాడు. ఉరుక్రమ, వృధు, మీన, కూర్మ, ధన్వంతరి, మోహిని, నరసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణావతారాలు ధరించిన అనంతరం బుద్ధుడవుతాడు. కలియుగాంతంలో విష్ణుయశుడనే విప్రునికి కల్కిరూపంలో పుడతాడు.

ఈ లోకంలో దుష్టరాక్షసపీడ పెరిగినప్పుడు ఆయన ప్రభవించి ఆ క్రూరదానవులను సంహరించి సాధువులను రక్షిస్తూ ఉంటాడు.

# ఉ ద్ధ వు డు

రాజేంద్రా!

కురుపాండవ సంగ్రామం తప్పదని తెలిసి, విదురుడు వనవాసానికిపోయి తిరిగి, తిరిగి పుణ్యనదులలో స్నానమాడి, పవిత్రజలపానంతో, వేళకు దొరికిన ఆకుకూరలతో కాలం గడుపుతూ క్రమంగా ప్రయాణాలు చేసి, యమునానదిచేరి, అక్కడ ధ్యానసమాధిలోవున్న ఉద్ధవుని చూశాడు.

చిన్ననాటి నుండి కృష్ణభక్తుడైన ఉద్ధవునిచూసి గాఢాలింగనం చేసుకొని కుశల ప్రశ్నలు వేశాడు.

ఉద్ధవుని సమాధానంలో కృష్ణనిర్యాణమూ, పాండవుల స్వర్గారోహణము విని కొంత సేపు చింతించి నిర్మలచిత్తుడై విదురుడు :

ఉద్ధవా! పురుషోత్తముడు నీకు బోధించిన అధ్యాత్మ రహస్యాలు వినాలని మనస్సు ఉవ్విళ్ళూరుతుంది, అన్నాడు.

అప్పుడు ఉద్ధవుడు ఆ రహస్యవిషయాలు చెప్పగల మైత్రేయమునిదగ్గరకు విదురుని వెళ్ళమని మరునాడు ఉద్ధవుడు బదరికావనానికి వెళ్ళాడు.

విదురుడు యమునదాటి, గంగ చేరాడు.

అక్కడ గంగ ఒడ్డున యిసుక తిన్నెమీద పద్మాసనాసీనుడై శ్రీహరిని ధ్యానించే యోగిపుంగవుడైన మైత్రేయుని దర్శించి, పాదాభివాదం చేసి:

మహాత్మా! లోకంలో ఎందరోపుట్టి ఏవేవో వాంఛలతో పాపకర్మలు చేస్తూ బ్రతుకుతున్నారు. వీరికీ పశువులకూ భేదం లేదు. మాతృ యౌవనంపాలిట గండ్రగొడ్డళ్ళు వీరు. అటువంటి పాపాత్ములను సక్రమమార్గాన నడపడానికే తమవంటివారు లోకంలో పభవించి పుణ్యాత్ములై జగత్కల్యాణ కాంక్షతో జీవయాత్ర సాగిస్తారు.

ఇప్పుడు తమ ముఖాన ఆ పురుషోత్తముని గాథలు వినాలని కుతూహల పడుతున్నాను. నారాయణ కథామృతం ఆస్వాదించిన వారికి యితర కథలన్నీ గరళప్రాయాలే కనక అనుగ్రహించి ఆ పరమ పురుషతత్వం ఉపదేశించండి. ఈ ప్రపంచంలో మానవులందరూ సుఖభోగాలకోసం ఏవో కర్మలుచేసి ఆశించిన ఫలితం దొరకక బాధపడుతున్నారు. పయిగా ఈ కర్మలన్నీ బంధన హేతువులు. బంధం దుఃఖకారణం. అంతతో ఆగదు. చేసిన కర్మల ఫలాలు అనుభవించడానికి పుడుతూ చస్తూ ఆ వలయంలో చిక్కుకుంటూనే ఉంటారు. అందుచేత వాటినుండి విముక్తికై అనుసరించదగిన దారి చూపండి, అన్నాడు.

మైత్రేయుడు: ఓ భక్తశిఖామణీ! నీకు చెప్పబోయే యీ పరమరహస్యాన్ని వాసుదేవుడు నాకు బోధించాడు. సావధానచిత్తంతో ఆలకించు.

ఈ సృష్టికి ప్రారంభంలో ఆయన తన అంశతో పురుషుని ప్రభవింపజేశాడు. అనంతరం మాయామయంగా మహత్తత్త్వం కల్పించాడు. దానినుండి కార్య, కారణాలు, కర్త వచ్చారు. పంచభూతాలు పుట్టాయి. అందుండి ఇంద్రియాలు అయిదు వచ్చాయి. మనస్సు ఏర్పడింది.

సత్వ, రజ, స్తమోమయమయిన అహంకారం పుట్టింది. సాత్వికాహంకారం నుంచి దేవగణాలు వచ్చాయి. ఇవి ఇంద్రియాధిష్ఠాన దేవతలు. ముందుగా శబ్దం పుట్టింది. అనంతరం జ్ఞానేంద్రియాలు వచ్చాయి. (నేత్ర, నాసిక, జిహ్వా, కర్ణ, చర్మం యివి) అనంతరం కర్మేంద్రియాలు - (వాక్, పాణి, పాదాలు, పాయువు, (మలద్వారం)) ఉపస్థ (జననేంద్రియం) వచ్చాయి.

తామసాహంకారంవల్ల శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు, శబ్దంవల్ల ఆకాశం అది స్పర్శతోకలిసి వాయువు, యీరెండూ కలిసి తేజస్సు, అనంతరం జలం, అనంతరం గంధగుణంతో భూమి ఆవిర్భవించాయి.

ఇందులో ఆకాశానికి శబ్దగుణం, వాయువుకు శబ్ద, స్పర్శలు, అగ్నికి శబ్ద, స్పర్శ, రూపాలూ, జలానికి శబ్ద, స్పర్శ, రూప, రసగుణాలు వచ్చాయి. పృథివికి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాది అయిదు గుణాలూ వున్నాయి.

అయితే ఇవి ఒకదానితో ఒకటి కలిస్తేనే సృష్టి కొనసాగుతుంది కనక ఆ సమ్మేళనంతో ప్రాణికోటిని సృష్టించారు.

అటువంటి శ్రీహరి మహిమను చతుర్ముఖప్రజాపతి కూడా ఎరగడు. ఇంక తెలుసుకోగల వారెవరు! అందువల్లనే ఆయన చరణారవింద సేవ అందరికీ అవశ్యం.

అఖిలాండకోటిబ్రహ్మాండాలలో వ్యాపించి వున్న ఆ పురుషోత్తమునికి ప్రాపంచిక కర్మబంధాలు లేవా! అనిపించవచ్చు.

ఆకాశంలో చంద్రబింబం వున్నది. అది సరోవరజలంలో ప్రతిబింబిస్తున్నది. ఈ నీరు కదిలితే ప్రతిబింబం కూడా కదులుతూ ఉంటుంది కదా! అంతమాత్రంచేత గగనంలోని చందమామ ఊగిసలాడుతున్నాడా! అలానే పురుషోత్తముని లీలలున్నూ.

అజ్ఞానంలోపడి కొట్టుకునే జీవుడికే యీ కర్మబంధాలన్నీ. వీటినుంచి విముక్తి పొందాలంటే హరినామస్మరణం ఒక్కటే మార్గం.

ఇప్పుడు మరికొన్ని విశేషాలు విను.

వాసుదేవనామంతో విరాజిల్లే పురాణపురుషుడు భాగవతవేదం చేతబట్టి పాతాళానికి వెళ్ళి, ధ్యానంలో ముకుళిత నేత్రుడై వున్నాడు. అంతలో అక్కడకు చేరిన సనక, సనం దాదులు రాగా వారిని అనుగ్రహించడానికి కనులు విచ్చిచూశాడు. వారు స్తుతించారు.

ఆ సమయాన నాగకన్యలు పవిత్రజలస్నానం చేసి, ఆ పరమపురుషుని సేవించి ధన్యులయారు.

అప్పుడాయన భాగవతగాథను సనత్కుమారునికి వివరించాడు. సనత్కుమారుడు దీనిని సాంఖ్యాయనునికి విశదంచేయగా, ఆయన పరాశరునికి ఉపదేశించాడు. పరాశరుల వారు బృహస్పతికి బోధించారు. ఆ బృహస్పతి దానిని నీకు అనుగ్రహించారు.

అంతా జలమయంగా ఉన్నప్పుడు,

వేయిపడగల శేషతల్పం మీద లీలావిలాసంగా పురుషోత్తముడు శయనించిన వేళ మాయావిదూరుడై ఆనందంగా ఉన్నసమయాన, పునఃప్రపంచాన్ని సృష్టించే కోరికతో, తన నాభినుండి ఒక పద్మాన్ని, దానినుండి వేదమయుడైన చతుర్ముఖబ్రహ్మనూ సృష్టించాడు.

ఆయన నాలుగు ముఖాలతో నలుదిక్కులూచూసి, ఏమీ గోచరించక, ఆ తామర పూవు క్రింది నాళం ద్వార దాని మూలస్థానం కనుక్కుందామని తిరిగి తిరిగి ఏమీ కనిపించక మళ్ళీ కమలంమీదికి వచ్చి సుఖాసీనుడై యోగాభ్యాసంతో దర్శించగా పద్మదళ విశాల నయనుడై గరుడ వాహనంగల, శేషతల్పంమీద ఉన్న నారాయణుని రూపం గోచరించింది·

ఆ విరాట్పురుషుని పాదాలకు అభివాదంచేసి, ఆయన అనుజ్ఞతో సృష్టి సాగించడానికి సంకల్పించి తపస్సమాధిలో కొన్ని సంవత్సరాలు గడిపి, అనంతరం ముల్లోకాలూ సాక్షాత్కరించగా వాటికి రూపం యిచ్చాడు.

ఈ సృష్టిలో ముందుగా వృక్షాలుపుట్టాయి. అందులో పూలతో నిమిత్తంలేని విత్తనాలు గల రావి, మోదుగ, మర్రి మున్నుందు ప్రభవించాయి.

అనంతరం పుష్పించి ఫలించి విత్తనాలయే కాయధాన్యాల మొక్కలువచ్చాయి తరువాయి పువ్వులు పూసే లతలు, అనంతరం ఉత్తి చర్మమే ఉండే వెదురు, అనంతరం మామిడి ఆదిగాగల పళ్ళచెట్లు, అనంతరం రెండుగిట్టల జంతువులు ఎద్దులు, దున్నలు, మేకలు, పందులు మొదలయిన తొమ్మిది జాతులు, ఒకేడెక్కగల గాడిద, గుర్రం ఆదిగా ఆరుజాతులు అయిదు గోళ్ళుండే మార్జాల, శునక, శార్దూల, సింహ, మర్కట, గజ, కూర్మాదులు పన్నెండు జాతులు. మొసలి, చేప, ఆదిగాగల జలచరాలు, గ్రద్ద, డేగ, కొంగ, నెమలి, హంస ఆది గాగల పక్షులు, అనంతరం మనిషి యిదీ ఆయన సృష్టి.

మళ్ళీ విబుధులు, పితృదేవతలు, సురలు ఒకగణంగా, గంధర్వ అప్సరోజాతులొక గణంగా, యక్ష, రాక్షసులొక వర్గంగా, భూత, ప్రేత, పిశాచాలొక కూటంగా, సిద్ధ, చారణ, విద్యాధరులు మరొక వర్గంగా, కిన్నర, కింపురుషులొకటిగా దేవగణాలయ్యాయి.

ఇప్పుడు నీకు కాల స్వరూపం చెపుతాను.

ఆకాశంలోని సూర్యకిరణంలో త్రసరేణువు ఆరుభాగాలయితే, ఆ ఆరోది పరమాణువు. ఆ పరమాణువులో సూర్యుడు గతించేకాలం సూక్ష్మకాలం.

మేష వృషభ మిథునాది ద్వాదశరాసులలో సూర్యుడు తిరిగేకాలం మహాత్కాలం.

ఇందాక చెప్పానే ఆ పరమాణువులు రెండు అణువు. అణువులు మూడు త్రసరేణువు. ఇవి మూడు త్రుటి, నూరు త్రుటులు వేధ, మూడువేధలు లవం. ఇది మూడు నిమేషం. మూడు నిమేషాలు క్షణం, అయిదుక్షణాలు కాష్ఠ, పదికాష్ఠలు లఘువు, యివి పదిహేను నాడి, రెండు నాడులు ముహూర్తం, మూడు ముహూర్తాలు ఝాము, నాలుగుఝాములు పగలు, నాలుగు ఝాములు రాత్రి ఇది ఒక రోజు.

ఏడురోజులు వారం, రెండు వారాలు పక్షం, రెండు పక్షాలు మాసం, పన్నెండు మాసాలు సంవత్సరం. నూరేళ్ళు మానవుని ఆయుర్దాయం.

ఈ మానవ సంవత్సరం దేవతల కొకరోజు.

కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంది.

త్రేతాయుగంలో మూడుపాదాలు, ద్వాపరయుగంలో రెండుపాదాలు, కలియుగంలో ఒకేపాదం.

అందువల్లనే కలియుగంలో ధర్మబుద్ధినశించి, పాపచింతలు, దుష్టకర్మలూ పెరుగుతాయి.

యుగాలు నాలుగూ కలిసి మహాయుగం. ఇవి వెయ్యి అయితే బ్రహ్మకు పగలు. అప్పుడాయన నిద్రకు ఉపక్రమిస్తారు.

చతుర్దశ భువనాలూ అప్పుడు పరమాణురూపుడైన పరమాత్మయందే లీనమవుతాయి. మళ్ళీ బ్రహ్మనిద్రలేచాక సృష్టి ఆరంభమవుతుంది.

ఈసృష్టిలో ఎన్నో విచిత్రాలున్నాయి.

ఒకమారు పరమేష్ఠి దేహాభిమానంతో అహంకారం నిండిన మోహాన్ని తరుణీ సంగమం, గంధమాల్యానులేపనం ఆదిగాగల పశువాంఛలతో మహామోహాన్నీ, అవి తీర నందున కలిగే క్రోధంలో అంధతామిస్రమును, యిది నశించగా నేనే నశించాననే భ్రమ కలిగించే తామిస్రంబును, చిత్తవిభ్రమాన్ని కలిపి భూతకోటిని సృష్టించి, పశ్చాత్తాపంతో వీరందరినీ తొలగించి, పవిత్ర హృదయంతో సనక, సనందన, సనత్కుమార, సనత్సు జాతులను సృష్టించి, యీ ప్రపంచంలో సదాచార సంపత్తికల ప్రజలను పుట్టించండి, అన్నారు.

వారు నవ్వుతూ, మోక్షధర్మం, నారాయణ చరణసేవ తప్ప మిగిలినవి మాకనవసరం.

అంతతో ఆయనకు క్రోధం కలిగి, భ్రూమధ్యంనుంచి పరమశివుడు పుడుతూనే రోదనం చేశారు.

రోదనం కారణంగా నిన్ను రుద్రనామంతో పిలుస్తాను, నువ్వు ఆకాశం అంతా వ్యాపించు, చంద్ర, సూర్య, అగ్ని, వాయు, జల, పృథివి, ప్రాణాలతో వుంటావు. హృదయంలో, తపస్సులో కూడా నీ నివాసం ఉంటుంది, అని ఆయనకు సృష్టికార్యం అప్ప గించాడు.

ఆయన సర్వవిషయాలలో తననే పోలే గణాలను సృష్టించాడు. రుద్రగణాలు విశ్వాన్నే మింగగా బ్రహ్మ వారించి మీరు తపోదీక్షవహించండి, అని పంపించి, అనం తరం పదిమందిని సృష్టించాడు.

వారు దక్ష, నారద, పులహ, పులస్త్య, భృగు, క్రతు, అంగీరస, వశిష్ఠ, మరీచి, అత్రి అనే పేర్లతో ప్రఖ్యాతులయారు.

అదే సమయంలో ధర్మదేవత, మృత్యుదేవతలతోపాటు కాముడు (మన్మథుడు) పుట్టాడు. అప్పుడు పుట్టిన భారతీదేవిని బ్రహ్మ కామించగా, ముందుపుట్టిన అత్ర్యాది మునులు నిందించారు.

అంతతో ఆయన తనువు చాలించగా ప్రపంచమంతా మంచుతోనిండిన చీకట్లు క్రమ్మాయి.

ఆయన మరొకదేహం ధరించి సృష్టినిగూర్చి ఆలోచన చేస్తుండగా ఆయన నాలుగు ముఖాలనుండి ఋగ్యజుస్సామ, అధర్వణవేదాలు పుట్టాయి.

అలా సర్వశాస్త్రాలూ ప్రభవించాయి. ప్రజాసృష్టికోసం ఆలోచన చేయగా స్వాయం భువ మనువు, ఆయన భార్య శతరూప ప్రభవించారు.

ఈ దంపతులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అను కుమారులు, ఆకూతి, దేవ హూతి, ప్రసూతి అనే ఆడపిల్లలు కలిగారు.

ఆకూతి రుచికుని, దేవహూతి కర్దముని, ప్రసూతి దక్షుని వివాహం చేసుకున్నారు. వీరివల్ల మానవప్రపంచం ప్రవృద్ధమయింది.

స్వాయంభువ మనువు ప్రజాసృష్టిచేసి వారందరినీ నారాయణ భక్తులుగా రూపొం దించి, ఏంచేసినా హరిసమర్పణ బుద్ధితో చేయిస్తూండాలని చతుర్ముఖుడు ఆదేశించాడు.

ప్రజాపతీ! ఇదంతా జలమయంగా వుంది. నా బిడ్డలందరూ సుఖంగా నివసించ డానికి యోగ్యమయిన స్థలం కావాలి, అనగా ఆయన నారాయణుని ప్రార్థించాడు.

ఇక్కడ హిరణ్యాక్షుని కథ చెపుతాను, విను.

కశ్యప ప్రజాపతి భార్య దితి.

ఒక సాయం సంధ్యలో ఆవిడ భర్తనుచేరి,

నాథా! నా సవతులందరూ సంతానవతులై సుఖంగా వున్నారు. సంతానవాంఛ నన్ను బాధిస్తున్నది. ఈక్షణంలో నాకు సంతానవతి అయే అవకాశం అనుగ్రహించండి, అని ప్రార్థించింది.

సంధ్యాసమయాలు అందుకు ఉచితం కాదని వారించాడు కశ్యపుడు వినలేదు దితి. దైవం ఏం చెయ్యదలచుకుంటే అదే జరుగుతుందని ఆమెను తృప్తిపరచి పంపాడు.

ఆమె గర్భవతి అయింది.

ఇల్లాలా! నీకు కలిగే బిడ్డలు క్రూరస్వభావంతో, రాక్షసులై తిరుగుతూ శ్రీహరి చేతులలో మరణిస్తారు, అన్నాడు.

ఆవిడ దీనంగా ప్రార్థించగా:

తప్పదు. కాని వారికి కలిగే కుమారుడు మాత్రం ముల్లోకాలలో కీర్తిపొందే సజ్జను డవుతాడు, అని ఓదార్చి పంపించాడు.

కొంతకాలం గడిచింది. దితికి నెలలు నిండుతున్నాయి. ఆ గర్భంలోని శిశువుల కాంతి సర్వలోకాలకూ దుస్సహం కాగా, దేవగణాలన్నీ, శ్రీమన్నారాయణుని చేరి, రాబోయే ఉపద్రవం ఏమిటని అడిగారు.

అప్పుడాయన:

దేవతలారా! ఒకనాడు నన్ను దర్శించడానికి వచ్చే సనక, సనందాదులను వైకుంఠ ద్వారపాలకులు నిరోధించగా వారు ఆగ్రహంతో నా ద్వారపాలకులను శపించారు. వారి రూపంలో జన్మిస్తున్నారు.

ఎంతటివారయినా వేదవిదులను అపహసిస్తే ప్రాయశ్చిత్తం తప్పదు. అందువల్ల జయవిజయులిప్పుడు రాక్షసులుగా పుట్టి నా చక్రధారలలో తనువు చాలించి వైకుంఠం చేరు తారు. అంతవరకూ వారి బాధ మీకు తప్పదు, అని పంపించాడు.

దితి యిద్దరు బిడ్డలను ప్రసవించింది.

వారికి హిరణ్యాక్ష, హిరణ్యకశిపులని పేరుపెట్టాడు కశ్యపుడు.

వారిద్దరూ తమ పరాక్రమంతో సర్వలోకాలూ జయించి, నిఖిల భువనాధిపులయారు.

ఒకనాడు హిరణ్యాక్షుడు యుద్ధప్రీతితో వరుణుని దగ్గరకుపోయి తొడగొట్టగా ఆయన చేతులు జోడించి :

దనుజేంద్రా! చాలాకాలంగా యుద్ధప్రీతి తగ్గి శాంతంగా ఉంటున్నాను. నీవంటి మహావీరునికి తగినవాడు వైకుంఠంలో విష్ణువని ఉన్నాడు. ఆయన దగ్గరకు వెళ్ళి నీ ప్రతాపం చూపితే మిగిలిన వ్యవహారం ఆయన చూసుకుంటాడు. అప్పుడు ఎవరెంతటి వారో లోకాలకు తెలుస్తుంది. వైకుంఠనాథుడు దానవ సంహారదీక్షలో వున్నాడని విన్నాను, అనగా ఆవేశంతో హిరణ్యాక్షుడు అటు బయలుదేరాడు.

దారిలో నారదుడు కనిపించగా, తను వెడుతూన్న పని చెప్పాడు, హిరణ్యాక్షుడు. విని నారదుడు :

నాయనా! ప్రస్తుతం నారాయణుడు భూభారాన్ని వహిస్తూ వరాహరూపంలో రసాతలాన వున్నాడు.

అనగా దితి పుత్రుడు మరింత ఉత్సాహంతో గదాదండం త్రిప్పుతూ రసాతలానికి వచ్చాడు.

వస్తూన్న దానవునిచూస్తూ శ్రీహరి తన కన్నులలో నిప్పులు నింపించి, ఆ చూపులతోనే వాని దేహకాంతిని హరించి, ఒక్కమారు ముట్టెతో క్రిందికి పొడిచి, కాలితోత్రవ్వి, పైకెగిరి, తనకోరచివరభూమిని పెట్టి, పరుగుప్రారంభించగా, ఆ దానవుడు వెంటతరుముతూ నిందిస్తూ రాగా, నారాయణుడు భూమిని సాగరంమీద ఉంచి యుద్ధసన్నద్ధుడయాడు.

హిరణ్యాక్షుడు గదాదండం విసరగా దాన్ని ముక్కలుగా విరిచాడు శ్రీహరి. మరొక గద విసిరాడు దానవుడు. అది అందుకుని దానినే త్రిప్పివిసిరాడు శ్రీహరి. వాడు మూర్ఛపోయిలేచి మళ్ళీ గద విసిరాడు.

కొంతసేపు పోరు సాగింది.

శ్రీహరి సర్వరాక్షస సంహార సామర్థ్యంకల చక్రం ప్రయోగించగా, అది ప్రళయాగ్ని జ్వాలలతో హిరణ్యాక్షుని మాయలన్నిటినీ నిరోధించింది.

హిరణ్యాక్షుడు మల్లయుద్ధానికి దిగాడు.

ఆ పోరాటంలో శ్రీహరి తన అరచేతితో రొమ్ము బ్రద్దలుగొట్టి, వజ్రఘాతంవలె కర్ణమూలాల దగ్గర పిడిగుద్దువేయగా వాడు నేలకూలాడు.

దేవతలతోపాటు మునులు, సజ్జనులూ ఆ శ్రీహరిని ప్రార్థించారు. ఆయన వైకుంఠం చేరుకున్నాడు.

# దేవహూతి

స్వాయంభువ మనువు తనకుమార్తె దేవహూతిని వెంటబెట్టుకుని కర్దముని సమీపించి:

ఆర్యా! ఈమె నా బిడ్డ. పురుషోత్తముని దర్శించినవారికి తప్ప యీమె గోచరించదు. ఈమెను కాముకదృష్టితో చూసిన వారికి అక్షణంలోనే మృత్యువు సంభవిస్తుంది.

అటువంటి పవిత్ర శీలవతి అయిన నాబిడ్డ నిన్ను భర్తగా వరిస్తున్నది, అనగా కర్దముడు,

ఈమెకూ నాకూ గుణ రూపాలలోనే కాక నడవడిలోకూడా పోలికలున్నాయి. కనక వరిస్తాను కాని - ఒకనియమం ఉంది. దాంపత్యజీవితానికి పరమావధియైన సంతానం కలగగానే నేను యోగాభ్యాసంతో శ్రీహరి ధ్యానంలో ఉంటాను, అన్నాడు.

స్వాయంభువ మనువు తన భార్య శతరూపతో, కుమార్తె దేవహూతితో యీ విషయం వివరించి చెప్పి, వారి అంగీకారంపొంది, వివాహం జరిపించాడు.

బిడ్డను కర్దమునికి అప్పగించి తిరిగివెళ్ళే సమయంలో ఆ తండ్రిహృదయం విషాద భరం అయింది. బిడ్డను కౌగలించుకుని, శిరసుముద్దాడి, వెన్నుదువ్వుతూ కొంతసేపు కన్నీరు విడిచి, అంతలో ఓదార్పుపొంది తిరిగి వెళ్ళాడు.

ఇంటికి చేరుతూ దారిలో బ్రహ్మావర్త దేశంలో విష్ణుపరంగా సత్క్రతువులు చేసి, రాజధానికి, నిరంతరహరి చరణారవింద సేవాపరాయణుడై కాలంగడుపుతున్నాడు.

పార్వతీదేవి పరమశివుని ఆరాధించే రీతిలో దేవహూతి తనభర్తను సేవిస్తూ, భక్తితో ఆయన శుశ్రూషయే పరమావధిగా భావిస్తూ, కామ క్రోధాదులు దరిజేరనీయక, సర్వమూ తనకు భర్తయే అని త్రికరణశుద్ధిగా విశ్వసిస్తూ జీవయాత్ర సాగిస్తున్నది.

ఒకనాడాముని : ఇల్లాలా! నీసేవాభావం మా మనస్సుకి ఆహ్లాదం కలిగించింది. నీకు దివ్యదృష్టి వరంగా యిస్తున్నాను, అన్నాడు.

స్వామీ! మీసేవలో మీ సర్వశక్తులూ నాకు లభిస్తాయని తెలును. కాని మన కల్యాణ సమయాన మీరు వాగ్దానం చేసిన సంతానవిషయం విస్మరించరని నమ్ముతాను, అంది.

అంతతో కర్దముడు తనశక్తితో మణులు చెక్కిన స్తంభాలతో అలరారే సౌధాలు కల్పించాడు. దానినిండా సంసారానికి అవసరమయిన శయ్యాగారాలు, భోజనశాలలు, సువర్ణపాత్రలు, చీనిచీనాంబరాలు, భవనంచుట్టూ ఉద్యానవనాలు, వనాలలో లతానికుంజాలు, ఫలవృక్షాలు, శుక పిక సంతతులు, సరోవరాలు, క్రీడామందిరాలు, ఇన్నిటితో నిండిన దివ్యవిమానం సృష్టించాడు.

దేవహూతికి సంతోషం కలగలేదు. అది గ్రహించి కర్దముడు :

ఈ బిందు సరోవరంలో స్నానం చెయ్యి. దానివల్ల అన్నికోరికలూ నెరవేర్తుతాయి. అనగా సరోవరంలో దిగి, స్నానం చేసింది.

చేసేవేళ ఆ నీటిలో వున్న నవయౌవన శోభనాంగులు వెయ్యిమంది ఆమెచుట్టూ చేరి, ఆమెను చక్కగా అభ్యంగన స్నానం చేయించి, అగరుధూపంతో తల ఆర్చి, దువ్వలువలు కట్టించి, షడ్రసోపేతంగా భోజనం పెట్టి, కర్పూరహారతు లిచ్చి, చక్కని ఆసనంమీద కూర్చుండబెట్టి చేతిలో అద్దం పెట్టారు.

దేవహూతి అద్దంలో తనప్రతిబింబం చూసుకుంటూ, భర్తను స్మరించింది. ఉత్తరక్షణంలో ప్రక్కగా నిలిచాడాయన.

పెళ్ళినాడు ఏ వయోరూపసౌందర్యలావణ్యాలు ఉన్నాయో అదేరీతిగా ఈక్షణంలో వున్న దేవహూతిని దగ్గరగా తీసుకుని కన్యకానహ్మానంతో విమానం ఎక్కాడు కర్దముడు.

ఆ విమానం మీద నిఖిలలోకాలూ తిరిగి, తననివాసానికి వచ్చి దేవహూతితో సాంసారిక సుఖభోగాలను అనుభవిస్తూ కొంతకాలము గడిపారు. ఆ రోజులలో కర్దముని అనుగ్రహంతో దేవహూతి తొమ్మండుగురు ఆడపిల్లలను ప్రసవించింది.

అప్పుడు కర్దముడు సన్యాసాశ్రమం స్వీకరించబోగా ఆమె :

స్వామీ! ఈ బాలికలకు వివాహంచేసి, నాకుతత్వోపదేశం చేయగల కుమారుని దయచేసి మీరు సన్యాసం తీసుకోండి, అని వినయంగా ప్రార్థించింది.

అంగీకరించి, దైవనిర్ణయానుసారం ఆమెను పుత్రవతిని చేశాడు. శ్రీహరి అంశ ఆమె గర్భాన పుత్రరూపంలో ప్రవృద్ధమై కపిలముని జన్మపొందింది.

ఆ సమయాన వచ్చిన బ్రహ్మాదిదేవతలందరూ దేవహూతినీ, కర్దమునీ అభినందించి ఆనందంతో తిరిగి వెళ్ళారు.

చతుర్ముఖుని ఆజ్ఞానుసారం కర్దముడు తన బిడ్డలు తొమ్మండుగురినీ మరీచి, అత్రి, అంగీరస, పులస్త్య, పులహ, క్రతు, భృగు, వశిష్ఠ, అధర్వులకిచ్చి వేదోక్తంగా వివాహం జరిపించాడు.

కొంతకాలం గడిచింది.

ఒకనాడు కర్దముడు తనయింట కపిల రూపంలో ప్రభవించిన మహావిష్ణువును సమీపించి :

పురాణపురుషా! సర్వమానవులూ నీ చరణసేవతో ముక్తిధామం చేరుతారు. మా అదృష్టవశాన మాపుత్రుడవై జన్మించి మాకు తరణోపాయం చూపించావు. ఇక నేను సంసారం వదలి వనానికి పోయి యోగమార్గాన ముక్తి సాధించుకుంటాను, అన్నాడు.

కపిలుడు మందహాసం చేసి :

ఈ మానవులందరినీ ఉద్ధరించడానికే నేను కపిలమునిగా అవతరించాను. సాంఖ్య యోగ ప్రబోధంతో వీరిని తరింపజేస్తాను. నువ్వు నిశ్చింతగా పరంజ్యోతిధ్యానంతో కైవల్య పదం చేరు, అని పంపించాడు.

కర్దముడు ప్రశాంత తపోవనంచేరి యోగనిష్ఠతో ఈశ్వరధ్యానంతో పరమభాగవ తోత్తముల స్థానం చేరాడు.

బిందుసరం దగ్గర దేవహూతి కపిలుని చేరి తనకు తత్త్వం ఉపదేశించమని కోరింది.

కపిలుడు చిరునవ్వు వెన్నెలల వదనంతో:

తల్లీ! ఈ జీవుడున్నాడే, వీని మనస్సు భవబంధాలను త్రెంచగలదు. కాని అది సత్వ, రజ, స్తమోగుణాలకు లొంగిపోతే సంసారబంధంలో గిరగిర త్రిప్పుతుంది. అదే మనస్సు నారాయణునియందు లగ్నమైతే మోక్షమార్గాన సాగుతుంది.

ఈ మనస్సు, అహంకార, మమకారాలకు లొంగి కామ, లోభాది అరిషడ్వర్గాలతో బంధితమై పాపకార్యాలకు పురికొల్పుతుంది. వానినుండి వదిలించుకున్ననాడు పరిశుద్ధమై స్వయంజ్యోతి స్వరూపుడైన పురుషోత్తముని యందు లగ్నమవుతుంది. జ్ఞాన, వైరాగ్య, భక్తియుక్తమై ఆ నారాయణుని యందే ఉండే మనస్సుమాత్రమే సక్రమమార్గాన్ని చూపుతుంది. అని భక్తులంటున్నారు.

విద్వాంసు లేమంటున్నారంటే, యీ యింద్రియాలు ఎప్పుడూ ఏదో ఒక వాంఛతో సతమత మవుతూనే ఉంటాయి. అవన్నీ దోషభరితాలు. వానినుండి మనస్సుతోపాటు

ఇంద్రియాలను మరలించి అంతఃకరణను మంచి పనులమీదనే కేంద్రీకరిస్తే అదిమోక్షమార్గం వైపు నడుస్తుంది అంటారు.

భూతకోటి నంతనూ తనవలెనే భావిస్తూ, ఓరిమితో, శాంతహృదయంతో, నిష్కామకర్మ చేస్తూ, నిరంతరం హరినామస్మరణచేస్తూ, నారాయణలీలాగాథలు పాడుకుంటూ వింటూ ఉండేవారు తాపత్రయదూరులవుతారు. వీరు భాగవతోత్తములు.

ఈ భాగవతోత్తముల సహవాసంవల్ల నిరంతరం హరినామస్మరణ, శ్రవణామృతం లభించి క్రమంగా శ్రద్ధ, భక్తి సమకూరుతాయి.

అమ్మా ! ముక్తి కంటె భగవత్సేవాభాగ్యం గొప్పది. శరీరంలోని జఠరాగ్ని మనం తిన్న ఆహారాన్ని జీర్ణంచేసి శక్తిని ఎలాయిస్తుందో, అలానే ఈ సేవ మనలింగ శరీరాన్ని నశింపజేస్తుంది.

కొందరు సర్వకర్మలూ నారాయణార్పణంగా చేస్తూ, హరిచరణసేవనే కోరుకుంటారు. మరికొందరు తమ యోగశక్తితో మనస్సునూ, ప్రాణాన్నీ హరించి ఆ గాథలు గానం చేయడమే మోక్షం కంటె ఉత్కృష్టంగా భావిస్తారు. వీరందరూకూడా మోక్షం పొందుతారు.

ఇటువంటివారియందు స్నేహంతో వారి బిడ్డగా, విశ్వాసంతో వారి భార్యగా, హితవుకోరే స్నేహితుడుగా, మంత్రోపదేశంచేసే గురువుగా, నిత్యపూజలతో దైవంగా వారిని చూస్తూ ఏక్లేశం రాకుండా చేస్తాను. ఇదంతా భక్తియోగులవిషయం.

అమ్మా ! ఇక తత్త్వ విషయం వివరిస్తాను. ప్రకృతి – పురుషుడు ఈ రెండూ ప్రపంచానికి కారణభూతులు. ఇందులో ప్రకృతి చతుర్వింశతి తత్త్వాలతో ఉంటుంది.

పంచమహాభూతాలు, పంచతన్మాత్రలు, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలుపది, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అని అంతఃకరణ చతుష్టయం, ఇవి ఇరవై నాలుగు తత్త్వాలు, ఇదంతా సగుణ బ్రహ్మస్థానం.

వాసుదేవ, సంకర్షణ, అనిరుద్ధ, ప్రద్యుమ్న అని నాలుగు వ్యూహాలున్నాయి. స్వచ్ఛ, శాంత, సత్వగుణంతో ఆకలిదప్పికలు, విచారమోహాలు, వార్ధక్యమరణాలు అనే ఊర్మిషట్కాన్ని జయించి నిత్యమూ, భక్తజనసేవానులభమూ అయినది వాసుదేవవ్యూహం.

మహత్తత్త్వంవల్ల అహంకారం పుడుతుంది. ఇది వికార తేజస, తామస భేదాలతో మూడువిధాలుగా ఉంటుంది. మనస్సు, ఇంద్రియాలు, ఆకాశాది భూతాలు వికార

మయాలు. బుద్ధి, ప్రాణాలతో ఉండేది తేజసాహంకారం. ఇంద్రియసమ్మేళనంతో తామసాహంకారం ఉంటుంది.

దీన్ని అధిష్టించి ఉండేది సంకర్షణవ్యూహం. ఇందులో కార్య, కారణ, కర్తృత్వాలు మూఢత్వమూ ఉంటాయి. సంకల్ప, వికల్పాలు కలిగించే కామ సంభవవ్యూహం అనిరుద్ధవ్యూహం.

తామసాహంకారం వల్లనే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాది తన్మాత్రలూ, యీ తన్మాత్రలవల్ల పంచమహాభూతాలూ, పంచేంద్రియాలు పుట్టాయి. ఇంతతో సృష్టి ప్రారంభమయింది. భూతపంచక సమ్మేళనం వల్లనే అదిసాగుతుంది.

ఈ సృష్టిలో దుర్లభమయిన నరజన్మ సాధించినవాడు నారాయణ చరణసేవతోనే మోక్షం పొందుతాడు.

అలాకాక అణిమాది సిద్ధులు సాధించినవాడు మోక్షానికి మార్గం గుర్తించలేడు. ఆ సిద్ధులువిడి విగతసంగుడై నన్నేధ్యానించాలి. మద్యపానం చేసినవాడు శరీరంమీది వస్త్రాలు జారిపోయినా తెలుసుకోలేడు. అదేరీతిగా ఆత్మతత్త్వం తెలిసినవానికి యీ దేహం మీద అభిమానం ఉండదు. కలలో ఏమో చేసినట్లు ఈ ప్రపంచంలో దారాపుత్రాదులతో ఉంటూ కర్మఫలాలు అనుభవించి, చివరకు ఈ ప్రపంచమంతా తానే అనీ, తనలోనే యిదంతా ఉన్నదనీ భావిస్తాడు.

"భక్తులయినవారు ఎల్లప్పుడూ నా సేవతోనే తృప్తిపడుతూంటారు. దీనినే ఆత్యంతికభక్తి అంటారు. సత్వ రజ స్తమోగుణాలు విడిచినవాడు నావలెనే ఉంటాడు".

ఈ ప్రపంచంలో అచేతనాలకంటే చేతన జీవిశ్రేష్ఠం. అందులో స్పర్శజ్ఞానం మాత్రం కల చెట్టుచేమలకంటె రసజ్ఞానంకల ప్రాణిఉత్తమమయింది. అంతకంటె వాసనాజ్ఞాని ఉత్కృష్టమయినది. అంతకంటె శబ్దజ్ఞానం, దానికంటె రూపజ్ఞానం కలపక్షులు శ్రేష్ఠం. అంతకంటె నాలుగుకాళ్ళ జంతువులు, వీనికంటె రెండుకాళ్ళ మానవులు ఉత్తమోత్తములు.

మానవులలో వేదవేత్తలు, వీరికంటె వేదార్థకోవిదులు, వీరినిమించిన వారుశాస్త్రజ్ఞానంతో సంశయవిచ్ఛేదం చేసేవారు. ఈమీమాంసకులకంటె ధర్మజ్ఞానులు, వీరిని క్రిందికి నెట్టగలవారు ఏ బంధానికీ లొంగనివారు, ఆపైన ధర్మపరులు, వీరిపైన సర్వసమభావనతో నన్నే అర్చించే వారుంటారు.

సర్వలోకేశ్వరుడైన మహావిష్ణువు కృపవల్లనే వాయువు చలించడం, ఇంద్రుడు వర్షించడం, సూర్య చంద్ర తారాదులు ప్రకాశించడం, సముద్రం చెలియలికట్ట దాటకుండా ఉండడం, నదులుప్రవహించడం, చెట్లుపుష్పించి ఫలాలివ్వడం అన్నీ జరుగుతున్నాయి.

ఈ విషయం తెలియక ఇల్లు, భూమి, పశువు, భార్య, బిడ్డలు యివే శాశ్వతమని భావించేవాడు వాటిరక్షణతోనే జీవితాన్నినాశనం చేసుకుంటాడు. ఆరక్షణకోసం ఎందరినో హింసించి ధనం సంపాదిస్తాడు.

వయసుమళ్ళి వార్ధక్యం మీదపడుతుంది.

దున్నడానికి పనికిరాని ఎద్దుని రైతువదిలిపెట్టినట్లు, ముసలివానిని బంధుమిత్రు లందరూ దూరం చేస్తారు.

ఈ బాధలతో శరీరం వికారరూపం పొందుతుంది. వీరు నేడో రేపో ప్రాణంవదు లుతాడని బంధువులు బయపడుతూంటారు. గతపదాటి కాలుబైటపెట్టే ఓపిక ఉండదు. కుక్కబ్రతుకవుతుంది. ఇంత తినడం పడిఉండడం.

జఠరాగ్ని మందగిస్తుంది. ఆకలిపడిపోతుంది. శ్లేష్మం ఎగదన్ని గొంతులో గుర గుర పుడుతుంది. నాలుకపలకదు. ఇంద్రియాలేవీ సక్రమంగా పనిచేయవు. మరణ యాతన అనుభవించే వేళకు విపరీత భయంకరాకారంతో యమదూతలువచ్చి మెడకుతాడు తగిలించి లాక్కు పోవడం మొదలు పెడతారు.

ఈదేహాన్ని విడిచి యాతనాదేహం ధరించి ఆకలి, దప్పికలు పీడిస్తూంటే, మండు వేసవిఎండకు కాలే యిసుక తిన్నెలమీద నడుస్తూ, యమకింకరుల కొరడాదెబ్బల బాధ సహిం చలేక మూర్ఛపోతూ, చేసిన పాపాల అంధకారం చుట్టుముట్టగా తొంభైతొమ్మిదివేలయోజ నాలదూరంలోవున్న యమపురి చేరుతాడు.

ఇదంతా రెండు ముహూర్తాలకాలంలో అయిపోతుంది. ఇక నరకంలో మండుతున్న కొరకంచులతో చురకలు, కత్తులే ఆకులుగా వుండేవనంలో తిరగడం, మంటల మధ్యలో పడడం, సలసలమరిగే నీళ్ళలోకి గెంటుతారు. వాడిగలకత్తులతో, పెద్దపెద్ద గదలతో, కోసి, మొత్తుతారు. ప్రేగులు లాగుతారు. వెల్లగితలా పడుకోబెట్టి ఏనుగుల చేత త్రొక్కి స్తారు. విషంకక్కే భుజంగాలు కరుస్తుంటాయి. శరీరంనిండా ఇనుపగుండ్లు పడుతూంటాయి. దేహాన్ని కోసి అదే తిండిగా పెడతారు.

తమిస్ర, అంధతామిస్ర, రౌరవ నరకాలలో పడి పాపఫలం అనుభవించి మళ్ళీ భూమి మీద పడతాడు.

జీవి ఎలా పుడుతుందీ అని –

పురుషుని శుక్రంలో ప్రవేశించి యువతీగర్భంలో శోణితంతో కలిసి, ఒకరాత్రి కలిలంగా (శుక్రశోణితాలముద్ద) ఉండి, అయిదు రోజులు నీటిబుడగలా, పదవనాటికి రేగుపండంత అయి, క్రమంగా అండరూపం పొంది, నెలదాటాక శిరను ఏర్పడి, రెండు నెలలకు కరచరణాలు కలిగి, మూడవనెలలో చర్మం, ఎముకలు, వెంట్రుకలు, గోళ్ళు ఏర్పడి, క్రమంగా నాలుగవనెలలో ధాతువులుచేరి, అయిదవనెలలో ఆకలి, దప్పికలు కలిగి ఆరవనెలలో మావిలోపల ఉండి తల్లి గర్భంలో కుడివైపున తిరుగుతూ, తల్లితీసుకునే ఆహారంతో క్రమంగా పెరుగుతూ, మలమూత్ర భరితమయిన గర్భంలో, చుట్టచుట్టుకుని పంజరంలో పక్షిలా అటూయిటూ కదలలేక, ఏడవనెలలో జ్ఞానంపొంది అటూయిటూ కదులుతూ గర్భవాసభీతితో, ప్రసూతి మారుతాల బాధతో, తనకి జన్మక్లేశం కలిగించిన పరమ పురుషుని ప్రార్థిస్తూ ఈ దుర్భరోదగ్ర భీకర గర్భ నరకవేదనను శాంతింప జేయమని వేడుకుంటాడు.

ఈ జన్మతో యింక ముక్తి కలిగించమని వేడుకుంటాడు

పదవనెల ప్రవేశిస్తుంది. తల క్రిందికి వస్తుంది. ఊపిరి ఆడదు. మలమూత్ర క్రిమి మధ్యంలో కొట్టుకుంటూ ఉంటాడు. జ్ఞానంపోతుంది. నేలమీద పడతాడు. క్రమంగా తలిదండ్రుల చేతులలో పెరుగుతాడు. శైశవం గడుస్తుంది. బాల్యంప్రాప్తిస్తుంది. అహంకార, మమకారాలు పుడతాయి. సంసారంలో పడతాడు. రాగద్వేషాలు, మళ్ళీకోరికలు. అవి తీరడానికి పాపకర్మలు.

దయ, సత్య, శౌచాలు వదిలేస్తాడు. మానాభిమానాలుండవు మనశ్శాంతి పోతుంది. శరీరమే ఆత్మ అనుకుంటాడు. నారీసంగమమే సుఖం అనుకుంటాడు.

వీటిని విడిచి ధర్మబుద్ధితో ధనార్జనచేసి దానిని యోగ్యులకు దానంచేసి, దేవపితృ కార్యాలు శ్రద్ధగా ఆచరించి వేదోక్తకర్మలు చేసేవారు చంద్రలోకంచేరి పుణ్యఫలం పూర్తి కాగానే మళ్ళీ జన్మిస్తారు.

ఈ కర్మలన్నీ విడిచి నిరంతరం పురుషోత్తముని స్మరించే వారికి పునర్జన్మభీతిలేదు, అని కపిలుడు తల్లికి భక్తిమార్గం ఉపదేశించాడని విదురునికి మైత్రేయముని వివరించేశాడు.

కపిలుడు వెళ్ళడంతో దేవహూతి కొంతసేపుచింతించి, తిరిగి మనస్సు చిక్కబట్టు కొని పురుషోత్తముని యందు మనసునిలిపి ఆయనలో ఐక్యమయింది, అని శుకయోగి పరీక్షిన్మహా రాజుకు వినిపించాడు.

# చతుర్థ స్కంధం

శ్రీ విలసిత ధరణీ తన
యావదనసరోజవానరాధిపసితరా
జీవదళనయన నిఖిల ధ
రావరనుత సుగుణధామ రాఘవరామా !

పరీక్షిన్మహారాజా !

స్వాయంభువ మనువు శతరూప అనే భార్యవల్ల ముగ్గురు కుమార్తెలను కన్నాడని చెప్పాను. అందులో రెండవ ఆమె దేవహూతి కథవిన్నావు. పెద్దకూతురు ఆకూతి. ఈమెను రుచిప్రజాపతి కిచ్చి వివాహం చేశాడు.

మహావిష్ణువు యీమె గర్భాన శ్రీయజ్ఞుడు అనే పేరుతో పుట్టాడు. స్వాయంభువుడు ఈ బాలుని తన యింటికి తీసుకువెళ్ళి పెంచాడు. విష్ణుమూర్తిని నిమేషకాలం కూడా వీడి ఉండలేని శ్రీదేవి ఆకూతికి కుమార్తెగా ప్రభవించి అక్కడే పెరుగుతున్నది.

లక్ష్మీ నారాయణులు ఆదిదంపతులు కనక వారికి వివాహం జరిగింది. అదివారి విషయంలో మాత్రం దోషంకాదు.

ప్రసూతిని దక్షప్రజాపతి కిచ్చి వివాహం జరిపించారు. ఈయన వలన ప్రజావృద్ధి సాగింది.

అనసూయాదేవిని అత్రిమహాముని వివాహం చేసుకున్నాడని విన్నావు.

ఈ దంపతులిద్దరూ ఋక్షపర్వతం దగ్గర నిర్వింధ్యానదీ సమీపంలో పచ్చని చెట్లు నిండినవనం దగ్గర తపోదీక్షవహించారు.

అక్కడ అత్రిమహాముని ఒక కాలు మీద నిలబడి గాలి[illegible] తీవ్రంగా తపస్సు చేస్తున్నాడు.

ఆ తపోదీక్షాగ్నికి ముల్లోకాలూ ఘల మల మాడుతూ[illegible] మహేశ్వరులు ముగ్గురూ అక్కడకు వచ్చారు.

తన ఆశ్రమానికి విజయం చేసిన త్రిమూర్తులను చూచి ఆనందతరంగిత హృదయుడై శిరసున చేతులు జోడించి :

స్వామి ! నేను సంతానకాంక్షతో మీలో ఒకరినే ప్రార్థిస్తున్నాను. మీరు ముగ్గురూ వచ్చి నా జన్మపావనం చేశారు, అనగా వారు :

బాహ్యదృష్టికి మేము ముగ్గురు మూర్తులుగా కనిపించినా వాస్తవానికి ఒక్కరమే. నీ మనసులో కోరిక నెరవేరుతుంది. మా ముగ్గురి అంశలతో ముగ్గురు కుమారులు కలిగి ముల్లోకాలలో కీర్తిపొందుతారు, అని అంతర్ధానమయారు.

ఆ మాట ప్రకారం బ్రహ్మ అంశతో చంద్రుడు, విష్ణువు అంశతో దత్తాత్రేయుడు, శివాంశతో దుర్వాసుడు పుట్టి లోకాలలో పేరుపొందారు.

దక్షప్రజాపతి కూతురు స్వాహాదేవిని అగ్నిహోత్రుడు పరిణయమాడి పావకుడు, పవమానుడు శుచి అని ముగ్గురు కొడుకులను కన్నాడు.

# దక్షయజ్ఞం

దక్షప్రజాపతి కూతురు సతీదేవి పరమశివుని వరించింది. వారుభయులూ అన్యోన్యానురాగంతో దాంపత్య జీవితం గడుపుతున్నారు.

అలా ఉండగా ఒకనాడు —

సత్రయాగం చేస్తున్నారు బ్రహ్మవేత్తలు.

అక్కడకు దక్షప్రజాపతి వచ్చాడు.

అందరూ లేచి నిలబడి స్వాగత మర్యాదలు నడిపించారు.

సదస్యులలో వున్న చతుర్ముఖ ప్రజాపతి, పరమశివుడు మాత్రం కదలకుండా తమ ఆసనాలమీద వున్నారు.

దక్షుడు నెమ్మదిగా చతుర్ముఖుని సమీపించి, అభివాదంచేసి తనకు యోగ్యమయిన ఆసనం మీద కూర్చున్నాడు.

సుఖాసనాసీనుడై శివునివైపు చూస్తూ, కన్నుల చింతనిప్పులు రాలుతూండగా : ఓ మునీశ్వరులారా !

మీరందరూ ఎరుగుదురు, సావిత్రితో సమానమయిన నాకూతురు సతీదేవిని పెండ్లాడిన ఈ పరమశివుడు నేను వచ్చినప్పుడు లేచి గౌరవంగా స్వాగతం యివ్వకపోగా, యింతసేపూ ఒక్కమాటకూడా మాట్లాడలేదు. ఇది ఎంత అవమానకరం. సజ్జను డెవడూ యిలా చరించడు. అభిమానమూ, మర్యాదా ఎరగనివాడు. భూతప్రేతగణాలు సేవిస్తూంటే దిగంబరుడై తామస గుణం నిండిన ప్రమధ గణాలకు నాధుడై, శరీరమంతా బూడిదపూసుకుని, ఎముకల దండలతో శ్మశానవాసం చేస్తూ, జుట్టు విరబోసుకు తిరిగే వీనిని శివుడని ఎలాపిలుస్తున్నారు.

అయితే —

నేను నాబిడ్డను ఎందుకిచ్చానని అడగవచ్చు –

విధి ప్రేరణ అనాలి తప్ప మరేమీ కనిపించదు.

వీని అమర్యాదకర ప్రవర్తన కారణంగా, ఇది మొదలు వీనికి యజ్ఞాలలో హవిర్భాగం యివ్వడానికి వీలులేదు. అని శపించాడు.

ఆవేశంలో పరమశివుని నిందించిన దక్షుని అక్కడి మునులందరూ గర్హించారు. మరింత క్రోధంతో ఆయన చరాలునలేచి తన నగరానికి వెళ్ళిపోయాడు.

పరమశివుని అనుచరులలో ప్రధాని అయిన నందీశ్వరుడు తమ అధిపతిని నిందించిన దక్షప్రజాపతితో వాని వంశీయులందరూ తత్త్వజ్ఞాన శూన్యులై పశువాంఛలలోపడి దేహామే శాశ్వతమని నమ్మే మూఢులవుతారు, ఈ సంసారవిషవలయంలో సడి కొట్టు కుంటారు.

పరమశివుని ద్వేషించే వారందరూ ధనదాసులూ, ఇంద్రియలోలురూ అయి యాచన చేసి బ్రతుకుతారు, అని శపించాడు.

అంతతో భృగుమహర్షికి ఆగ్రహంవచ్చి :

వేదప్రతి పాదితమయిన కర్మాచరణం జేసే విప్రజనాన్ని నిందించిన ధూర్జటి వ్రత పరాయణులు పాషండులై జీవిస్తారు.

భూత పతిని ఆరాధించే వారందరూ జటా, జూటాలతో, ఎముకలమాలలతో బూడిదపూసుకుని తిరుగుతూ మూఢులై పరిశుభ్రత లేకుండా వశిస్తారు, అనిశపించాడు.

కొన్ని రోజులు గడిచాయి —

దక్షుడు ఎలా అయినా రుద్రుడు లేని యాగం చెయ్యాలని నిశ్చయించినాడు. అందుకు "బృహస్పతి యజ్ఞం" అనేది సాగించి, వచ్చిన నిఖిల దేవగణాలనూ, ముని బృందాలనూ ఉచితరీతిని సత్కరించి పంపించాడు.

వారందరూ గగనవీథిని విమానాలమీద వెడుతూ దక్షయజ్ఞాన్ని గురించి ఘనంగా చెప్పుకుంటూంటే విన్న సతీదేవి, తనకు కూడా తన తండ్రి చేసే యాగం చూడాలని ఉందనీ, ఆ యజ్ఞానికి తన అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ అందరూవస్తారు కనుక వారిని చూసి వస్తాననీ భర్తను వేడుకుంది.

పుట్టింట జరిగే ఉత్సవానికి నాకు పిలుపు రాలేదు కనుక వెళ్ళడం మంచిదికాదంటే పుట్టింటికి, గురుగృహానికి, స్నేహితులయింటికి పిలవకుండా వెళ్ళవచ్చుగదా, అని పరిపరి విధాల ప్రతిమాలింది.

పరమశివుడు చిరునవ్వునవ్వి :

ప్రాణేశ్వరీ! నువ్వు చెప్పినట్లు పుట్టింటికీ, గురుగృహానికీ, స్నేహితుల నివాసాలకూ పిలుపులేకుండా వెళ్ళడం దోషంకాదు. కాని, మంచిచెడ్డల వివేకం లేకుండా అహంకారంతో చరించే వారింటికి పిలవకుండా వెడితే వారు అవమానిస్తారు. శత్రువుల ఆయుధ ప్రహారాలతో దేహం రక్తసిక్తమైనా భరించవచ్చు. ఆప్తులయినవారు నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించలేము. ఇప్పుడు నామీద ద్వేషంతోవున్న వారింటికి నువ్వువెడితే నీకు కూడా అవమానమే సిద్ధిస్తుంది. ఇంతచెప్పినా నీకు వెళ్ళాలని వుంటే వెళ్ళు, అన్నాడు.

పుట్టింటి మీది ఆశ వీడని సతీదేవి ప్రయాణమయింది. ఆవిడ ప్రయాణానికి అనుకూలంగా పరమశివుని అనుచరులయిన యక్షులు ఆవిడసేవకు అవసరమయిన లాంఛన సామాగ్రి అంతా తీసుకుని ఆమెను వృషభవాహనం ఎక్కించి, శంఖ దుందుభి ధ్వానాలతో యజ్ఞశాల చేరారు.

దక్షునికి భయపడి యజ్ఞమండపంలోని వారెవరూ ఆమెను పల్కరించలేదు. కన్న తల్లి, చెల్లెళ్ళు, ఆదరించినా, తండ్రి తనవైపుకూడా చూడలేదు.

ఈశ్వర తిరస్కారం, రుద్ర రహిత యాగం చూసేసరికి ఆమెకు విపరీతంగా రోషంవచ్చింది. ఆమె వెంట వచ్చిన రుద్రగణాలు తమ అధిపతిని అవమానించిన వానిని సంహరిస్తామని ముందుకు నడవగా వారిని వారించింది.

సభాసదులను చూస్తూ :

ఈ లోకంలో పుట్టే అందరినీ ప్రేమతోచూసే పరమశివునికి పక్షపాతభావంలేదు. అదితెలియక గర్వంతో ఈ దక్ష ప్రజాపతి ఆయనను అవమానించాడు.

ఇటువంటి వారికి ఎదుటివారి సుగుణాలు కూడా దుర్గుణాలుగా కనిపిస్తాయి. ఉత్తములయినవారు తమ ఎదుటివారిలో దుర్గుణాలన్నీ సుగుణాలుగానే భావించి మన్నిస్తారు.

ఒక్కమారు "శివశివా!" అంటే చాలు సర్వపాపాలు హరిస్తాయి. అటువంటి పరమశివుని అవమానించిన యీ ప్రజాపతిని ఏమనాలి?

శివనింద చేసినవాని నాలుక కోసివెయ్యాలి. అది చెయ్యలేకపోతే శివనింద వినడం కంటె ప్రాణాలు వదలడం మంచిది. అందుకు ధైర్యం చాలకపోతే రెండుచెవులూ మూసుకుని ఆ ప్రదేశం విడిచిపోవాలి.

మనిషి తనకు తెలియకుండా ఏ పదార్థమయినా తినరానిదితింటే వాంతి చేసుకుని పవిత్రంగా ఉంటాడు. అలానే నేను నీ బిడ్డననిపించుకోవడం కంటె హేయంలేదు. కనక ఈ దేహాన్ని వదిలిపెడుతున్నాను. అప్పటికి కాని నాకు శుద్ధికాదు, నన్ను నాభర్త "దక్షుల వారి అమ్మాయి!" అని పిలుస్తూంటే నా గుండె మండిపోతూ ఉంటుంది, అంటూనే ఉత్తరదిక్కుగా తిరిగి కూర్చుని, ప్రాణాపాన వాయువులను ఒకే వయిపుకు నడిపి, నాభి వద్ద నిలిపి ఉదానంతో కలిపి హృదయందాకా నడిపి, కంఠసీమ దాటించి, భ్రూమధ్యంలో కేంద్రీకరించి, పరమశివుని ధ్యానిస్తూ యోగాగ్నిలో దేహాన్ని భస్మంచేసింది.

యజ్ఞశాలలో హాహా రవాలు లేచాయి.

రుద్రుని అనుచరులందరూ యజ్ఞమండపంలోని వారిని సంహరించడానికి ఉద్యుక్తులు కాగా భృగుమహర్షి అభిచార హోమంచేసి యజ్ఞ విధ్వంసకులను ఎదుర్కొనే ఋభు గణాలను పుట్టించగా వారు శివగణాలను పారద్రోలారు.

వార్తవిన్న పరమశివుడు తీవ్రక్రోధంతో జటాజూటం పెరికి నేలకువేసికొట్టగా మహా భీషణ రూపంతో వీరభద్రుడు అవతరించాడు.

అభ్రంలిహోదభ్ర విభ్రమభ్రమ
కృష్ణనీల దీర్ఘ శరీరమమర
ప్రజ్వల జ్వలన దీప్త జ్వాలికాజాల
జాజ్వల్యమాన కేశములు మెరయ

చండదిగ్వేదండ శుండాభదోర్దండ
సాహస్ర ధృతహేతి సంఘమొప్ప
వీక్షణత్రయలోక వీక్షణద్యుతి
లోకవీక్షణతతి దుర్నిరీక్షముగను
క్రకచ కఠినకరాల దంష్ట్రలు వెలుంగ
ఘనకపాలాస్థి వనమాలికలును తనర
అఖిలలోక భయంకరుడగుచు
వీరభద్రుడుదయించె
మారట రుద్రుడగుచు.

ఏనుగుతొండాలవంటి వేయిచేతులతో, రంపాలవంటి దంతాలతో, విశాల దేహంతో, మండుతూన్న అగ్నికాంతుల జటలతో, లోకాలను మండించే అగ్నిగోళాలవంటి కన్నులతో ఆవిర్భవించిన వీరభద్రుడు రుద్రుని పాదాలకు మ్రొక్కి నిలువగా, శివుడు:

ఓ మహావీరుడా! నా సర్వసేనకూ అధిపతివై నడిపించి, దక్షుని కడతేర్చి, యజ్ఞాన్ని నాశనంచెయ్యి, అనగానే భయంకర శూలధారియై వీరభద్రుడు భూమ్యాకాశాలు దద్దరిల్లేలా అడుగులువేస్తూ యజ్ఞశాలసమీపించాడు.

సాక్షాత్తూ దండధారియైన యమునివలె వచ్చిన వీరభద్రునిచూస్తూ అందరూ గజగజలాడారు.

సతీదేవివంటి యిల్లాలిని పరాభవించిన దక్షుని పాపఫలం యిది, అనుకున్నారు.

వీరభద్రుని అనుచరగణం యజ్ఞశాలకు ప్రవేశంలోవున్న మండపాన్ని ధ్వంసంచేశారు. అలాముందుకుసాగి సర్వనాశనం ఆరంభించారు. యాగశాలలోని వారందరూ భయంతో పారిపోతూవుండగా వీరభద్రుడు దక్షుని, మణిమంతుడు భృగువును, చండీశ్వరుడు సూర్యుని, నందీశ్వరుడు భగుని పట్టివేధించారు. నందిచేతులలో భగుని కన్నులు ఊడిపడ్డాయి. చండీశ్వరుడు సూర్యుని పళ్ళుఊడబెరికాడు. భృగువుకు గడ్డం, మీసం తీసేసారు.

అప్పుడు దక్షుని పడగొట్టి వాడిగలకత్తితో ఎంతపొడిచినా దక్షుని చర్మం తెగలేదు. వరప్రభావంవల్ల ఆ చర్మం అంతగట్టిపడిందని గ్రహించి, శిరసుఖండించి దక్షిణాగ్నికి ఆహుతి చేశాడు.

చెయ్యవలసినంతపనీచేసి వారందరూ కైలాసం చేరారు.

యజ్ఞశాలనుంచి పరుగున పరుగున వెళ్ళిన వారందరూ జరిగిన విషయమంతా బ్రహ్మకూ, విష్ణుమూర్తికీ వివరించారు.

ఇంతజరుగుతుందని తెలిసినందువల్లనే వారి యాగానికి రాలేదు.

దేవతలందరూ మొరపెట్టగా విన్న చతుర్ముఖుడు :

నాయనలారా ! మీరందరు వెళ్ళి పరమశివుని పాదాలమీదపడి శరణువేడండి. ఆయన దగ్గరకు వెళ్ళడంఎలా ? అని భయపడకండి. నేనుకూడామీతోవస్తాను, అని తనవెంట దేవతలను, పితృదేవతలను, ప్రజాపతులను నడిపించి, భక్తజనులమనస్సులకు ఉల్లాసం కలిగించే కైలాసంచేరారు.

అక్కడ పద్మాసనాసీనుడై నారదమునితో యిష్టాగోష్ఠిసాగించే పరమశివునిచూశారు. ఆ ప్రశాంతవాతావరణంలో ఎందరోయోగులూ, సిద్ధులూ పరివేష్టించివున్న ఆయనను సమీపించి దేవేంద్రాదులందరూ పాదాభివాదంచేశారు.

పరమశివుడు నవ్వుతూ, వినయంగా చతుర్ముఖునికి నమస్కరించాడు. ఆయన వెనువెంట నందీశ్వర, చండీశ్వరాదులందరూ బ్రహ్మకు పాదాభివాదంచేశారు.

అప్పుడు బ్రహ్మ ఉచితాసనం మీద ఆసీనుడై :

పరమశివా ! అఖిలప్రపంచసృష్టి, స్థితి, లయాలు నీ అధీనాలు. ఈ జగత్తులో ధర్మార్థాలను సురక్షితంగా ఉంచడంకోసం వేదాలనూ, వేదోక్తకర్మలనూ రక్షిస్తూ, అందుకే దక్షప్రజాపతి ఆదిగాగలవారిని నిమిత్తమాత్రంగా ఉంచి క్రతువు చేయించావు. సత్కార్యాలు చేసేవారికి మోక్షంయిచ్చి, దుష్టులను నరకానికి పంపుతున్నావు.

ఈ భూతకోటి అంతా నీకు సమానమే. అయితే ఆత్మజ్ఞానంలేక అనేక కారణాల వల్ల మదోన్మత్తులయి కొందరు పరుల సంపదలుచూసి ఓర్వలేక అనేకవిధాల వారిని దూషిస్తూ చరించే మూర్ఖులను ఎవరయినా శిక్షించకుండా ఉండరు.

కాని నీవంటివాడు శిక్షించడం అంత ఉచితంకాదు.

ప్రస్తుతం దక్షుడారంభించిన యజ్ఞం ఆగిపోయింది. అది పరిసమాప్తం కావాలంటే దక్షుడు మళ్ళీ జన్మించాలి. అంగహీనులయిన వారందరినీ ఆరోగ్యవంతులుగా చెయ్యాలి. ఇదంతా నీవల్ల జరగాలి, అనగా శివుడు చిరునవ్వుతో :

దుర్బలులను రక్షించడానికి బలవంతులను దండించక తప్పదు. ఇప్పుడు నీ కోరిక ప్రకారం అన్నీ జరుగుతాయి. అయితే దక్షుడు అజాముఖుడుగా ఉంటాడు. సూర్యుడ పిష్టం మాత్రం తినగలుగుతాడు, అని అనుగ్రహించాడు.

మేకముఖంతో దక్షుడు పునర్జన్మపొందాడు. పరమశివుడు యజ్ఞశాలకు వచ్చాడు. దక్షుడు పరిపరివిధాల పరమశివుని స్తుతించి ఆయన సమక్షంలో నిర్విఘ్నంగా యాగం పూర్తిచేశాడు.

అనంతరం అందరూ మహావిష్ణువును ప్రార్థించి ఆయన అనుగ్రహంతో ఆనందభరితహృదయులై ఎవరిగృహాలకు వారు వెళ్ళారు.

యజ్ఞశాలలో తనువువిడిచిన సతీదేవి మేనకా హిమవంతుల పుత్రికగా పార్వతీదేవియై ప్రభవించింది, అని శుకయోగి అనంతరగాథ అందుకుంటున్నాడు.

మహారాజా! మహాభక్తశిరోమణి ధ్రువుడు. ఆయన గాథను వినబోయేముందు మరికొన్ని విశేషాలు వినిపిస్తాను.

అధర్ముని భార్య మృష. వీరికి దంభుడు, మాయ అని కుమారుడు కూతురు కలిగారు. వీరు అధర్మసంతానం కనుక వారిద్దరూ భార్యాభర్తలయారు. వీరికి లోభుడు నికృతి అనే అబ్బాయి - అమ్మాయి పుట్టి వీరు వివాహితులై క్రోధుడు - హింస అనే బిడ్డలను కన్నారు. ఈ అన్నాచెల్లెళ్ళు దంపతులయారు. వీరికి కలి - దురుక్తి అను పేర్లతో కలిగిన ఇద్దరూ దంపతులయి, భయుడు - మృత్యువు అనే పిల్లల్ని కన్నారు వీరు భార్యా భర్తలుగా సంసారంచేసి యాతన, నిరయం అనే బిడ్డల్ని కన్నారు. వీరు దంపతులై సంసార కారణమైన అధర్మవృక్షానికి పట్టుగొమ్మలయారు. అన్నాచెల్లెళ్ళదాంపత్యం ఈవంశలక్షణం.

# ధ్రువోపాఖ్యానం

స్వాయంభువమనువు కుమార్తెల చరిత్రలు విన్నావు. ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు ఆయన కుమారులు.

ఇందులో ఉత్తానపాదుడు ఉత్తముడు. ఈయనకు సునీతి, సురుచి అని యిద్దరు భార్యలు. సునీతి వినయగుణశీల. యీమెకొడుకు ధ్రువుడు. సురుచి కుమారుడు ఉత్తముడు.

కాలప్రభావంవల్ల మహారాజుకి సునీతికంటె సురుచియందు అనురాగం ఎక్కువ: నిరంతరం ఆవిడతోనే విలాసంగా ఉండేవాడు.

ఒకనాడు ఉత్తానపాదుని తొడమీద కూర్చొని ఉత్తముడు ఆడుకుంటూండగా చూసిన ధ్రువుడు ఆశగా తండ్రివైపు చూశాడు. అది గమనించిన సురుచి, పరిహాసంగా:

వెర్రివాడా! తండ్రితొడమీద ఎక్కేయోగం నీకుంటే నువ్వు నాబిడ్డవై పుట్టేవాడివి. నా సవతికొడుకుకి ఆ అదృష్టంరాదు. ఇప్పటికీ మించిపోలేదు. శ్రీహరిని ప్రార్థించు. ఆయన అనుగ్రహించి నిన్ను నా కొడుకుగా పుట్టిస్తాడు. అప్పుడు మహారాజు నిన్ను ఆదరిస్తాడు, అంది.

ధ్రువుని లేతమనస్సు చివుక్కుమంది.

గోలుగోలున ఏడుస్తూ తల్లిదగ్గరకు వెళ్ళాడు.

జరిగిన విషయం తెలుసుకొని సునీతి :

ఎందుకేడుస్తావు నాయనా! ఎవరు చేసుకున్న కర్మ వారు అనుభవించాలి. అగ్ని సాక్షిగా పరిణయమాడిన నన్ను దాసీకన్నా నీచంగా చూస్తున్నారు ఆయన.

పరిహాసం చేసినా సురుచి మంచిమాటలు చెప్పింది.

శ్రీహరి పాదధ్యానంవల్ల నెరవేరని ఆశలేదు.

మీ తాతగారు స్వాయంభువమనువు శ్రీహరి సేవాక్రతువులుచేసి ఇహ పర భోగ సుఖాలు సాధించారు. నువ్వుకూడా ఆయనను ధ్యానించు, అంది.

తల్లిమాటలే పరమప్రమాణంగా భావించి, రాజధాని విడిచి అరణ్యానికి బయలు దేరాడు. దారిలో నారదుడు కనిపించి శిరసు నిమిరాడు. నారదుని పవిత్రకరస్పర్శతో సర్వపాపాలు నశించాయి.

చిరునవ్వుతో నారదుడు :

నాయనా! మాటపడితే సహించలేని క్షత్రియవంశీయునివలె ఉన్నావు. ఎక్కడికి వెళుతున్నావు? అని ప్రశ్నించాడు.

ధ్రువుడు : మహర్షీ! సవతితల్లి మాటలనే శూలాలతో గాయపడిన మనస్సును భగ వంతునిమీద లగ్నంచేసి ప్రశాంతం చేసుకుందుకు వెళుతున్నాను, అన్నాడు.

ఆ బాలుని దీక్షను పరిశీలించి, తిరిగి రాజధానికి పంపుదామని ప్రయత్నించాడు నారదుడు. వినలేదు ధ్రువుడు.

అప్పుడు నారదుడు :

నాయనా! యమునా నదీతీరాన మధువనం ఉంది. ఆ వనంలో ప్రశాంత వాతా వరణం. అక్కడ దర్భాసనం మీద ఆసీనుడవై, ఇంద్రియాలను నిగ్రహించి, ప్రాణాయామ నియమంతో శ్రీహరిని ధ్యానించు, అని నారాయణ మంత్రం ఉపదేశించి :

హార కిరీట కేయూర కంకణ
ఘన భూషణుడాశ్రిత పోషణుండు
లాలిత కాంచీకలాప శోభిత
కటి మండలుం డంచిత కుండలుండు
మహనీయ కౌస్తుభమణిఘృణి
చారుగ్రైవేయకుం డానందదాయకుండు
సలలిత ఘన శంఖ చక్ర గదా
పద్మహస్తుండు భువన ప్రశస్తుడజుడు
క్రమ సౌరభ వనమాలికాధరుండు
హిత విమోహుండు నవ్యపీతాంబరుండు
లలిత కాంచన నూపు రాలంకృతుండు
నిరతిశయ సద్గుణుడు దర్శనీయ తముడు

అయిన వాసుదేవుని త్రికరణశుద్ధిగా పూజించి, సేవించిన వారికి ఆయన కొంగు బంగారం, అని నారదుడు బోధించగా, ధ్రువుడు సంతోషంతో దేవమునికి నమస్కారాలు చేసి, మధువనం చేరాడు.

యమునా నదిలో స్నానంచేసి నియమబద్ధుడై పద్మాసనం వేసి కూర్చుని, పరమ పురుషుని యందు మనసు నిలిపి, మూడురోజుల కొకమారు దొరికిన వెలగపండ్లు, రేగిపండ్లు ఆహారంగా తినుకుంటూ ఒక వెలగడిపి, అనంతరం ఆరు రోజుల వరకూ ఆహారం తినకుండా, ఆరవనాడు పండి రాలిన ఆకులు తినిగడుపుతూ, మూడవనెలలో తొమ్మిది రోజుల కొకసారి మంచినీరు త్రాగి కడుపునింపుతూ, తరువాయి పన్నెండు రోజుల కొక్కమారు గాలినే ఆహారంగా తీనుకుని, అనంతరం ఒక్కకాలు మీద నిలబడి గాలికూడా పీల్చకుండా రాయిలా ఉండి పరాత్పరుని ధ్యానిస్తూ గడుపుతూంటే ముల్లోకాలూ గజగజలాడాయి.

అంతతో దేవతలందరూ శ్రీహరిని చేరి చరాచర భూతకోటికి ఈ ఉపద్రవం నివారించమని కోరారు.

అప్పుడాయన మందహాసం చేసి :

భయపడకండి. ఉత్తానపాదుని కుమారుడు ధ్రువుడు నన్ను స్మరిస్తూ తపోదీక్షలో వున్నాడు. వాని తపోగ్ని తీవ్రతవల్ల ఈ ఉపద్రవం ఏర్పడింది. వానిని దీక్షనుండి విరమింపజేస్తాను, మీరు వెళ్ళిరండి, అన్నాడు.

దేవతలందరూ వారి వారి నివాసాలకు వెళ్ళారు.

మరుక్షణంలో శ్రీహరి ధ్రువునిముందు ప్రత్యక్షంకాగా, భక్తశిరోమణి పులకిత గాత్రుడై చతుర్భుజునికి పాదాభివాదం చేసి నిలబడగా, పురుషోత్తముడు తన శంఖహస్తంతో వాని శిరసు నిమిరాడు.

అంతతో జ్ఞానియై నారాయణుని కీర్తిస్తూ;

నీకు మ్రొక్కెద అత్యంత నియమమొప్ప
భవ్య చారిత్ర! పంకజ పత్రనేత్ర!
చిరశుభాకార! నిత్యలక్ష్మీ విహార!
అవ్యయానంద! గోవింద! హరి! ముకుంద!

అని ప్రార్థించి నిలబడ్డాడు.

శ్రీహరి చిరునవ్వుతో:

రాకుమారా! సప్తమహర్షులతో నిఖిల తారాగోళాలూ, సూర్యాది గ్రహమండలాలూ నిరంతరం ప్రదక్షిణంచేసే "ధ్రువక్షితి" అనేస్థానం నీకు కల్పిస్తున్నాను. ప్రళయవేళ కూడా అది నశించదు. అక్కడకు చేరడానికి ముందు నువ్వుకొంతకాలం రాజ్యపాలనం చెయ్యాలి. ఆ సమయంలో కూడా నన్నే స్మరిస్తూ సత్క్రతువులు సాగించి పరమపదం పొందుతావు, అని అదృశ్యమయాడు.

ధ్రువుడు యింటికి తిరిగి వచ్చాడు.

రాజధానిలోని ప్రజలందరూ ఎంతో ఉత్సాహంతో స్వాగతం పలికారు. ఉత్తాన పాదుడు ఆనందబాష్పాలతో ఆలింగనం చేసుకుని, రాజసౌధానికి తీసుకువెళ్ళి, పట్టాభిషిక్తుని చేసి వానప్రస్థాశ్రమం స్వీకరించి వెళ్ళాడు.

శింశుమార ప్రజాపతికూతురైన భ్రమి అనే గుణవతిని వివాహం చేసుకుని కల్ప, వత్సర అనే కుమారులను కని, అనంతరం వాయువు కూతురైన ఇల అనేకన్యను వివాహమాడి ఆమెవల్ల కుమారునీ, కుమార్తెనూ కన్నాడు.

ఈ మధ్యకాలంలో ఉత్తముడు అరణ్యానికి వేటకువెళ్ళి అక్కడ ఒక యక్షుని చేతిలో మరణించాడు. కొడుకు మరణవార్తవిని సురుచి అరణ్యానికిపోయి అక్కడ దావాగ్నిలో ప్రాణాలు విడిచింది. ఈ రెండుసంఘటనలూ మనఃక్లేశం కలిగించగా ధ్రువుడు హిమవత్పర్వత ప్రాంతపులోయలో వున్న అలకాపురి చేరి యక్షులతో యుద్ధం

ఆరంభించాడు. కొంతసేపు యక్షులు మాయాయుద్ధంచేసి ధ్రువుని చీకాకు పరిచారు. అంతతో మరింత ఆగ్రహం కలిగింది. అయినా వారి మాయాజాలాన్ని ఛిన్నాభిన్నం చేసే దారితోచక ఆలోచిస్తున్న సమయంలో మునులు ప్రత్యక్షమై.

నాయనా ! సిఖిల మాయలనూ నంహరించేశక్తి శ్రీహరి స్మరణతో కలుగుతుంది, అని అదృశ్యమయారు.

ధ్రువుడు శ్రీహరిని స్మరించి నారాయణాస్త్రం ప్రయోగించాడు. అంతతో యక్షుల శక్తులు సన్నగిల్లాయి. ఆ అస్త్రప్రభావంవల్ల బయలుదేరిన వాడిబాణాలు వారందరినీ హింసించ నారంభించాయి. కొందరు కాళ్ళువిరిగి, మరికొందరు తొడలువిరిగి, చెవులురాలి, చేతులుత్రావాలి, పొట్టలుచీలి నానాయాతనలూ పడుతూంటే స్వాయంభువమనువు ప్రత్యక్షమై:

ఏమిటీ కిరాతక కృత్యం. దేహాభిమానంకల పశుప్రాయులుచేసే పని యిది. సర్వప్రాణికోటికీ అధీశ్వరుడైన నారాయణుని సేవించి పరమపదం పొందిన నువ్వు ఈపాప కర్మచేయరాదు. సహనము, భూతదయ, కరుణ, స్నేహభావం ఉన్నవారివే శ్రీహరి కరుణిస్తాడు.

మరొక్కమాట :

వీరు నీసోదరుని చంపారనే ద్వేషంవల్ల యింతచేస్తున్నానంటావు. వీరునిమిత్త మాత్రులు. అంతా శ్రీహరి లీలవల్ల సాగుతూంటుంది.

దుష్టజనుల పాలిట మృత్యురూపుడు, సజ్జనులకు అమృతస్వరూపుడు అయిన సర్వాంతర్యామి నారాయణుడు. ఆయన చరణారవింద సేవను మించినదిలేదు.

నీ సోదరుని చంపారని నువ్వు వీరిని సంహరించావు. అందువల్ల కుబేరునికి అపచారం జరిగింది. ఆయన పరమశివుని యిష్టసఖుడు. ఈ అపరాధాన్ని మన్నించమని కుబేరునివేడుకో, అని శాంతింపజేసి వెళ్ళారు.

ధ్రువుడు ప్రసన్నుడుగా వున్న వార్తవిని కుబేరుడు తన అనుచరులతో వచ్చారు. కుబేరునిచూస్తూనే ధ్రువుడు చేతులు జోడించాడు.

అప్పుడు కుబేరుడు :

రాకుమారా ! మీతాతగారి మాటలువిని నువ్వు శాంతించావు. సంతోషం. ఇక నువ్వు నిర్మల హృదయంతో విష్ణు నామస్మరణమే జీవితధ్యేయంగా సాగించు, అని పంపించాడు.

ధ్రువుడు తన రాజ్యానికి వచ్చి భూరిదానాలతో ఎన్నోయజ్ఞాలుచేసి పురుషోత్తముని యందు మనసునిలిపి, సర్వం హరిమయంగా చూస్తూ కొంతకాలం రాజ్యంచేసి, కొడుకును సింహాసనం ఎక్కించి, బదరికావనం చేరి, వినిర్మల నదీజలాలలో స్నానంచేసి, పద్మాసనా సీనుడై నారాయణనామస్మరణం ఆరంభించాడు.

కొంతకాలానికి నందసునందులనే నారాయణ సేవకులు దివ్యవిమానంతెచ్చి, ధ్రువుని దానిమీదకు ఎక్కించి, వైకుంఠం వైపు బయలుదేరగా:

ఓ నారాయణ సేవకులారా ! నాకన్నతల్లిని విడిచిరాలేను, అనగా వారు తమ ముందున్న విమానంమీద వానితల్లిని చూపించారు. ఆనందంతో ధ్రువుడు నారాయణ పదం చేరాడు.

# వేనుడు

ఈ వంశంలో అంగుడనేరాజు చిరకాలం సంతానంలేక పుత్రకామేష్టిచేసి కుమారుని కన్నాడు. వాని పేరు వేనుడు. వీడు చిన్ననాటినుంచీ క్రూరకృత్యాలు చేస్తూ అందరినీ హింసించేవాడు. ఇటువంటి దుష్టుడు కొడుకుగా పుట్టడంకంటే సంతానంలేకపోయినా బావుండును, అని బాధపడి, దండించినా, శాసించినా వాని నడవడి మారలేదు.

అది సహించలేక ఆరాజు ఎవరికీ చెప్పకుండా అడవికి వెళ్ళాడు. మంత్రి పురో హితులు అనేక ప్రాంతాల తమ రాజుకోసం వెదకి కనిపించక వేనుని సింహాసనం ఎక్కించారు.

సింహాసనం ఎక్కింది మొదలు వాడు మరీ దుష్టుడై సజ్జనహింస ఆరంభించాడు.

యజ్ఞ యాగాలు నిషేధించాడు.

దానధర్మాలు కట్టిపెట్టించాడు.

అగ్నిహోత్రకార్యం పనికిరాదన్నాడు.

ఈవార్తతెలిసి ప్రాజ్ఞులయిన కొందరు వానిని సమీపించి, స్వస్తివాక్యాలుపలికి:

మహారాజా ! మనోవాక్కాయాలతో జరిపే ధర్మకార్యాలవల్ల లోకాలు క్షేమంగా ఉంటాయి. ప్రజలకు కల్యాణ ప్రదాలివి : అయితే రాజు ధర్మమార్గం విడిచిపెడితే ప్రజలు వానిని తరిమేస్తారు.

రాజ్యంలో చోరభీతినీ, నీ అనుచరుల వంచననూ గమనించి ప్రజలను రక్షించాలి.

రాజ్యంలో శ్రీహరి ప్రీతిగా యజ్ఞయాగాలు సాగుతూ ఉండాలి. నారాయణుడు తృప్తిపొందితే యిహ పర సుఖ భోగాలిస్తాడు. కనక రాజ్యంలో యజ్ఞయాగాలు నడిపించి సర్వదేవతాప్రీతి కలిగించు, అన్నారు.

వేనుడు నవ్వుతూ : ఏమిటి మీమాటలు! ఎవడాయజ్ఞప్రియుడు? జారునితోతిరిగే యిల్లాలికి భర్తకంటె వాడే ప్రియుడైనట్లు మీరు ప్రభువునైన నన్నుకాదని ఎవరినో ఆరాధించ మనడం నాకు నచ్చలేదు.

సర్వదేవతలూ రాజులోనే వున్నారు కనక మీరంతా నన్ను పూజించి సేవించండి, అని అహంకారంతో మాట్లాడుతుండగా, ఆ పెద్దలు :

ఇటువంటి నీచకర్ముని వల్ల లోకానికి హానికలుగుతుంది. ఏ పురుషోత్తముని అనుగ్రహవిశేషంవల్ల వీడు రాజభోగాలనుభవిస్తున్నాడో ఆ నారాయణునే నిందించే వీనిని అంతమొందించాలి, అని నిశ్చయించి క్రోధాగ్నిని పూరించి హుంకారం చేశారు.

వేనుడు మరణించాడు.

రాజులేకపోతే దేశంలో చోరులూ, క్రూరులూ పెచ్చుపెరిగి రెచ్చి సాదుహింస సాగించగలరని భావించి, వేనుని ఊరువును మధించగా ఒక రాక్షసుడు పుట్టాడు. వానిని నిషాదుడుగా అరణ్యాలకు పొమ్మన్నారు.

అప్పుడు వేనుని బాహువులు మధించగా నారాయణాంశతో పృథువు, లక్ష్మీదేవి అంశతో అర్చి జన్మించారు.

పృథువును రాజ్యాధిపతిని చేశారు.

ఆయన సర్వలక్షణ లక్షితుడై అర్చితో దాంపత్యం సాగిస్తూ నిఖిలప్రజారంజకంగా పరిపాలన ఆరంభించాడు.

అలా సాగుతూండగా దేశంలో క్షామంఏర్పడి ప్రజలు అన్నోదకాలులేక అలమటి స్తూంటే, వారి బాధలుచూడలేక, ఇంతకూకారణం భూమినిస్సారంకావడం అనిగ్రహించి, ధనుస్సునందించాడు.

భూదేవి భయపడి గోరూపధారియై పరుగుపెడుతూంటే తరిమి తరిమి వెడుతున్నాడు.

కొంతదూరం సాగాక భూదేవి నిలబడి :

మహారాజా! రక్షించు నిఖిలప్రాణికోటికి ఆధారమయిన ఓషధులు నాలోవున్నాయి.

గోరూపంలో వున్ననాలో క్షీరంగావున్న వాటిని పిండుకోవాలి. అందుకుముందు లేగదూడ కావాలి, అనగా మనువును ఆవుదూడగా ఉంచి మహారాజు ఓషధులన్నీ పిదికి ప్రజానంద కరుడయాడు.

కొంతకాలం గడిచింది.

పృథుచక్రవర్తి అశ్వమేధం ఆరంభించాడు.

యాగశాలలో నిర్విరామంగా షడ్రసోపేతమయిన భోజనపానీయాలు సమకూరుతూ, వేదోక్తంగా యజ్ఞంసాగుతున్నది. అదిచూచి దేవేంద్రుడు సహించలేక యజ్ఞశాలలోని అశ్వాన్ని అపహరించాడు.

అంతతో పృథువు ధనుర్బాణధరుడై దేవేంద్రునిపై బాణవర్షం కురిపించగా, ఇంద్రుడు అశ్వాన్నివదలి వెళ్ళిపోయాడు.

పృథువు అశ్వాన్ని తీనుకువచ్చి యజ్ఞంపరిసమాప్తం చేసేయత్నంలో ఉండగా యింద్రుడు మళ్ళీ అపహరించాడు. అప్పుడు పృథువు ఇంద్రసంహారానికి సన్నద్ధుడుకాగా వేదవేత్తలు వారించి :

మహారాజా! శక్తిమంతములయిన మంత్రాలతో దేవేంద్రుని యిక్కడకు ఆహ్వానిస్తాం. రాగానే వానిని అగ్నికి ఆహుతి చేయవచ్చు, అన్నారు.

ఆయన అంగీకరించాడు.

ఋత్విక్కులు దీక్షవహించారు.

ఆసమయాన చతుర్ముఖుడు వచ్చివారిని శాంతింపజేసి, పృథువుకు యాగఫలం అనుగ్రహించాడు.

అప్పుడు విష్ణువు ఇంద్రసమేతంవచ్చి పృథువుకు క్షమార్పణలుచెప్పించి :

రాజా! నరపాలునికి ప్రజారక్షణ ప్రధానకర్తవ్యం. అందువల్ల ప్రజలుచేసేపుణ్య కర్మఫలంలో ఆరవవంతులభిస్తుంది. అలాకాక ప్రజలకష్టసుఖాలతో సంబంధంలేనిరాజు ప్రజలందరి పాపఫలాన్నీ అనుభవించక తప్పదు, అని బోధించాడు.

తన పాదాలమీద వ్రాలిన ఇంద్రుని లేవనెత్తి గాఢాలింగనం చేసుకున్నాడు పృథువు.

అనంతరం మహావిష్ణువును ప్రార్థించి, సెలవుతీసుకుని రాజధానిచేరి, త్రికరణశుద్ధిగా పురుషోత్తమధ్యానం చేస్తూ, కన్నబిడ్డలవలె ప్రజలనుపాలిస్తూ, సత్కర్మలతో, దానధర్మా

లతో అందరినీ తృప్తిపరుస్తూ, క్రమంగా తనువు చాలించి, భార్యతోకలిసి పురుషోత్తమ పదం చేరాడు.

# పురంజనోపాఖ్యానం

పరీక్షిన్మహారాజా!

చాలాకాలం క్రితం మాట.

పురంజనుడనే రాజుండేవాడు.

ఆయన తనకు యోగ్యమయిన నగరంకోసం అన్వేషించి, అన్వేషించి చివరకు తన మనసుకు నచ్చిన నగరం చూశాడు. ఆనగరం వెలుపల చక్కని ఉద్యానవనంలో ఆగాడు.

ఆ సమయానికి అక్కడి కొక లావణ్యలహరి వచ్చింది. ఆసుందరీమణిని చూడగానే ఆయినమనను ఆమెమీద లగ్నం అయింది.

ఆమెను సమీపించి కులగోత్రాలడుగగా, ఆమెనప్పి:

రాజా! ఎవరిదాననో, నాపేరేమిటో, ఈశరీర నిర్మాతఎవరో ఎరుగను. నీవంటి మహావీరుని చూచినతరువాయి నామనను మరొకరిమీదికి మరలదు. ఈ నవద్వారయుత దేహారాజ్యాన్ని నువ్వు ఏలుకో, అంది.

పురంజనుడు సంతోషంతో ఆమెను వివాహమాడి సుఖంగా భోగాలలో తేలియాడుతున్నాడు. సర్వమూ ఆమెయే అని భావిస్తూ, యితరవ్యవహారాలేమీ లేకుండా కామోపభోగియై ఎందరో బిడ్డలనుకని, వారందరికీ వివాహాలు జరిపించాడు.

వార్ధక్యంమీద పడింది. భోగవాంఛ తగ్గడంలేదు.

కాలం కబళించడానికి వచ్చింది. తానులేకపోతే తనప్రియురాలు ఏమవుతుందో అనే భయంతో ఆమెనే స్మరిస్తూ ప్రాణాలు విడిచాడు.

ప్రాణ ప్రయాణవేళ జీవుని మనసులో ఏవాంఛ ఉంటుందో అదే జన్మసిద్ధిస్తుందికదా, అలానే మరునటి జన్మలో విదర్భరాజుకి కూతురుగా జన్మించాడు.

ఆమెను పాండ్యరాజు మలయధ్వజుడు వివాహమాడి కొంతకాలం సంసారం చేసి యోగ్యులయిన బిడ్డలను కని వారికి రాజ్యభారం అప్పగించి వానప్రస్థానికి వెళ్ళాడు. ఆమె కూడా వానిని అనుసరించింది.

అక్కడ మలయధ్వజుడు సర్వవాంఛలూదిగవిడిచి, నారాయణచరణారవింద ధ్యానంతో పరమపదం పొందాడు.

భర్తమరణంతో ఆమెవిపరీతవ్యధపొంది, చితిపేర్చి, అందులో ప్రవేశించబోతుండగా విజ్ఞానియైన విప్రుడొకడు అటువచ్చి:

అమ్మాయీ! నువ్వెవరిదానివి? ఎందుకేడుస్తున్నావు? అని ఆదరవాక్యాలతో ఓదార్చగా, ఆమెమాట్లాడలేదు.

అప్పుడా విప్రుడు: నువ్వుమరచినట్లున్నావు. పూర్వజన్మలో మనం ప్రాణసఖులం. మానసంలో హంసలం. అప్పుడు నీకు భూలోక భోగవాంఛపుట్టి నరజన్మ ఎత్తివచ్చావు.

వచ్చివచ్చి ఒకకామిని నిర్మించిన పంచారామమధ్యంలో నవద్వారయుతమై విరాజిల్లే నగరంలో పడ్డావు. ఆవివరాలు జాగ్రత్తగావిను.

పంచారామాలు అంటే పంచేంద్రియవిషయాలు. నవద్వారాలంటే కళ్ళు, ముక్కు, చెవులూ ఆదిగాగల తొమ్మిదిరంధ్రాలు. ఏక పాలకంఅంటే ఒక్కప్రాణి. ఇదంతానువ్వు పురంజనుడుగా వున్ననాటిగాథ.

నిజానికి నువ్వు నాడు రాజువీకాదు, నేడునారీమణివీకాదు. ఇదంతా నాలీల. నువ్వేనేను. నేనేనువ్వు. అని జ్ఞానంఉపదేశించగా ఆ స్త్రీ హంసయై మానసానికి వెళ్ళింది.

సురవిమతవిదారీ! సుందరీ శంబరారీ!
నరనవినుతసూరీ! సర్వలోకోపకారీ!
నిరుపమగుణహారీ! నిర్మలానందకారీ!
గురుసమరవిహారీ! ఘోరదైత్యప్రహారీ!

# పంచమస్కంధం

నరప హృదయవాసా! చారులక్ష్మీ విలాసా!
ధరితి శుభ చారిత్రా! భాస్కరాబ్జారినేత్రా!
నిరుపమ ఘనగాత్రా! నిర్మలజ్ఞానపాత్రా!
గురుతర భవదూరా! గోపికా చిత్తచోరా!

స్వాయంభువమనువు వానప్రస్థానికి వెడుతూ ప్రియవ్రతుని పట్టాభిషిక్తుని చేసాడు.

ప్రియవ్రతుడు వినిర్మలాంతఃకరణతో హరినామపారాయణ పరాయణుడై ప్రజారంజకంగా పరిపాలన సాగిస్తున్నాడు.

విశ్వకర్మ కుమార్తె బర్హిష్మతి యీయనభార్య. వీరికి పది మంది కుమారులు, ఒక కుమార్తె.

ఈయనకే ఉత్తమ, తామస, రైవతులు కలిగారు. ఈ ప్రియవ్రతుడు ఎంతటి వాడంటే సూర్యునివల్లకదా ప్రపంచానికి వెలుగువస్తున్నది. సూర్యుడు అస్తమిస్తే చీకటి అనిగ్రహించి, తాను రెండవ సూర్యునివలె భ్రమిస్తూ దివారాత్రభేదంలేకుండా చేసిన మహామహుడు. ఆయన రథం సాగిన ప్రదేశాలు సప్తద్వీపాలయాయి. అక్కడే సప్త సముద్రాలు ఏర్పడ్డాయి.

ఏడుగురు కుమారులను ఏడు ద్వీపాలకూ అధి పతులను చేశాడు.

కుమార్తె ఊర్జస్వతిని భార్గవునికిచ్చి వివాహం చేశాడు. ఈదంపతులకు దేవయాని పుట్టింది.

కొడుకులు సక్రమంగా రాజ్యపాలనం చేస్తూంటే ఆయన సర్వవాంఛలూ విడిచి, ఇంద్రియనిగ్రహంతో వైకుంఠం చేరాడు.

వీని కుమారులలో ఒక ఆగ్నీధ్రుడు జంబూద్వీపాన్ని పాలించేవాడు. ఆరాజ్యంలోని ప్రజలందరినీ కన్న బిడ్డలవలె చూసేవాడు.

ఆయన పుత్ర వాంఛతో మందరాద్రిచేరి, ఏకాగ్ర చిత్తంతో చతుర్ముఖుని ధ్యానించాడు. వాని దీక్షకు బ్రహ్మ సంతోషించి పూర్వచిత్తి అనే అప్సరసను అక్కడకు పంపాడు.

అతిలోక మోహనాంగిని చూస్తూనే అగ్నీధ్రుడామెను సమీపించి, సౌందర్యోపాసనతో

దేవీ! ప్రజాపతి నా తపోదీక్షకు మెచ్చి నిన్ను పంపివుంటాడు. నాతోవచ్చి రాజ భోగాలతో సంసార యాత్ర సాగించి పుత్రవతివై సుఖించు, అని ఆమెను వెంటబెట్టుకుని ఆనందసాగరంలో తేలియాడుతూ తొమ్మండుగురు బిడ్డలను కన్నాడు.

శిశువులను వానివద్దనే విడిచి పూర్వచిత్తి బ్రహ్మలోకానికి వెళ్ళింది.

అనంతరం ఆయన తన కుమారుడు నాభిని పట్టాభిషిక్తునిచేసి, సత్క్రతువుల సాగించి బ్రహ్మలోకం చేరాడు.

నాభి రాజ్యపాలనం సాగిస్తూ తన భార్య మేరుదేవితోకూడి పరమపురుషుడై నారాయణుని స్మరిస్తూ యజ్ఞం చేయగా ఆయన ప్రసన్నుడై వరం కోరుకోమన్నాడు.

అప్పుడు ఋత్విజులు శ్రీమన్నారాయణుని వంటి కుమారుడు తమ మహారాజు కలగాలన్నారు.

నారాయణుడు సంతోషంతో మేరుదేవి గర్భంలో ప్రవేశించాడు.

ప్రసవించిన అనంతరం వానికి ఋషభుడు అని నామకరణం చేశారు.

లోకానికి కర్మమార్గం ఉపదేశించే సంకల్పంతో ఋషభుడు గురు సన్నిధానంలో స విద్యలూనేర్చి, వారి అనుమతితో శత మన్యుని కుమార్తె జయంతిని వివాహం చేసుకొ నూరుగురు బిడ్డలను కన్నాడు.

నాభి భార్యాసమేతం బదరికావనంలో నారాయణధ్యాన తత్పరుడై శ్రీహరిలో ఐ మయాడు.

ఋషభుని రాజ్యంలో ఇహలోక సుఖాలకోసం భోగాలకోసం ఆరాటపడే మ మందులోకి కనబడదు. అందరూ సత్కర్మాచరణంతో, త్యాగబుద్ధితో పరలోకం కో తాపత్రయపడే వారే!

ఆవిధంగా తన ప్రజలందరినీ ధర్మకర్మ పరతంత్రులను చేసి, ఋషభుడు రాజ్యా బిడ్డలకు అప్పగించి, వారిని వెంటబెట్టుకుని మునిబృందాలకు ఆవాసమయిన బ్రహ్మావర్తం అక్కడ అందరినీ సమావేశపరిచి:

నాయనలారా! మనిషిలో తృష్ణ పుట్టినట్టయితే వాడు కుక్కకంటె హీనంగా బ్ర తాడు. అందుచేత కామానికి దూరంగా వుండండి.

బ్రహ్మానందం కలిగించే నారాయణ నామస్మరణ అనే తపస్సుతో జీవితాలు ధన్య చేసుకోండి.

కంటికి అందంగా కనిపించే సుందరీమణుల వెంటబడేవారికి నరకం తప్పదు సజ్జనసాంగత్యం వల్ల మోక్షం సిద్ధిస్తుంది. సజ్జనులు ఎలా వుంటారంటే వారికి స్నేహితులని శత్రువులని భేద భావం ఉండదు. అందరినీ ఒకే దృష్టితో చూస్తారు.

వారికి ఇది నాయిల్లు, నాభార్య, నాబిడ్డలు అనే స్వార్థ చింతన వుండదు. నిరంతరం భగవన్నామ స్మరణమే వారికి ప్రాణంగా వుంటుంది.

మహా మహులు కూడా ఒక్కొక్కప్పుడు ఇంద్రియాలకు లొంగి సంసార విష వలయములో పడుతూంటారు. ఇది నాభార్య, నా సంసారం అనే భావం మనసులో పడిందంటే వాడు ముక్తి పొందలేడు. భార్యమీద అనురాగం, అంతతో సంతానం, వీరి రక్షణకు ధనసంపాదన, ధనసేకరణ, గృహనిర్మాణం అలా యీ గొలుసు పెరుగుతూ వుంటుంది.

అయినా ఏదో ఒకనాడు యీ విషయ వాంఛలనుండి మనస్సు విముఖమై పరమేశ్వరుని యందు లగ్నం అయితే ముక్తి పొందవచ్చు.

కాని ధనవాంఛ వున్నదే, అది మనిషిని వదలదు. అందుకే దానికి దూరంగా వుండాలి. ఈ జ్ఞానం తెలిసినవారు తమ తోడివారికి దీనిని బోధించి వారినికూడా మోక్షమార్గానికి మరలించాలి.

వేదమే బ్రహ్మస్వరూపం కనక వేదవేత్తలయిన వారిని నిరంతరం ఆరాధించి వారి వల్ల ఉత్తమగతులు పొందవచ్చు అని బోధించి, అవధూతయై తిరుగుతున్నాడు.

అయితే అంతటివాడు యోగమార్గాన వెళ్ళవచ్చు గదా, అని సందేహం కలుగుతుంది.

ఆయన సాక్షాత్తూ నారాయణాంశ సంభూతుడు కదా! నిజానికివేవీ ఆయనకోసం కాదు. కొందరు యోగులైకూడా దేహాభిమానంతో ఎలా కొట్టుమిట్టాడుతారో చూపించడానికే యిదంతా చేశాడు.

చేసిచేసి దేశాలు తిరిగి తిరిగి దక్షిణాన కర్ణాటకం చేరి అక్కడ ఒక వనంలో దావాగ్నిలో శరీరం విడిచిపెట్టాడు.

# భరతుడు

ఋషభుని కుమారులలో పెద్దవాడయిన భరతుడు సింహాసనం ఎక్కి రాజ్యపాలనం ధర్మబద్ధంగా సాగిస్తున్నాడు. విశ్వరూపుడనే రాజు కూతురు పంచజని అనే తరుణీమణిని వివాహమాడి అయిదుగురు బిడ్డలను కన్నాడు.

సర్వకర్మలూ వేద ధర్మానుసారం పరమేశ్వరార్పణంగా సాగించి, తన రాజ్యంలోని ప్రజలందరికీ సుఖశాంతులు సమకూర్చి, పూర్వ వంశీకుల కీర్తి నిలబెట్టి, తన రాజ్య సంపద లను బిడ్డలకు పంచిపెట్టి, పులహాశ్రమానికి వెళ్ళాడు.

అక్కడ పురుషోత్తముని యందు మనసు నిలిపి, రాగ, ద్వేష శూన్యుడై హరి పద ధ్యానంతో జీవితం గడుపుతున్నాడు.

ఆశ్రమ సమీపంలోని గండకీ నదిలో స్నానంచేసి వస్తుండగా ఒకనాడు, ఆ నదిలో నీరు త్రాగడానికి వచ్చింది ఒక లేడి. అది నిండు చూలాలు. నీరు త్రాగుతూండగా సింహ గర్జన వినబడి ఎగిరి గంతేసింది. కడుపులోని లేడిపిల్ల నదిలో పడింది. లేడి ప్రాణాలు వదిలింది.

ఆ దృశ్యం చూసిన భరతుని మనసు దయార్ద్రమైంది. నదిలోని లేడిపిల్లను బైటికి తెచ్చాడు. దాన్ని ఆశ్రమానికి తీసుకొచ్చి లాలించి, పెంచుతున్నాడు.

నిరంతరం ఆయన దృష్టి ఆ లేడికూన మీదనే లగ్నమయి మిగిలిన జపతపాలన్నీ సన్నగిల్లాయి.

దానిసేవయే జీవిత పరమార్థంగా భావించి సాగుతున్నాడు. అదిపెరిగి పెద్ద దయింది. దానితోనే ఆటపాటలు. దాన్ని ఏ క్రూరమృగమూ ఎత్తుకుపోకుండా కాపలా కాస్తూ బ్రతుకుతున్నాడు.

అంతలో ఒకనాడది ఆశ్రమం విడిచి దూరంగా పోయింది.

ఎంతో మమకారంతో పెంచుకునే లేడికూన కనిపించక దిగులుతో

వెదకడం మొదలు పెట్టాడు.

ఈ ఆశ్రమ పరిసరాలలో పెరిగే లేతపచ్చిక తిని హాయిగా గంతులువేస్తూ యిక్కడే తిరిగక యిది ఎక్కడికి పోయిందో !

ఏ క్రూరమృగమయినా చీల్చుకుతినేసిందేమో !

ఎప్పుడూ నన్ను విడిచి ఉండని, తల్లి లేని ఆ కూన ఏ బాధలు పడుతున్నదో

పూజకు తెచ్చిన పుష్పాలు, పళ్ళు అది మూతిపెట్టి నాకినప్పుడు నేను కోప

పుండలిస్తే, అలిగి దూరంగా పోయేది మళ్ళీ నేను పిలవగానే వచ్చివెనకాలే నిలబడేది.

క్రూరమృగాలు హింసించకుండా చంద్రుడు తీసుకువెళ్ళి జాగ్రత్తగా రక్షిస్తు

డేమో !

అని పరివరివిధాల బాధపడుతూ జపతపాలు మరిచిపోయాడు. సర్వేశ్వర స

స్మరణ విస్మరించాడు.

మోక్షమార్గానికి అంతరాయాలని భార్యాబిడ్డలను విడిచి వచ్చినవాడు ఈ లేడి

వ్యామోహంలో పడ్డాడు.

కొంతసేపు ఆ లేడి స్వేచ్ఛగా తిరిగి పచ్చికమేసి ఆశ్రమానికి వచ్చింది. ఎ

సంతోషంతో దాన్ని దగ్గరగా తీసుకుని ముద్దులాడాడు. అది మొదలు దాన్ని వి

పెట్టకుండా కంటికిరెప్పలా చూసుకుంటున్నాడు:

కాలంగడుస్తున్నది.

భరతునికి అవసానకాలం సమీపించింది.

ఆ సమయంలో వానిమనను పూర్తిగా లేడిపిల్లమీదనే లగ్నంఅయింది. ప్రాణ

విడుస్తూ కూడా దానినే తలుచుకుంటూ ఉంతడంవల్ల మరుజన్మలో లేడిపిల్లగా పుట్టాడు.

పూర్వజన్మ సంస్కారంవల్ల తనకీజన్మ లభించినందుకు చింతించి, ఆవాసనా బల

హరినామస్మరణంచేస్తూ నదీతీరాన మునుల ఆశ్రమ సమీపాన జీవితంగడిపి కాలం స

పించగానే తనువు వదిలాడు.

ఆ పుణ్యఫలంవల్ల అంగిరస వంశీయులయిన విప్రుల యింట్లో జన్మించా

పుట్టిందిమొదలు నిరంతరం హరినామస్మరణ చేస్తూ ఉండేవాడు.

ఏ విధంగా అయినా కొడుకును వేదవేదాంగ విదుని చెయ్యాలని తండ్రి ప

ప్రయత్నించినా వాని మనస్సు అటు మరలలేదు.

తండ్రి గతించాడు.

తల్లి ఆయనతో పరలోకం చేరింది.

ఇంట్లోవున్న సవతితల్లి బిడ్డలు వానిని పరిపరి విధాల హింసించారు.

శీతవాతాతపాలకు, సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు అతీతమయిన స్థితిని పొందాడు.

వానిని జడుడనీ, బధిరుడనీ, ఉన్మత్తుడనీ భావించేవారు.

వాని సోదరులు వానిని పంటచేను దగ్గర కాపలా ఉంచారు.

ఆ రోజులలో ఒకనాడు ఆ నగరపు రాజు సంతానార్థం నరబలి యివ్వాలని నిశ్చయించి సేవకులను పంపించాడు.

చేనిగట్టున అమాయకంగా కూర్చున్న వీనినిచూసి వారు సంతోషంతో మంచి నరపశువు దొరికిందని తీసుకు వెళ్ళారు.

పరి శుభ్రంగా తలంటి పోశారు.

కొత్త బట్టలు కట్టబెట్టారు.

మంచిగంధం పూశారు పూలమాలలు వేశారు, అలంకారాలు తొడిగారు.

ఘుమఘుమలాడే రుచులుగల పిండివంటలతో భోజనం పెట్టారు.

హారతులిచ్చారు, సాంబ్రాణి ధూపం వేశారు.

కాళికాదేవి ముందు నిలబెట్టారు.

రాజు వృషలుడు సంతోషంతో కరవాలం పుచ్చుకు వాని దగ్గరనిలబడి, శిరసు ఖండించడానికి సన్నద్ధుడయాడు.

సర్వప్రాణినీ తనవలెచూచుకొంటూ, పురుషోత్తమ ధ్యానంతో బ్రహ్మానందానుభూతి పొందే ఆ బ్రాహ్మణ యువకునితెచ్చి తనకు బలియివ్వబోయే రాజునీ, వాని అనుచరులను కాళికాదేవి కరాళఖడ్గంతో చీల్చి చెండాడింది.

తనను బలి పశువుగా తెచ్చినప్పుడు ఎంతనిర్వికారంగా వున్నాడో, కనులఎదు కాళికాదేవి భీకరతాండవం చూసిన క్షణంలో కూడా అంతనిర్వికారంగా నిలబడి, అది శాంతించాక ఆ ఆలయం వెలుపలకు వచ్చాడు.

తిరిగి యధాప్రకారం తమ చేని గట్టుకు చేరి కాపలా కాస్తున్నాడు.

ఆ సమయానికి అదే దారిని సింధుదేశపు రాజు కపిలమహాముని ఆశ్రమా పల్లకీ మీద వెడుతున్నాడు.

పల్లకీ మోసే బోయీలు ఈ అమాయకుని చూసి, తమకు కొంత విశ్రాంతి దొరుకుతుందని వానిని పిలిచి పల్లకీ భుజానపెట్టారు. నిశ్చింతగా మోస్తూనే వెడుతున్నాడు.

మిగిలిన బోయీలతో నమంగా నడవలేక అడుగులు తడబడుతూంటే రాజుగారు కోపంగా మందలించారు.

చిరునవ్వుతో ఆ దూషణలు విని వడక సాగిస్తున్నాడు.

పల్లకీకుదుపు ఎక్కువై రాజుగారు మండిపడ్డారు.

అప్పుడా విప్రవరుడు :

మహారాజా! దూషణభూషణలు శరీరానికే కాని నాకుకావు. ఆకలిదప్పులు జరా మరణాలు, రాగద్వేషాలు, నిద్రాజాగరణాలు, అహంకార మమకారాలు ఈ దేహం వున్నంతసేపే.

ఓరి జీవన్మృతుడా! అన్నారు మీరు. నిజమే! నేనేకాదు. మనమందరం జీవన్మృతులమే.

యజమాని సేవకసంబంధం వున్నదే - అది దేహికే కాని ఆత్మకుకాదు.

మూగ, గ్రుడ్డి, పిచ్చి, జడత్వం వున్న నన్ను ఏమని ఏంలాభం! అంటూండగా మహారాజు మనసు మరలింది.

పల్లకీ దిగి వాని కాళ్ళమీదపడి :

మహానుభావా! ఈ రూపంలో వున్న మీరెవరు? కపిలమహర్షివి కాదుకదా? యమ దండానికీ, ఇంద్రాయుధానికీ, పరమశివునికీ, శూలానికీ భయపడను నేను. జ్ఞాన నిధియైన విప్రుడంటే నా మనస్సు గజగజలాడుతుంది.

ఆర్యా! నేను కపిలమహాముని సన్నిధానంలో తత్వం గ్రహించడానికి వెడు తున్నాను. మీరెవరో చెప్పి నన్ను ధన్యుని చేయండి, అని ప్రార్థించాడు.

అప్పుడా యోగి :

మహారాజా! నేనెవరినని చెప్పను. ఈ ఉపాధియైన దేహం నిత్యం కాదుకదా! ఇది వున్నంతసేపే దీనికి నామరూపాలు.

పొయ్యిమీద కుండపెట్టి క్రిందమంటపెడతాం. ఆ వేడికి కుండ కాలుతూ లోపల నీటిని మరగబెడుతుంది. ఆ కాకతో అందులో బియ్యం అన్నంగా మారుతాయి. అలానే దేహమూ, యింద్రియాలూ కలిసి జీవుని వ్యాపారం సాగిస్తాయి. అయితే నంపారయాత్రా

రూపమయిన దేహఘటాన్ని శిక్షించడం, రక్షించడం చేసే జీవుడనే రాజు దుష్కర్మలు విడిచి పురుషోత్తమారాధనం చేసుకుంటే మళ్ళీ యీ జన్మ ఘటబాధ ఉండదు, అని బోధించగా రాజు తన అపరాధాన్ని మన్నించమని వేడుకున్నాడు.

అప్పుడా యోగి :

మహారాజా! ఈ ప్రపంచం అంతా మిథ్య అంటున్నారు వివేకులు. అదితెలియక యిదే సత్యం అనే భ్రమలో వున్నావు నువ్వు.

కర్మకాండలో, వేదాంతబోధలో తత్వం బోధపడదు. అదంతాస్వప్నంలో లభించే సుఖం వంటిది. కన్నుతెరిస్తే కలవుండదు కదా! ఈ మనస్సు ఎంతవరకూ విషయ సుఖాలను కోరుతూంటుందో అంతవరకూ జీవుడు భూతప్రపంచంలో సంసారవలయంలో భ్రమిస్తూంటాడు.

వాటిని విడిచి పరమగురువైన శ్రీహరి చరణారవింద సేవలో మనస్సులగ్న మయిందో యింక వానికి బంధాలుండవు.

మహారాజా! నేలమీద ఆనుకున్న పాదాలకంటె పిక్కలు గొప్పవి. వాటికంటె మోకాళ్ళు, అంతకంటె తొడలు, ఆపైన కటిప్రదేశం, అంతకంటె రొమ్ము దానిమీద కంఠం, ఆపైన శిరస్సు, దానికంటె ఈ పల్లకిబొంగు, దీనికంటె పల్లకి, ఆ పల్లకిలో నువ్వు రాజు ననుకుంటూ అన్నింటి కంటె గొప్పవాడి ననుకొంటున్నావు.

కాని స్థావర జంగమాలన్నిటికీ ఆధారం ఈభూమి అని మరువకూడదు. ఈ పృథివి ఎలా ఏర్పడింది? పరమాణు సంయోగం వల్ల. ఆ అణువునే మహత్తుగా, కాలంగా అనేక విధాల భావింపజేసేది మన మనస్సులోని అజ్ఞానం. ఇదంతామాయ.

నిత్యమూ శాశ్వతమూ అయినది స్వప్రకాశమయిన భాగవతశబ్దం మాత్రమే। దానినే బ్రహ్మ అన్నారు.

ఈ బ్రహ్మను భాగవతుల పాద సేవతో, హరినామస్మరణతో మాత్రమే పొందగలం. ఇది తెలియక సంసార చక్రంలోపడి సంతానాన్నికని వారి పోషణకోసం సంపన్నుల యింటి చుట్టూ పడి గాపులు పడుతూ జీవితపరమార్థం ఎరుగక యాతన పడుతూంటారు.

ఆ పురుషోత్తముని సేవించలేక పాషండులతో కలిసి తిరుగుతూ వారివల్ల వంచితులై దుఃఖాల పాలవుతారు.

నువ్వు నేనురాజుననే భావాన్ని వదిలి జ్ఞానఖడ్గంతో అజ్ఞాన తరువును ఛేదించు, అని ఉపదేశించగా ఆ రాజుకు జ్ఞానోదయం అయింది.

సర్వమూ విడిచి నారాయణ చరణసేవతో వైకుంఠం చేరాడు. ఆ విప్రవరుడు కూడా శ్రీహరి పదాన్ని అందుకున్నాడు.

# గయుని గాధ

భరతుని కుమారుడు సుమతి రాజ్యాభిషిక్తుడయాడు.

అప్పటికి రాజ్యంలో పాషండులు బలపడ్డారు. వారందరూ బుద్ధుని సేవించినట్లు సుమతిని సేవిస్తామన్నారు. అలావే సాగింది.

ఆయనకు ముగ్గురు భార్యలు. ధ్రువసేన, ఆసురి, ధేనుమతి అని వారి పేర్లు. ధ్రువసేనకు దేవతాజిత్తు, ఆసురికి దేవద్యుమ్నుడు కలిగారు. ధేనుమతికి పరమేష్ఠి కలిగాడు. ఈ పరమేష్ఠిభార్య సువర్చల. వీరి కుమారుడు ప్రతీహుడు. ఈయనకు ముగ్గురు కొడుకులు. వీరిలో పెద్దవాడయిన ప్రతిహర్తకు యిద్దరు కుమారులు. ఇందులో చిన్నవాడయిన భూమునికి కలిగినవాడు ఉద్గీథ. ఈయన భార్య దేవకుల్య. వీరి కుమారుడు ప్రస్తోత. ఈయవ కొడుకు విభుడు, విభుని కుమారుడు పృథసేణుడు, వీని సుతుడు నక్తుడు.

నక్తుని కుమారుడు గయుడు.

గయుడు సత్ప్రవర్తనతో, సత్కర్మాచరణంతో, అనవరత దాన ధర్మాలతో ప్రఖ్యాతుడయాడు. ఈ విధంగా ఆ వంశం అభివృద్ధిపొందింది, అని శుకమహర్షి చెప్పగా, పరీక్షిత్తు:

యోగీంద్రా! ప్రియవ్రతుని రధచక్రమార్గాన్ని అనుసరించి ఏర్పడిన సముద్రాలనూ, ద్వీపాలనూ గురించి వివరించండి, అన్నాడు.

# భూగోళం

మహారాజా!

ఈ భూమి పద్మాకృతిలో ఉంది.

దీనికి నడిమి బొడ్డులో జంబూ ద్వీపం, పద్మదళంలా ఉంటుంది.

ఇది లక్షయోజనాల పొడుగు, అంతే వెడల్పుతో గుండ్రంగా ఉంది. ఇందులో నవవర్షాలున్నాయి. ఎనిమిది కులగిరులున్నాయి. ఈ తొమ్మిదింటిలో మధ్యఉండేది ఇలా వృతవర్షం దీని మధ్యప్రాంతం అంతాబంగారుమయం.

భూమి అనే పద్మానికి పైకి లేచిన మేరుగిరి బొడ్డువంటిది. దీని యెత్తు లక్ష యోజనాలు. దీనికి ఉత్తరంగా నీల, శ్వేత, శృంగ పర్వతాలున్నాయి. రెండువేల యోజనాల పొడవుతో పూర్వ, పశ్చిమదిశలలో యివి వ్యాపించాయి.

వీని మధ్య రమ్యక హిరణ్మయ కురువర్షాలున్నాయి.

ఇలావృత వర్షానికి దక్షిణంగా నిషధ, హేమకూట, హిమవత్పర్వతాలున్నాయి. వీనిమధ్యహరివర్ష, కింపురుషవర్ష, భారతవర్షాలున్నాయి. ఇలా వృతానికి పడమరగా మాల్యవత్పర్వతం, తూర్పుగా గంధమాదనం, ఇక్కడ కేతుమాల వర్షం ఉంది.

గంధమాదనానికి తూర్పుగా భద్రాశ్వవర్షం, మేరువుకి తూర్పుగా మందరగిరి.

మేరువుకి నలువంకలా వున్న స్తంభాల మధ్యక్షీర, మధు, ఇక్షు రసాలరుచులతో విశాల సరోవరాలున్నాయి. వీటిలో స్నానం చేసినవారికి ఐశ్వర్యమూ, ఆరోగ్యమూ కలుగుతాయి.

ఈ మేరు శిఖరాల మీద చైత్రరథ, విభ్రాజిక, సర్వతో భద్రాలనే పేర్లతో సుందరవనాలున్నాయి. ఇక్కడ దేవతాబృందాలు నృత్త, గీతాలతో విహరిస్తూంటారు.

మందరగిరి శృంగాలమీది మామిడిచెట్లు బహు విశాలంగా పెరుగుతాయి. వాటి ఫలాలు చాలాపెద్దవి. అవిబాగాపండి జారిన రసంతో సరోవరాలు ఏర్పడుతాయి. వాటి రుచి అతిమధురం. వాని సువాసనలు ఆ పరిసరాలను సుగంధంతో నింపుతాయి.

మేరు, మందరాల మీది నేరేడు పళ్ళు మరీ విపరీతంగా పెరుగుతాయి. ఆ ఫల రసంతో జంబూ నదం ఏర్పడింది.

ఈ జంబూనదిలో నానిన మన్ను ఎండకు ఎండి, గాలికి ఆరి స్వచ్ఛ సువర్ణంలా అవుతుంది.

సుపార్శ్వ పర్వతంమీద అయిదు చారలవెడల్పుతో ప్రవహించే మధు ధారలు అయిదు దిక్కులుగా సాగి ఇలావృత వర్ష పశ్చిమభాగం అంతమూ తడుపుతాయి. ఈ ప్రవాహంలో తేనె త్రాగినవారు విడిచేగాలి సుగంధ భరితమై ఉంటుంది.

కుముద పర్వతాగ్రం మీద సువిశాలమైన మర్రి చెట్టుంది. గాని విశేషం ఏమంటే ఆ మ్రాను నుండి పాలు, పెరుగు, నెయ్యి, బెల్లం కలిపిన అన్నం పుడుతూంటుంది. పయిగా యీ మర్రిచెట్టు మనం కోరిన వస్త్రాలు, ఆభరణాలు, శయ్యలూ, ఆసనాలు యిస్తుంది.

ఈ చెట్టుని ఆశ్రయించిన వారికి జరామరణాలుండవు. చలి బాధించదు, సూర్యుడు ఎంతవేడిగావున్న యిక్కడి వారికి ఆ తాపం ఉండదు. వారి శరీరాలు సువాసన లీనుతూంటాయి.

ఇక్కడ దేవదానవులూ మునులూ గంధర్వులూ స్వేచ్ఛగా విహరిస్తారు.

మేరువు అనే కర్ణికకు చుట్టూ కేసరాలవలె కురంగ, కురగ, కుసుంభ, వైకంకత, త్రికుట, శిశిర, పతంగ, రుచక, నిషధ, శితివాస, కపిల శంఖ, పర్వతాలున్నాయి.

మేరు గిరికి తూర్పున జఠర దేవకూటాలు,

దీనికి పడమరగా పవన, పారి యాత్రాలు.

దక్షిణంగా కైలాస కరవీరాలు, ఉత్తరంగా త్రిశృంగ, మకరాలు అనే పర్వత శ్రేణులు విరాజిల్లు తున్నాయి.

మేరుగిరి శిఖరంమీద పదివేల యోజనాలయెత్తూ, అంతే వైశాల్యంతో బంగారు మయమయిన బ్రహ్మ పురం ఉంది. దీనికి ఎనిమిది వైపుల అష్టదిక్పాలకుల నగరాలున్నాయి. శ్రీహరి వామనుడై పెరుగుతూన్నప్పుడు ఆయన కాలిగోరు తగిలి ఊర్ధ్వ బ్రహ్మాండం అంతా బ్రద్దలయింది.

అప్పుడక్కడ బయలుదేరిన జలధార శ్రీహరి పాదస్పర్శతో సాగి సాగి నిఖిలలోకాల పాపాలూ క్షాళనంచేసి భగవత్పాది అనుపేర స్వర్గంలో విహరించింది.

భాగవతోత్తముడైన ధ్రువుడు ఆ శ్రీహరి పాదోదకాన్ని నిత్యం శిరసున ధరిస్తాడు. ధ్రువమండలానికి క్రిందుగావున్న సప్తర్షులుకూడా విష్ణుపాదోదకధారణమే తమ తపఃఫలసిద్ధి యని గ్రహించి తమజటాజూటాలను అ దివ్యజలంతో నింపుకున్నారు.

అది దేవమార్గాన దిగివచ్చి చంద్రమండలంలోదిగి, మేరుశిఖరం మీది బ్రహ్మ పట్నంచేరి అక్కడనుండి నాలుగు దారులలో ప్రవహించింది.

బ్రహ్మ పట్నం తూర్పు ద్వారాన ప్రవహించినది సీత. ఇది గంధమాదనం మీదుగా భద్రాశ్వవర్షం దాటి తూర్పు సముద్రంలో ప్రవేశించింది.

పడమటి ద్వారాన వచ్చిన నది చక్షువు. మాల్యవత్పర్వతం దాటి కేతుమాలవర్షం మీదుగా పశ్చిమ సముద్రంలో చేరింది.

ఉత్తరంగా వచ్చిన భద్రానది కుముద నీల శ్వేత పర్వతాల మీదుగా ఉత్తర కురు భూములను పావనం చేసి ఉత్తర సాగరంలో సంగమించింది.

దక్షిణంగా సాగిన అలకనందా నది హేమకూట హిమకూటాలు దాటి భారతవర్షాన్ని పవిత్రంచేసి దక్షిణ సముద్రంలో కలిసింది.

మేరువు ఆదిగాగల పర్వతాలనుండి పుట్టిన నదులు వేల సంఖ్యలో వుంటాయి.

జంబూద్వీపంలోని భారతవర్షం మాత్రమే కర్మభూమి. మిగిలిన అన్ని ప్రాంతాల లోనూ దివినుండి దిగివచ్చినవారు తమ పుణ్యఫలశేషం అనుభవించి పోతుంటారు. అక్కడుండే వారు వేల సంవత్సరాలు జీవిస్తారు వేల ఏనుగుల బలం కలవారు. వజ్రసమ దేహులు వారు. నిరంతర సంతోషచిత్తులై, ప్రమత్తతను దరిజేరనివ్వరు.

వీరు నిరంతరం కామోపభోగాలతో యథేచ్ఛగా విహరిస్తారు

ఇక ఇలావృత వర్షాధిపతి పరమశివుడు.

అక్కడి వనాలలో పార్వతీ పరమేశ్వరులు లీలా వినోదాలు జరుపుతుంటారు కనక అక్కడికెవరు పోయినా స్త్రీలుగా మారుతారు.

భద్రాశ్వ వర్షాధిపతి భద్రశ్రవుడు. ఆయన హయగ్రీవుని అనుచరుడు. కనక అక్కడి వారందరూ హయగ్రీవుని అర్చించి ఆనందిస్తారు.

హరి వర్షానికి ప్రభువు నరహరి. దైత్య, దానవ జాతుల వారందరూ ప్రహ్లాదాది కులవృద్ధులతో కూడి నరహరిని ఉపాసిస్తూంటారు.

కేతుమాల వర్షంలో నారాయణుడు లక్ష్మీదేవికి ప్రీతి కలిగించే సంకల్పంతో కామ దేవ రూపుడై ఉంటాడు.

రమ్యక వర్షానికి అధిపతి మనువు. ఈయన మత్స్య రూపుడైన శ్రీహరిని సేవిస్తూంటాడు.

హిరణ్మయవర్షానికి అధిదేవత కూర్మరూపుడైన హరి.

ఉత్తర కురుభూములకు వరాహ రూపుడు అధిదేవత.

కింపురుష వర్షాధిదేవత సీతాలక్ష్మణ సహితుడైన శ్రీరాముడు.

అక్కడి కింపురుషగణాలతో అంజనీసుతుడు రామసేవలో ఉంటాడు,

భారతవర్షానికి అధిదేవత బదరికాశ్రమ వాసి నారాయణుడు. ఆయనను

నారదాదులు ఉపాసిస్తారు.

భారతవర్షంలో ప్రసిద్ధమయిన నదీ, నద, పర్వత, క్షేత్రాల వివరాలు చెపుతానువిను.

మలయ, మంగళ, మైనాక, త్రికూట, ఋషభ, ఋక్షగిరి, ఋశ్యమూక, సహ్య, వేదగిరి, వింధ్య, మహేంద్ర, శ్రీశైల, వెంకటాద్రి, పారియాత్ర, ద్రోణ, చిత్రకూట, గోవర్ధన, రైవతక, కుకుంభ, నీలగిరి, కాకముఖ, రామగిరి, ఇంద్రకీల, ఆదిగా గలవి పర్వత శ్రేష్ఠాలు.

చంద్రవట, కృతమాల, వైహాయసి, పయస్విని, పయోద, శర్కరావర్త, తుంగభద్ర, కృష్ణవేణి, గోదావరి, భీమరథి, నిర్వింధ్య, రేవా, శిలా, సుర, చర్మణ్వతి, వేదస్మృతి' ఋషికుల్య, కౌశికి, మందాకిని, యమున, సరస్వతి, వృషద్వతి, గోమతి, సరయు, భోగవతి, శతుద్రు, చంద్రభాగ, మరుద్వృధ, వితస్త, విశ్వ, సింధు, రోణలు, నదీనదాలు.

ఇక ఈ భారత వర్షంలో జన్మించిన వారు సత్వ, రజ, స్తమో గుణాలతో జరిపే కర్మలవల్ల దేవ, మనుష్య, నరకగతులు పొందుతారు.

రాగద్వేషశూన్యులై అవాఙ్మానసగోచరుడైన శ్రీహరిని ఆరాధించే భాగవతోత్తములు నారాయణపదం పొందుతారు. అందువల్లనే ఈదేశంలో జన్మించడం కంటె కోరుకోదగినది లేదు.

భారత వర్ష జంతువుల
భాగ్యములేమని చెప్పవచ్చు
ఈ భారత వర్షమందు
హరి పల్మరు పుట్టుచు జీవకోటికిన్
ధీరతతోడ తత్వముపదేశము సేయుచు
చెల్మి సేయుచున్ ఆరయబాంధవాకృతి
కృతార్థుల జేయుచు నుండు నెంతయున్.

నారాయణ నామస్మరణం నిఖిల కల్మషాలను ప్రక్షాళనం చేస్తుంది. ఇతర ప్రాంతాలలో వేల సంవత్సరాలు జీవించినా పునర్జన్మ తప్పదు ఇక్కడ ఒక్క క్షణం వాసుదేవుని స్మరిస్తే చాలు ఆ పరమపదం చేరగలం.

Q 22 : 223
35279



పరమ రహస్యం ఏమంటే—

వైకుంఠాధిపతి అయిన శ్రీమన్నారాయణుని కథాగానం లేనిచోట, ఆయనను స్మరించే భాగవతోత్తములు లేని స్థలాన, ఆ పురుషోత్తముని ఆరాధనోత్సవ శూన్యమయిన దేశాన అది ఇంద్రలోకమయినా అక్కడ ఉండకూడదు.

మానవజన్మ ఎత్తాక జ్ఞాన, తప, అనుష్ఠానాలతో ముక్తిని సాధించుకోలేక పోతే వాడు మృగంకంటె హీనుడు.

ప్రాణికోటిలో సర్వోత్కృష్టమయిన మానవజన్మ లభించినందుకు దానిని వాసుదేవ నామస్మరణతో ధన్యం చేసుకోవాలి. అది భారత వర్షంలోనే సాధ్యం.

జంబూద్వీపం చుట్టూ లక్ష యోజనాల చుట్టుకొలతతో లవణసముద్రం ఉన్నది.

రెండు లక్షల యోజనాల వైశాల్యంతో ప్లక్షద్వీపం ఉన్నది. వీరికి అగ్ని అధిదేవత.

దానికావల ఇక్షుసముద్ర మధ్యంలో శాల్మలీ ద్వీపం ఉన్నది.

వీరికి చంద్రుడు దేవత.

దానికావల సురా సముద్ర మధ్యంలో కుశద్వీపం ఉంది. ఈ ద్వీపాన్ని ఆనుకుని ఘృతసముద్రం. అక్కడ క్రౌంచద్వీపం. దీనికావల పదహారు లక్షల యోజనాల వైశాల్యంతో పాలసముద్రం. అందులో శాకద్వీపం.

ఆవల దధిసముద్రం. దాని మధ్య పుష్కరద్వీపం. ఇది అరవైనాలుగు లక్షలయోజనాల వైశాల్యం కలది. అక్కడ పదివేల బంగారు దళాల పద్మం. దానిమీద ప్రజాపతి ఆసీనుడై ఉంటాడు. దీనికి నాలుగువైపులా దిక్పాలకులు నలుగురూ తమతమ నగరాలలో ఉంటారు. ఇక్కడే మానసోత్తర పర్వతం ఉంది

ఈ పర్వతం చివరల నుంచి సూర్యునిరథం మేరువుచుట్టూ ప్రదక్షిణం చేస్తూ కాల గతిని సూచిస్తుంది. పుష్కరద్వీపంలో ప్రాణులమధ్య బేధాలులేవు. అందరూ సమభావంతో జీవిస్తారు.

ఈ ద్వీపంచుట్టూ ఉండే సముద్రంలో నీరు స్వాదువుగా ఉం[illegible]

ఈ సముద్రానికి ఆవల లోకాలోక పర్వతం ఉంది.

వీటి మధ్యభాగంలో రెండుకోట్ల యోజనాల విశాలమయిన [illegible] ప్రదేశం దేవతా విహారభూమి.

36253

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
TIRUPATI

ఈ భూమండలంలో లోకాలోక పర్వతం నాలుగోవంతుంటుంది. ఈ పర్వతం మీదనే ఋషభ, పుష్కర, చూడ, వామన, అపరాజిత అనే పేర్లుగల దిగ్గజాలుంటాయి.

ఇక్కడే నారాయణుడు విష్వక్సేనాది అనుచరులతో, దేవ, మునిబృందాలతో అలరారుతూంటాడు.

ఈ భువన భవనానికి మధ్యలో సూర్యభగవానుడుంటాడు. సూర్యునికి రెండు వైపులా ఇరవైఅయిదు కోట్ల యోజనాల పరిమాణంలో బ్రహ్మాండ భాండం ఉన్నది. సర్వ జీవ రాశికీ సూర్యుడు ఆత్మ.

ఇది భూగోళం.

## ఇక ఖగోళ విశేషాలు.

బ్రహ్మాండ గోళానికి మధ్యలోఉండే సూర్యుడు ఉత్తర దక్షిణ గతులలో చరించేటప్పుడు మంద, తీవ్ర, సమగతులు ఏర్పడతాయి.

మేషాది మీనాంతం పన్నెండు రాశులలో తిరుగుతాడీయన. మేష, తులారాశులలో సమంగా తిరగడంవల్ల రాత్రింబవళ్ళు సమంగా ఉంటాయి. వృషభ, మిథున, కర్కాటక, సింహ, కన్యారాశులలో తిరిగే సమయాన రాత్రి ఒక్కొక్క గడియ తగ్గుతుంది. వృశ్చిక, ధనూ, మకర, కుంభ, మీన రాశులలో పగలు తగ్గుతూ ఉంటుంది. ఒక్కముహూర్త కాలంలో సూర్యుడు ముప్పైనాలుగులక్షల ఎనిమిది వందల యోజనాలు తిరుగుతాడు.

సూర్యరథానికి గాయత్రీ ఆదిగాగల ఏడు ఛందస్సులు గుర్రాలు. రథసారథి అరుణుడు.

అంగుష్ఠ దేహులయిన అరవైవేలమంది వాలఖిల్యులు సూర్యునికి అగ్రభాగంలో సౌరసూక్తాలు చదువుతూ సాగుతారు.

సూర్యునికి అటూ యిటూ మిగిలిన చంద్ర, కుజ, గురు, శని, బుధ, శుక్ర గ్రహాలు పరిభ్రమిస్తూంటాయి. ఈగ్రహాలన్నిటికీ ఆవల బహుదూరంలో సప్తర్షిమండలం ఉన్నది. ఇన్నిటికీ పైన శింశుమార చక్రం వున్నది.

అక్కడ ధ్రువుడు, ఇంద్ర, వరుణ, యమ, కశ్యపాదులతో ఆ కల్పాంతం ఉంటాడు. ఈ ధ్రువమండలం చుట్టూ సర్వగ్రహ తారకా గోళాలు పరిభ్రమిస్తూంటాయి.

పురుషోత్తముడైన పుండరీకాక్షుని దివ్యశరీరమే ధ్రువమండలం. నిత్యం సాయం కాలంలో ధ్రువనక్షత్రాన్ని దర్శించి, శింశుమారక చక్రానికి నమస్కరించే వారికి ఏ క్లేశాలూ వుండవు. ఆ సమయంలో మనను ప్రశాంతంగా నిర్మలంగా ఉండాలి.

ఈ భూగోళానికి దిగువ అతల, వితల, సుతల, రసాతల, తలాతల, మహాతల, పాతాళలోకాలున్నాయి. ఈ లోకాలలో స్వర్గాన్ని మించిన సుఖభోగాలు లభిస్తాయి. ఇక్కడ దైత్య, దానవ, నాగజాతుల వారుంటారు.

పాతాళంలో మహాశిల్పి మయుడు నిర్మించిన అత్యంత రమణీయ భవనాలున్నాయి. ఆ భవనాలచుట్టూ నిరంతర వసంత శోభతో అలరారే పూలునిండిన లతలూ, ఫలభారంతో తరువులూ విరాజిల్లే ఉద్యాన వనాలున్నాయి.

రకరకాల జలపక్షులతో, పద్మాలు, కలువలు ఉండే నిర్మల సరోవరాలున్నాయి.

ఇక్కడి మహానాగుల పడగలమీది మణికాంతులవల్ల చీకటిభయం ఉండదు. దివ్యఓషధీ రసపానంవల్ల వీరికి ఆకలిదప్పులూ, రోగాలూ ఉండవు.

మహావిష్ణువు యొక్క సుదర్శన చక్రం తప్ప వీరిని భయపెట్టేదిలేదు. అతల లోకాధిపతి మయుని కుమారుడు బలాసురుడు రాజు. ఈయన మాయావిద్యలలో ఆరితేరిన వాడు. ఈ విద్యలు నేర్చిన కొందరు భూలోకంలో కూడా ఇంద్రజాలాలుచేసి జీవిస్తుంటారు.

ఈ బలాసురుని ఆవులింతవల్ల స్వైరిణి, కామిని, పుంశ్చలి అనే పేర్లతో స్త్రీ బృందాలు పుట్టి పాతాళానికిపోయి అక్కడి పురుషులకు తాము తయారుచేసిన హాటకరసం యిచ్చి రససిద్ధులనుచేసి వారితో నిర్విరామంగా రతిక్రీడ సాగిస్తూంటారు. దీని దిగువ వితలం. ఇక్కడే పరమశివుడు పార్వతీదేవితో రసరాజ్యం ఏలుతూంటాడు.

వితలానికి దిగువన సుతలంఉంది. అక్కడ బలిచక్రవర్తి నిరంతరం హరిపద సేవాతత్పరుడై ఉంటాడు. బలిచక్రవర్తి భవనద్వారంలో శ్రీమన్నారాయణుడు శంఖ, చక్ర, గదా, శార్ఙ్గాలతో అలరారు తూంటాడు.

దీనిక్రింద తలాతలానికి అధిపతి మయుడు. దానిక్రింద మహాతలంలో కద్రువ సంతానం ఉంది. ఆసర్పాలు అయిదు పడగలవి, ఆరు పడగలవి, అలా అనంత ఫణా లతో అక్కడ విహరిస్తాయి.

ఆ క్రింద రసాతలంలోని వాతకవచకాలకేయాది దానవబృందాలు పుట్టలో పాముల్లా నిరంతరం శ్రీహరి భయంతో బ్రతుకుతూంటారు.

రసాతలానికి దిగువ పాతాళంలో వాసుకి ప్రముఖులైన నాగులుంటారు. వీరి పడగలమీది మణుల కాంతితో అక్కడ నిరంతరం పగటి వెలుగులుంటాయి.

పాతాళం క్రింద ఆదిశేషుడు తమవిశాలదేహాన్ని చుట్టుకుని ఉంటాడు. శేషుని శిరసుమీద ఈ భూగోళం చిన్న ఆవగింజలా ఉంటుంది.

# నరకం

ఇప్పుడింక క్రూరకర్ములు, అధర్మపరులు, అయినవారిని శిక్షించే నరకవిశేషాలు చెపుతాను.

ఈ లోకాలన్నిటికీ దక్షిణంగా ఉన్నాయి నరకాలు. అక్కడే పితృదేవతలు నిరంతరం తమతమ వంశాల శ్రేయస్సుకోసం ఆశీర్వాదాలు పలుకుతూంటారు.

యముడు నరకాధిపతి. ప్రాణుల కర్మలను చూసి తగిన శిక్షలు అందిస్తాడాయన. మొత్తం ఇరవై ఎనిమిది నరకాలున్నాయి.

తామిస్ర, అంధతామిస్ర, రౌరవ, మహారౌరవ, కుంభీపాక, కాలసూత్ర, అసిపత్రవన, సూకరముఖ, అంధకూప, క్రిమిభోజన, సందంశ, తప్తోర్మి, వజ్రకంటకశాల్మలి, వైతరణి, పూయోద, ప్రాణరోధ, విశసన, లాలాభక్షణ, సారమేయాదన, అవీచిరయ, రేతఃపాన, యివి మహానరకాలు.

క్షారకర్దమ, రక్షోగణభోజన, శూలప్రోత, దందశూక, అవటనిరోధన, అపర్యావర్తన, సూచీముఖాలు నరకాలు.

ఇతరులభార్యలను, బిడ్డలను అపహసించి అవమానించే వారందరూ తామిస్ర నరకంలో తిండిలేకుండా, పర్వతశిఖరాలమీద నుండి దొర్లించబడుతూ, యమకింకరుల ఉక్కుపాదాలతో తన్నులు తింటూఉంటారు.

పరస్త్రీ సంగమం చేసిన వానిని అంధతామిస్రంలో పడవేసి హింసిస్తారు.

సంసారపోషణకోసం యితరులను వంచించి ధనం సంపాదించేవాడు రౌరవ నరకంలో యాతనలు పడతాడు.

తమతిండి తాముతింటూ ఎవరినీ హింసించకుండా బ్రతికే పశువులనూ, పక్షులనూ, హింసించేవారు మహారౌరవం అనుభవిస్తారు.

తనపొట్టనింపుకుందుకోసం ఎలుకలుండే కన్నాలుమూసి వాటిని చంపుతారో అటువంటి క్రూరులందరూ కుంభీపాక నరకంలో మరుగుతూన్న నూనెమూకుళ్ళలో వేగుతారు.

తల్లిదండ్రులను, వేదవిదులను అవమానించి హింసించే వారికి కాలసూత్ర నరకంలో మంటలమధ్య మాడేయోగం పడుతుంది. విపరీతంగా ఆకలి, దాహం కలుగుతాయి. నీరివ్వరు, తిండి పెట్టరు. కాలసూత్ర నరకంలో. చిక్కిన పశువులను బాధించి బరువు పనులు చేయించే మూర్ఖులుకూడా ఈనరకంలోనే పడతారు. సనాతనధర్మం బోధించే వేదమార్గాన్ని విడిచి పాషండులై స్వేచ్ఛావిహారాన్ని ప్రచారంచేసి ఆచరించే వారిని అసిపత్రవనంలో పారేసి, యమకింకరులు కొరడాలతో కొడుతూ పరుగులుపెట్టిస్తారు. ఈఅరణ్యంనిండా చురకత్తులే ఆకులుగా దట్టంగా పెరిగిన చెట్లుంటాయి. ఆ కత్తులు చీరుతూంటే దుర్భరయాతన పడుతూ ఈ నరకంలో గడపాలి.

దోషం చేశాడో లేదో తెలుసుకోకుండా నిష్కారణంగా దండించే వారితోపాటు, వేద విదులను హింసించేవారు కాలసూత్రనరకంలో పడతారు. వీరిని యమభటులు చెరకుగడలు విరిచినట్లు విరుస్తూ హింసిస్తారు.

జంతుహింస చేసేవారు అంధకూప నరకంలో పడి వివిధ జంతువుల చేత, సర్పాల చేత, దోమలు, నల్లులూ, ఆదిగాగల క్రిమికీటకాలచేత బాధలు పడుతూంటారు.

ధనసంపదలతో తులతూగేవాడు బంధుమిత్రులకు పెట్టకుండా తనతిండితాను చూసు కుంటూ బ్రతుకుతాడు. వాడిని క్రిమిభోజన నరకంలో త్రోసి అందులోని క్రిములే ఆహారంగా పెడుతూంటారు.

ఏ పని చెయ్యడానికి నడ్డివంగక దొంగతనంతో జీవించేవారిని తప్తోర్మిలో పడవేసి కాలుతూన్న ఇసుపగుళ్ళతో బాదుతారు.

వావి వరుసలులేకుండా సంగమంచేసే స్త్రీ పురుషులను ఉక్కుకొరడాలతో కొడుతూ, మండుతూన్న ఉక్కు విగ్రహాలను కౌగిలింపజేస్తారు.

కొందరు కాముకులు పశువులతో సంగమం చేస్తారు. వారిని వజ్రకంటక సదృశంగా ఉండే ఆకులుగల జువ్విచెట్టుకి కట్టి పొడుస్తారు.

పాషండులతో సహవాసంచేసి ధర్మపథం తప్పిన వారిని వైతరణీ నదిలో ముంచుతారు. ఈ నది మలమూత్ర రక్తమాంసపూరితమై ఉంటుంది.

వేదవేదాంగాలు అధ్యయనం చేసినవారు తీవ్రపశు ప్రవృత్తితో పరస్త్రీ సంగమం చేస్తే వారిని మలమూత్ర లాలాజల శ్లేష్మభరితమయిన నూపంలో ముంచుతూ, అతిహేయ మయిన పదార్థాలు ఆహారంగా యిస్తారు.

జాగిలాలను పెంచి వానితో వేట సాగించే వారిని వాడిశూలాలతో పొడుస్తూ బాధిస్తారు.

ఆడంబరంకోసం పశువులను చంపి క్రతువులు చేసేవారిని పదునుగల రంపాలతో కోస్తూంటారు.

కొందరు రాజవంశీయులు, చోరులుకలిసి సంపన్నులను హింసించి దోపిడీలు చేస్తారు. ఇక్కృతగల బెడతారు, క్రూరుల నియోగించి సాధువులను చంపిస్తారు. వీరందరినీ యమ లోకంలోని జాగిలాలు వాడి కోరలతో చీల్చుకు తింటాయి.

లంచాలుపట్టి దొంగసాక్ష్యాలు చెపుతారే, అటువంటివారిని వీచీనరకంలో ఎత్తైనపర్వత శిఖరం ఎక్కించి కాళ్ళు పైకిఎత్తిపట్టి తలక్రిందికిపెట్టి వదులుతూంటే ఆజీవి బండరాళ్ళమీద పడిముక్కలు ముక్కలై మళ్ళీ అతుక్కుంటుంది. ఆప్రాణిని అలాపడవేస్తూనే హింసిస్తారు.

పతివ్రతలను కామించేవారిని, విలాసంగా మద్యపాన, సోమపానాలు చేసేవారిని గుండెలమీద త్రొక్కుతూ, నిప్పులమీద ఎర్రగాకాలుస్తూ, మరుగుతున్న ఉక్కును నోట్లో పోస్తారు.

ధూర్తులు కొందరు వేడుకగా జంతుహింస చేస్తారు. వీరిని దందశూక నరకంలో అయిదుపడగల పాములు కాటువేసి బాధలు పెడతాయి.

అతిథి అభ్యాగతులను క్రూరంగా చూసేవారిని గ్రద్దలూ, కాకులూ వాడిముక్కులతో పొడిచి హింసిస్తాయి.

సిరిసంపదలున్న వాడు దానధర్మాలు చేయకుండా లోభంతో బ్రతికితే సూచీముఖ నరకంలో వేసి గట్టి తాళ్ళతో బంధించి పీడిస్తారు.

ధర్మమార్గాన సత్యవ్రతంతో సాధుశీలంతో పరోపకారపరాయణులై జీవించేవారు స్వర్గ భోగాలనుభవిస్తారు.

జలజ భవాదిదేవ మునినన్నుత తీర్థపదాంబుజాత! ని
ర్మలనవరత్ననూపురవిరాజిత! కౌస్తుభ భూషణాంగ! ఉ
జ్జ్వల తులసీమరందమద వాసనవాసిత దివ్యదేహ! శ్రీ
నిలయశరీరకృష్ణ! ధరణీధర! భానుశశాంకలోచనా!

# షష్ఠ స్కంధం

కరుణాకర శ్రీకర కంబుకరా!
శరణాగత సంగత జాడ్యహరా!
పరిరక్షిత శిక్షిత భక్తమురా!
కరిరాజ శుభప్రద కాంతిధరా!

శుకయోగీంద్రా:

మానవుడు తెలియకకొన్ని, తెలిసికొన్ని పాపాలు చేస్తూ ఉంటాడు. ఆపాపఫలం అనుభవించడానికి నరకకూపంలో పడుతూ, మళ్ళీజన్మయెత్తి, మరికొన్ని పాపకర్మలుచేసి యిలా యీవలయంలో పడి ఉండవలసిందేనా! వానికి జనన మరణ నరకాల నుంచి విమోచనంలేదా! అని పరీక్షిన్మహారాజు ప్రశ్నించగా యోగిపుంగవుడు:

మహారాజా! కర్మలు చేస్తూవుంటే కర్మ నశించదు. కర్మ నాశనానికి కృషిచెయ్యాలి.

సదాచార సంపత్తితో సత్కర్మలు చేస్తూ శరీరానికి ఆరోగ్యం కలిగించే ఆహారం సేవిస్తూ మనస్సును నిర్మలంగా వుంచుకున్నవాడు పాపాలను నశింపజేసుకుంటాడు.

బ్రహ్మచర్య నియమంతో, తపస్సుతో, దానధర్మాలతో, అంతరింద్రియ, బహిరింద్రియాలను స్వేచ్ఛగా విడవక నియమవ్రత పరాయణులై దయాహృదయంతో ఉండేవారు పాపకర్మలనుండి బయటపడతారు.

అలాకాక —

మరికొందరు - నందనందనుడైన వాసుదేవుని పాదారవింద సేవతో నిర్మలరూపులై పాపాలను ప్రక్షాళనం చేసుకుంటారు. సూర్యకాంతి మంచును రూపుమాపేటట్లు భగవదారాధనపాపాలను హరిస్తుందని వీరి విశ్వాసం.

సర్వమూ పరమేశ్వరార్పణంగా, ఆయన సేవయే జీవితకర్తవ్యంగా, నారాయణకథాగానంతో కాలంగడిపే వారికి కైవల్యం కరతలామలకం.

జీవితంలో ఏ ఏకర్మలు చేసినా అన్నిటినీ హరించగల దివ్యమంత్రం నారాయణనామ స్మరణమే.

అలా విష్ణులోకం చేరిన అజామిళుని కథ చెపుతాను, సావధానంగా విను.

# అజామిళుడు

భారతవర్షంలో కన్యాకుబ్జమని ఒకనగరం

ఆ నగరంలో అజామిళుడు అనే ఓ విప్రుడుండేవాడు.

తండ్రితాతలు సంపాదించిన సిరిసంపదలు కావలసినన్ని వున్నాయి. అంతతో పయను వచ్చింది మొదలు పీనికి జూదం, వేశ్యాగమనం బాగా అలవాటయాయి. వేశ్యయే భార్యగా నిరంతరం అక్కడే ఉంటూ సర్వం నాశనం చేసుకున్నాడు. ఆమెవల్ల పదిమంది బిడ్డలతండ్రి అయాడు.

పరమ పవిత్రమయిన వంశంలో పుట్టినా ఆచార, సంప్రదాయాలు విడిచి పాపకర్మ లలో మునిగి తేలుతూండగా వార్ధక్యం నెత్తిమీదపడింది.

నీలికాంతు లీనే జుత్తు తెల్లబూడిదలా అయింది. అవయవాలు పట్టుతప్పాయి. తల వణుకు మొదలయింది. చూపుసన్నగిల్లింది. పళ్ళుఊడాయి. అయాసంతో దగ్గు ఆరంభ మయింది. ఎనిమిది పదులు దాటాయి.

బిడ్డలలో చివరివాడయిన వానిమీద ప్రేమ ఎక్కువైంది. ఆబాలుని పేరు నారా యణుడు. ముసలితనంలో ఎప్పుడూ వాని లాలనతోనే కాలంగడుపుతూండగా వానికికాలం చెల్లింది. కన్నుమూసేస్తూకూడా ముద్దుల కొడుకుమీద ప్రేమతో నారాయణా! అంటూ ప్రాణాలు వదిలాడు.

ఎన్నోపాపాలు చేసిన కారణంగా వానిని నరకానికి తీసుకుపోవడానికి యమకింక రులు వచ్చారు, భయంకరాకారులై.

అంతిమక్షణంలో నారాయణ స్మరణచేసిన కారణంగా విష్ణుదూతలూ వచ్చారు.

అప్పటికే యమదూతలు అజామిళుని దేహంనుండి జీవునిలాగి పాశబంధం వేశారు. వచ్చిన విష్ణుసేవకులు యమభటులను దూరంగా తరిమారు.

వారిని ఆశ్చర్యంతో చూస్తూ యమకింకరులు :

అయ్యా! మీరెవరు? మీ శరీరాకారాలు మాకెంతో ఆనందం కలిగిస్తున్నాయి. శంఖ, చక్ర, గదా, పద్మధారులై, పీతాంబరాలు ధరించి కిరీటకాంతితో విరాజిల్లే పరమ శాంతమూర్తులైన మిమ్ము చూచినకొద్దీ సంతోషం పెరుగుతున్నది.

నిఖిలలోక ధర్మరక్షణకు ప్రజాపతిచే నియోగింపబడ్డ యమధర్మరాజు మాప్రభువు. ఆయన ఆజ్ఞానుసారం వీనిని తీసుకు వెడుతూంటే మీరెందుకు అడ్డుకున్నారు; అని ప్రశ్నించి అంతతో ఆగక.

ధర్మాధర్మ నిర్ణయం చేసేదివేదం. అటువంటివేదం పరమేశ్వర స్వరూపం. ధర్మబద్ధమయిన సత్కర్మలు చేసినవాడే విప్రకులంలో పుడతాడు. ఈప్రాణి అటువంటి సదాచార సంపన్నమయిన వంశంలో పుట్టి శాంతస్వభావంతో ధర్మనిష్ఠతో గురుసన్నిధానంలో శ్రద్ధగా వేదాధ్యయనం చేశాడు. అతిథి మర్యాదలు నడిపాడు. భూతదయకలవాడు.

అన్నీ అంతనిష్ఠగానూ సాగించినా యౌవనం ప్రవేశించి, కామోద్రేకం కలిగే వయసువచ్చింది.

ఆ రోజులలో ఒకనాడు తండ్రి ఆజ్ఞ ప్రకారం దేవపూజకు పువ్వులూ, పళ్ళూ తేవడానికి నగరం వెలుపల ఉద్యానవనానికి వెళ్ళాడు.

అది వసంతమాసం.

వనంలో లతలన్నీ సుగంధసుమాలతో నిండివున్నాయి.

వానిలో తేనె త్రాగడానికి ఝుంకారాలతో తుమ్మెదలు తిరుగుతున్నాయి. ఫలవృక్షాల మీద కోకిలలు, చిలుకల కలకూజితాలు వినవస్తున్నాయి.

అటువంటి వనం నగరంలోని విలాసినీ జనానికి ఆటపట్టు. అక్కడికే విటులు కూడా చేరుతూంటారు.

ఫలాలూ, పువ్వులూ, దర్భలూ తీసుకుని వస్తున్నాడీ అజామిళుడు.

ఆ సమయంలో ఆవనంలో ఒకపూవు పొదరింట నడివయసులోవున్న సుందరాంగిని ఆలింగనం చేసుకుని ముద్దులు కురిపించే ఒక యువకుని చూశాడు.

ఆ కామిని బాగా మద్యం త్రాగివుంది. అందువల్ల దాని కన్నులు ఎర్ర కలువల వలెవున్నాయి. మత్తులో వుండడంవల్ల అది మరీ మీది మీదికి వెళ్ళి ప్రియుడికి ఉద్రేకం కలిగిస్తున్నది.

మైకంలో వారిరువురూ ఒళ్ళుతెలియకుండా క్రిందా మీదా పడుతూ నవ్వుతూ కులాసాగా గడుపుతున్నారు.

దానిజుట్టు ముడివీడి ముఖంనిండా చిందర వందరగా పడింది. చేతులగాజులు గల గల లాడుతున్నాయి. మువ్వలవడ్డాణం ఘల్లుఘల్లు మంటున్నది.

అటువంటి సన్నివేశం చూసిన యౌవనుడెవడికయినా మనసు చెదురుతుంది. అప్పటికే నూనూగు మీసాల వయసులో వున్న అజామీళుని గుండెలో మన్మథుడు విల్లెక్కుపెట్టి వున్నాడు.

అంతే! కామోద్రేకం కలిగిన వాడికి మంచిచెడ్డల విచక్షణపోతుంది.

పోయింది అజామీళునికి.

సర్వమూ మరిచి పోయాడు.

పువ్వులూ, పళ్ళూ, దర్భలూ జారవిడిచాడు.

అదిమొదలుగా వాని జీవితం మారిపోయింది.

వేదాంత చర్చలు మాని కామినీ జన చర్చలో పడ్డాడు.

శాస్త్ర పారతర్కం వదిలి ప్రణయ తర్కం ఆరంభించాడు.

తన సంసారం వదిలి దాని సంసారభారం మీద వేసుకున్నాడు.

ఇంతటి పాపకర్మలు చేసిన యీ ధూర్తుడికి యమదండనతోకాని ప్రాయశ్చిత్తంకాదు, అన్నారు.

అప్పుడు విష్ణుదూతలు :

మీవాదం బాగానేవుంది, కాని కన్నబిడ్డల మంచిచెడ్డలు చూస్తూ వారి శ్రేయస్సు కోరవలసిన జననీ జనకులే వారికి కీడుతలపెడితే వారెవరితో మొరపెట్టుకుంటారు. లోకంలో వివేకంకల వారేది చేస్తే మిగిలినవారు అదే చేస్తారు. అటువంటివారు చెప్పినమాట సత్యం అవుతుంది.

కాగా —

నమ్మికతో స్నేహితుని తొడమీద తలపెట్టి నిద్రపోయేవానిని చంపడం కంటె ద్రోహం వుంటుందా! మనసుతో మనసు కలిపి స్నేహంచేసినవారికి మేలుచెయ్యాలి కాని కీడు తలపెట్టకూడదే!

ఒక్క పరమరహస్యం ఏమిటంటే—

ప్రాణంపోయే సమయంలో నారాయణ నామస్మరణ చేసిన వాడికి కోటిజన్మల పాపాలు నశిస్తాయి. అటువంటి పుణ్యం వీడు చేసుకున్నాడు.

పుణ్యమూలంబులనపాయపోషకంబు
లభిమతార్థంబు లజ్ఞానహరణకరము
లాగమాంతోపలబ్ధంబు లమృతసేవ
లార్త శుభములు హరినామకీర్తనములు.

అటువంటి శ్రీమన్నారాయణనామాన్ని. ప్రాణావసానసమయంలో స్మరించిన వీనికంటె పుణ్యాత్ముడులేడు, అని అజామీళునికి యమపాశ విముక్తి కలిగించి వారు వెళ్ళారు.

యమకింకరులు ప్రశాంతంగా యమునిచేరి తాము విన్నదంతా వివరించారు.

అజామీళుడు కన్నులు నులుముకు లేచాడు.

క్షణాలక్రితం విష్ణుసేవకులు చెప్పిన మాటలన్నీ మనసులో కదిలాయి.

జీవితంలో తనుసాగించిన క్రూరకర్మలన్నీ తలచుకుని కొంతసేపు బాధపడి, పశ్చాత్తాపాగ్నిలో అవి భస్మంచేసుకుని, సర్వసంగ పరిత్యాగియై, గంగానదిలో స్నానంచేసి, అక్కడ ఆలయంలో పద్మాసనాసీనుడై యోగనిష్ఠతో శరీరాన్ని విడిచిపెట్టాడు.

విష్ణుదూతలు వానిని దివ్యవిమానంమీద వైకుంఠం తీసుకువెళ్ళారు.

పరీక్షిన్మహారాజా! నారాయణ నామస్మరణ ఎంతటి మహత్తర మయినదో విన్నావా! అటువంటి అజామీళుని గాథ చదివినా, విన్నా పాతకాలు నశిస్తాయి, అన్నాడు.

యోగీంద్రా! యమకింకరుల మాటలు విని వారి ప్రభువు యమధర్మరాజు ఏమన్నాడో వినిపించండి, అని కోరగా :

రాజేంద్రా!

యమకింకరులు తమప్రభువును సమీపించి, నమస్కరించి, వినయంగా తలవంచి:

స్వామీ! ఈనాడు జరిగిన విషయం చూస్తుంటే మాకు చాలా ఆశ్చర్యంకలిగింది. మానవకోటి చేసే కర్మలకు శిక్షవేసేది మీరొక్కరే అని యింత వరకూ భావించాం. కాని మీరుకాక మరెవరో వున్నట్టు అనుమానం కలుగుతున్నది. అలా అయితే తమరిని దండధారి అనడం పైపై గౌరవంగా నమ్మక తప్పదు.

ముల్లోకాలకూ మీరే శాసకులు అని విశ్వసించిన మాకు యిటువంటి పరాభవం చేసిన ఆ శాసకులెవరు? అని ప్రశ్నించారు.

యమధర్మరాజు : కింకరులారా ! ఆశ్చర్యమూ, అన్యాయమూ ఏమీ జరగలేదు. ఇంద్ర, అగ్ని, వరుణ, సూర్య, చంద్రాదులకంటె, బ్రహ్మ, మహేశ్వరాదులకంటె అధికుడైన మహామహు డొకడున్నాడు. ఆయన శ్రీమన్నారాయణుడు.

ఆ మహావిష్ణువు తత్వాన్ని మహేశ్వరుడు, ప్రజాపతి, కుమారస్వామి, కపిలుడు, నారదుడు, భీష్ముడు, మనువు, బలి, జనకుడు, ప్రహ్లాదుడు, వ్యాసుడు, ఆయన కుమారుడైన శ్రీ శుకుడు యీ పన్నెండుగురే తెలుసుకోగలిగారు. ఉపనిషత్తులు బోధించిన ఆ పురాణ పురుషుని భాగవత దివ్యధర్మం మరెవరికీ తెలీదు.

మీరు చూశారు కదా ! నారాయణ స్మరణఫలం. మృత్యుపాశ బంధితుడైన అజామీళుని రక్షించి ప్రాణదానం చేసిందంటే హరినామ పారాయణ ఎంత మహత్తర మయినదో !

క్రూరబుద్ధీ, పాపాచారరతుడూ అయిన అజామీళునికే రక్షణ యిచ్చిన నారాయణ మంత్రాన్ని నిర్మల మనస్సుతో జపిస్తే మరెంతటి ఉత్తమ ఫలం లభిస్తుందో తెలుసుకోలేక క్లేశాల పాలవుతున్నారు నరులు.

పర్యవసానంగా—

ఎప్పుడయినా సరే మీరు విష్ణుపద సేవా పరాయణుల జోలికి వెళ్ళకండి.

నారాయణ స్మరణ చెయ్యని వారినీ, నామసంకీర్తనం వినని వారినీ, హరినామ స్మరణతో జీవితం ధన్యం చేసుకునే పుణ్యాత్ములను పరిహసించే వారినీ బంధించి తెచ్చి మన నరకాలలో చిత్రహింసలు పెట్టండి.

పాపబుద్ధులూ, పాపాచారులూ, అయినవారినే నరకానికి తీసుకురండి. అంతే ! హరి భక్తులనూ, వారి బంధుమిత్రులనూ మనం హింసించకూడదు. వారందరూ నారాయణపథం పొందుతారు, అని ప్రబోధించాడు.

మహారాజా ! మరొక విశేషం చెపుతాను.

ప్రచేతసుని కుమారులు ప్రాచీన బర్హి ఆదిగాగలవారు ఒకప్పుడు సముద్రంనుండి యీవలకు వచ్చి, భూమినిండా ఆవరించిన వృక్షాలను చూసి ఆగ్రహంతో అగ్నిని కల్పించి అన్ని చెట్లనూ తగులబెట్టడం ఆరంభించారు. అదిచూసి చంద్రుడు వారిని వారించి :

మహనీయులారా ! ఏం చేస్తున్నారు మీరు. ఈ వృక్షాలలో ప్రాణికోటికి అవసర మయిన బలమిచ్చే ఓషధులు ఆహార రూపంలో నిక్షేపించాడు ప్రజాపతి. వాటిని దగ్ధం చేయకండి. మానవులకు నాలుగుకాళ్ళ జంతువులు ఆహారంగా యిచ్చాడు.

అందుచేత జీవకోటికి జవసత్వాలిచ్చే చెట్లను నాశనం చెయ్యకండి. ఇదిగో ఈ వృక్షాల నుండి పుట్టిన అప్సరి కన్యను మీకు భార్యగా యిస్తున్నాను, అన్నారు.

ఆమెవల్ల దక్షుడు పుట్టి ప్రజలను సృష్టించాడు.

ఆయన చలువ వల్లనే దేవ, దానవ, యక్ష, రాక్షస, గరుడ, గంధర్వ, కిన్నర, కింపురుషాదులు పుట్టారు. పక్షులూ, పాములూ, పర్వతాలూ, అన్నీ ఆయన సృష్టియే.

ఇంత సృష్టి సాగినా ఆయనకు తృప్తి కలగలేదు

వింధ్య పర్వత ప్రాంతంలో అఘమర్షణ తీర్థంలో స్నానంచేసి హరినామ స్మరణలో కూర్చున్నాడు. ఆయన తపస్సుకు సంతోషించి—

సర్వేశుడు సర్వాత్ముడు
సర్వగతుండచ్యుతుండు
సర్వమయుండై సర్వంబు చేరి కొలువగ
సర్వగుడై దక్షునకు ప్రసన్నుండయ్యెన్.

పురుషోత్తముడు ప్రత్యక్షం కాగా దక్షుడు సంతోషంతో ఆయన పాదాలమీద వ్రాలి ఆనందంతో ఏమీ పలకలేకపోయాడు.

అది తెలిసిన నారాయణుడు: దక్ష ప్రజాపతీ! చతుర్ముఖుడు, ఫాలాక్షుడూ, ఇంద్రుడూ, మనువులు, ప్రజాపతులూ వీరందరూ నా విభూతిరూపాలు. ఇంద్రియాలను నిగ్రహించి చేసే సంధ్యావందనమనే తపస్సు నా హృదయం. ధ్యాన జపమే నా శరీరం. శబ్దమే నా ఆకారం. సత్క్రతువులే నా అవయవాలు. ధర్మమే నా ఆత్మ. దేవతలు నా ప్రాణాలు. వేదాలు నా రూపం.

నా మాయవల్ల బ్రహ్మ పుట్టాడు. దానివల్లనే నిఖిల లోకాలు పుట్టాయి. బ్రహ్మ తపస్సుచేసి మిమ్ము సృష్టించాడు. మీరు ప్రజాపతులయారు. ఈ ప్రజాసృష్టికోసం నీకు అసిక్ని అనే యువతిని యిచ్చాను. దీనితో సంసారం సాగించి సృష్టి కొనసాగిస్తున్నావు. ఈ పుట్టిన ప్రాణికోటి అంతా దాంపత్య జీవనంతో సంతానవృద్ధి చేస్తూంటుంది, అని అదృశ్యుడయాడు.

అనంతరం దక్షునికి పుట్టిన కుమారులు సింధునది సముద్రంలో కలిసిన పశ్చిమ దిశగాపోయి అక్కడ నారాయణ సరోవరంలో స్నానం చేసి తపోదీక్ష ఆరంభించారు.

అక్కడకు నారదుడువచ్చి—

జ్ఞానంలేని పసివారు మీరు. పరతత్వం తెలునుకోకుండా అజ్ఞానంలో పడి నంసార విషయ సుఖవలయంలో పడకండి. శాశ్వతమైన పరమపురుషధామం చేరే ప్రయత్నం చేయండి, అని బోధించగా వారు విరాగులై నారాయణ చరణసేవలో నిమగ్నులయారు.

ఇది విని దక్షుడు శోకిస్తూంటే చతుర్ముఖుడువచ్చి, నాయనా! శోకం విడిచి మరి కొందరు కుమారులను కని వారి చేత ప్రజావృద్ధిసాగించు, అని అదృశ్యమయాడు.

దక్షుడు శబళాశ్వలనే కుమారులను సృష్టించాడు. వారు తమ తండ్రి ఆజ్ఞపాలించే ఊహతో నారాయణ నరోవరానికి వెళ్ళి తపోదీక్ష వహించారు.

నారదుడు మళ్ళీ వచ్చి వారికి కూడా వైరాగ్యం భోధించగా వారు సర్వం విడిచి తమ అన్నలు వెళ్ళిన దారినే పరమపథం చేరారు.

ఆవార్త విని దక్షుడు ఆగ్రహంతో నారదుని చేరి :

పసివారిని అపమార్గం పట్టించే నీకు ఏలోకంలోనూ స్థానంలేకుండా పోవుగాక, అని శపించాడు.

నారదుడు నంతోషంతో వెళ్ళాడు.

దక్షుడు తిరిగి విచారిస్తూండగా చతుర్ముఖుడు ప్రజాసృష్టిమార్గం ఉపదేశించాడు. అప్పుడు దక్షుడు అరవైమంది కుమార్తెలనుకని, యమునికి పదిమందినీ, కశ్యపునికి పద ముగ్గురినీ, చంద్రునికి ఇరవైయేడుగురినీ, భూత, అంగీరస, కృశాశ్వలకు యిద్దరిద్దరినీ యిచ్చి మిగిలిన నలుగురినీ కశ్యపునికే యిచ్చాడు

వీరి వల్ల సర్వప్రాణికోటీ ప్రవృద్ధమయింది

( ఈ సృష్టి వివరాలు మూల భాగవతంలో చదువతగ్గవి )

# దేవదానవ సంగ్రామం

రాజేంద్రా !

ఒకానొకప్పుడు —

అమరావతిలో దేవేంద్రుడు చింతామణి సింహాసనం మీద సుఖాసీనుడై ఉన్నాడు. నిఖిల దేవగణాలూ పరివేష్టించి వున్నాయి. గంధర్వులు గానం చేస్తుంటే అప్సరసలు నాట్యం చేస్తున్నారు.

ఆ సమయంలో దేవగురువు బృహస్పతులవారు విజయం చేశారు.

నిఖిలదేవ వైభవానికి ఆధారభూతుడైన గురువు వచ్చినా, అధికార మదాంధుడైన ఇంద్రుడు సింహాసనం దిగి ఎదురేగి స్వాగతం యివ్వకపోగా ఆయనకు ఆసనం చూపే స్థితిలో లేకుండా పోయాడు.

అది గమనించి బృహస్పతి మౌనంగా వెనుదిరిగి వెళ్ళారు.

కొంత సేపటికి దేవేంద్రునికి తన అహంకారచర్య తెలిసింది. తెలిసిన క్షణంలో విపరీత వ్యధతో హుటాహుటి గురువుగారి యింటికి వెళ్ళారు. అమరేంద్రుడు వస్తున్నాడని తెలిసి బృహస్పతి అదృశ్యమయ్యాడు. అంతటా వెదకి గురువును కానక ఇంద్రుడు దీన వదనుడై తన భవనం చేరుకుని శోకసముద్రంలో పడ్డాడు.

ఈ వార్త తెలిసింది దానవ గణానికి

బృహస్పతి లేని సమయంలో దేవతలకు మంత్రాంగం చెప్పే వారుండరు కనక యిప్పుడే యుద్ధానికి పోవాలని నిశ్చయించి వివిధ శస్త్రాస్త్రాలతో దేవతానగరం మీద దాడి ప్రారంభించారు. అప్పుడు దానవ విజృంభణాన్ని ఎదుర్కోలేక పలాయనం పఠించి బ్రహ్మలోకానికి పోయి ఆయన పాదాలమీద పడ్డారు.

అప్పుడాయన: ఓ దేవతలారా! చిన్ననాటి నుండి మీకు విద్యాబుద్ధులు నేర్పి మిమ్మింతటి వారిని చేసిన గురువుపట్ల చూపిన తిరస్కారానికి ఫలం యిది. దానవులు మీకంటే బలహీనులయినా వారి గురువయిన శుక్రాచార్యుని కృపాకటాక్షంతో యీనాడింత వారయారు.

సరే! ఇప్పుడు మీరు త్వష్ట కుమారుడైన విశ్వరూపుడనే ముని దగ్గరకు వెళ్ళి ఆయన అనుగ్రహం సంపాదిస్తే మీ బాధలు గట్టెక్కుతాయి, అనగా వారు విశ్వరూప ముని చంద్రుని పాదాలవ్రాలి ప్రార్థించగా ఆయన కరుణించి నారాయణకవచం అనుగ్రహించి దేవ తలకు దానవపీడ తొలగించాడు.

అనంతరం ఒకానొక సందర్భంలో దేవేంద్రుడు ఈ విశ్వరూపుని సంహరించాడు. అదివిని త్వష్ట క్రోధంతో యజ్ఞంచేసి ఇంద్రసంహారం చేయగల వృత్రాసురుని పుట్టించాడు.

# వృత్రాసురుడు

ఈ వృత్రాసురుడు పుడుతూనే అఖిలలోక భీకరంగా విజృంభించాడు. దేవత లందరూ ఒక్కుమ్మడిగా వానిమీదికి తమ తమ ఆయుధాలతో నడిచారు దేవతలు విడిచే ఆయుధాలన్నీ వానిముందు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి.

చేసేదిలేక అందరూ శ్రీహరిని వేడుకుందామని వైకుంఠం చేరారు. వారందరూ తలలువాల్చి అతిదీనంగా ప్రార్థించారు. వారి దీనదశను గుర్తించి నారాయణుడు :

దేవేంద్రా ! మీరందరూ మహాతపస్సంపన్నుడైన దధీచి మహర్షిని అర్థించి అతి శక్తి వంతమయిన ఆయన శల్యంతో దివ్యాస్త్రం సాధించండి. ముందుగా అశ్వనీ దేవతల అనుగ్రహంపొంది, ఆయనను దర్శించండి. ఆ శల్యం వజ్రాయుధమై వృత్రాసురుని సంహరిస్తుంది, అన్నాడు.

దేవతలందరూ నారాయణుని ఆజ్ఞానుసారం అశ్వనీ దేవతాసహితులై దధీచి మహర్షి దగ్గరకు వెళ్ళి తమ కోరిక తెలిపారు.

దధీచి : దేవతలారా ! నాకు చాలా సంతోషంగాఉంది. ఈ దేహం ఎప్పుడయినా నశించేదే ! ఇప్పుడిది నక్కలపాలు గాకుండా దేవకార్యానికి ఉపయోగపడటం ఎంత అదృష్టం.

అని పరమేశ్వరుని హృదయంలో నిలిపి యోగసమాధిలోకి వెళ్ళి శరీరంవిడిచి పెట్టాడు.

దేవేంద్రుడు వాని శల్యాన్ని గ్రహించాడు. విశ్వకర్మ ఆ శల్యాన్ని వజ్రాయుధంగా రూపొందించాడు.

వజ్రధారియై దేవేంద్రుడు ఐరావతం మీద బయలుదేరాడు. నిఖిలదేవతలు వెన్నంటిరాగా వృత్రాసురునితో యుద్ధానికి తలపడ్డాడు.

వృత్రాసురుని అనుచరులందరూ సింహనాదాలతో రణరంగలో అడుగుపెట్టారు. పోరు ఘోరంగా సాగుతోంది.

దేవతలధాటికి అసురులాగలేక పారిపోతూంటే, చూసి వృత్రాసురుడు వారికి ఉత్సాహం కలిగించి హుంకరించి, వాడిశూలంతో దేవగణాలను హింసిస్తుంటే దేవేంద్రుడు వజ్రం ప్రయోగించాడు.

వృత్రాసురుడు ఆ వజ్రాని చేతబట్టి ఎదురువచ్చి, ఐరావతాన్ని వేధించాడు.

ఆ బాధకు తాళలేక ఐరావతం గిరగిరతిరిగింది.

అమృతపానం చేసిన హస్తంతో దేవేంద్రుడు దానిని ఆశ్వాసించి, కుపితుడై చూడగా వృత్రాసురుడు: దేవేంద్రా! గురుహత్యచేసిన నీ మహాపాపానికి ప్రాయశ్చిత్తం లేదు. ఇదిగో నా శూలంతో ఈ దేవగణాలను బలిచేసి విజయలక్ష్మిని వరిస్తాను. లేదా, నీ వజ్రాయుధానికి గురియై శ్రీహరిని ధ్యానిస్తూ పరమపదం చేరుతాను. ఆ పురుషోత్తముని పాదదాసులకు దాసుడనై ఏబాధలూలేనిలోకం చేరుతాను.

అని నారాయణుని ప్రార్థిస్తూ శూలంతో యింద్రుని వేధించడానికి సన్నద్ధుడయాడు.

అదిచూసి ఇంద్రుడు శూలంతోపాటు వాని చెయ్యికూడా ఖండించగా, వాడు రెండవ చేతితో పరిఘాయుధం పూని తీవ్రరోషంతో వచ్చి ఐరావతాన్ని హింసించాడు.

అది బాధ భరించ లేక వెనుదిరిగింది.

చేతిలో వజ్రాయుధం జారిపడింది.

క్రిందపడ్డ ఆయుధం తీసుకో, నిరాయుధులతో మేము యుద్ధం చెయ్యం, అన్నాడు వృత్రుడు.

ఇంద్రుడు వజ్రాయుధం అందుకుని వాని రెండవచేయి ఖండించాడు.

రెక్కలు తెగిన పర్వతంలా వాడు తన భీకరవదనం విశాలంగా తెరిచి, ఒక్క దూకులో దేవేంద్రుని మీదపడి గుటుక్కున మ్రింగేశాడు.

వాని ఉదరంలో ఇంద్రుడు చేరాడు, లోపలకు వెడుతూనే వాని పొట్టను వజ్రాయుధంతో చీల్చి వెలుపలికి వచ్చి శిరసు ఖండించాడు.

ఆ క్షణంలో వాని దేహంనుండి ఒకజ్యోతి వెలువడి వైకుంఠంచేరి నారాయణునిలో లీనమయింది.

వృత్రాసుర సంహారంతో సంతృప్తుడై దేవేంద్రుడు అమరావతి చేరాడు.

## చిత్రకేతువు

శూరసేన దేశాన్ని చిత్రకేతుడనే రాజు పాలిస్తూండేవాడు. ఆయనను ప్రజలందరూ కన్నతండ్రిలా చూసేవారు. మంత్రి, సామంత, దండనాథ, పురోహితులు, ప్రాం

స్నేహితునివలె చూసేవారు. రాజ్యంలో అందరూ సుఖంగా సర్వభోగాలతో సంతోషంగా వున్నారు.

అలాఉండగా ఒకనాడు అంగీరసుడనే ముని ఆయన భవనానికి వచ్చాడు. వచ్చిన మునికి అర్ఘ్యపాద్యాదులిచ్చి సుఖాసనం అర్పించిన అనంతరం అంగీరసుడు :

రాజా ! ఇన్ని భోగాలున్నాయి. అనుచరులందరూ నిన్నుదైవంగా ఆరాధిస్తున్నారు. భార్యలందరూ మీయందు అనురాగంతో వున్నారు. అయినా నీ వదనంలో దీనభావం ఉండడానికి ఏమిటికారణం ? అని అడిగాడు

అప్పుడా చిత్రకేతువు : స్వామి ! త్రికాలజ్ఞులయిన మీకు తెలియని విషయాలుంటాయా ! అని మౌనంగా తలవాల్చుకున్నాడు.

అంగీరసుడు : రాజా ! ఇన్నిసంపదలూ, సుఖాలూవున్నా సంతానంలేని బాధ కదా నిన్ను వేధిస్తున్నది. సరే ! నీచేత పుత్రకామేష్టి చేయిస్తాను.

అని సుముహూర్తంలో ఆ మహాక్రతువు నిర్వహింపజేసి, యజ్ఞఫలాన్ని మహారాణి కృతద్యుతికి యిచ్చాడు.

ఆవిడ గర్భవతియై తొమ్మిదినెలలు నిండగానే కుమారుని కన్నది. ఈ వార్త రాజ్యంలోని అందరికీ ఆనందం కలిగించింది. మహారాజు సంతోషంతో తన దేశంలోని విద్వాంసులకు భూదాన, గోదాన, సువర్ణదానాలుచేసి, సర్వప్రజలనూ అన్నదానంతో తృప్తిపరిచాడు.

ఆ కుమారుడు శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానుడవు తున్నాడు.

కొడుకు మీదప్రేమ కారణంగా మహారాజు నిరంతరం పట్టమహిషి మేడలోనే ఉండేవాడు. అదిమిగిలిన భార్యలకు అసూయ కలిగించింది. వారందరూ చేరి బాగా ఆలోచించి, అతిరహస్యంగా, ఒకరాత్రి ఆబాలునికి విషంపెట్టారు.

తెలతెల వారుతుండగా బాలునిముఖం చూసిన దాది భయంతో గోలుగోలున ఏడుపు మొదలుపెట్టింది. అద్దివిని మహారాణి లేచి బిడ్డపైబడి గుండెలు బాదుకుంటూ శోకిస్తూంటే మహారాజు చెవినిపడింది.

చిరకాలానికి కలిగిన కుమారుని మరణంతో ఆయన గుండెలు బ్రద్దలయేలా విలపిస్తూంటే పరిజనులు, అమాత్యులూ, పురోహితులూ చేరి విచారసాగరంలో మునిగారు.

ఈ సంగతి తెలిసి అంగీరసుడు నారదునితో కలిసివచ్చి :

మహారాజా! దేనికి విచారిస్తున్నావు. ఈ దేహము దేహి ఏమిటివి? అంతా నారాయణుని మాయ. ఈ రాజ్యం, మంత్రులు, భోగాలు, యివన్నీ నిత్యాలుకావు. పుడుతూ చస్తూ ఉండడం ప్రాణిధర్మం, దానికోసం అవివేకంలో పడి శోకించకు, అని వైరాగ్య బోధ చేశాడు.

అనంతరం నారదుడు ఆ రాజుకి నారాయణ మంత్రోపదేశం చేసి.

మహారాజా! ఈ మంత్రాన్ని ఏడురోజులు దీక్షగా పఠించినవారు ఈ లౌకిక క్లేశాల నుంచి విముక్తులై పరమపథం చేరుతారు, అయినా ఒక్కచిత్రంచూడు, అని బాలుని బ్రతికించి.

నాయనా! నువ్వు మీనాన్నగారి సింహాసనం ఎక్కి రాజ్యం ఏలుకో అన్నాడు.

అప్పుడా బాలుడు :

స్వామీ! ఇప్పటికి నేనెన్నో దేవ జన్మలెత్తాను. జంతువుల గర్భంలో యాతనలు పడ్డాను. నరజన్మలు ఎత్తాను. ఇన్ని జన్మలలో వీరు ఏ జన్మతాలూకు జననీజనకులు! తండ్రి, కొడుకు, భార్య, భర్త ఏవిటీ వరసలు. ఎందుకీ రాగద్వేషాలు. నాకు వీరెవరు? ఏమీకారు. ఉదాసీనుడైన పరమేశ్వర రూపుణ్ణి నేను. మీరంతా విచారం వదలి, నారాయణ స్మరణతో తరించండి, అని అదృశ్యం అయాడు.

అంతతో చిత్రకేతుడు విరాగియై కాళిందీనదికి పోయి పరిశుభ్రంగా స్నానంచేసి, పద్మాసనాసీనుడై నారదుడు ఉపదేశించిన మంత్ర పారాయణం వారంరోజులు సాగించాడు.

నారాయణ అనుగ్రహంతో చిత్రకేతుడు దివ్యవిమానారూఢుడై, విద్యాధరులకు అధిపతిఅయి సర్వలోకాలలో శ్రీహరి కీర్తనం సాగిస్తూ సాగిస్తూ ఒకనాడు కైలాసంచేరాడు.

అక్కడ మునిజన, ప్రమథగణ మధ్యంలో సింహాసనం మీద పార్వతీ సహితుడై కూర్చుని ఆమెతో సరసాలాడుతూన్న పరమశివుని చూచి ఫకాలున నవ్వి :

ఎంతటి వారయినా మహాజనమధ్యంలో శృంగారక్రీడలు సాగించడం ఎంత అసహజం, అన్నాడు.

పరమశివుడు నవ్వుతూ ఊరుకున్నాడు. పార్వతీదేవి ఆగ్రహంతో :

ఓ మూర్ఖుడా! అహంకారంతో యింత అవమానకరంగా మాట్లాడిన నువ్వు రాక్షసుడవై పుట్టు, అని శపించింది.

చిత్రకేతుడు కోపించకుండా :

అమ్మా! ఏ జన్మ ఎత్తినా హరిభక్తి వీడను, అని వెళ్ళి, త్వష్టప్రజాపతి సాగించే క్రతువులో దక్షిణాగ్నిలో ప్రవేశించి వృత్రాసురుడుగా పుట్టాడు. అందుకనే వానికి విష్ణు భక్తి సడలలేదు. అదీ హరిభక్తుల విశేషం!

# మరుత్తులు

రాజేంద్రా! కశ్యప ప్రజాపతికి దితి, అదితి అని యిద్దరు భార్యలుకదా! వీరిలో అదితి సంతానమయిన అమరులు, దితి సంతతి అయిన దైత్య, దానవులను నిరంతరం హింసించి సంహరిస్తూండడం ఆ తల్లికి తీరనిబాధ అయింది.

ఆమె ఒకనాడు భర్తను చేరి పరిచర్యలతో, మధురవాక్కులతో ఆయన మనసు రంజింపజేసింది. ఆయన ప్రీతితో:

ఇల్లాలా! నీకేం కావాలో కోరుకో, అన్నారు.

అప్పుడామె: నాథా! మీరు నిజంగా నా మీద అనుగ్రహంతో ఉంటే దేవేంద్రుని సంహరించే కుమారుని దయచేయండి, అంది.

అప్పుడు కశ్యపుడు తన మనసులో:

కోరి సతులకెల్ల కూర్చువారెవ్వరు
పతులనైన సుతుల హితులనైన
బలిమి చేసి యైన పరహస్తమునయైన
హింస పరతురాత్మహితము కొరకు.

అని భావించి, దీనిని తగిన రీతిని జరిపించాలని నిశ్చయించి,

ప్రాణేశ్వరీ! నీ కోరిక తీరుతుంది. దేవతలకు బంధువుగా వుండేవాడు ఇంద్రుని హరించే వాడు అయిన కొడుకు కలుగుతాడు.

కాని, దానికి నువ్వొక దీక్షవహించి, సంవత్సరకాలం నిష్ఠతో వుండాలి.

జాగ్రత్తగావిను. సర్వభూతాలమీద ప్రేమవుండాలి. పరుషంగా మాటాడరాదు. కోపంరానూడదు. అబద్ధం ఆడకూడదు. గోళ్ళు తియ్యకూడదు. కేశాలు రాలనివ్వరాదు. అమంగళం కలిగించే ఎముకలూ, పుర్రెలూ తాకరాదు. సాధ్యమయినంత వరకూ నదులలోనే స్నానంచెయ్యాలి. లేదా విశాలసరోవరాలు, అంతే తప్ప నూతులలో నీరు, కుండలతో తెచ్చిన నీరు స్నానానికి వాడరాదు.

దుర్బుద్ధులతో మాట్లాడకు. ఒకమారు కట్టిన చీర, ఒకసారి పెట్టుకున్న పువ్వులు మళ్ళీ దగ్గరకు రానివ్వకు. ఎంగిలిచేసిన అన్నం తినకు. కుక్కలూ, పిల్లులూ, గ్రద్దలూ, క్రిమికీటకాలూ తాకిన ఆహారం స్వీకరించకు. మాంసం ముట్టకు. పాత్రతోనే తప్ప దోసిలితో నీరు త్రాగకు. మితంగా మాట్లాడు. జుట్టు విరబోసుకోకు. అలంకార శూన్యంగా కనిపించకు. నిద్రపోయేముందు కాళ్ళుకడుగు. తడికాళ్ళతో పడుకోకు. సంధ్యాసమయంలో నడ్డి వాల్చకు. పశ్చిమంగా తలపెట్టి నిద్రించకు. నగ్నంగా పడుకోకు. ఎప్పుడూ పరిశుభ్రంగా వుండు. ప్రాతః కాలంలో సూర్యాభిముఖంగా నిలిచి షోడశోపచారాలతో నారాయణుని పూజించి మంత్రజపం చేసి, ముత్తైదువులను సేవించి, అర్చించు. అనుక్షణం నీ గర్భంలో శిశువు పెరుగుతున్నాడనుకుంటూ వుండు.

మార్గశిరశుద్ధ పాడ్యమినాడు ఈ పుంసవన వ్రతం ఆరంభించు. సంవత్సరంలోగా యీ నియమాలకు భంగం రాకుండా చూసుకుంటే నీకు కుమారుడు కలుగుతాడు అన్నాడు.

ఈవార్త విన్న దేవేంద్రుడు వ్రతారంభం నాటినుండి ఆవిడకు రహస్యంగా అన్ని సేవలూ చేస్తూ వ్రతభంగం కోసం ఎదురుచూస్తున్నాడు.

అనుక్షణం నియమాలతో గడుపుతూన్న ఆవిడ ఒక సాయంకాలం అలసటతో అశుచిగా ఉండి కాళ్ళుకడగకుండా నిద్రించింది. ఆ అవకాశం చూసి దేవేంద్రుడు ఆమె గర్భంలో ప్రవేశించి లోపల పెరుగుతూన్న శిశువును ఏడు ముక్కలుచేశాడు. ఏడుముక్కలూ ఏడుగురు శిశువులుకాగా వారిని ఒక్కొక్కరిని ఏడు ముక్కలుగా నరికాడు. వారు నలభై తొమ్మండుగురై :

దేవేంద్రా! ఇంక ఆపు. మేము నీకు సోదరులం. మరుత్తులం అనవరతం నీ సేవలో వుంటాం. మమ్మల్ని హింసించకు, అన్నారు.

అనంతరం వారందరూ సూర్యసమప్రకాశంతో గర్భం వెలుపలకు వచ్చి దేవేంద్రుని సరసన నిలిచారు. అప్పుడు దితి లేచి దేవేంద్రుని వైపు చూడగా యింద్రుడు చేతులు జోడించి :

అమ్మా! నువ్వు వ్రతం ఆరంభించిన నాటినుంచీ నియమభంగం కోసం ఎదురు చూస్తూ సేవించి, అవకాశం దొరకగానే శిశువును చంపడానికి యత్నించాను. ఆ శిశువు యిందరు శిశువులుగా ఆవిర్భవించింది. నన్నుమన్నించు. కొడుకు చేసిన తప్పును తల్లి క్షమించకపోతే యింకెవరు రక్షిస్తారు, అని పాదాల వ్రాలగా ఆవిడ కరుణించింది.

అనంతరం ఇంద్రుడు మరుత్తులతో దేవలోకం చేరి వారందరికీ యజ్ఞాలలో హవిర్భాగం, సోమపానం లభించే అవకాశం కల్పించాడు.

మురవిదారణ ముఖ్యకారణ మూలతత్త్వవిచారణా!
దురితతారణ దుఃఖవారణ దుర్మదాసురమారణా!
గిరివిహారణ కీర్తిపూరణ కీర్తనీయ మహారణా!
ధరణిధారణ ధర్మతారణ తాపసస్తుతిపారణా!

# సప్తమస్కంధం

శ్రీ మద్విఖ్యాతి లతా క్రామిత రోదోంతరాళ
కమనీయ మహాజీమూత తులితదేహ
శ్యామలరుచిజాల! రామచంద్రనృపాలా!

రాజేంద్రా!

సూర్యుడు ఒక్కడే అయినా సర్వదేశాల ప్రజలకూ ఎలా గోచరిస్తున్నాడో అలానే నారాయణుడు సర్వాంతర్యామియైన ఏకైక రూపుడే ఆయన సత్వగుణంవల్ల దేవతలూ, ఋషులూ పుట్టారు. రజోగుణంవల్ల అసురబృందాలు ఆవిర్భవించాయి. తమోగుణం నుంచి యక్షులూ, రాక్షసులూ పుట్టారు.

సర్వాంతర్యామియైనా పరమాత్మను జ్ఞానులైనవారు తమ ఆత్మలోనే దర్శిస్తారు. ఆయనే కాలరూపుడై నిఖిల చరాచర జగత్తునూ నడుపుతాడు.

ఒకరహస్యం ఉంది.

శిశుపాలాదులు నారాయణ ద్వేషులయినా ఆయనలోనే ఎలా లీనమయ్యారని అడగ వచ్చు. వారి ద్వేషం అంతా వారి పరుషభాషవల్ల, నిందావాక్యాలవల్ల బైటపడుతుంది. ఈ దూషణ భూషణలన్నీ దేహానికే గాని పరమాత్మకు అంటవు.

శరీరంమీద అభిమానంవల్ల నేను, నాది అనే అహంకార మమకారాలవల్ల రాగద్వేషాలు పుడుతున్నాయి. ఆ అభిమానం విడిచిపెడితే యివేమీ బాధించవు. అదీకాక సర్వభూతాత్ముడైన ఆయనకు ఒకరియందు ద్వేషం, క్రోధం ఉండవు.

అలుకనైన చెలిమినైన
కామంబుననైన బాంధవముననైన
భీతినైన తలగి తలప నఖిలాత్ముడగు
"హరి" జేరవచ్చు వేరుసేయడతడు.

ఎరుగుదువు కదా—

కామించి గోపికలు, విపరీతమయిన భయంతో కంసుడు, వైరభావంతో శిశుపాలాదులు, బంధువులై యదు, వృష్ణి వంశాలవారు, ప్రేమతో మీవంటివారు, భక్తితో మేము ఆయన దర్శన భాగ్యం పొందుతున్నాము.

కామోత్కంఠత గోపికల్
భయమునన్ కంసుండు
వైరక్రియా సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్
సంబంధులై వృష్ణులుం
ప్రేమన్ మీరలు భక్తినేము ఇదే చక్రిం గంటి
మెట్లైన ఉద్దామధ్యాన గరిష్ఠుడైన
హరి చెందన్ వచ్చు ధాత్రీశ్వరా!

# మూడు జన్మలు

ఒకానొకప్పటిమాట

సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు శ్రీహరి దర్శనానికి వైకుంఠానికి వచ్చారు. వారెప్పుడూ అయిదేళ్ళ బాలకులవలెనే ఉంటారు కదా! ఆ సమయంలో నారాయణుడు లక్ష్మీదేవితో అంతఃపురంలో వున్నాడు. అందువల్ల ద్వారపాలకులు వీరిని లోపలకు పోనీయక బైటకు పొమ్మన్నారు.

అంతతో వారు కోపించి:

మీకిక్కడ నిలిచే అర్హతలేదు. భూలోకంలో రాక్షసులై పుట్టండి, అని శపించారు.

శాపభయంతో ద్వారపాలకులిద్దరూ వారిని శరణువేడారు. వారు కనికరించి మూడు జన్మలు రాక్షసులై పుట్టి శ్రీహరిని ద్వేషించి, అనంతరం యిక్కడకు రండి, అని వెళ్ళిపోయారు.

వారే దితిగర్భాన హిరణ్యాక్ష, హిరణ్యకశిపులై జన్మించారు. అనంతరం రావణ, కుంభకర్ణులు. తదుపరి శిశుపాల, దంతవక్త్రులు.

ఈ మూడు జన్మలలో వారు శ్రీహరిని ద్వేషిస్తూ నిరంతరం హరినామస్మరణతో గడిపి వైకుంఠం చేరారు.

హిరణ్యకశిపుడు తమ్మునికి కర్మచేసి, వాని కుమారులైన శకుని, శంబర, కాలనాభ, మదోత్కచులను, వారితల్లిని ఓదార్చి వెంటబెట్టుకుని తన తల్లి దితి దగ్గరకు వెళ్ళి:

అమ్మా! ఈ ప్రపంచం ఒక చలివేంద్రం. దాహంవున్న బాటసారులవలె జీవుడు దేహధారియై ఈ భూమండలానికి వస్తాడు మంచినీరు త్రాగి విశ్రాంతి తీసుకుని బాటసారులు చలివేంద్రం విడిచి వెడతారు. అంతేకాని అక్కడ నివాసం చెయ్యరు:

అదే రీతిగా జీవుడు కూడా నిష్క్రమిస్తాడు. అందుకోసం శోకించనవసరం లేదు.

పయిగా నీ కొడుకు మహావీరుడు. తన వీరత్వం ప్రదర్శించి జీవయాత్ర చాలించిన ఘనుడు.

మరొక రహస్యం ఉంది.

ఈశ్వరుడున్నాడే ఆయన సర్వవ్యాపకుడు. సత్యమూ, శాశ్వతమూ, అవ్యయమూ ఆరూపం. ఆయన తన మాయతో నిరంతరం సృష్టి సాగిస్తూంటాడు. అంతా ఆయన మాయయే. చెరువులో నీరుకదులుతూంటే ఆ గట్టునవున్న చెట్లనీడకూడా అందులో కదులుతున్నట్లే కనిపిస్తుంది.

మన కన్ను అదిరితే భూమి కూడా చలిస్తున్నట్లుంది. నిజానికి ఈ కదలికలేదు. అలానే ఈశ్వరునికీ చలనంలేదు. అజ్ఞానంలోపడి మానవుడు రాగద్వేషాలతో, సుఖదుఃఖాలతో కొట్టుమిట్టాడుతూ వుంటాడు.

ఈ సందర్భంలో ఒక యితిహాసం చెపుతున్నారు, పెద్దలు.

ఉశీనర దేశాన్ని సుయజ్ఞుడనే రాజు పాలించేవాడు. ఒక యుద్ధంలో ఆయన మరణించాడు.

ఆ మృతశరీరం మీదపడి ఆయన భార్యలందరూ గోలుగోలున విలపిస్తున్నారు.

సాయంకాలం అవుతున్నది.

ఆ సమయాన యమధర్మరాజు బ్రాహ్మణబాలుని వేషం ధరించి వచ్చి:

ఎంత ఆశ్చర్యంగా వుంది. పుట్టిన ప్రాణికి చావుతప్పదని తెలిసికూడా వీరందరూ శాశ్వతంగా ఈ భూమిమీదనే వుంటామన్న నమ్మకంతో చచ్చిన వారికోసం శోకిస్తున్నారు.

నడివీథిలో పడినా మన సొమ్మయితే మళ్ళీ మనకే దొరుకుతుంది. అలాకాక ఇనపపెట్టెలో పెట్టి మారుమూలగదిలో దాచినా మనది కాకపోతే మనకు దక్కదు.

పంచభూతాలతో దేహం ఏర్పడుతుంది. జీవుడు కర్మఫలం అయేవరకూ దేహంలో ఉండి, అనంతరం నిష్క్రమిస్తున్నాడు. పోయేది దేహమేకాని ప్రాణికాదు. ఈ రెండూ ఎప్పుడూ భిన్నంగానే వుంటాయి.

కట్టెలో నిప్పులా, శరీరంలో వాయువులా దేహమూదేహీ ఉంటాయి. అంతకు మించి ఏ సంబంధములేదు.

ఈ రహస్యం తెలియక మాయాజాలంలో పడి భార్య, బిడ్డలు, చుట్టాలు, స్నేహితులు అనే బంధాలు కల్పించుకుని అవే నిజమనుకుంటారు. కాని అదంతా ఈశ్వరలీల అని తెలిసినవారికి ఈ బాధలు ఉండవు.

వేటగాడు తన ఉచ్చులు, డిల్లు, అమ్ములు ఆదిగాగల సామగ్రితో అడవికి వేటకు వెళ్ళాడు.

ఎన్నెన్నో పక్షులను వేటాడి చిక్కంలో వేసుకుని, అప్పుడే ఎదురుపడిన అడవి పిచికల జంటలో ఆడదానిని కొట్టి బుట్టలో వేసుకున్నాడు.

అప్పుడు దాని జతపిట్ట:

ఎవరికీ ఏ కీడూ తలపెట్టకుండా, అడవులలో దొరికినది తింటూ జీవించే మాకు వియోగం దుఃఖం కల్పించిన బ్రహ్మను ఏమనాలి! పోనీ, యిలా విడదీయకుండా యిద్దరినీ ఒక్కమారే చంపేస్తే యీ బాధ వుండేదికాదు.

గూడులో వున్న పిల్లలకింకా రెక్కలురాలేదు. అనుక్షణం తమతల్లి ఆహారం తెచ్చి పెడుతుందని ఆశతో మెడనిక్కించి దిక్కులు చూస్తూంటాయి. వాటి గతి ఏం కావాలి! అని బాధపడుతూండగా దాన్నికూడా కిరాతుడు పడగొట్టాడు అంతే!

అలానే కాలం చెల్లిన మహారాజు కన్నుమూస్తే ఎందుకింత శోకం! ఎంత గుండెలు బాదుకు ఏడ్చినా మరణించినవారు తిరిగి రారుగదా అని పలుకుతూన్న ఆ బ్రాహ్మణ బాలుని మాటలు విని ఓదార్పుపొంది వారు మహారాజుకి ఉత్తరక్రియలు చేసి వెళ్ళారు.

అందుచేత అమ్మా! మీరు కూడా శోకం విడిచి యిదంతా ఈశ్వరలీల అని గ్రహించండి, అనగా వారందరూ కన్నులు తుడుచుకుని ఎవరి మందిరానికి వారు వెళ్ళారు.

అనంతరం హిరణ్యకశిపుడు మందర గిరిచేరి అక్కడ ఒక లోయలో నిలబడి రెండు చేతులూ పైకెత్తి, ఆకాశంలోకి చూపులు పోనిచ్చి తీవ్ర తపోదీక్ష వహించాడు

హిరణ్యకశిపుని తపస్సుయొక్క తీవ్రతకు, భూమికంపించింది. గ్రహ తారాగణాలు చలించాయి. సర్వప్రాణికోటికీ తాపం పుట్టింది.

ఆ బాధ భరించలేక దేవతలందరూ బ్రహ్మనుచేరి మొర పెట్టుకున్నారు.

వారిని ఆశ్వాసించి చతుర్ముఖుడు భృగు, దక్షప్రముఖులు వెంటరాగా హిరణ్య కశిపుని సమీపించాడు.

దీక్షలోవున్న ఆ దానవేశ్వరుని శరీరంలో రక్తమాంసాలేమీలేవు. ఉత్తి ఎముకల గూడు మాత్రం వుంది.

అది బ్రహ్మకు ఆశ్చర్యం కలిగించింది.

తన చేతిలోని కమండలువులో నుండి ఉదకం తీసి వానిదేహంమీద చిలకరించాడు.

అంతలో హిరణ్యకశిపుడు తపసుచాలించి, తనచుట్టూ వున్న పుట్ట చీల్చుకువచ్చాడు.

సాష్టాంగపడి పరి పరి విధాల ప్రార్థించి :

పరమేష్టి ! నాకు పగలుకాని, రాత్రికాని, భూమిమీద, సముద్రంలో, ఆకాశంలో, గాలిలో, ఎక్కడా చావులేని వరం కావాలి. దానితోపాటునాగ, యక్ష, గరుడ, గంధర్వ, కిన్నర, నర, సుర, ప్రాణికోటికాని, సింహశార్దూలాది మృగాలుకాని, నా చావుకి కారణం కారాదు, అనగా బ్రహ్మ అనుగ్రహించి అంతర్ధానం అయాడు.

వరగర్వంతో హిరణ్యకశిపుడు విష్ణువుమీద వైరం పెంచుకుని దేవ, గంధర్వగణాల మీదికి దాడిచేసి వారందరినీ పరాభూతులను చేశాడు. దేవేంద్రుని జయించి అమరావతిలో సింహాసనం అధివసించాడు.

ఆయన మధుమైరేయపానలోలుడై కూర్చుంటే గంధర్వులు గానంచెయ్యాలి, అప్స రసలు నాట్యమాడాలి. మునులు దీవించాలి. దేవతలు సేవకులై నిలబడాలి.

యజ్ఞాలు జరుగుతూంటే హవిర్భాగాలూ తానే గ్రహించేవాడు. ఆయన ఏలుబడిలో భూమి సస్యశ్యామలంగా వుండాలి, సకాలంలో వానలుకురవాలి. ఉద్యాన వనాలలో ఎల్లకాలమూ వసంతశోభలే.

రోజురోజుకీ పెరుగుతూన్న వాని దుశ్చర్యలను భరించలేక లోలోపలే దేవతలందరూ నారాయణ ధ్యానం చేసుకుంటూ, ఎప్పటికయినా తమకు ముక్తి లభిస్తుందా ! అని అంత రాంతరాలలో ఆ శ్రీమన్నారాయణుని వేడుకుంటున్నారు.

అప్పుడు హరి తనను వేడుకున్న వారందరినీ ఓదార్చి:

భయపడకండి మీకష్టాలు తీరే రోజువస్తుంది. కాలం ఆసన్నంకాగానే ఆ దానవుని రిస్తాను.

శుద్ధ సాధులందు సురలందు శ్రుతులందు
గోవులందు విప్రకోటియందు
ధర్మపదవి యందు తగిలి నాయందు
వాడెన్నడలుగు నాడె హింసనొందు.

బ్రహ్మ వరాలివ్వడం వల్ల వీడింత మదించి యథేచ్ఛగా సాగుతున్నాడు. ఏనాడు తనకొడుకైన ప్రహ్లాదుని కష్టాలు పెడుతాడో ఆనాడే వీనిని సంహరిస్తాను. అంతవరకూ ఓరిమి వహించండి, అన్నాడు.

వారందరూ శ్రీహరికి ప్రణామాలు అర్పించారు.

## ప్రహ్లాదుడు

పరీక్షిన్నరేంద్రా!

హిరణ్యకశిపునికి నలుగురు కుమారులు.

వారిలో ప్రహ్లాదుడు పరమభక్తాగ్రేసరుడు.

భూతదయ వానికి చిన్ననాడే అలవడింది.

పరస్త్రీలెవరుకంటబడినా కన్నతల్లిలా భావించి నమస్కరించేవాడు.

పెద్దలుకనబడితే వినయంగా తలవంచి నమస్కరించేవాడు.

కష్టాలలో వున్నవారిని తల్లిలా ఆదరించేవాడు.

గురువులను దైవంగా భావించి పూజించేవాడు.

స్నేహితులను సోదరభావంతో చూసేవాడు.

చక్కనిరూపం, విద్యాగంధం, కావలసినంత సంపద వున్నాయి. దానికితోడు రాచ యినా ఈషణ్మాత్రం గర్వంలేదు.

ఏది కావాలంటే అది చేతికి అందుతుంది, కాని యింద్రియాలను నిగ్రహించి దూరంచేశాడు.

వయస్సు, బలంవున్నాయి – కాని కామక్రోధాలు పట్టనివ్వడు.
నిరంతరం హరినామస్మరణమేతప్ప మరొక దృష్టిలేదు.

గుణనిధియగు ప్రహ్లాదుని
గుణము లనేకములు కలవు
గురుకాలమునన్ గణుతింప నశక్యంబులు.
ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్.

దేవేంద్రుడు సైతం ప్రహ్లాదుని గుణగణాలను కీర్తించేవాడంటే ఆబాలుడు ఎంత సద్గుణ సంపన్నుడో తెలుసుకోగలవు. పరిహాసానికికూడా అబద్ధమాడని సత్యవ్రపరాయణుడు.

హరినామస్మరణతో సర్వాన్నీ మరచిన సమయంలో ఆ శ్రీహరి తనప్రక్కనే ఉన్నట్లు అనిపించి దగ్గరవున్న స్నేహితులను మరిచేవాడు.

మహావిష్ణువు తనముందు ఆడుతున్నట్లు అనిపిస్తే చెలికాండ్రతో ఆడుతూ ఆడుత అలా నిలబడిపోయేవాడు.

లక్ష్మీనాధుడు తనతో మాట్లాడుతున్నట్లనిపించి ఎదుటివారి ప్రశ్నలకు జవాబిచ్చేవాడుకాదు.

నారాయణుడు తనగుండెలో వున్నట్లు భావించి యిరుగు పొరుగులను మరిచేవాడ
శ్రీహరి నామామృత పానమత్తుడై అలానిశ్చలంగా ఉండేవాడు.

పానీయంబులు ద్రావుచున్ కుడుచుచున్
భాషించుచున్ హాసలీలా నిద్రాదులు
సేయుచుం తిరుగుచున్ లక్షించుచున్
సంతత శ్రీనారాయణ పాదపద్మ యుగళీ
చింతామృతాస్వాద సంధానుండై మరచెన్
సురారిసుతుడే తద్విశ్వమున్ భూవరా!

తనకు పరమవిరోధియైన శ్రీహరిమీద అంతభక్తితో ఉండే కుమారుని మనః మార్చడానికి తగిన విద్య బోధింపజేయాలని భావించి, ఒకనాడు కొడుకును రావించి :

నాయనా! విద్యవల్లజ్ఞానం వస్తుంది. చదువురానివాడు అజ్ఞానంలో ఉంటాడు. మంచిచెడ్డల వివేకం యిచ్చే విద్య నువ్వు గురువులవద్ద చదవాలి :

చదువని వాడజ్ఞుండగు
చదివిన సద సద్వివేక చతురత కలుగున్
చదువగ వలయును జనులకు
చదివించెద ఆర్యులొద్ద చదువుము తండ్రీ!

అని తమ కులగురువైన శుక్రాచార్యుల వారి కుమారులు చండామార్కులను రావించి :

ఆర్యా! ఈ పసివాడికి నా శక్తిసామర్థ్యాలు తెలియడం లేదు. మరీ అజ్ఞానంలో ఉన్నాడు. మీరు మా గురువులు. మా శ్రేయస్సు కాంక్షించే మీకంటే మాకు ఆప్తబంధువులూ స్నేహితులూ ఎవరున్నారు!

అందుచేత ఈ బాలుని మీ దగ్గర ఉంచి చక్కని నీతి శాస్త్రం బోధించండి, అని అప్పగించాడు.

విద్యాభ్యాసం సాగుతున్నది.

గురువులు చెప్పిన దానిని యథాతథం చదివి వినిపిస్తున్నాడు. ఏనాడూ వారితో వాద ప్రతివాదాలకు దిగలేదు. ఎందుకంటె యిదంతా అనవసరం. హరి చరణారవిందమే శరణ్యం అని త్రికరణశుద్ధిగా నమ్మినవానికి యీ తర్కాలన్నీ వృథా అని ఎరిగినవాడు కదా!

కొన్ని రోజులయాక హిరణ్యకశిపుడు కుమారుని విద్యాగంధం ఎలా వున్నదీ చూడాలని పిలిపించి అడిగాడు.

నాయనా!

తనయుల సంభాషణలు జనకులకు కర్ణభూషణాలు, సంతోష కారణాలు, దుఃఖ శోషణాలు. కనక యింతవరకూ నువ్వు చదివిన వేద, శాస్త్ర, నీతి విషయాలలో ఏది నీకు బాగా మనసుకు పట్టిందో వివరించు అన్నాడు.

ప్రహ్లాదుడు : తండ్రీ! ఈ దేహధారులందరూ తమ యిల్లు అనే చీకటి కూపంలో పడి, స్వపరభేదాన్ని వీడలేక, మతి చలించి తిరుగుతున్నారే తప్ప, సర్వమూ విష్ణుమయం

అని భావించి హాయిగా ప్రశాంతమైన వనంలో నివసించడం మేలు అని తెలుసు కోలేక పోతున్నారు.

హిరణ్యకశిపుడు ఫకాలున నవ్వి, ప్రహ్లాదుని దగ్గరగా తీసుకుని :

నాయనా! సాధారణంగా లోకంలో పసిపిల్లలు ఎదుటవారు ఏది చెపితే అది విని పిస్తారు చిలకలా. నీకీ బోధలెవరు చేశారు? మనకు విష్ణువు పరమ విరోధి. ఆ నామ స్మరణం మన కనవసరం.

దేవతలను హింసించడం, దేవేంద్రుని పాదాక్రాంతుని చేయడం, మునులను క్లేశాల పాలుచేయడం, అలానే శ్రీహరిని ఆరాధించే వారందరినీ బాధించవలసిన నువ్వు హరీ, గిరీ అంటూ చెడిపోకు. అది మన వంశానికే కళంకం, అని మందలించాడు.

ప్రహ్లాదుడు తన గురువు వైపు తిరిగి :

గురుదేవా! ఈ ప్రపంచంలో కొందరు అవివేకులు విష్ణుమూర్తి శక్తి తెలియక మోహ ములో పడి యిది నాది, వారు పరాయివారు అనే భేదభావంతో కొట్టుమిట్టాడుతుంటారు. బ్రహ్మాదులు తప్ప ఆ పురుషోత్తముని దర్శించగలవారు లేరు.

ఇనుము అయస్కాంతం దగ్గరకు చేరేటట్లు నా మనస్సు శ్రీమన్నారాయణుని వైపే నడుస్తున్నది. అందులో నా ప్రమేయం లేదు.

మరొక్కమాట—

మందార మకరంద మాధుర్యమున తేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికల తూగు
రాయంచ చనునె తరంగిణులకు
లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు
కోకిల చేరునే కుటజములకు
పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరకం
బరుగునే సాంద్ర నీహారములకు

అంబు జోదర దివ్య పాదారవింద
చింతనామృతపాన విశేషమత్త
చిత్తమేరీతి నితరంబు చేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేయునేల.

అంటూండగా చండామార్కులు క్రోధంతో :

ఔరా! నిండా అయిదేళ్ళు దాటని బాలుడవు. మేం చెప్పిన శాస్త్ర విషయాలలో ఒక్కటికూడా చెప్పకుండా ఏమేమో చెపుతున్నావు. ఏవిటీ అన్యాయం.

నిజానికి వీడు దానవేశ్వరునికి కుమారుడు కాడు. పరమ శత్రువు. దానవ చందన వనంలో పుట్టిన ముళ్ళ చెట్టు వీడు.

రాక్షస వంశ నాశనంచేసే నారాయణుని స్మరించే ఈ బాలునికి హిత వచనాలతో బుద్ధి మార్చలేము. తగిన విధంగా దండించి దారికి తేవాలి, అని హిరణ్యకశిపుని వైపు తిరిగి :

మహారాజా! మన్నించండి. ఇకమీద వీనిని దండించి తల తిరిగేటట్లు చేసి రాజ నీతి బోధిస్తాం. అంతవరకూ అనుగ్రహించండి, అని ప్రహ్లాదుని వెంటబెట్టుకుని వెళ్ళారు.

కొంతకాలం రాజనీతి ఉపదేశించి, సామ, దాన, భేద, దండోపాయాలు పూర్తిగా బాలునికి అవగతం అయాయని విశ్వసించి, వాని తల్లి దగ్గరకు తీసుకువెళ్ళి, చక్కగా అలంకరింపించి బుజ్జగిస్తూ :

నాయనా! నీకు మేము ఏ విషయాలు బోధించామో అవే మీ నాన్నగారి దగ్గర వినిపించు. అక్కడ మళ్ళీ విష్ణుకథలు పాడి మా పరువు గంగపాలు చేయకు, అని నెమ్మదిగా కొలువుకూటానికి తీసుకువచ్చారు.

సభకు వస్తున్న ప్రహ్లాదుడు అనుక్షణం శ్రీహరి స్మరణతో సర్వం మరిచిపోతున్నాడు. సాక్షాత్తూ హరిభక్తి యీ బాలుడుగా అవతరించిందా అన్నట్లున్నాడు. మనస్సులో శ్రీహరి రూపం, అంతటా హరి విశ్వరూపం చూస్తున్నాడు.

అటువంటి వానిని తండ్రి దగ్గరకు తీసుకువచ్చి, పాదాభివాదం చేయించి, తమ కర్తవ్యాన్ని అప్రమత్తంగా నిర్వర్తించామని చండామార్కులు చెప్పగా, హిరణ్యకశిపుడు కొడుకును దగ్గరగా తీసి, కౌగలించి, తొడమీద కూర్చుండబెట్టి, బుగ్గలు ముద్దాడి, శిరసుమీద దువ్వుతూ, ఆనందంతో :

నాయనా! ఇంతకాలం మీ గురువులు నీకు ఏ ఏ నీతిశాస్త్ర విషయాలు బోధించా అందులో విశేషం ఏమిటో చెప్పు. నువ్వు రాజనీతి కోవిదుడవై ఏనాడు నాకు సంతో కలిగిస్తావా, అని ఎదురుచూస్తున్నాను. ఒక్కసారి నీ విజ్ఞానం అంతా నాకు వినిపిం అన్నాడు.

ప్రహ్లాదుడు :

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబుల్
నే చదివినవి కలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!

త్రికరణాలతో హరిని స్నేహితునిగా భావించి హరిసేవా దృష్టి పెంచుకుని, ఆ నామస్మరణంతో, వందనంచేస్తూ, అర్చించి, దాసులమై, ఆత్మజ్ఞానంతో, సంకీర్తనం చింతనతో సర్వాత్ముడైన హరిని నమ్మడమే సజ్జనులకు శ్రేయస్కరమయిన మార్గం.

హరిభక్తిలేని వారికివన్నీ ఎలా ఉంటా యంటే,

గ్రుడ్డివానికి వెన్నెలవలె, చెవిటివానిముందు శంఖనాదంలా, మూగవానికి సద్గ్ర బోధలా, నపుంసకునికి సుందరాంగితో పొత్తులా, కృతఘ్నులతో బంధుత్వంలా, బూడి హవిర్భాగంలా, లోభిదగ్గర ధనంలా, పంది ముందు సుగంధంలా ఉంటాయి.

కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని చూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరి తవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి
దేవ దేవుని చింతించు దినము దినము
చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు
కుంభినీధవు చెప్పెడు గురుడు గురుడు
తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి!

దానవేంద్రా!

హరిసేవకు నోచుకోని శరీరం వున్నదే అది గాలి నింపిన తోలుతిత్తి.

విష్ణు సంకీర్తనం ఎరుగని నోరు ఢం ఢం ధ్వని చేసే ఢక్క.

హరిని పూజించని హస్తాలు కర్రతో చేసిన గరిటెలు.

కమలాపతిని చూడని కన్నులు శరీరమనే గోడకు కొట్టిన కన్నాలు.

శ్రీపతిని గురించి యోచించని జన్మ గాలిబుడగ.

విష్ణుభక్తి ఎరుగని విద్వాంసు డున్నాడే వాడు ద్విపాద పశువు.

ఆ విధంగా ప్రహ్లాదుడు భక్తి పారవశ్యంతో మాట్లాడుతుంటే హిరణ్యకశిపుని ఆగ్రహం పెరుగుతున్నది. కన్నులు ఎర్రబడుతున్నాయి.

విష్ణు గాథా సంకీర్తనంలో వున్న ప్రహ్లాదునికి అవేమీ కనిపించడంలేదు. అంతా పరమేశ్వరరూపమే గోచరిస్తున్నది. తన అనుభూతితో మాట్లాడుతూనే ఉన్నాడు.

నాన్నా! శ్రీహరికి దాస్యం చేయడం అనే మారుతం కదలకుండా సంసారమనే కారుమేఘాలు చెల్లా చెదరుకావు.

సంసార తాపత్రయమనే దావాగ్ని చల్లారాలీ అంటే విష్ణుసేవామృత వర్షం కురియాలి.

మనం చేసే పాపసముద్రాలు ఇంకిపోవాలంటే శ్రీహరి అనుగ్రహమనే బడబాగ్ని రావాలి.

అనుకోకుండా వచ్చిపడే ఆపదల అంధకారాలు వైదొలగాలనుకుంటే లక్ష్మీపతి స్తోత్రమనే సూర్యకిరణాలు రావాలి.

నిష్కళంకమూ, పునరావృత్తి రహితమూ అయినముక్తినిధిని కనుక్కోవాలంటే ఆ శార్ఙ్గపాణి స్మరణమనే అంజనం కావాలి. అంతకన్న దారిలేదు, అని తన్మయుడై చెపుతున్నాడు.

తన తొడమీద కూర్చుని నిర్భయంగా ఆబాలుడు పలికే ప్రతిపలుకూ ఒకములుకులా గ్రుచ్చుకుంది హిరణ్యకశిపునికి.

ఎర్రబడిన కన్నులనుండి విస్ఫులింగాలు వెలువడుతున్నాయి. పళ్ళుపటపటలాడాయి, బుగ్గలుపొంగుతున్నాయి, పెదవి కొరుకుతున్నాడు, కొరుకుతూ, హిరణ్యకశిపుడు

గురునందనా! నాబిడ్డను నీతిశాస్త్ర కోవిదుని చేస్తామని తీసుకువెళ్ళి మీరునేర్పిన విద్యలా యివి! వేదవిదులయిన విప్రవంశీయులని నమ్మినందుకు మంచి ప్రాయశ్చిత్తం చేశారు, అని హుంకరించగా:

అప్పుడు చండామార్కులు:

దానవేశ్వరా! మన్నించండి. ఈతప్పు మాదికాదు. మేముకాని, మాఆశ్రమంలో మరెవరుకాని ఇటువంటివి బోధించలేదు. ఇది యీ బాలునికి జన్మతః ప్రాప్తించింది, కనక దీనికి ప్రతిక్రియ యోచించండి, అన్నారు.

హిరణ్యకశిపుడు: బాలకా! నువ్వు నాకొడుకువై పుట్టి మనవంశాన్ని ద్వేషించే ఆ శ్రీహరిని ఎందుకు ధ్యానిస్తున్నావు? మనగురువులుకూడా నీకిది బోధించలేదే!

ప్రహ్లాదుడు: తండ్రీ! గృహస్థులై సంసారవిషయంలో పడి జన్మలెత్తుతూ, మరణిస్తూ ఆచక్రభ్రమణంనుండి బైటపడలేక గిలగిలలాడే వారికి యిటువంటి విషయాలు ఒకరు చెపితే తెలుస్తాయా! వారికి స్వతహా ఈ బుద్ధి రానేరాదు.

గ్రుడ్డివాని వెంటబడి పోయేగ్రుడ్డివానికి ఏం కనిపిస్తుంది. అలానే కర్మబద్ధులై నడిచే వారికి విష్ణుస్వరూపం గోచరించదు. నిరంతరం ఆ నారాయణుని చరణకమలాలు కొలిచే వారికి ఆపాదవరాగం సోకి సర్వకర్మలూ నశిస్తాయి.

మహారాజా! సర్వశాస్త్రాలూ శోధించగా తేలిన విషయం ఒకటే.

ఆలుబిడ్డలనే మహా మకర మత్స్యాలతో నిండిన ఈసంసార సాగరం దాటాలంటే మాధవుని అనుగ్రహమనే నావకావాలి. మరోమార్గంలేదు.

అంటూండగానే రాక్షసేశ్వరుడు తనరెండు చేతులతో ప్రహ్లాదుని క్రిందికిపడద్రోసి, తన అనుచరులను చూస్తూ:

చూశారుకదా వీడిపద్ధతి. తనపినతండ్రిని చంపిన శ్రీహరిని కీర్తిస్తూ ఎంత తన్మయుడవుతున్నాడో. వీడు పుత్రరూపంలో నన్నుపట్టిన మహావ్యాధి. వీడి తలనరికిరండి.

శరీరంలో ఏ అవయవమయినా చెడితే దాన్ని ఖండించి మిగిలిన అవయవాలకు రక్షచేస్తాడు వైద్యుడు. అలావే యీ కులద్రోహిని సంహరించి మిగిలిన వారికి మేలు చెయ్యాలి, అని ఆజ్ఞాపించాడు.

క్రూరరాక్షసులు ప్రహ్లాదుని మండుటెండలో నిలబెట్టి వాడి శూలాలతో పొడిచారు. ఎంతపొడిచినా ఆ హరిభక్తుని శరీరం కందలేదు, రక్తపుచుక్కకారలేదు. కన్నుచెదరలేదు. చర్మం చిరగలేదు, ఏమాత్రం బాధలేదు వానికి, వారుఅలాపొడుస్తూంటే :

ఓ శేషశాయీ ! దైత్యమర్దన ! జగదీశ ! ఆపన్న శరణ్య ! నిఖిల పావనమూర్తీ ! అని ప్రార్థిస్తున్నాడు.

శ్రీహరినే మనసులో నిలిపి నిలబడ్డాడు.
మదగజం చేత త్రొక్కించారు.
విషంక్రక్కే వాడికోరల కోడిత్రాచులచేత కరిపించారు.
ఆకాశాన్నంటే మంటల గుండాలలో త్రోయించారు.
పోటుమీదవున్న సముద్రంలో ముంచేశారు.
విషంపెట్టారు. ఎత్తైన కొండలమీదనుండి దొర్లించారు.
మండుటెండలలో నిలబెట్టారు.
కుండపోత వానలో వదిలేశారు.
మంచుగుట్టలమీద పడుకోబెట్టారు.
ఝంఝూ మారుతానికి ఎదురునడిపించారు.
గోయిత్రవ్వి పాతిపెట్టారు.
అన్నఆహారాలు లేకుండా చేశారు.
గదలతో కొరడాలతో హింసించారు.
ఇన్ని చేసినా హరిభక్తితో వున్నప్రహ్లాదుని శరీరం ఏ మాత్రం వాడలేదు.
అది హిరణ్యకశిపునికి మరింత బాధ కలిగించింది.

వీడికి జీవనౌషధాలు తెలియవు. రక్షించేవారు లేరు. ఎన్ని చేసినా అమ్మా ! అని అరవడు. ముఖకాంతి తగ్గదు. శరీరంలో ఏ రోగములేదు. ఇటువంటి ప్రాణిని సంహరించడం ఎలా !

వీడిలో ఏదో దివ్యశక్తి ఉంది. అది నా పాలిట మృత్యుదేవతకావచ్చు, అని ఆలోచించాడు. ఆక్షణంలో విచారం ఆవహించింది.

అది గ్రహించి చండా మార్కులు : దానవేశ్వరా !

నీ కనుబొమలు బిగిస్తే దిక్పాలకులు తలలువంచారు. నీ ప్రతాపానికి సర్వ లోకాలూ దాసోహం అన్నాయి. అటువంటి నీకు వీడెంత.

చిన్నపిల్లలు అజ్ఞానంలో దారి తప్పినడిస్తే వృద్ధులయిన గురువులవద్ద చక్కని శిక్షణ పొంది సరయిన దారికి వస్తారు. గురువులు శుక్రాచార్యుల వారు వచ్చేవరకూ వేచి ఉందాం. ఆయన ఈ బాలునికి తగిన రీతిని నీతి శాస్త్రం బోధిస్తారు, అనగా హిరణ్య కశిపుడు అంగీకరించాడు.

ప్రహ్లాదుడు మళ్ళీ చండామార్కులు వారి ఆశ్రమానికి వచ్చాడు. ఆయన ధర్మార్థ కామాలు బోధిస్తున్నాడు. ఇవన్నీ రాగద్వేషాలు కల గృహస్థులకు కాని తనకు కాదని తన ధ్యానం తాను సాగిస్తూనే వారి పాఠాలు వారికి అప్పగించే వాడు.

ఒకనాడు తన తోడి బాలకులందరినీ కూర్చోబెట్టి ప్రహ్లాదుడు.

మిత్రులారా! మన వయసు వారెందలో మరణించడం మీరు చూస్తున్నారు. మన గురువుగారు ఎందుకూ కొరగాని విషయాలు బోధిస్తూ అదేపరమార్థంగా చెపుతున్నారు. ఇవన్నీ విడిచి మనందరికీ అవశ్యమైన విషయాలు చెపుతాను, వినండి.

ఈ ప్రపంచంలో ఎన్నో లక్షల ప్రాణులున్నాయి. అన్నిటిలో 'ధర్మకార్యాచరణ యోగ్యమయినది మానవజన్మ. అందులో పురుషుడై పుట్టడం మరీ అదృష్టం. అయితే మన ఆయుర్దాయం నూరేళ్ళు. అందులోసగం నిద్ర అనే అంధకారంలో పోతుంది. మిగిలిన యాభైలో ఇరవై ఏళ్ళు బాల్య, కిశోరావస్థలలో గడుస్తుంది. ఇంక మనకు మిగిలింది ముప్పది వత్సరాలు.

ఈ మూడు దశాబ్దాలలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు బంధించి ఎన్నెన్నో వాంఛలలో ముంచి అవి తీరడం కోసం కొందరు సేవకులవుతున్నారు. మరికొందరు దొంగతనం చేస్తున్నారు. ఈ రెండూ చెయ్యని వారు వ్యాపారంచేసి ధనం సంపాదిస్తున్నారు. ఈ సంపదల కోసం ప్రాణాలయినా వదలడానికి సిద్ధపడతారు.

అందుకోసం తమ ధీరత్వాన్ని హరించే సంసారంలో పడి, భార్యావ్యామోహంలో చిక్కుకుంటారు. తియ్య తియ్యని పలుకులతో పిల్లలతో గడుపుతారు. శీలము, వయస్సు, సౌందర్యముకల కుమార్తెలను కంటారు. వినయ వివేక విద్యాసంపన్నులయిన కుమారుల కోసం తాపత్రయపడతారు. చెప్పిన పనులు చేసే సోదరుల కోసం ఆరాటపడతారు.

అనురాగ మమకారాలు కల తల్లిదండ్రుల కోసం తాపత్రయపడతారు. ధన, కనక, వస్తు, వాహనాలు, పశువులు, సేవకులు, తండ్రి, తాతలు సంపాదించిన సొమ్ములు వీటన్నిటినీ వదులుకోలేక, సంసారంనుంచి బైటపడలేక, ఈ చుట్టుముట్టిన దారాలతో సాలె గూడులో చిక్కిన ఈగలా గిజ గిజ కొట్టుకుంటూ ఉంటారు.

అందుచేత ఈకౌమార వయస్సులో బహుజాగరూకులమై ఉండాలి. మనం ఆశించ కుండానే దుఃఖాలు మీదపడినట్లే, సుఖాలువస్తాయి. అందుచేత సుఖసంతోషాల కోసం తాపత్రయం అనవసరం.

సర్వానికీ శ్రీహరి ఉన్నాడని నమ్మి ఆయన నామం స్మరిస్తూ సంకీర్తన చెయ్యాలి. అలానారాయణ చరణసేవ చేస్తే మోక్షం పొందగలం.

చూస్తున్నారు కదా మన పెద్దలందరినీ, ఈ సంసార విషవలయంలో పడి ఎలా అవస్థలు పడుతున్నారో! ఈ జననమరణ చక్రం నుండి బయటపడాలంటే చక్రధారి చరణ సేవయే పరమోత్కృష్టపథం. మహామహులు కూడా తరించలేని భవజలధిని తరించ డానికి నారాయణ స్మరణమే మార్గం.

ఈ విషయాలన్నీ నేను నారద మహర్షి వల్లవిన్నాను.

* * * *

చాలాకాలం క్రితం మాట —

అప్పుడి దానవేశ్వరుడు తపోదీక్షలో వున్నాడు.

ఆ అవకాశం చూసుకుని దేవేంద్రుడు తన సేనలతో వచ్చి రాక్షసులను పరాజితులను చేసి, మా అమ్మను చెరపట్టి తీసుకువెడుతున్నాడు. దారిలో నారదమహర్షి కనిపించి :

దేవేంద్రా! ఏమిటీపని. నీకు వైరం హిరణ్యకశిపునితో కాని యీ అబలతో కాదే. పైగా యీ యిల్లాలు గర్భవతి. కనక విడిచిపెట్టు, అన్నాడు.

వినిన దేవేంద్రుడు : అమరమునీంద్రా! గర్భవతి కనకనే బంధించాను. ఈమె గర్భంలో వున్న శిశువును ప్రసవసమయంలో సంహరించి యీమెను విడిచిపెడతాను. ఈ శిశువు హిరణ్యకశిపుని కొడుకుగదా. ఆ పీడవదులుతుంది; అన్నాడు.

నారదమహర్షి నవ్వి : దేవాధీశా! ఆగర్భంలో వున్న బాలుడు రాక్షసేశ్వర నందనుడే అయినా వాడు హరిభక్తుడు. జన్మాంతరవాసనా బలంతో భక్తితోనే ప్రభవిస్తాడు. వానిని ఏ ఆయుధాలూ కడతేర్చవు. కనక విడిచిపెట్టు, అనగా దేవేంద్రుడు మాఅమ్మను వదలివెళ్ళాడు.

నారదులవారు మా అమ్మను తమ ఆశ్రమానికి తీసుకువెళ్ళి ఓదార్చి, రోజూ ఆధ్యాత్మిక విషయాలు బోధించేవారు. ఆవిడ నిద్రపోతూంటే నేను వింటూండే వాడిని. అవి ఎన్నడూ మరవరానివి.

ఈ ఆత్మ వున్నదే యిది నిత్యము, శుద్ధము, నాశనరహితం. అది ఏపనీచేయదు. స్వయం ప్రకాశంకలది. దేనితోనూ సంబంధంలేనిది. పరిపూర్ణమయినది. అందుచేత తద్భిన్నమయిన ఈ దేహం మీద మమకారం పెంచుకోకూడదు.

బంగారు గనులనుండి రాళ్ళుతీసి పుటంపెట్టి, ఆ అగ్నితో కరిగించి స్వర్ణకారుడు బంగారం తీస్తాడు. అలానే ఆత్మను ఆశ్రయించిన దేహాన్ని కరిగించి బ్రహ్మభావన పొందాలి.

ఈ సంసారం అంతా ఒక కల. ఇందులో నిద్ర, మేలుకొలుపు అనేవి అంతకన్న మాయ. ఈ అజ్ఞానాంధకారాన్ని జ్ఞానజ్యోతితో పారద్రోలాలి.

భగవత్సాన్నిధ్యం పొందాలంటే దానికి మార్గాలున్నాయి.

గురుశుశ్రూష, సర్వస్వం త్యాగంచేయడం, సజ్జనులతో సహవాసం, ఈశ్వర ప్రతిమ ముందు కూర్చుని ఆరాధించడం, శ్రీహరి గాథలు వింటూండడం, ఆయన యందే అనురాగం ఆయన గుణాలను, ఆయన చేసే పనులను కీర్తించడం, నారాయణ పదపద్మముల యందే ధ్యానం, యివి భక్తులకు అవశ్యాచరణీయాలు. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు విడిచి, యింద్రియాలను జయించి, భక్తితో నడుచుకుంటే ఆయనను చేరగలం.

భక్తి పారవశ్యంతో వైకుంఠవాసా! జనార్దనా! గోవిందా! వాసుదేవా! నారాయణా అని ధ్యానం చేస్తే సర్వంమరచి పోగలం. భక్తితోనే ఆయన అనుగ్రహం లభిస్తుంది.

చిక్కడు వ్రతముల క్రతువుల
చిక్కడు దానముల శౌచశీలతపములం
చిక్కడు యుక్తిని - భక్తిని చిక్కనక్రియ
అచ్యుతుండు సిద్ధము సుండీ!

అందుచేత మన మందరం స్వేచ్ఛగా హరినామ సంకీర్తనంతో దివ్యపదం పొందుదాం, అని రహస్య ప్రదేశంలో వారి చేత నామ సంకీర్తనం చేయిస్తూ, విష్ణుకథలు చెపుతూ అందరినీ భక్తిమార్గానికి తరలిస్తున్నాడు.

కొన్నిరోజుల కది తెలిసిన చండామార్కులు విషయాలన్నీ హిరణ్యకశిపునికి నివేదించాడు.

ఆ మాటలు విని తోక త్రొక్కిన త్రాచులాలేచి, కన్నులనిప్పులు క్రక్కుతూ, గాలి పూపుతూ మండుతున్నదావాగ్నిలా, తీవ్రక్రోధంతో ప్రహ్లాదుని, హిరణ్యకశిపుడు

ఓరి ఢింభకా!

నేను ఆజ్ఞాపిస్తే తప్ప సూర్యుడు వేడికిరణాలు వెదజల్లడు. వాయువుసైతం మనకి భయపడి చల్లగా కదులుతూంటాడు. మన అనుగ్రహంతో అగ్నిహోత్రుడు వెలుగుతున్నాడు. నామాటకాదని యముడుసైతం ఎవరిప్రాణం హరించలేడు.

మనముందు తలవంచి నిలబడాలి దేవేంద్రుడు. గరుడ, గంధర్వ, కిన్నర, కిం పురుష, సిద్ధ, సాధ్య, యక్ష, రాక్షసగణాలన్నీ గజగజలాడుతూ పాదాలవ్రాలాలి. అటువంటి నాముందు నువ్వు ఎంత నిర్భయంగా నిలబడుతున్నావురా!

దిక్పాలకులుసైతం నామాటకు ఎదురు చెప్పరే!

వాడెవడో వైకుంఠుడు సర్వశక్తి సంపన్నుడంటున్నావే. దేవగణాలన్నిటినీ నేను చీకాకు పరిచినా కదిలిరాడేం!

కులగురువుల బోధలన్నీ కాదని దానవబాలురందరికీ హరినామసంకీర్తనం చెప్పి ఎంత ద్రోహం చేస్తున్నావు.

ఏకైక వీరుడిగావెళ్ళి, చతుర్దశ భువనాలూ జయించిన నన్ను ఎదిరించే ధైర్యం నీకెక్కడిది. ఎవడురానీకు దిక్కు! ఎవడిబలం చూసుకుని యింత అక్రమానికి దిగావు, అని గంభీర గర్జతో అడిగాడు.

ప్రహ్లాదుడు నవ్వుతూ!

దానవేశ్వరా!

బలయుతులకు దుర్బలులకు
బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మా
దులకున్ బలమెవ్వడు ప్రాణులకును
బలమెవ్వండట్టి విభుడు బల మసురేంద్రా!

ఏ రక్షణాలేని వారికెవడు రక్షకుడో, దిక్కులేనివారికి దిక్కెవరో, బలవంతు బలహీనులకూ, బ్రహ్మాదులకూ ఎవడుబలమో ఆయినే నాకు దిక్కు, ఆయనే నాకు

తండ్రీ! అసలు శత్రువు లెవరయ్యా! నీమనస్సే నీకు పరమశత్రువు, దాన్ని జయించు. తామస ప్రధానమయిన రాక్షసభావం విడిచిపెట్టు.

లోకాలన్నీ నిమేషాలలో జయించావు కాని యింద్రియాలను వశవరుచుకో లేకపో నీలోవున్న అరిషడ్వర్గాలే నీకు శత్రువులు. ముందు ఆ అంతశ్శత్రువులను ఛే అప్పుడింక శత్రువనే వాడుండడు.

వివేకంతో కర్మబంధాలు విదలించుకొని నంసారవలయం నుంచి బయ పురుషోత్తముని యందు భక్తిని నిలుపుకో, అన్నాడు.

హిరణ్యకశిపుడు మరింత రోషంతో:

ఓరిమూర్ఖుడా! చంపితే చంపు అని నిలబడే మొండివాడిలా ఏవిటి బోధలు. భువన భవనంలో నన్ను మించినవాడు లేడు.

నా తమ్ముని చంపిన నారాయణుడెవ్వడో, వాడెక్కడుంటాడో చెప్పు. కాలూ వెదకినా వాడు కనబడలేదు. ఇదిగో యిప్పుడే నా కరవాలంతో నీ శిరను ఖండి వాడెవడున్నాడో నీకుదిక్కు రమ్మను అన్నాడు.

ప్రహ్లాదుడు మందహాసవదనుడై, శ్రీహరిని మనసాధ్యానించి:

రాక్షసేశ్వరా! ఆయన ఎక్కడున్నారని అడుగుతున్నావా! సర్వాంత అయిన పరమేశ్వరుడు లేనిచోటు లేదే!

కలడంభోధి, కలండుగాలి, కలడాకాశంబునన్ కుంభినిం
కలడగ్నిన్ దిశలం పగళ్ళనిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
కలడోంకారమునన్ త్రిమూర్తుల త్రిలింగవ్యక్తులందంతటం
కలడీశుండు కలండు తండ్రీ వెదకంగా నేల ఈయాయెడన్.

ఇందుగలడందులేడని
సందేహమువలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి జూచిన
అందందేకలడు దానవాగ్రణివింటే!

సర్వేసర్వత్రా ఆయన ఉన్నాడయ్యా, అని చెపుతూంటే, హిరణ్యకశిపుడు రోష తామ్రాక్షుడై.

ఢింభకా! అంతటా వున్నాడంటున్నావే, అయితే ఈ సభామండపంలోని రాతి స్తంభంలో వున్నాడా, అని హుంకరించాడు.

ప్రహ్లాదుడు: తండ్రీ! చతుర్ముఖ ప్రజాపతినుండి, కాలిక్రింది గడ్డిపరక వరకూ నిండివున్న శ్రీహరి యీ స్తంభంలో వున్నాడా అని అడగడం దేనికి, చూడు కనిపిస్తాడు.

అంభోజాసనుడాదిగాగ తృణపర్యంతంబు
విశ్వాత్ముడై సంభావంబుననుండు, ప్రోడ!
విపులస్తంభంబునందుండడే!
స్తంభాంతర్గతుడయ్యు నుండుటకు
ఏ సందేహమున్లేదు
నిర్దంభత్వంబున నేడు గానబడు
ప్రత్యక్ష స్వరూపంబునన్.

అనడంతో హిరణ్యకశిపుడు వజ్రసదృశమైన అరచేతితో ఆ స్తంభంమీద గట్టిగా కొట్టాడు. అంతే!

నరసింహాకృతితో శ్రీహరి ఆవిర్భవించి, గర్జించి, జూలువిదలించి, దృష్టిసారించి బొమముడిబిగించి, నాలుక గిర్రున ఆడించి, ఒక్కదూకులో హిరణ్యకశిపుని పట్టి వాడిగోళ్ళతో గరుడుడు త్రాచును చీల్చినట్లు చీల్చి, ప్రేవులులాగిమెడలో వేసుకుని, భయంకరాకారంతో సింహాసనం ఎక్కి, కూర్చున్నాడు ఉగ్రనరసింహమూర్తి.

అలా ప్రచండ జ్వాలామాలాగ్ని సదృశనేత్రాలతోవున్న నృశింహమూర్తిని సమీపించ డానికి ఎవరికీ ధైర్యం చాలడంలేదు. నిఖిలదేవ, గంధర్వ, సిద్ధ, సాధ్యగణాలూ ఆ నర కంఠీరవ రూపాన్ని దర్శించడానికి వచ్చి ఆశ్చర్యంతో చేతులుజోడించగా. పరమేశ్వరుడు, ప్రజాపతి, ఇంద్రాది సర్వదేవ సంఘాధిపతులూ నృసింహుని స్తుతించారు.

అప్పుడుకూడా ఉగ్రరూపంలో వున్న ఆయన దగ్గరకు లక్ష్మీదేవిని పంపించా
ఆవిడ కొంచం దూరంగా నిలబడి వచ్చి :

ఇంతవరకూ నేనెన్నడూ యింతటి మహోగ్రరూపాన్ని చూడలేదు.

ఆయన కొంచం శాంతించాక వెడతాను అంది.

ఆ తీవ్రతను తగ్గించగలవాడు పరమభక్తాగ్రేసరుడైన ప్రహ్లాదుడొక్కడే అని ని యించారు.

ప్రహ్లాదుడు చిరునవ్వుతో నెమ్మదిగా అడుగులు వేస్తూవెళ్ళి ఆ నరసింహమూ పాదాలమీద అంజలి బంధం పట్టగా, ఆ తీవ్రక్రోధం చల్లారి, ప్రహ్లాదుని వైపు కరుణాద దృష్టులు నడిచాయి.

ప్రహ్లాదుడు సంతోషంతో అనేక ప్రార్థనలు చేయగా శ్రీహరి వానిని అనుగ్రహిం కర్మబంధాలు సడలగానే వైకుంఠం పొందగలవు అని అదృశ్యమయాడు.

పరమభక్తాగ్రేసరుడైన ప్రహ్లాదుని చరిత్ర వినినా, చదివినా నారాయణుని అ గ్రహం లభిస్తుంది.

# ధర్మమార్గం

రాజేంద్రా! ఏ ప్రాణినీ హింసించకుండా దొరికిన దానితో తృప్తిపడుతూ నిరంతర నారాయణుని స్మరించే వారిని ఎవరూ ఏమీచెయ్యలేరు. సర్వమూ ఆయన కరుణ అనుకునే వారికి ఏబాధాలేదు.

అన్నిబాధలకూ హేతువైన మనస్సును నిగ్రహించాలి. సర్వబంధాలూ విడిచి సన్యాసియై ఏ అలజడులూలేని ప్రశాంతప్రదేశంలో పద్మాసనంవేసి, వెన్నెముక వంగకుండ తలపైకెత్తి నాసాగ్రాన దృష్టినిలిపి ఓంకారం జపిస్తూ: రేచక, పూరక, కుంభకాలతో ప్రాణ పానాలను నియమించిన వాని మనస్సుప్రశాంతంగా ఉంటుంది, అప్పుడది బ్రహ్మానుభూ పొందుతుంది.

ఈ శరీరం రథం. బుద్ధి సారధి. ఇంద్రియాలు గుర్రాలు మనసు పగ్గ ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధన

జయ, అనే పదివాయువులూ ఇరుసు. ధర్మాధర్మాలు చక్రాలు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలే, సంచారప్రదేశాలు. జీవుడే రథికుడు. ప్రణవమంత్రమే ధనుస్సు, శుద్ధజీవుడు బాణం. దీని లక్ష్యం బ్రహ్మానుభూతి. రాగద్వేషాలే వీని శత్రువులు.

అందుచేత యీ శరీర రథాన్ని తన అదుపులో ఉంచుకుని భాగవతుల పాదపద్మ సేవ అనే ఖడ్గంతో నారాయణుని అనుగ్రహబలంతో రాగద్వేషాది శత్రువులను నిర్మూలించి, శుద్ధజీవశరాన్ని ప్రణవమనే ధనుస్సుకు సంధించి బ్రహ్మపదంచేరాలి.

అలాకానినాడు ఇంద్రియాలనే గుర్రాలు బుద్ధి అనే సారధిని తమకు అనుకూలంగా త్రిప్పి విషయసుఖాలనే శత్రువుల మధ్యవిడిచి పెడతాయి అంతతో సంసారకూపంలో పడతాడు.

అందువల్ల వాటికి అతీతంగా శ్రీమన్నారాయణనామ సంకీర్తనం సాగిస్తూజన్మ చరితార్థం చేసుకోవాలి.

# అష్టమస్కంధం

ఏ కథలయందు పుణ్యశ్లోకుడు
హరి సెప్పబడును సూరిజనముచే
ఆ కథలు పుణ్యకథలని
ఆకర్ణింపుదురు పెద్ద లతిహర్షమునన్

శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు భాగవత పురాణం వినిపిస్తూ:

రాజేంద్రా! స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ మనువుల అనంతరం తామస మను వయాడు.

ఈ మనువుకాలంలోనే శ్రీహరి దయాంతరంగుడై మొసలిబాధనుండి గజరా రక్షించాడు.

అరణ్యాలలో తిరిగే మత్తేభానికీ, నీటిలోనుండి వెలికిరాని మకరానికీ పోరాటం జరిగిందని సందేహిస్తావు. ఆకథ వివరిస్తాను విను.

# గజేంద్రమోక్షం

పాలసముద్రంలో త్రికూటం అనే అతి విశాలమయిన పర్వతం ఉంది. దానికి రాలు మూడు. ఒకటి బంగారుకాంతితో, ఒకటి ఇనుముతో, మూడవది రజతకాంతి అలరారుతున్నాయి.

ఆ కొండచివరల వివిధరత్నాలు, ధాతువులు ఎంతో శోభతో కనిపిస్తాయి.

సెలయేళ్ళ చప్పుళ్ళతో, సువాసన లీనే పూలునిండిన లతలతో, మహావృక్షాల అలరారే ఆ శిఖరాలమీద గగనచారు లయిన కిన్నరులు విహరిస్తుంటారు.

ఆ శిఖరంమీది వృక్షాలు ఎప్పుడూ పల్లవాలతో, మొగ్గలతో, పూలతో, పండ్ల వసంతశోభను సాక్షాత్కరింపజేస్తాయి.

ఆ కొండమీది అడవులలో అడవిదున్నలు, ఖడ్గమృగాలు, ఎలుగుబంట్లు, ఆటి గల క్రూరమృగాలతోపాటు ఎన్నోవేల ఏనుగులుకూడా ఉన్నాయి.

ఆఏనుగులు గుంపులుగా బయలుదేరి నడుస్తూంటే అంధకారదేవత నడయాడుతున్నట్టు ఉంటుంది.

అవి కదలి వస్తూంటే వాటి చుట్టుప్రక్కల మరే మృగమూ ఉండడానికి వీలులేదు. అలా అవి గుంపులు గుంపులుగా బయలుదేరి ఆహారం గ్రహించి, జలపానార్థం బయలు దేరాయి.

వెడుతూ వెడుతూండగా ఒక గుంపు చీలిపోయింది. అందులోని ఆడు ఏనుగులన్నీ గజరాజు వెంట సాగి, సాగి ఒకచక్కని సరోవరం చూశాయి. దానినిండా కలువలు, తామరలు అలరారుతున్నాయి.

అతి విశాలహ్రదం కావడంవల్ల అందులో ఎన్నెన్నో జలచరాలతో మొసళ్ళుకూడా వున్నాయి.

అలసివున్న ఏనుగులగుంపు సంతోషంతో సరోవరంలోదిగి హాయిగా జలక్రీడలు సాగించాయి.

తొండంబుల పూరించుచు
గండంబుల జల్లుకొనుచు గళ గళ రవముల్
మెండుకొన వలుదకడుపులు నిండన్
వేదండకోటి శీతలంబు ద్రావెన్.

వేడుకతో ఆ గజేంద్రుడు తొండంనిండా నీరు పీల్చి, ఆకాశవీధికి చిమ్ముతూంటే ఆవేగానికి పైకిలేచిన కర్కాటక, మీనాలు రోదసిలోని మీన, కర్కాటాలను పట్టినట్టున్నాయి.

ఆ క్రీడ సాగుతున్నవేళ,

ఒక్కసారిగా సరోవరమధ్యంలో తరంగాలు లేచాయి.

భయంకరారావంతో తోకచప్పుడు చేయగా సుడిగుండా లేర్పడ్డాయి. ఆ కల్లోలానికి గట్టునవున్న చెట్లు ఊగిసలాడాయి. అంత ఆర్భాటంతో ఒకపెద్దమొసలి వచ్చి గజేంద్రుని కాలుపట్టింది.

పట్టువిడిపించుకొని, తొండంతో ఏనుగు దెబ్బతీయగా మొసలి ఒడుపుతో వచ్చి ముందుకాళ్ళు పట్టింది. అంతతో ఏనుగు తనదంతాలతో దానిని కుమ్మివిడిచిపెట్టగా, అది వెనుకపాటున లేచి ఏనుగు తోకను చీల్చింది.

అలా అవి ఒకదానినొకటి పీడిస్తూ సరోవరం అంతా కలయదిరుగుతున్నాయి.

కరి దిగుచు మకరి సరసికి
కరి దరికిని మకరి దిగుచు
కర కరి బెరయన్ కరికి మకరి
మకరికి కరి భరమనగా
అతల కుతల భటు లదరిపడన్

ఆ పోరాటాన్ని చూస్తూ నిలబడ్డాయి ఆడ యేనుగులు.

నీరు నివాసస్థానమయిన మకరానికి బలం పెరుగుతున్నది. ఏనుగు నీరసిస్తు

సంసారవలయంలో వ్యామోహవర్తంలోపడి కొట్టుకునే జీవునివలే, ఆ మ
పోరలేక దీనావస్థలో పడింది, ఏనుగు.

ఇంక దీన్ని గెలవడం తన తరంకాదని నిశ్చయించుకుంది. ఈ విపత్తు
తనను రక్షించే దైవ మెవరా అని యోచించి, యోచించి:

ఎవ్వనిచే జనించు జగ మెవ్వని లోపలనుండు లీనమై
ఎవ్వని యందు డిందు పరమేశ్వరు డెవ్వడు,
మూలకారణం బెవ్వ డనాది మధ్య లయు డెవ్వడు
సర్వము తాన యైన వా డెవ్వడు
వాని నాత్మభవు ఈశ్వరునే శరణంబు వేడెదన్.

లోకంబులు లోకేశులు
లోకస్థులు తెగిన తుది అలోకంబగు
పెం జీ క టి క వ్వ ల
ఎవ్వం డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్

అని పరిపరివిధాల ప్రార్థించి:

లా వొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యె
ప్రాణంబులున్ ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె
తనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్

నీవేతప్ప నితఃపరం బెరుగ మన్నింపందగున్
దీనునిన్ రావే ఈశ్వర కావవే వరద!
సంరక్షింపు భద్రాత్మకా!

అని దీనంగా అర్థించగా

అల వైకుంఠపురంబులో నగరిలో
ఆ మూల సౌధంబు దాపల
మందారవనాంతరామృత సరః
ప్రాంతేందుకాంతోపలోత్పల పర్యంక
రమావినోదియగు ఆపన్నప్రసన్నుండు
విహ్వాల నాగేంద్రము పాహి పాహి యన
కుయ్యాలించి సంరంభియై.

సర్వశక్తులూ ఉడిగి, అన్ని ప్రయత్నాలూ విరమించి నిఖిలలోక రక్షకుడైన నారాయణుని ప్రార్థించే సమయాన. ఆ జగద్రక్షకుడు వైకుంఠంలో అంతఃపురంలోని కేళీమందిర సమీపంలో మందారవనమధ్యంలోని సరోవరతటాన చంద్రకాంత శిలావేదిపై హంసతూలికా తల్పంమీద లక్ష్మీదేవితో సరససల్లాపా లాడుతున్నవాడు ఆదుతున్నట్లే బయలుదేరాడు.

ఎలా బయలుదేరాడు!

సిరికిం జెప్పడు శంఖ చక్రయుగమున్
చేదోయి సంధింపడు
ఏ పరివారంబును జీరడు
అభ్రగపతిన్ బన్నింపడు
ఆకర్ణికాంతర ధమ్మిల్లము చక్కనొత్తడు
వివాద ప్రోత్థిత శ్రీకుచోపరిచేలాంచలమైన
వీడడు, గజప్రాణావనోత్సాహియై

లక్ష్మీదేవికి చెప్పలేదు.
శంఖ చక్రాలు ధరించలేదు.
పరివారాన్ని పిలవలేదు.

గరుత్మంతునికూడ ఆహ్వానించలేదు.

చెవులమీద చిందర వందరగా పడుతూన్న వినీల కేశాలు సవరించలేదు.

అలకలో వున్న లక్ష్మీదేవిని అనునయించడానికి పట్టుకున్న పైటచెంగు కూడా వదలకుండా బయలుదేరాడు.

ఇంకేముంది–

ఆయన వెనువెంట లక్ష్మీదేవి.

ఆవిడతో అంతఃపుర పరివారం.

వెనకనే గరుత్మంతుడు; శంఖ చక్ర గదా శార్ఙ్గాలు. నారదుడు, విష్వక్సేనుడు వారితోపాటు నగరంలోని ఆబాలగోపాలం బయలుదేరారు.

అలా వెడుతున్న లక్ష్మీదేవి మనస్సు పరిపరి విధాల ఊహాలు సాగించింది.

దుష్ట దుశ్శాసనుల కబంధహస్తాలలో చిక్కుకొని ఏ యిల్లా లయినా మొర పెట్టుకున్నదేమో-

మళ్ళీ మూర్ఖు డెవడయినా వేదాలు దొంగిలించాడేమో-

క్రూర రాక్షసులు అమరావతి మీద దాడికి వచ్చారో–

మహాభక్తులను హింసించి ఏడిరా నీ హరి అని దండించే రాక్షసుడు మళ్ళీ బయలుదేరాడేమో–

అనుకుంటూ ఆయన వెంట సాగుతూ:

అడిగెదనని కడువడి జను
అడిగిన తను మగుడ నుడువడని
నడయుడుగున్ - వెడవెడ చిడిముడి
తడబడ అడుగిడు అడుగిడదు
జడిమ నడుగిడు నెడలన్

అలా గగనవీధిని సాగే నారాయణుని చూచి దేవగణాలన్నీ చేతులు జోడించి 'న మో నా రా య ణా!' అంటూ ప్రార్థించాయి.

వీ రెవరినీ చూడకుండా, వారి పలుకులు వినకుండా ఆయన హుటాహుటి గజేంద్ర రక్షాదీక్షితుడై సరోవరప్రాంతం చేరి విస్ఫులింగాలు జిమ్మే సుదర్శన చక్రం ప్రయోగించిన మరుక్షణంలో అది సూర్యకాంతితో వెళ్ళి మొసలితలను ఖండించింది.

గజేంద్రుడు ఒక్కసారి ఊపిరిపీల్చి కొలను వెలువడి ఒడ్డుకువచ్చి తన కరిణీ బృంద మధ్యంలో నిలబడ్డాడు.

శ్రీహరి పాంచజన్యం పూరించాడు. అది దుష్ట శక్తులకు హృదయ విదారకమై సజ్జనులను ఉల్లాస తరంగిత హృదయులను చేసింది.

అనంతరం నారాయణుడు తన కరస్పర్శతో గజేంద్రుని అనుగ్రహించాడు.

పరీక్షిన్మహారాజా !

దేవలుని శాపంవల్ల మకరజన్మ యెత్తిన హూ హూ అనే గంధర్వుడు శ్రీహరి కరుణతో శాపవిముక్తుడై గంధర్వరూపంతో వెళ్ళిపోయాడు.

ఇంద్రద్యుమ్నుడనే రాజు అగస్త్యమహర్షిని ఉదాసీనంగా చూసిన కారణంగా ఏనుగు జన్మయెత్తి ఈ విధంగా శాపవిముక్తుడై వైకుంఠం చేరాడు.

అప్పుడు నారాయణుడు నవ్వుతూ లక్ష్మీదేవిని చూసి.

నీ పైటచెంగుకూడా వీడకుండా వచ్చేటప్పుడు ఏమనుకున్నావు నువ్వు; బాలా! నిరంతరం నన్ను స్మరించే వారిని నేను మరువనని ఎరుంగుదువు కదా, అనగా :

స్వామీ! దీనుల మొరలువిని వారిని రక్షించే నీ వెంట రావడంకంటె యింకేమీ నాకు అవసరంలేదు, అంది శ్రీదేవి.

గజరాజ మోక్షణమును నిజముగ పఠియించునట్టి
నియతాత్ములకున్ గజరాజ వరదు డిచ్చును
గజతురగ స్యందనములు కైవల్యంబున్

తామస మన్వంతరంలో గాథ అది.

అనంతరం యీయన తమ్ముడు రైవతుడు మను వయాడు. తరువాయి చాక్షుషమనువు పాలించాడు.

ఈ మనువుకాలంలో క్షీరసాగరమథనవేళ శ్రీహరి కూర్మావతారం ధరించాడు. ఆ వృత్తాంతం విను.

# కూర్మావతారం

అలనాడు—

క్రూర రాక్షసపీడ పడలేక దేవతలందరూ పరమశివుని, ప్రజాపతినీ ముందుం
మహావిష్ణువును ప్రార్థించి తమక్లేశాలు తొలగించుమని వేడగా:

కాలం మారి మనకు బలం చేకూరేవరకూ శత్రువులతో స్నేహంగా ఉండి సవ
వచ్చినప్పుడు ప్రతీకారం తలపెట్టాలి. రోజులు సరిగా లేకపోతే పాముకూడా ఎ
భయపడుతుంది.

వారూ మీరూ కలిసి పాలసముద్రంలో సర్వ ఓషధులూవేసి, మందరగిరి కవ్వ
వాసుకి త్రాడుగా మథంచాలి. అందువల్ల మీకు అమృతఫలం సిద్ధిస్తుంది.
క్లేశాలు మిగులుతాయి. మథనవేళ హాలాహలం పుడుతుంది. అయినా భయం
వెళ్ళిరండి, అన్నాడు నారాయణుడు.

దేవతలందరూ సంతోషహృదయంతో వెళ్ళి అసురేశ్వరుడయిన బలిని సేవిస్తూ
గడుపుతున్నారు. అయినా కొందరు రాక్షసులుద్వేషంతో దేవతాసంహారానికి ప్రయ
చగా బలి వారిని శాంతింప జేశాడు.

అలా ప్రశాంతంగా కొంతకాలం గడిచాక, దేవేంద్రుడొకనాడు వారందరికీ
సాగరమథనంవల్ల అమృతం లభిస్తుందనీ అందుకు ఉభయపక్షాలు కృషిచెయ్యాలనీఅనా

అందరూ ఉత్సాహంతో బయలుదేరి, మందరగిరిని త్రవ్వి మోసుకు రాబోగా
మహాభారమై దానిక్రిందపడి కొందరు అవయవహీనులుకాగా కొందరు ప్రాణాలే వదిలారు.

అది గ్రహించి నారాయణుడు గరుడారూఢుడైవచ్చి, ఆ మహామందరగిరిన
బంతిలా చేతపుచ్చుకొని తెచ్చి క్షీరసాగరంలో వదిలాడు.

అప్పుడందరూ వాసుకిని ప్రార్థించి, ఆయనకు కూడా అమృతంలో భాగమిస్తా
త్రాడుగా చేసి మథనం ఆరంభించారు.

ఆరంభించే వేళ దేవత లందరూ పడగవైపు నడవగా రాక్షసులు కోపంతో:
మేం తోక పట్టే నీచులం కాదు, మీరే తోకదగ్గరకు రండి, అన్నారు.

దేవతలు అంగీకరించారు.

మథన సాగుతూండగా వానుకి :

ఓ మహావీరులారా! ఈ మందరగిరికి క్రింద నిలిచే స్థానం లేక దిగిపోతోంది. నన్ను వదలండి; అనగా వారందరూ గిరిని ఎత్తడానికి విశ్వప్రయత్నం చేశారు.

వారి శ్రమచూసి నారాయణుడు విశాలదేహంతో కూర్మరూపం ధరించి గిరిక్రింద భాగాన కుదురుగా నిలిపాడు.

అంతతో వారందరూ ఒకరి కొకరు ఉత్సాహం కలిగిస్తూ మళ్ళీ మథనం ప్రారంభించారు.

గిర గిర గిర తిరుగుతోంది మందరగిరి, అటూ, ఇటూ. ఆ ధ్వనికి దేవ దానవ వీరులు ఉత్సాహధ్వానాలు తోడై బ్రహ్మాండం బ్రద్దలయే భీతి పుడుతోంది.

ఎడమ కుడి మునుపు తిరుగుచు
కుడి ఎడమను వెనుక దిరుగు
కు ల గి రి క ద లి న్
కద లెడల సురలు అసురలు
తాడి తాడి ఫణి ఫణము
మొదలు తుదియును దిగువన్—

అలా ఆ గిరీంద్రం కవ్వంలా తిరుగుతూంటే, సముద్రంలోని జీవరాశి అంతా చెల్లా చెదరై నశించి పోతున్నది. ఆ ఊపులో లేచే ఉత్తుంగ తరంగాలలో కొన్ని జలజంతువులు ఆకాశాని కెగురుతున్నాయి.

అంతలో సాగరమధ్యంనుండి హాలాహలజ్వాలలు రేగగా దేవ దానవులు భయ భ్రాంతులై వానుకిని విడిచి దూరతీరాలకు పోయారు.

రేగిన హాలాహల జ్వాలామాలలు బ్రహ్మాండ మంతనూ భస్మం చేయబోగా అందరూ హాహారవాలతో పరమశివుని ప్రార్థించారు.

నీకంటె ఒండెరుంగము
నీ కంటెం వరులు గావవేరరు జగముల్
నీకంటె ఒడయ డెవ్వడు
లోకంబుల కెల్ల నిఖిల లోకస్తుత్యా

అని దీనాలాపాలు చేస్తుంటే, ఆమహాశివుడు పార్వతీదేవినిచూసి :

ఇందరి ప్రాణరక్షణ నా చేతులలో ఉంది. శరణన్నవారిని రక్షించడ కర్తవ్యం, ఇప్పుడీ హాలాహలాన్ని తియ్యని పండులా ఆరగిస్తాను, అనగా ఆ చిరునవ్వుతో అంగీకరించింది :

మ్రింగెడు వాడు విభుండని
మ్రింగెడిది గరళ మనియును
మేలని ప్రజకున్ మ్రింగ మనె
సర్వమంగళ! మంగళ సూత్రంబు
నెంత మదిన మ్మినదో!

అంతే! ఆయన ఆ హాలాహలాన్ని చిన్న నేరేడు పండులా మ్రింగేశాడు.

తన ఉదరం సర్వభువనాలకూ నిలయం కనక లోపలకు పోనివ్వకుండా కంఠం దాన్ని బంధించాడు. అదికారణంగా ఆయన కాలకంఠుడు, గరళగ్రీవుడు అనే నామాలతో ఆరాధ్యుడయ్యాడు.

దేవ దానవులు సంతోషంతో మళ్ళీ మథనం సాగించారు.

అప్పుడు కామధేనువు పుట్టింది.

మరికొంతసాగాక ఉచ్చైశ్శ్రవం ప్రభవించింది.

ఐరావతం, కల్పవృక్షం, అప్సరసలు, శశాంకుడు; అనంతరం లక్ష్మి ఆవిర్భవించింది.

ఐశ్వర్యదేవతామూర్తి శ్రీదేవి ఆవిర్భవించడంతో అందరూ ఆవిడకు సర్వభూషణాలు లాంఛనాలూ సమర్పించారు. మంగళస్నానం చేయించారు.

సముద్రుడు పట్టుబట్ట లివ్వగా వరుణుడు వైజయంతీమాల అర్పించాడు. విశ్వకర్మ సువర్ణాలంకారా లందించగా, సరస్వతీదేవి తారహారం అలంకరించింది. ప్రజాప పద్మం యిచ్చాడు. నాగజాతివారు కర్ణాభరణా లిచ్చారు. వేదాలు స్తోత్రం చేశాయి.

అఖిలలోక మోహనంగా వున్న శ్రీదేవిని దేవ దానవులు బొమ్మలయి చూస్తూం మహావిష్ణువు చిద్విలాసంతో తిలకిస్తున్నాడు.

ఆ కుమారీ రత్నం తనచుట్టూచేరిన సిద్ధ, సాధ్య, యక్ష, రాక్షస, గరుడ, గంధర్వ ప్రముఖు లందరినీ చూసి :

వీరిలో ఎవరిని వరించినా శాశ్వత సుఖ భోగాలుండవు. ఒకరికి ఆయుర్దాయం తక్కువ, మరొకరికి బహుభార్య లుంటారు, యింకొకరికి హృదయంలో దయ ఉండదు. వీరందరిలో ఏవో కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి, అని మహావిష్ణువును తిలకించి :

ఈయనను వరిస్తే నిత్యసుమంగళినై, సవతుల పోరు లేకుండా, చల్లగా, వైభవాలతో, మెత్తనిహృదయం కలిగి, సాధురక్షణ శీలుడై, అరిషడ్వర్గాలకు అతీతుడైన భర్తను పొందిన దాని నవుతాను, అనుకుంటూ వెళ్ళి ఆయన మెడలో పూలమాల వేసింది.

మనసులోని కోరికతో తలయెత్తి చూసింది.

సిగ్గు ముసరగా తల వంచుకుంది.

మరికొంతసేపు తల యెత్తిందో, దింపిందో తెలియకుండా ఉంది.

ఆనమయాన సముద్రుడు కౌస్తుభమణిని తెచ్చి అల్లునికి కానుకగాయిచ్చాడు.

మణితో కన్యామణినికూడా వక్షస్థలం మీద విరాజిల్ల జేశాడు మహావిష్ణువు.

లక్ష్మీ పరిణయం అయాక, దేవ దానవులు తిరిగి మధనం ఆరంభించారు.

అప్పుడు వారుణి పుట్టింది.

అది తమకు కావా లన్నారు దానవులు. అంగీకరించారు దేవతలు.

అనంతరం నీలిమేఘకాంతితో నవయౌవనంతో మణికుండల భూషితుడై నారాయణాంశతో అమృతకలశహస్తుడై ధన్వంతరి ఆవిర్భవించాడు.

అమృతకలశం చూస్తూనే అసురులు హుటాహుటి పోయి అది అందుకున్నారు.

అందుకున్న బృందంకంటె దుర్బలు లయినవారు :

ఇది చాలా అన్యాయం. దేవతలకు కూడా యిందులో భాగం ఉంది, అని అరుస్తున్నారు.

అలా ఉండగా వారిలో బలిష్ఠుడయినవాడు ఆ కలశాన్ని సంగ్రహించగా, ఎంతకన్న బలిష్ఠుడు దాన్ని లాక్కున్నాడు. అలా చేతులు మారుతున్నది కలశం.

ఇటు దేవతలు దీనవదనులై మహావిష్ణువును ప్రార్థించగా ఆయన చిరునవ్వుతో ఆశ్వాసించి, అంతలో జగన్మోహినీరూపం ధరించి, అమృతకలశం పట్టుకుని వెళ్ళే అసురులవైపు అడుగులు వేశాడు.

మిల మిలలాడే కన్నులతో ఓరచూపులు

కలస్వనంతో పెదవులు కదిలిస్తూ చిరునవ్వులు

ఉత్తుంగ వక్షోజాలపై పైటజార్చి సిగ్గుగా సరిజేసుకుంటూ

హంసగమనంతో అందరినీ అలరిస్తూ నడుస్తూ వస్తూంటే అందరూ ఆ దివ్యమోహన రూపాన్ని చూస్తూ నిలబడిపోయారు.

ఎవరికివారికి ఆమె తననే చూస్తున్న దనిపించింది. అందరూ ఆమె చుట్టూచేరి కన్ను లప్పగించి :

ఓయువతీ! మేమందరం అప్ప చెల్లెళ్ళ బిడ్డలం. ఇందరం కలిసి అమృతం సాధించాం. అది నీ చేత పెడతాం. మాకందరికీ సమంగా పంచిపెట్టు, అన్నారు.

ఓ మహావీరులారా!

అందగాడు కంటబడితే వాని వెంటబడిపోయే ఆడదానిని నేను. నామీద అంత నమ్మకంఉంటే మీ మాటనేనెందుకు కాదనాలి, అంటూ తేనెచినుకుల పలుకులతో, ఒయారంగా అమృతకలశం అందుకుంది.

అందరూ స్నాన సంధ్యాదులు ముగించివచ్చి, తూర్పుముఖంగా దర్భాసనాలమీద కూర్చున్నారు.

అప్పుడా జగన్మోహిని దేవతలనూ, రాక్షసులనూ రెండు పంక్తులలో కూర్చోబెట్టి, తొందరపడకుండా, అసురులను కరుణామృతకటాక్షవర్షంతో, శృంగార చేష్టలతో, వావి వరుసలు కలిపి పలుకుల తేనెతో తృప్తిపరుస్తూ, దేవతలకు త్వరత్వరగా అమృతం అందిస్తున్నది. ఏం మాట్లాడితే ఆ యువతికి ఎంత కోపం వస్తుందో అని అసురులు ఆనందంగా ఆ దివ్యమోహనరూపాన్ని చూపులతో జుర్రుకుంటున్నారు.

దేవతలపంక్తిలో, సూర్య చంద్రులమధ్య రహస్యంగా చేరిన రాహువు దగ్గరకు జగన్మోహిని వచ్చేసరికి వీ రిద్దరూ సంజ్ఞతో రాహువు రాక్షసుడన్న సూచన చేయగా, క్షణ కాలంలో సుదర్శనంతో రాహువు శిరస్సు గగనానికి చేరింది. అది అసురులకు తెలియనేలేదు.

అంతలో అమృతం పూర్తి అయింది. అమరులయారు దేవతలు.

అంతే!

జగన్మోహిని లేదు.

మహావిష్ణువు మందహాసంతో చూస్తున్నాడు.

రాజేంద్రా!

హరిభక్తులకు తప్ప అమృతం లభించదు. ఎంతటి బలసంపన్నులయినా ఆయన కరుణలేనివారు అసురులవలె శ్రమపడతారే తప్ప ఫలం పొందలేరు, అని శుకయోగీంద్రుడు :

అనంతరం మహావిష్ణువు లక్ష్మీసమేతుడై గరుడవాహనారూఢుడై వైకుంఠం చేరాడు.

దానవగణాలన్నీ తమకు జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా దేవతలతో యుద్ధానికి బయలుదేరాయి.

ఉభయులమధ్య ఘోరమైన పోరు సాగుతోంది. అత్యంత బలంకల అసురుల ధాటికి తాళలేక దేవతలు శ్రీమన్నారాయణుని ప్రార్థించగా ఆయన గరుడారూఢుడై వచ్చి దేవతలపై కరుణార్ద్రదృష్టులు ప్రసరించగా వారందరూ దివ్యబలంతో రాక్షససంహారానికి ఉపక్రమించారు.

వారి విజృంభణంతో దానవసేన పరాజితమై పలాయనమంత్రం పఠించింది- ఇదీ క్షీరసాగర మథన వృత్తాంతం, అన్నాడు.

ఆ యుద్ధంలో మరణించిన అసురులందరినీ మృతసంజీవనితో పునర్జీవితులను చేశాడు. శుక్రాచార్యులవారు.

లోకమర్యాద తెలిగినవాడు కనక దానవేశ్వరుడు బలి తన పరాజయానికి చింతించకుండా నిష్క్రమించాడు.

## విష్ణులీల

కాలచక్రం తిరుగుతున్నది.

ఒకనాడు పార్వతీ సహితుడై పరమశివుడు వైకుంఠంచేరి మహావిష్ణువును పూజించి, ప్రార్థనలతో :

లోకేశ్వరా! పురుషరూపంతో చేసే నీ క్రీడలన్నీ చూశాం. నీ గాథలు విన్నాం. కాని క్షీరసాగరంవద్ద అమృతకలశంతో మోహినీరూపం ధరించావట. ఆ రూపం చూడాలని వేడుకగా ఉంది, అని అర్థించగా, చిరునవ్వుతో అంగీకరించి, అదృశ్యుడయాడు.

శ్రీమన్నారాయణుడు ఇంతలో ఏమయ్యాడా! అని ఆశ్చర్యంతో పరమశివుడు నలువంకలా వెదకుతూ పూలతోటలో ప్రవేశించాడు.

ఆ తోటలో సువాసనలీవే పూలునిండిన లతలు అల్లుకున్న ఒక చెట్టు కొమ్మ నానుకొని జారిపోతున్న పలచని పైటచెరగుతో గాలికి కదిలే ముంగురులతో అందంగావున్న ఫాలభాగంతో కర్ణభూషణకాంతితో శోభిల్లే బుగ్గలతో మిల మిల లాడే తారలవంటి కన్నులతో జారే చీర సరిజేసుకుంటూండగా గల గల లాడుతూన్న బంగారుగాజులతో కందుకక్రీడ సాగించే, నవయౌవనాంగిని చూశాడు, శివుడు.

చూసిన క్షణంలో మహేశ్వరుని మనసు వశం తప్పింది. ఆయనను కికురించే ఊహతో ఆ యువతి తన చేతిలోని బంతితో గుండె లదుముకొని, చెక్కులద్దుకుని బుగ్గల మీద దువ్వుకుంటూ, కొనగోటితో బంతిని దువ్వుతూ, మళ్ళీ బంతితో ఆట మొదలుపెట్టి నవ్వుతూన్న కనులతో ఓరచూపులు విసురుతూ పరుగులు పెడుతూ మధ్యలో పూలతీగెలమీద ఊయ్యాలలూగుతూ, సంపెంగల వాసనలు గ్రోలుతూ, వనంలోని చంద్ర శిలా వేదికలమీద విశ్రాంతిగా పరుండి, లేచి, పూలరేకులతో కట్టిన గవాక్షాల పొదరిండ్లలో తిరుగుతూ, అంతసేపు కన్నులు పరమశివునిమీదనే కేంద్రీకరించింది.

ఓరిమి చాలక పరమశివుడు ఒక్క అడుగువేసి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

చేతికి అందినట్లే అంది చటుక్కున విడిపించుకొని పైటజారిన నెపంతో సిగ్గుగా పొదమాటుకు చేరగా, వెంబడించాడు గిరిజాపతి.

కిల కిల నవ్వుతూ, జారే పైట గాలికి వదలి, మళ్ళీ సవరిస్తూ, అంతలో దగ్గరకు రానిచ్చి, దూరంగా పరుగెడుతూ, గిర గిర త్రిప్పుతూంటే పరమశివునికి ఇంద్రియనిగ్రహం తప్పింది.

అంతతో ఆయనకు స్వస్వరూపజ్ఞానం రాగా మహావిష్ణువు మాయ అని తెలిసి, ఆ శ్రీమన్నారాయణుని ప్రార్థించి కైలాసానికి వెళ్ళాడు.

నారాయణుడు వైకుంఠం చేరాడు. అవీ ఆయన లీలావిశేషాలు, అని శుకుడు :

రాజేంద్రా !

ఇప్పుడు నడుస్తున్నది వైవస్వతమనువు పాలన. గౌతమ,కశ్యప,అత్రి,విశ్వామిత్ర, జమదగ్ని, భరద్వాజ,వశిష్ఠులు సప్తర్షులు. ఈ మన్వంతరంలో వామనావతారం ధరించాడు మహావిష్ణువు.

ఇక ఎనిమిదవ మనువు సావర్ణి. అనంతరం దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మ సావర్ణి, భద్రసావర్ణి, దేవసావర్ణి ఇంద్రసావర్ణి మనువులుగా వస్తారు.

వైవస్వతునికాలంలో శ్రీహరి వామనుడైన గాథవిను :

అమృత పానానంతరం శ్రీమన్నారాయణుని సహాయంతో దేవతలు రాక్షసులను పరాజితులను చేశారుకదా !

అది మొదలుగా బలిచక్రవర్తి తన దానవగణాలతో భార్గవులను ఆశ్రయించి వారి సేవతో విశ్వజిద్యాగంచేశాడు.

ఆక్రతువు ముగియగానే అగ్నిహోత్రుడు సంతోషంతో దివ్యరథంతో, సింహ పతాకాన్ని, అభేద్యకవచాన్ని ధనుర్బాణాలనూ బహూకరించాడు.

బలి శాంతచిత్తుడై వేదవేత్తలను వివిధదానాలతో తృప్తిపరచి, వారి ఆశీస్సులతో సర్వభోగాలూ పొందుతూ, దేవతల శత్రుగణాలన్నీ తన్ను చేరి సేవింపగా, సమయంచూసి దేవేంద్రుని మీదికి దాడి వెళ్ళాడు.

వస్తూన్న దైత్య, దానవ, అసురబలాలను చూసి దేవేంద్రుడు బృహస్పతిని చేరి యోచించగా, ఆయన యిది యుద్ధానికి అదను కాదని, శత్రువు చాలాబలంగా వున్నప్పుడు వైదొలగడం మంచిదనీ, మళ్ళీ కాలం మారినప్పుడు అవలీలగా విజయం సాధించవచ్చుననీ, అనగా, ఆచార్యుని అభిమతానుసారం దేవగణాలు కామరూపాలతో అమరావతి వీడివెళ్ళాయి.

నిశ్చింతగా అమరావతిని ఆక్రమించి బలి తన పరిపాలన ఆరంభించాడు.

అసురగురువులు శిష్యవాత్సల్యంతో వానిచేత నూరు అశ్వమేధాలుచేయించారు. తనరాజ్యంలో దరిద్రుడుండరాదనే నియమంతో బలిచక్రవర్తి అనేకానేకదానాలతో సర్వ ప్రజకూ సంతుష్టి కలిగించాడు.

అయితే–

తన బిడ్డలకు కలిగిన దుర్దశకు చింతించి దేవతల తల్లి అదితి విచారిస్తూంటే ఆమె భర్త ఒకనాడు ధ్యానసమాధి వీడివచ్చి :

ఎందుకు విచారిస్తున్నావు. వేదవేత్తలకు ఏ కిష్టాలూ రాకుండా, దేవపూజలకు అంతరాయం కలగకుండా, వయసువచ్చిన పిల్లలు పెద్దలను ఎదిరించకుండా, ఆకలిగొన్న వారిని ఆదరంతో చూస్తూ భోజనంపెట్టి తృప్తిపరుస్తూంటే ఏ ఆపదలూరావు.

మనకున్నదాంట్లో గుప్పెడుమెతుకులో గుక్కెడు మజ్జిగయో ఇంతకూరముక్కయో ఎదుటివారికి యివ్వకుండా ఎవడుంటాడో వాడికంటె దరిద్రుడు లేడు.

వేదవిదులు తృప్తిపడితే మహావిష్ణువు సంతోషిస్తాడు. వారికి లోటుజరగడంలేదు కదా, అని ప్రశ్నించగా జరిగినకథ అంతా చెప్పింది, అదితి.

అంతా విని ఆ బ్రహ్మవేత్త:

అమాయకురాలా! తండ్రి, కొడుకు, పుట్టుక, సంసారం, ఏమి టివన్నీ. అంతా ఆ శ్రీమన్నారాయణుని మాయ. ఆ వ్యామోహసముద్రంలోపడి కొట్టు మిట్టాడుతోంది. ఈ లోకం.

జనకుం డెవ్వడు, జాతు డెవ్వడు,
జను స్థానంబు లెచ్చోటు! సంజననం బెయ్యది,
మేను లే కొలది, సంసారంబు లే రూపముల్,
వినుమా యింతయు విష్ణుమాయ
తలపన్ వే రేమియున్ లేదు
మోహనిబద్ధంబు, సదాన మింతటికి
జాయా విన్నబో నేటికిన్.

ఆ మాయలో పడినవారు మాయాకారణుడైన శ్రీహరిని సేవిస్తే ఆయన అనుగ్రహిస్తాడు, అనగా అదితి.

నాథా! నారాయణ సేవావ్రత విధానం బోధించండి, అంది.

ఆవుపాలు ఆహారంగా, పన్నెండు రోజులు నియమంతో ఆరాధించవలసిన పద్ధతి అంతా బోధించా డాయన.

కన్నబిడ్డల కష్టాలు గట్టెక్కించడం కోసం ఆ పతివ్రతా శిరోమణి విధ్యుక్తంగా వ్రతం పూర్తిచేసింది.

చతుర్భుజ రూపంతో శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై ఆవిడ కోరిన ప్రకారం దేవతలకు సుఖ శాంతులు ప్రసాదించడానికి అంగీకరించాడు.

దానవ సంహారంకంటె వారిని నిర్వీర్యులను చేసి దేవతలకు ఆధిపత్యం యిచ్చే సంకల్పంతో అదితి గర్భాన ప్రవేశించి ఆమె బిడ్డగా వామనుడై శ్రావణ శుద్ధ ద్వాదశినాడు మధ్యాహ్నం ప్రభవించాడు, వామనుడు.

శ్రీ మన్నారాయణుడు తనగర్భాన శిశువైన తరుణంనుండి ఆ యిల్లాలు సంతోషంతోనే ఉంది.

నన్ను గన్న తండ్రి నా పాలి దైవమ
నా తపః ఫలంబ నా కుమార
నాదు చిన్నవడుగ నా కులదీపక
రా గదయ్య భాగ్యరాశి వగుచు

అలా ఆవిడ లాలించి పాలిచ్చి పెంచుతూండగా సప్తమహర్షులు విజయంచేసి ఉపనయనం జరిపించారు.

సూర్యుడు సావిత్రీమంత్రం ఉపదేశించాడు. బృహస్పతి దండంయిచ్చాడు. బ్రహ్మ కమండలు వీయగా, సరస్వతి జపమాల యిచ్చింది.

ధనపతికుబేరుడు భిక్షాపాత్ర యిచ్చాడు, పార్వతీదేవి పూర్ణభిక్ష పెట్టింది.

రోజులు గడుస్తున్నాయి. తన యింటికి వచ్చే విప్రు లందరూ బలిచక్రవర్తి దానాన్ని గురించి పొగుడుతూంటే విని, తల్లి దండ్రుల అనుమతితో దేవతలకు శ్రేయస్సు కలిగించే ఊహతో, లక్ష్మీవల్లభుడైన ఆదినారాయణుడు వామనావతారంతో బ్రహ్మచారిగా భిక్షా పాత్రతో బలిచక్రవర్తి యజ్ఞంచేసే ప్రాంతానికి చేరాడు.

యజ్ఞశాలాప్రాంగణంలో ప్రవేశించే ఆ వామన బ్రహ్మచారిని చూసిన వారందరూ ఆశ్చర్యంతో పరమశివుడో, ప్రజాపతియో, శ్రీమన్నారాయణుడో, సూర్యభగవానుడో, అగ్ని భట్టారకుడో యీ రూపంతో వస్తున్నా డనుకున్నారు.

వస్తూ తార్కికులతో కొంతసేపు చర్చలు జరిపి, మరొకచో వేదపఠనంచేసి, కొందరిని కుశలప్రశ్నలువేసి నెమ్మదిగా బలిచక్రవర్తిని సమీపించి కుడిచేయి అభయముద్రతో ఎత్తి, స్వస్తి వాక్యాలతో ఆశీర్వదించాడు.

దానవేశ్వరుడు వినయంగా పాదాలుకడిగి పాదోదకం శిరసున జల్లుకుని :

ఓ బ్రహ్మచారీ! నీ రాకతో మా జన్మ చరితార్థ మయింది. ఇంతకూ నువ్వు ఎవరిబిడ్డవు, పే రేమిటి? ఏం కోరి వచ్చావు. ఏది కావలసినా అడుగు. నా రాజ్యం అయినాసరే నీకు ధారవోస్తాను అన్నాడు.

చిరునవ్వుతో వామనుడు :

దానవేశ్వరా! ఎవరి వాడనని చెప్పను, నా అంతవాణ్ణి నేనే!

ఎక్క డుంటాననికదా? ఎలా తెలుస్తుంది, అంతటా ఉండేవానికి! ఏం చదువుతున్నావంటే చదవని దేముంది!

నే నెవరికీ ఏమీ కాను, అందరూ నా వారే. ఒకప్పుడు సిరి ఉండేది. ఇప్పుడూ అప్పుడూ సజ్జనుల సన్నిధానంలో ఉంటాను.

ఇక దానం విషయంలో నిన్నుచెప్పి వేరొకరిని చెప్పాలి. మీ వంశంలో దయార్ద్ర హృదయం నీ ఒక్కడికే ఉంది.

హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు మీ ముత్తాతలు. అయినా నీకు మీ తాత ప్రహ్లా దుని బుద్ధులే వచ్చాయి. సంతోషం.

ముల్లోకాలూ ఏలుతున్నావు. మహాదాతగా ఖ్యాతి పొందావు. వేదవిదులకూ, బీదసాదలకూ, దాన ధర్మాలుచెయ్యని రాజ్యాలూ, సంపదలూ వ్యర్థం అని గ్రహించావు

ఇంక నా కేం కావాలనికదా అడిగావు. ఒంటిరివాణ్ణి, నా కేం కావాలి. ఒకటి రెండడుగుల భూదానం చేస్తే బ్రహ్మలోకం దాకా చూస్తాను.

అనగా బలి : ఓ బ్రహ్మచారీ! ఇంతటి దాతను అంతేనా అడిగేది? అన్నాడు.

మాట్లాడకుండా నవ్వుతూ నిలబడ్డాడు వామనుడు.

బలి : చిన్న వాడివి. బాగా ఆలోచించి అడుగు. భూమండలమా! త్రిభువనసామ్రా జ్యమా! రథ, గజ, తురగ వాహనాలా, కన్యకామణులా, ఏం కావాలో కోరుకో, అన్నాడు.

వామనుడు: రాజేంద్రా! నేను బ్రహ్మచారిని, తాటాకుగొడుగు, రాగికమండలువు, యజ్ఞోపవీతం అన్నీ అందరూ యిచ్చారు. ఇంక నువ్వు చెప్పిన రాజ్యాలు, రాజలాంఛనాలూ, రమణీమణులు బ్రహ్మచారికి దేనికయ్యా. దొరికినదానితో తృప్తి పడనివానికి సప్తద్వీపాలు చే జిక్కినా సంతృప్తి ఉండదు.

ఇవ్వాలని ఉంటే మూడడుగుల నేల ధారపొయ్యి. తమరు చక్రవర్తులూ, మహాదాతలూ అని చెప్పి నా అవసరానికి మించి అడగనా!

అంటూండగా బలి సంతోషంతో దానం యివ్వడానికి సన్నద్ధుడయాడు.

అదిచూసి శుక్రుడు: మహారాజా! ఈ బ్రహ్మచారి ఎవ రనుకుంటున్నావు? సాక్షాత్తూ లక్ష్మీవల్లభుడు. దేవకార్యార్థం యిలా అవతరించి నిన్ను మాయ చేస్తున్నాడు.

నువ్విచ్చే మూడడుగులకూ, ఒకపాదంతో భూవలయం, రెండవ పాదంతో ఊర్ధ్వలోకాలూ ఆక్రమిస్తాడు.

దాన మిస్తానని యివ్వకపోతే నరకం సిద్ధిస్తుందని అనుకుంటున్నావా!

దానం చేసి సర్వనాశనం అయేస్థితివస్తే అది దానమే కాదన్నారు ప్రాజ్ఞులు. మనసంపదను అయిదు భాగాలు చేసి అర్థ, కామాలకూ, ధర్మానికీ కీర్తికీ, ఆశ్రయించుకున్నవారికీ సమంగా యివ్వాలని నీతివేత్తలు చెపుతున్నారు.

సర్వనాశనం అయేదశలో ఆడిన మాట తప్పితే అనృతదోషంలేదు.

ఆత్మ అనేచెట్టుకి మూలం అనృతం. అందుచేత అసత్యం వల్ల ఆత్మచెడదు. ఈ చెట్టున ఫల, పుష్పాలే సత్యం. అంటే మ్రానువుంటేకదా పువ్వులూ పళ్ళూ ఉండేది. అదే లేకపోతే యివి లేవే.

వారిజాక్షులందు వైవాహికము లందు
ప్రాణ విత్త మాన భంగ మందు
చకిత గోకులాగ్రజన్మ రక్షణమందు
బొంకవచ్చు అఘము పొంద దధిప.

అని బోధించే ఆచార్య శుక్రునివైపు చూసి బలిచక్రవర్తి:

ఆచార్య! తమరు గృహస్థ ధర్మం బోధించారు. కాని, భూదేవి ఏమన్నది. ఎటువంటి దుష్కార్యాలు చేసేవారి నయినా భరించగలను కాని అసత్యవాదిని ఒక్కణ్ణి భరించలేను, అని.

రణరంగలో వెనుదిరిగి పోవడం కంటె చావుమేలు, అలానే అసత్యం పలకకు జీవితం సాగించడం మేలు.

రైతుకు బాగా సారవంతమయిన భూమితో మంచివిత్తనాలు దొరికితే ం సంతోషిస్తాడో, దాత తన సంపదలు ధారవోయడానికి పాత్రుడయిన వ్యక్తి దొరికితే అ ఆనందిస్తాడు.

అదీకాక —

కారే రాజులు రాజ్యముల్ కలుగవే
గర్వోన్నతిం బొందరే! వా రేరీ?
సిరి మూటగట్టుకొని పోవంజాలిరే!
భూమిపై పేరైనం గలదే! శిబిప్రముఖులున్
ప్రీతిన్ యశఃకాములై యీరే కోర్కులు
వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవా!

ఆచార్యా!

సృష్టి మనతో ఆరంభం కాలేదు, మనతో అంతమూ కాదు. ఎందరో రాజు పాలించారు. ఎన్నో రాజ్యాలు వెలకొల్పారు. కాని ఒక్కరి పేరులేదే! ఈనాటికీ పేరుం వారు వెనుక ముందులు చూడకుండా సర్వస్వం దానం చేసిన శిబిప్రముఖులేకదా!

మరొక్క మనవి.

ఇప్పుడు నా ఎదుట చెయ్యిజాపి భిక్ష వేడుతున్న దెవరు? మీరే చెప్పినట్ల చతుర్దశ భువనాలకూ క్రీగంటి చూపుతో సర్వైశ్వర్యాలు యిచ్చే శ్రీదేవి శిరసుమీద మృద వుగా పూలగుత్తులుంచే హస్తం క్రిందై ఆపైన నా చెయ్యి దాన మిచ్చే అదృష్టానికి నోచ కుంది. ఇంతకంటె ఏం కావాలి.

ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువుపై
అంశోత్తరీయంబుపై, పాదాబ్జంబులపై
కపోల తటిపై, పాలిండ్లపై
నూత్నమర్యాదం చెందు కరంబు క్రిందగుట
మీదై నా కరంబుంట మేల్గాదే!
రాజ్యము గీజ్యమున్ సతతమే!
కాయంబు నా పాయమే.

గురుదేవా! ప్రళయం వచ్చినా, భూఖండం నిర్మూల మయినా, వంశనాశనం అయినా ఏమయినా నేను దానం యిచ్చి తీరుతాను

మేరువు తల్లక్రిందైనను
పారావారంబు లింకబారిన లో లో
ధారుణి రజమై పోయిన
తారాధ్వము ఖండమైన తప్పక యిత్తున్

ఎన్నడూ ఎవరినీ ఏమీ అడగనివాడు; నా అనేవారు లేని ఏకాకి; విద్యల సారం తెలిసిన బ్రహ్మచారి చేయిచాపి 'దేహీ' అంటూంటే కాదనలేను,

అని తన సత్యనిష్ఠను ప్రకటించగా, శుక్రాచార్యులు కోపంతో :

ఈనాడు నామాట కాదన్న ఫలంగా అచిరకాలంలో పదభ్రష్టుడ వవుతావు, అని శపించారు.

అయినా చలించలేదు, బలిచక్రవర్తి;

అప్పటికే మహారాణి వింధ్యావళి బంగారు కలశంతో నీరుతేగా, బ్రహ్మచారికి పాదాలుకడిగి, ఆ జలాలు శిరసున జల్లుకుని :

"విప్రాయ ప్రకటవ్రతాయ
భవతే విష్ణు స్వరూపాయ
వేదప్రామాణ్యవిదే!
త్రిపాద ధరణిం దాస్యామి"

అని కమండలువులోని జలం ధారపోస్తుండగా, శుక్రుడు ఆ రంధ్రానికి అడ్డువెళ్ళాడు. అది తెలిసి, శ్రీహరి తన చేతిలోని దర్భపుల్లతో లోపలకు పొడిచాడు. దానితో ఆయన ఏక నేత్రు డయాడు.

జలధారవిడుస్తూ బలి :

ఓ బ్రహ్మచారీ! భూదానం చేసేవారూ, దానం గ్రహించేవారూఉభయులూ సర్వ పాపవిముక్తులై స్వర్గంలో శాశ్వతభోగా లనుభవిస్తారు కనక ఈ దానంగ్రహించి సర్వలోక కీర్తిపొందు, అన్నాడు.

దానవేంద్రా! నువ్విచ్చిన మూడడుగుల దానంతో ముల్లోకాలూవచ్చినంత సంతోష పొందుతున్నాను, అన్నాడు బ్రహ్మచారి.

బలి చిరునవ్వు నవ్వాడు.

ఉదకధారపడిన ఉత్తరక్షణంలో

ఇంతింతై వటు డింతయై మరియు తానింతై
నభోవీధిపై నంతై తోయదమండలాగ్రమున కల్లంతై
ప్రభారాశిపై నంతై చంద్రుని కంతయై
ధ్రువునిపై నంతై మహర్వాటిపై నంతై
సత్యపదోన్నతుం డగుచు
బ్రహ్మాండాంత సంవర్ధియై.

శ్రీమన్నారాయణుడు అలా త్రివిక్రమరూపం ధరిస్తూంటే సూర్యబింబం గొడుగులా ఉంది. అంతలో శిరోరత్నం, మరుక్షణంలో కర్ణభూషణం, గళహారం, భుజకీర్తి, చేతి కడియం, కటిస్థలాన అలంకరించే బంగారుగంట, అంతలో కాలిఅందె, చివరకు పాదపీఠం అయింది.

ఒకపాదంతో భూమినీ, రెండవపాదంతో సకలగగనాన్నీ ఆక్రమించగా, దానవ సేనానులు వివిధాయుధపాణులై యుద్ధ సన్నద్ధులయారు.

చిరునవ్వుతో వారిని బలిచక్రవర్తి శాంతింపజేశాడు.

అప్పుడు త్రివిక్రముడైన వామనుడు :

రాజేంద్రా! మూడడుగు లిచ్చావు. రెండడుగులకే బ్రహ్మాండం సరిపోయింది, అనగా ఆ దాత : స్వామీ! ఆ పాదం నాతలపై ఉంచండి, ఏప్రాణికయినా మృత్యువు ప్రాణస్నేహితుడు, యముడు ఆప్తబంధువు, యమకింకరులు సేవకులు. ఈ రహస్యం తెలియక సంసారబంధంలో కొట్టుకునే వారిని ఏమనగలను.

చుట్టాలు దొంగలు. సుతులు ఋణస్థులు.
కాంతలు సంసారకారణములు. ధనము లస్థిరములు.
తను వతి చంచలము,

అని వినయంగా పలుకుతూండగా ప్రహ్లాదుడువచ్చి :

శ్రీమన్నారాయణా ! ఇంతవరకూ వీనిని ఇంద్రపదవిలో ఉంచి యిప్పు డీదశకు తేవడం చాలా బావుంది. అహంకార, గర్వకారణమైన ఆ పదవులుతప్పించి బంధవిమోచనం కలిగించిన కరుణామయుడవు, అంటున్నాడు.

అప్పుడు వింధ్యావళి వామనుని పాదాలపై పతిభిక్ష వేడగా, అప్పుడే వచ్చిన ప్రజాపతి బ్రహ్మ అర్థించగా నారాయణుడు :

సావర్ణిమనువు కాలంలో బలి ఇంద్రపదవిని అధిష్ఠిస్తాడు. అంతవరకూ జరా మరణ రోగభీతిలేకుండా తన దనుజగణంతో సుతలంలో విశ్వకర్మనిర్మించిన భవనంలో ఉంటాడు, అన్నాడు.

బలిచక్రవర్తి నిర్మలానందంతో శ్రీహరి చరణారవిందాలకు నమస్కరించి సుతలం చేరాడు.

అనంతరం లోకాలకూ, లోకపాలురకూ వామనుని అధిపతిని చేసి, దేవేంద్రునికి అమరావతి యిప్పించి పరమశివ, ప్రజాపతులు, దేవర్షులు తమ తమ నివాసాలకు చేరారు.

ఇది వామనావతారకథ.

# మత్స్యావతారం

పరీక్షిన్నరేంద్రా !

కల్పాంతంనాటి విషయం.

ఆ రోజులలో సత్యవ్రతుడనే రాజు ధర్మబద్ధంగా రాజ్యపాలనంచేస్తూ, ఒక సంవత్సరకాలం శ్రీహరిధ్యానంలో గడిపాడు. ఆ సంవత్సరం అంతా ఆయన నీరే ఆహారంగా తీసుకున్నాడు.

అలాఉండగా ఒకనాడాయన నదీస్నానం చేసి హరిప్రీతిగా జలతర్పణంచేసే సమయంలో ఆయన దోసిలిలో ఒకచేపపిల్ల కనిపించింది.

కనిపించిన క్షణంలో దానిని జారవిడిచాడు.

నదీజలంలో పడ్డ చేపపిల్ల :

మహారాజా ! ఈనదిలోని పెద్దచేపలు చిన్నవాటిని కబళిస్తున్నాయి. వాటికి పడి నేను నీ దోసిటపడ్డాను. నన్ను రక్షించకుండా యిలా విడిచిపెట్టడం న్యాయమా ! వేళ చేపలబారితప్పినా, జాలరులు వల పన్ని హింసిస్తారు, అనగా ఆ రాజు కరుణి దానిని తన కమండలంలోవుంచి యింటికి తీసుకువెళ్ళాడు.

తెలతెలవారుతూండగా ఆ చేప తన కీ చిన్నపాత్ర విశాలంగా లేదంది. అ డాయన మరింతపెద్దపాత్రలో విడిచాడు. విడిచిన క్షణకాలంలో ఆ పాత్రకూడా చాలలే దానిని చిన్నకొలనులో విడిచాడు. అంతకంతకు అది పెరుగుతూంటే, దానిని సముద్రం వదలిపెట్టాడు.

అప్పుడది : రాజా ! నన్నీ మొసళ్ళగుండంలో వదలివెడతావా, అనగా సత్యవ్రతుడు క్లేశాలలో వున్న భక్తులను రక్షించడానికి ఈ అవతారం ధరించిన శ్రీహరీ ! నీకు నమస్కారం

ఇంతకూ ఈ అవతారకారణం తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది, అనగా శ్రీమన్నారాయణుడు :

రాజా ! నేటికి ఏడురోజులలో బ్రహ్మకు పగలుపూర్తికానున్నది. అప్పుడు ప్రళయం వస్తుంది. అప్పుడొక పెద్దనావ వస్తుంది, దానిలోసర్వబీజాలూ, ఓషధులూ నింపి నువ్వు ఈ జలరాశిలో తిరుగుతూవుండు. అందులోనే సప్తర్షులూ నీతో వుంటారు. దాని రక్షణభారం నాది. అందుకే ఈ అవతారం ధరించాను, అని అదృశ్య మయాడు హరి.

శ్రీహరినే ధ్యానిస్తూ ఆరాజు దర్భాసనంమీద కూర్చున్నాడు. సమయానికి ఆకాశ మంతా కారుమేఘాలతో నిండింది. కుంభవృష్టి నిర్విరామంగా కురిసింది. సముద్రం చెలియలికట్టదాటి భూగోళాన్ని ముంచెత్తింది.

బ్రహ్మ నిద్రలో ఉండగా వెలువడిన వేదాలను హయగ్రీవుడనే దైత్యుడు అవహరించాడు.

అప్పటికే నిఖిలబీజాలనూ, ఓషధులనూ నావలో భద్రపరచి, మహావిష్ణువు మహా మత్స్యాకృతిధరించి రాక్షసుడు దాగిన జలరాశి మధ్యానికివెళ్ళాడు.

నావను చూచిన సత్యవ్రతుడు శ్రీహరి ఆజ్ఞానుసారం సప్తర్షులతో ఆనావలో ఎక్కాడు.

అందరూ అధివసించిన ఆనావకు రక్షణ కల్పించిన శ్రీహరిని సత్యవ్రతుడు అనేక విధాల స్తుతించగా, మహావిష్ణువు వారందరికీ బ్రహ్మస్వరూపాన్ని తత్వరహస్యాలతో విశదం చేశాడు.

ఆ సత్యవ్రతుడే ఈ కల్పంలో వివస్వంతుడనే పేరవెలిగే సూర్యుని కుమారుడుగా పుట్టి వైవస్వతమనువుగా ప్రఖ్యాతు డయాడు.

అప్పుడు శ్రీమన్నారాయణుడు సముద్రంలోపలకు పోయిఅక్కడదాగిన దుష్టదైత్యుని సంహారించి వేదాలు అందుకున్నాడు.

ప్రళయకాలం పూర్తిఅయింది.

కాళరాత్రి ఎప్పుడు ముగుస్తుందా అని ఎదురుచూసే మునీంద్రుల హృదయాలు సంతోషంతో విచ్చుకున్నాయి. సరస్వతీదేవి తన శయ్యామందిరం వీడివచ్చింది. ప్రజాపతి తన అవయవాలన్నీ కదలించి, ఒక్కసారి ఆవులించి, కన్నులువిచ్చి, లేచి కూర్చున్నాడు.

ఆసమయాన శ్రీహరి వేదాలు తెచ్చి బ్రహ్మకందించాడు, అని అష్టమస్కంధం ముగించాడు శుకయోగీంద్రుడు.

దివిజ రిపు విదారీ। దేవలోకోపకారీ
భువనభర నివారీ। పుణ్యరక్షానుసారీ!
ప్రవిమల శుభమూర్తీ। బంధుపోషప్రవర్తీ
ధవళ బహుళకీర్తీ। ధర్మ నిత్యానువర్తీ!

# నవమస్కంధం

శ్రీరాజిత మునిపూజిత
వారిధి గర్వాతిరేక వారణ బాణా
సూరిత్రాణ మహోజ్జ్వల సారయశస్సాంద్ర
రామచంద్ర నరేంద్రా!

వైవస్వత మనువుకాలంలో భూమండలాన్ని ధర్మబద్ధంగా సత్యమార్గాన పా చిన మహారాజు ఇతిహాసం వినిపిస్తాను.

శ్రీ మన్నారాయణుని నాభికమలంనుండి బ్రహ్మ ఆవిర్భవించారు. ఆయన సంక వల్ల మరీచి ప్రభవించాడు. మరీచికి కశ్యపప్రజాపతి కుమారు డయాడు.

ఈయనను దక్షుని పుత్రిక అదితి వివాహ మాడింది. వారికి సూర్యుడు పుత్రు సూర్యుని భార్య సంజ్ఞ. వీరికి శ్రాద్ధదేవుడు అనే మనువు కలిగాడు. ఈయన భార్య శ్ర వీరికి ఇక్ష్వాకువు, నృగుడు, శర్యాతి, దిష్టుడు, ధృష్టుడు, కరూశకుడు, అరిష్యంతు పృషధ్రుడు, అభంగుడు, కలి అని పదిమంది కుమారులు.

కుమారులు పుట్టడానికి ముందు మనువు సంతానేచ్ఛతో యజ్ఞం చేస్తుండగా అత భార్యతనకు ఆడబిడ్డ కలగాలని అధ్వర్యుని కోరింది. ఆయన అందుకు అనుకూలంగా క్రతు నడిపించగా ఆమె ఆడబిడ్డను కన్నది.

అది చూసిన మనువు తమ కులగురువు వశిష్ఠులను చేరి :

గురుపూజ్య! నేను పుత్ర సంతానార్థం క్రతువు చేస్తే ఆడబిడ్డ ఎలా కలిగిం అనగా ఆయన అనుగ్రహించి :

"ఇది హోత చేసిన తప్పు. అయినా నీ కుమార్తె ఇలాదేవికి నేను పురు రూపం యిస్తున్నాను, వెళ్ళు," అన్నాడు.

అది మొదలుగా సుద్యుమ్ననామంతో ఆ బిడ్డ పురుషాకృతితో వెలుగుతూ సింహ సనం అధివసించింది.

ఒకనాడు సుద్యుమ్నుడు పరివారంతో వేటకు వెళ్ళి ఉత్తరదిశగా సాగి సాగి మేరు గిరి చేరాడు. అక్కడ పరమశివుడు పార్వతీదేవి శృంగారకేళిలో ఉంటారు కదా. అందు వల్ల అక్కడకు ఎవరువచ్చినా వారు స్త్రీలుగా మారిపోతారు.

సుద్యుమ్నుడు పరివారంతో స్త్రీ బృందంగా మారిపోయాడు. యువతి రూపంతో తిరుగుతూ బుధుని ఆశ్రమ ప్రాంతానికి చేరగా, ఆ యువకుడు యీమెను మోహించాడు. వా రుభయులూ కొంతకాలం సంసారం చేశారు. సంసారయాత్రా ఫలంగా వారికి పురూరవు డనే కుమారుడు కలిగాడు.

ఈలోగా తన కుమారుడు సుద్యుమ్నుడు మళ్ళీ తరుణీరూపం పొందినందుకు చింతిస్తూ వశిష్ఠుని చేరి విచారించగా, ఆయన పరమశివుని ఆరాధించగా ఆ మహేశ్వరుడు :

ఈ వ్యక్తి ఒకనెల స్త్రీగా, ఒకనెల పురుషుడుగా ఉంటూ ప్రశాంతంగా రాజ్య పాలనం చేస్తాడు, అని అనుగ్రహించాడు.

ఆ విధంగా రాజ్యం పాలిస్తూ ముగ్గురు కుమారులను కని వారిని ఉత్తరదేశానికి అధిపతులను చేసి, మిగిలిన రాజ్యాన్ని పురూరవుని కిచ్చి వానప్రస్థానికి వెళ్ళాడు.

అంతతో వైవస్వతుడు చింతించి, శ్రీహరిని సేవించి ఆయన కరుణతో ఇక్ష్వాకుడు మొదలుగా పదిమంది కుమారులను కన్నాడు.

వీరిలో పృషధ్రుడు గురువుగారి ఆజ్ఞానుసారం వారి గోవులను మేపుతూ కాలం గడుపుతున్నాడు. ఉండగా ఒకనాడు సాయంకాలం కారుమబ్బులుపట్టి కుంభవృష్టి ఆరంభ మయింది.

అయినా గోగణాన్ని రక్షించడానికి శ్రమపడే సమయంలో ఒక పెద్దపులి ఆ మంద లోకి ప్రవేశించింది. అంతతో ఆవులు అంబారవంతో పరుగులు పెట్టాయి. కానరాని చీకటిలో ఆ రాకుమారుడు పెద్దపులిని చంపడానికి యత్నించి, ఒక కపిల గోవును పట్టి అదే పులి అనుకుని దాని మెడ నరికాడు.

అప్పటికి వాన వెలిసింది.

జరిగిన అపరాధానికి చింతించే శిష్యునిచూచి వశిష్ఠుడు :

ఈ దోషం కారణంగా నీకు రాజత్వం పోయింది, చతుర్థ కులజుడ వయావు అని శపించాడు.

పృషధ్రుడు గురువుగారి పాదాలవ్రాలి, హరిపదధ్యానంతో ఇంద్రియాలను నిగ్ర హించి దొరికిన కాయలూ, పండ్లూ తింటూ మహారణ్యాలలో తిరుగుతూ, దావానలంలో శరీరం ఆహుతి చేసి వైకుంఠం చేరాడు.

మిగిలినవారిలో కొందరు పరాత్పరుని ఆరాధిస్తూ వనవాసానికి వెళ్ళారు. కొంద క్షత్రియవంశకర్త లయారు.

వారిలో ఒకడయిన శర్యాతి మహారాజు కుమార్తె సుకన్య. ఒకనాడు వనవిహా చేస్తూ చ్యవనమహర్షి ఆశ్రమసమీపానికి వెళ్ళింది. అక్కడ పువ్వులుకోసుకుంటూ, క్రీడల చెలికత్తెలు తోడురాగా ఒకానొక పుట్టలో రెండుజ్యోతులు కనిపించగా అవి మిణుగురు ప గులనుకుని ముల్లుతో పొడిచింది.

ఉత్తరక్షణంలో ఆ రాజుగారి సేనలకు మల మూత్రబంధం అయింది.

ఈ వార్తవిని శర్యాతి అక్కడ ఆశ్రమంలో తనవారు ఏదో పొరపాటుచేశార అనగా, కుమార్తె సుకన్య వచ్చి, తాను చేసిన పని చెప్పింది.

తక్షణం శర్యాతి తనకుమార్తెతో ఆ పుట్టదగ్గరకువెళ్ళి అందులో తపోదీక్షలోవున్న చ్యవనమునిని చూచి, విచారంతో చేతులు జోడించి, క్షమాభిక్షతో ఆయన అనుగ్రహ పొంది, సేనలకు ప్రాణరక్షణచేసి, తన కుమార్తెను ఆ మునీంద్రునికిచ్చి వివాహం జరిపి చాడు.

అది మొదలుగా సుకన్య పతివ్రతాధర్మంతో మహర్షిని సేవిస్తూ రోజులు గడుప తున్నది. ఒకనాడు దేవవైద్యులు అశ్వనీకుమారు లిద్దరూ ముని ఆశ్రమానికి వచ్చారు. వారికి ఉచితరీతిని మర్యాదలు జరిపించి, చ్యవనుడు :

నా వార్ధక్యం పరిహరించండి, మీకు యజ్ఞవేళలలో సోమపానార్హత కలిగిస్తాను, అన్నాడు.

వారు సంతోషించి ఆయనతో కలిసి సమీపంలోని ఒక మడుగులో మునిగి పైకి లేచారు

ముగ్గురూ దివ్యసుందర రూపాలతో వెలికిరాగా చూసి సుకన్య :

ఆర్యా ! మీలో నా ప్రాణనాథు లెవరో తెలియజేయండి, అనగా అశ్వనీదేవతలు చ్యవనుని ఆమెకు అర్పించివెళ్ళారు.

నవయౌవనంతో చ్యవనుడు సంసారం సాగిస్తున్నాడు. ఆరోజులలో శర్యాతి యజ్ఞం తలపెట్టి, కూతురునీ, అల్లునీ తీసుకువెడదామనివచ్చి, తనబిడ్డప్రక్కకూర్చున్న నవయౌవన సుందరాకారుని చూసి :

ఓసీ! వీడెవడు? నీ భర్త చ్యవనమహర్షి యేడీ? అని గద్దించాడు.

చిరునవ్వుతో సుకన్య, జరిగినగాథ అంతా వివరించగా, శర్యాతి సంతోషించి వారుభయులనూ రాజధానికి తీసుకువెళ్ళాడు.

యజ్ఞం ప్రారంభ మయింది. వేదోక్తంగా కర్మకాండ నడుస్తున్నది. సోమపాన సమయంలో పాత్రను అశ్వనీదేవతల కీయగా, దేవేంద్రుడు క్రోధంతోవజ్రాయుధం చ్యవనుని పైకెత్తగా, ఆ మహర్షి దానిని ఇంద్రుని భుజం మీదవే బంధించివేసాడు. అనంతరం యజ్ఞం పరిసమాప్తం చేయించి చ్యవనుడు భార్యాసహితుడై వనానికి వెళ్ళి పరమేశ్వర ధ్యానంలో ఉన్నారు.

శర్యాతిమహారాజుకు ఉత్తానబర్హి, ఆనర్తుడు, భూరిషేణుడు ముగ్గురుకుమారులు. వీరిలో ఆనర్తునికొడుకు రైవతుడు. ఈయన సముద్రంలో కుశస్థలిఅనేపట్టణం నిర్మించి ప్రశాంతంగా పరిపాలనసాగిస్తూ వందమంది కుమారులనుకన్నాడు. ఆయన కుమార్తె రేవతి, ఆమె అతిలోకసౌందర్యం చూసి ఎందరో ఆమెను ప్రేమించారు. వారిలో తనబిడ్డను ఎవరి కివ్వవచ్చునో తెలియక ఆయన బ్రహ్మలోకానికివచ్చాడు.

ఆసమయాన అక్కడ గంధర్వులూ కిన్నరులూ గీత నృత్యాలతో ప్రజాపతికిసేవ శేస్తున్నారు. అది ముగిశాక రైవతుడు బ్రహ్మకు నమస్కరించి నిలువగా ఆయన:

నాయనా! ఇక్కడ నువ్వునిలబడిన క్షణం వ్యవధిలో భూగోళంలో ఎన్నిమార్పులు జరిగాయో ఎరుగవు. మీబిడ్డను కోరిన రాజులు, వారిబిడ్డలు, వారల మనుమలు తనువులు చాలించి స్వర్గం చేరారు. అందులో కొన్ని వంశాలు నామరూపాలులేవు.

ప్రస్తుతం నారాయణాంశతో బలరాము డున్నాడు. ఆయనకు నీబిడ్డ నిచ్చి వివాహం జరిపించు, అన్నాడు. ఆయనమాట ప్రకారం వివాహం జరిపించాడు రైవతుడు.

ఈవంశంలో నభాగునికి నాభాగుడనే కుమారుడు. ఆయన సత్యవ్రతపరాయణుడై పరమేశ్వరుని అనుగ్రహంతో ఆత్మజ్ఞానియై బ్రహ్మలోకం చేరాడు. నాభాగుని కుమారుడు అంబరీషుడు.

ఈయన చరిత్ర వినదగినది, అని శుకయోగీంద్రుడు కొనసాగిస్తున్నాడు.

# అంబరీష చరిత్ర

శ్రీ సంపన్నుడూ సద్గుణభూషితుడూ అయిన అంబరీషమహారాజు సముద్ర వలయితభూమండలాన్ని సర్వప్రజారంజకంగా పాలిస్తూ, మనస్సు శ్రీమన్నారాయ యందే లగ్నంచేసి, శ్రీహరి కథాశ్రవణపరాయణుడై జీవితం గడుపుతున్నాడు.

చిత్తంబు మధురిపు శ్రీ పాదముల యంద
వలుకులు హరిగుణ పఠన మంద
కరములు విష్ణుమందిర మార్జనము లంద
శ్రవములు హరికథా శ్రవణ మంద
చూపులు గోవింద రూప వీక్షణ మంద
శిరము కేశవ నమస్కృతుల యంద
పదము లీశ్వరగేహ పరిసర్పణము లంద
కామంబు చక్రి కైంకర్య మంద
సంగ మచ్యుత జన తను సంగమంద
ఘ్రాణ మసురారి భక్తాంఘ్రి కమల మంద
రసన తులసీదళము లంద
రతులు పుణ్యసంగతుల యంద
ఆ రా జ చం ద్ర ము న కు

రాజ భోగాలున్నా అన్నిటినీ విడిచి విష్ణుసేవాపరాయణుడై కులగురువులు వశిష్ఠ అనుమతితో సరస్వతీ నదీతీరాన ఎన్నెన్నో క్రతువులు జరిపి, సత్కర్మలయందే మన నిలిపి, రాజ్యచక్రం త్రిప్పుతున్నాడు.

సంతత హరిచరణారవింద సేవా ఫలంగా నారాయణుడు అనుగ్రహించి ఆ రాజు తన సుదర్శన చక్రం కానుకగా యిచ్చాడు.

నిత్య సత్య వ్రతపరాయణుడైన ఆ జననాథుడు ఒకయేడు శ్రీహరి ప్రీతిగా ద్వాద వ్రతం సాగించాడు.

ఆ రోజులలో—

వ్రతం పరిసమాప్తమయిన. వేళ కార్తీకమాసంలో మూడురాత్రులు ఉపవాసంచేసి యమునానదీ స్నానంచేసి మధువనంలో విధి విధానంగా శ్రీహరిని అభిషేకించి, పూజలు జరిపి, బంగారు తొడుగుల కొమ్ములు, వెండి తొడుగుగిట్టలు కలిగి లేగదూడలతో అలరారే లక్షల గోవులను వేదవిదులకు దానంచేసి, వారందరికీ షడ్రసోపేత భోజనంపెట్టి తృప్తి గావించి, అప్పుడు తాను భోజనం చెయ్యడానికి సన్నద్ధుడయాడు. అప్పుడు విచ్చేశారు దుర్వాసమహాముని.

భాసుర నిగమ పదోప న్యాసుడు
సు తపో విలాసు డనుపమ యోగాభ్యాసుడు
రవిభాసుడు దుర్వాసు డతిథియయ్యె తన్నివాసంబునకున్

వచ్చిన మహర్షిని అర్ఘ్యపాద్యాలతో అర్చించి, సుఖాసనం యిచ్చి భోజనానికి పిలువగా, ఆయన అంగీకరించి యమునానదీ స్నానానికి వెళ్ళారు. వెళ్ళిన వాడు ఎంత సేపయినా రావడంలేదు.

ద్వాదశి ఘడియలు దాటుతున్నాయి. వ్రత ఫలం వ్యర్థం అయ్యేలా ఉంది. ఏం చెయ్యాలి, అని విద్వజ్జనులను అడిగాడు.

వ్రతఫలం దక్కి, అతిథిమర్యాదకు లోపం రాకుండా పవిత్రనదీజలపానం శ్రేయస్కరం, అని వారవగా అంబరీషుడు ఆ ప్రకారంచేసి దుర్వాసుని రాకకు ఎదురు చూస్తున్నాడు.

వచ్చాడు మహర్షి.
జరిగినదంతా గ్రహించాడు.
ఆతిథ్యం యిస్తానని అతిథికంటె ముందుగా ఆరగించి
ధర్మభంగం చేసినవానికి ప్రాయశ్చిత్తం తప్పదన్నాడు.
పళ్ళు పట పట లాడించాడు.
కళ్ళలో చింతనిప్పులు కురుస్తున్నాయి.

హుంకరించాడు. తన జట ఒకటి లాగి దానితో ఒకమహారాక్షసిని సృష్టించి వదిలాడు.

అది శూలహస్తంతో కాలాగ్నిలా నేల అదిరేలా అడుగులువేస్తూ అంబరీషుని సమీపిస్తున్నది. ఆయన నిశ్చలంగా శ్రీహరిని ధ్యానిస్తున్నాడు.

అంతలో ప్రళయజ్వాలామాలలతో సుదర్శనంవచ్చి ఆరాక్షసిని హతమార్చి దుర్వా సుని వెంటబడింది. ఆయన పరుగు ప్రారంభించాడు. తరుముతూవస్తున్నది, సుదర్శనం. ముల్లోకాలూ తిరిగాడు. చివరకు వైకుంఠంచేరాడు.

శ్రీమన్నారాయణుడు మందహాసంతో:

తనువు మనువు విడిచి
తనయుల చుట్టాల ఆలి విడిచి
సంప దాలివిడిచి నన్నుకాని
అన్య మెన్నడు ఎరుగని వారి
విడువ ఎట్టి వారి నైన.

మునీంద్రా!

సత్పురుషుల హృదయం నా నివాసం. ఆ హృదయాన్నీ నేనే. నన్ను వారెరుగు దురు. వారిని నే నెరుగుదును. విప్రవరులు విద్యతో, తపస్సుతో ముక్తిమార్గం సాధిం చాలి. ఆదారివిడిచి దుష్టమార్గాలు త్రొక్కితే కీడు తప్పదు. పర్యవసానంగా, అంబ రీషుని దగ్గరకువెళ్ళి శరణువేడుకో, ఆయన అనుగ్రహిస్తాడు. అని పంపాడు.

దుర్వాసుడు తిరిగివచ్చి అంబరీషుని పాదాలమీద పడగా, ఆయన దయార్ద్రహృద యంతో చేతులు జోడించి, సుదర్శన చక్రాన్ని స్తుతించాడు.

విహిత ధర్మ మందువిహరింతు నేనియు
ఇష్టమైన ద్రవ్య మిత్తునేని
ధరణిసురుడు మాకు దైవతం బగునేని
విప్రునకు శుభంబు వెలయుగాక

అని ప్రార్థించగా సుదర్శనం అదృశ్యమయింది.

అప్పుడు దుర్వాసముని అంబరీషుని భక్తి తత్పరతను పరిపరివిధాల ప్రశంసించి, ఆశీర్వదించి బ్రహ్మలోకానికి వెళ్ళాడు.

అనంతరం అంబరీషుడు కొంతకాలం రాజ్యం పాలించి ఆత్మసదృశులయిన కుమా రులకు రాజ్యభారం అప్పగించి, వనానికి పోయి శ్రీహరి చరణసేవతో వైకుంఠం చేరాడు.

# ఇక్ష్వాకులు

మనువు కుమారుడు ఇక్ష్వాకువు. ఈయనకు నూరుగురు కొడుకులు. వీరిలో వికుక్షి, నిమి, దండకుడు అనే వారు హిమాలయ–వింధ్య గిరుల మధ్యభాగాన్ని పాలించారు. మిగిలినవారిలో ఇరవై అయిదుగురు తూర్పుదిశకు ఏలిక లయారు. మరొక ఇరవై అయిదుగురు పశ్చిమానికీ, మిగిలినవారు దక్షిణానికి ప్రభువులు.

ఒకనాడు ఇక్ష్వాకువు పితృకార్యంకోసం వికుక్షిని పంపి పరిశుద్ధమైన మాంసం తెమ్మన్నాడు. ఆయన తిరిగి తిరిగి అలసి ఒక కుందేలును పట్టి, ఎక్కువ శ్రమపడి నందున ఆకలి బాధించగా, అందులో కొంతమాంసం తిని మిగిలిన దానిని తెచ్చాడు. అది గ్రహించి కులగురువు వశిష్ఠుడు వానిని దేశభ్రష్టుని చేసి ఇక్ష్వాకువును వానప్రస్థానికి పంపుతూ యోగాభ్యాసంతో తనువు చాలించ మన్నాడు.

ఇక్ష్వాకువు అనంతరం వికుక్షి రాజ్యం పాలించారు. ఆయన కుమారుడు కకుత్స్థువు.

కృతయుగాంతంలో దేవాసుర సంగ్రామవేళ దేవతలు పరాజితులై శ్రీ మహావిష్ణువును వేడగా, ఆయన :

దేవేంద్రా! నువ్వు వృషభరూపంతో కాకుత్స్థునికి వాహనంగావెళ్ళు. నేను ఆ రాజులో ప్రవేశించి అసురసంహారం చేస్తాను, అన్నాడు.

ఆ విధంగా కాకుత్స్థునికి వాహనమై ఇంద్రుడు అసురులను ఎదుర్కొన్నాడు. ఆ యుద్ధంలో రాక్షససేన చెల్లాచెద రయింది. అది మొదలుగా ఆయన ఇంద్రవాహన బిరుదు పొందాడు.

ఈయన కుమారుడు అనేనసుడు. వానిపుత్రుడు పృథువు. ఈయనకొడుకు విశ్వగంధుడు. వీనికి అయిదుగురు బిడ్డలు.

వీరిసంతతివాడైన యువనాశ్వునకు సంతానంలేదు. అందుకై ఇంద్రయాగం చేయించి, మంత్రపూతజలకలశం భద్రంగా ఉంచి ఆరాత్రి నిద్రించారు. ఆరాజు, రాత్రి విపరీతదాహబాధతో ఆశ్రమంలోకి వెళ్ళి ఆ జలం త్రాగి జరిగిన అపరాధానికి బాధపడుతూండగా, ఆయన ఉదరంచీల్చుకునిబాలుడుపుట్టాడు. ఈయనపేరుమాంధాత.

తండ్రి అనంతరం యీయన రాజ్యపాలనంచేస్తూ, రాక్షసగణాలనుకడతేర్చి ఇంద్రునికి సంతోషం కలిగించాడు.

ఈయనభార్య శతబిందు. వీరిబిడ్డలు పురుకుత్సుడు, అంబరీషుడు, ముచికుందుడు. ఈయన కుమార్తెలు యాభైమందినీ సౌభరి వివాహం చేసుకుని చిరకాలం సంసార సుఖాలలో తేలి, చివరకు విరాగంతో వానప్రస్థాశ్రమం స్వీకరించి తనువు చాలించాడు.

ఈ వంశంలో జన్మించిన హరిశ్చంద్రుడు చిరకాలం సంతానం లేక వరుణుని ఉపాసించి :

నాకు కలిగిన బిడ్డను యాగపశువును చేసి
నీకు హోమం చేస్తాను, అన్నాడు.
వరుణుని కరుణతో కుమారుడు కలిగాడు.

హరిశ్చంద్రుడు ఏదో నెపంతో క్రతువు జరపకుండా గడుపుతున్నాడు. విషయం గ్రహించిన రోహితుడు, అరణ్యానికి వెళ్ళిపోయాడు. ఆడితప్పిన హరిశ్చంద్రుడు ఉదర వ్యాధిగ్రస్తు డయాడు. అది విన్న రోహితుడు తండ్రిదగ్గరకు వస్తూండగా, దేవేంద్రుడు ఎదురై :

నాయనా ! పుణ్యక్షేత్రాలలో, సజ్జనులతో, శ్రీహరిగాథలు వింటూకాలం గడుపు. నీకు శ్రేయస్సు కలుగుతుంది, అని మరలించాడు.

రోహితుడు ఒక యేడాదిగడిపి మళ్ళీ తండ్రిదగ్గరకు బయలుదేరాడు. దేవేంద్రుడు మళ్ళీ మరలించాడు. అలా అయిదేళ్ళు గడిచాయి. ఆరవయేట శునశ్శేపుడనే యువకుని కొనిపోయి తండ్రి కిచ్చి క్రతువు పూర్తిచేయించాడు. అనంతరం హరిశ్చంద్రుడు ఆత్మజ్ఞానియై నిష్క్రమించాడు.

ఈ వంశంలో పుట్టిన బాహుకుని భార్య, భర్త మరణించగా ఆయనతోసహగమనానికి సిద్ధ మయింది. కాని ఆమెగర్భవతి అనితెలిసిన ఔర్వుడనేమునిఆమెను రక్షించాడు.

ఆమె సవతులు అసూయతో ఆమెకు భోజనంలో విషం కలిపిపెట్టారు. గరళం మ్రింగినాఆమె మరణించలేదు. గరళంతోనే ఆమెకు పుత్రుడు కలిగాడు ; వానికి సగరుడు అని పేరుపెట్టారు.

ఔర్వుని ఆదేశానుసారం సగరుడు అశ్వమేధం చేసి, గుర్రాన్ని విడిచిపెట్టాడు. దానిని దేవేంద్రుడు అపహరించి నాగలోకంలో తపోదీక్షలో వున్న కపిలుని ఆశ్రమసమీపంలో బంధించివెళ్ళాడు.

యాగాశ్వాన్ని వెదకడానికి బయలుదేరిన సగరపుత్రులు నేలత్రవ్వి పాతాళానికిపోయి ఉత్తరంగాన ఉన్న కపిలునిచూచి, యాయనే మనగుర్రాన్ని హరించి ఉంటాడనిశంకించారు, అక్కడ గుర్రం కనిపించిది.

వారికి ఆగ్రహం కలిగి ఆయనను చంపబోగా, ఆ తపస్వికనులు తెరిచాడు. ఆ చూపులవేడికి వారి శరీరాలు భస్మరాసులాయాయి. నిజానికి కపిలునివంటి శాంతతపస్వికి ఆగ్రహంరాదు. వారి పాపాగ్నియే వారిని బూడిద చేసింది.

నగరునిభార్య కేశినికి కలిగిన అసమంజసుడనే కుమారుడు దుర్మార్గవర్తనుడై అయోధ్యలోని పసివారందరినీ ఎత్తుకుపోయి నదిలో ముంచేసేవాడు. కొన్నాళ్ళయాక వాని మనను మారి యోగబలంతో ఆ పసికందులను బ్రతికించితెచ్చాడు.

అసమంజసునికొడుకు అంశుమంతుడు. ఈయన పరమసాధువు. వినయశీలి ఆయన మనుమని పిలిచి యాగాశ్వాన్ని కొని రమ్మన్నాడు.

అంశుమంతుడు సగరులు త్రవ్విన బిలమార్గాన పోయి కపిలుని చూచినమస్కరించి, నిలబడ్డాడు.

కపిలుడు కరుణతో! నాయనా, గుర్రాన్ని తీసుకువెళ్ళు. ఈ నగరులు చూశావా, భస్మమయారు. వీరిమీద గంగాజలం ప్రవహింపజేస్తే మేలు కలుగుతుంది, అన్నాడు.

మనుమని రాకతో క్రతువు పూర్తిచేసి, వానిని రాజ్యాభిషిక్తుని చేసి. గురువుల ఉపదేశంతో యోగమార్గాన సగరుడు ఉత్తమగతి అందుకున్నాడు.

సగరనందనులను ఉద్ధరించడానికి అంశుమంతుడు కృషిచేసి, తనువు చాలించాడు. ఆయన కొడుకు దిలీపుడూ ఆ దారినే పోయాడు.

ఆయనకొడుకు భగీరథుడు. తన ప్రపితామహులకు ఉత్తమగతులు కల్పించే సంకల్పంతో పరమశివుని గూర్చి, ఘోరతపస్సు చేసాడు. ఆయన ప్రసన్నుడుకాగా

స్వామీ, మా ప్రపితామహులను ఉద్ధరించడానికి గంగను భూమికిదింపుతున్నాను. ఆ దివ్యనది: నాయనా! నే నీ భువికి అవతరించేటప్పుడు ఆధాటికి భువనభవనం బ్రద్దలు కాకుండా ధరించేశక్తి పరమశివునకే ఉన్నదని సెల విచ్చింది. మీ కరుణ ప్రసరించండి, అనగా శివుడు శ్రీమన్నారాయణ పాదసంభూతఅయిన గంగను శిరసున దాల్చడానికి అంగీకరించాడు. దివినుండి శివుని శిరసున దిగింది గంగ.

పరమశివుని జటాజూటంనుండి నిరర్గళ ప్రవాహంతో గంగానది క్రిందికి దిగుతుంటే భగీరథుడు తన రథాన్ని శరవేగంతో నడుపుతూ తన ప్రపితామహుల భస్మరాశివరకూ వెళ్ళాడు. లేగదూడవెంట పరుగెత్తే గోవులా గంగానది అనుసరించింది.

ఆ దివ్యగంగాజలాలలో భస్మం తడిసింది. వారందరూ సర్వపాపాలూ పోగొట్టుకుని ఉత్తమలోకాలు చేరారు. ఎందరో మహర్షులు ఆ నదీజలాలలో స్నానంచేసి పవిత్రులై నారాయణ సన్నిధానం చేరుకున్నారు.

అలా భగీరథనరపాలుడు గంగను భూలోకానికి తెచ్చి కీర్తిమంతుడై రాజ్యపాలనం సాగించాడు.

అనంతరం ఆవంశంలో ఎందరో ప్రభవించి రాజ్యపాలనం చేశారు. సాగించినవారిలో పృధుశ్రవునికి అజ మహారాజు; ఆయనకు దశరథమహారాజు, ఈయనకు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు విష్ణ్వంశతో ప్రభవించారు.

వీరి చరిత్రను వాల్మీకిమునిచంద్రుడు చక్కనికావ్యంగా అందించాడు. ఆ గాథ వివరిస్తాను, అని శుకయోగి అందుకుంటున్నాడు.

* * * *

# రామావతారం

దశరథమహారాజుకు ముగ్గురు భార్యలు. అందులో పట్టమహిషి కౌసల్యకు రామచంద్రుడు, కైకకు భరతుడు, సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులు పుట్టారు.

వారికి నూనూగుమిసాల వయసు వచ్చింది. ఆ రోజులలో విశ్వామిత్రమహర్షి వచ్చి, తన యాగరక్షణకు రామ లక్ష్మణులను తీసుకువెళ్ళాడు. వెళ్ళేదారిలో అడ్డువచ్చిన దానవి తాటకను రాముడు సంహరించాడు.

యజ్ఞవిఘ్నకారులలో సుబాహుని హతమార్చి మారీచుని వాయువ్యాస్త్రంతో సముద్రం ఒడ్డుకి పారేశాడు.

అనంతరం విశ్వామిత్రునితో మిథిలానగరం చేరి, అక్కడి శివధనుస్సును చెరకుగడలా విరిచి, జనకపుత్రి సీతను వివాహమాడాడు.

ఎదురువచ్చిన మహావీరుడు పరశురాముని నిలబెట్టి తన ప్రతాపం ప్రదర్శించాడు.

సీతాసహితుడై అయోధ్యచేరి కాలం గడుపుతూండగా మహారాజు రామునికి పట్టాభిషేకం తలపెట్టాడు. కైక తన వరాలు గుర్తుచేసి, రాముని అడవికిపంపింది. రామభద్రునివెంట సీతా, లక్ష్మణులుకూడా వచ్చారు. భరతుడు రాజయాడు.

రాముడు మునుల ఆశ్రమాలు దర్శిస్తూ, చిత్రకూటంవద్ద కొంతకాలం గడిపి, పవిత్ర గౌతమీతీరాన మునిజనావాసమైన దండకారణ్యం చేరాడు.

అక్కడ పర్ణశాలలో ఉండగా రావణుని చెల్లెలు శూర్పణఖవచ్చి రామునికామించగా లక్ష్మణుడు దాని ముక్కు చెవులు కోసి పంపాడు.

ఆ వార్తవిని దాని బంధువులు ఖర దూషణాదులు పదునాలుగువేలమంది దాడికిరాగా వా రందరినీ రామభద్రుడు నేలకూల్చాడు.

శూర్పణఖవెళ్ళి సీతాదేవి సౌందర్యాన్ని వర్ణించగా రావణుడు తనమంత్రి మారీచుని మాయలేడిగా పంపి రామ లక్ష్మణులను వంచించి సీతను అపహరించాడు.

సీతను అపహరించకుండా అడ్డువచ్చిన జటాయువు రావణఖడ్గానికి బలిఅయాడు.

జటాయువుకు దహనసంస్కారం జరిపి, సీతాన్వేషణ సాగిస్తూ రామ లక్ష్మణులు కిష్కింధలో ఋశ్యమూకంమీద సుగ్రీవునితో స్నేహంజేసి, సుగ్రీవుని భార్యను హరించిన వాలిని నేలకూల్చి, సుగ్రీవుని వానరరాజ్యాధిపతిని చేశారు. సీతాన్వేషణకు హనుమంతుని పంపాడు రాముడు.

వాయునందనుడు అవలీలగా సముద్రందాటి లంకలో ప్రవేశించి, జానకీదేవిని దర్శించి, అక్షకుమారాది రాక్షసులను సంహరించి, లంకకు నిప్పుపెట్టి, తిరిగివచ్చి రామునికి సమాచారం చెప్పాడు.

ఆయన వానర భల్లూకసేనలతో సముద్రతీరం చేరి, దారి యిమ్మని సముద్రుని కోరినా ఆ సముద్రుడు ఉలకక, పలకక ఊరుకున్నాడు. రాముడు క్రోధోద్రిక్తుడై ధనుస్సందుకోగా సముద్రుడు ఎదురుగా వచ్చి అనేక విధాలస్తుతించి:

కట్టుము సేతువు
లంకం జుట్టుము, నీ బాణవహ్ని

సురవైరి తలల్ గొట్టుము నేలంబడ
చే పట్టుము నీ అబల అధిక భాగ్యప్రబలన్

అనగా రాముడు సేతునిర్మాణానికి ఆజ్ఞ యిచ్చాడు.

వానరులు మహావృక్షాలు పెకలించి సముద్రంలో వేస్తూ, వాటిమీద బండరాళ్ళు పరిచి సేతువు నిర్మించి, లంకలో అడుగుపెట్టారు. రావణుని సోదరుడు విభీషణుడు శరణువేడగా రాముడు అనుగ్రహించాడు.

వానరవీరులు లంక చుట్టుముట్టారు.

సరోవరంలో మత్తగజం ప్రవేశించి హాయిగా యీదులాడుతూ కలచిపారేసినట్లు రాక్షసరాజధానిలో వానరయోధులు కల్లోలం లేపారు.

లక్ష్మణుని శరాఘాతాలకు రావణసుతుడు అతికాయుడు నేలకూలాడు. రాముని చేతిలో కుంభకర్ణుడు ప్రాణాలు వదిలాడు.

అనంతరం వచ్చిన ఇంద్రజిత్తు లక్ష్మణుని బాణాగ్నికి ఆహుతిఅయాడు.

అప్పుడు రావణుడు విమానంమీద రాగా దేవేంద్రుడు తన రథాన్ని పంపిరామునికి సాయపడ్డాడు.

దివ్యరథంమీద రాముడు తూర్పుదిక్కున వెలిగే సూర్యునివలె ప్రకాశిస్తూ :

రావణా! మాయలేడితో మోసగించి, మాయాసన్యాసివై వనమధ్యంలో ఆడదాన్ని అపహరించడంకాదు రణరంగంలో రామునిముందు నిలవడం, అంటూ ధనుష్టంకారం చేసి బాణం వదిలాడు.

దశరథు సూనుం డేసిన
విశిఖము హృదయంబు దూర
వివశుండగుచున్ దశకంధరుండు
కూలెను దశవదనంబులను
రక్తధారలు దొరగన్.

అంతతో లంకానగరంలో హా హా రవాలు చెలరేగాయి. రాక్షసనారీజనం అందరూ రణరంగంలో తమ తమ నాథుల దేహాలపైబడి గోలు గోలున విలపించారు.

రావణుని పట్టమహిషి మండోదరి :

పరస్త్రీ వ్యామోహాంధులు యిహపరాలకు చెడి యిలానే గతిస్తారు, అంటూ యింత సేపు ఏడ్చింది.

అనంతరం రాముని ఆజ్ఞానుసారం విభీషణుడు అన్నగారికి దహన సంస్కారాలు చేశాడు.

రాముడు లోకులకు విశ్వాసం కలిగించడానికి జానకిని అగ్నిపరిశుద్ధను చేసి, లంకకు విభీషణుని అధిపతిని చేసి, పుష్పకారూఢుడై వానరయోధులందరితో బయలుదేరి భరతుడున్న నందిగ్రామం చేరాడు.

అప్పుడు భరతుడు రాముని పాదుకలు శిరసున పెట్టుకుని తెచ్చి, ఆయన పాదాల వ్రాలి ఆనందబాష్పాలతో కడిగాడు.

అనంతరం అందరూ అయోధ్యచేరారు. రాముడు ముందుగా తల్లులకూ పెద్దలకూ అభివాదాలు అర్పించాడు.

నగరం అంతా పరిశుభ్రంగా తడిపించి, అలంకరించి, మంగళవాద్యాలతో రామ పట్టాభిషేకం సాగించారు.

తండ్రి క్రియ రామచంద్రుడు
తండ్రుల మరపించి ప్రజల
తా రక్షింపం - తండ్రుల నందరు మరచిరి
తండ్రిగదా రామచంద్ర ధరణీపు డనుచున్

అలా సర్వప్రజారంజకంగా ఆయన ఏలుబడి సాగుతోంది.

సిగ్గువడుట గల్గి సింగారమును కల్గి
భక్తి కల్గి చాల భయముకలిగి
నయము ప్రియము కలిగి నరనాథు చిత్తంబు
సీత తనకు వశము చేసికొనియె.

ఆ యిల్లాలితోకూడి రామభద్రుడు సత్క్రతువులు సాగించి హెూతకు తూరుపు దిక్కును, సామగానం చేసినవానికి ఉత్తరదిగ్భాగాన్ని, బ్రహ్మపీఠం నిర్వహించిన వేద వేత్తకు దక్షిణదిశనూ, అధ్వర్యునికి పశ్చిమదిగ్భాగాన్నీ ధారవోశాడు. మిగిలిన ధన, కనక, వస్తు, వాహనాలు విప్రశ్రేష్ఠులకు దానం చేశాడు.

యజ్ఞాంతానికి ఆయన ధరించిన రెండు వస్త్రాలే ఆయనకు మిగిలాయి. జానకీదేవికి మెడలో మంగళసూత్రం మిగిలింది. అంత ఉదారంగా సర్వస్వమూ ధారవోసిన రామ భద్రునికి అంజలి ఘటించి వారందరూ తమ తమ రాజ్యాలు రామునికే ధారవోసి.

స్వామీ, మా అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతి ప్రసాదించు, అనగా స్వామి అనుగ్రహించాడు.

మునులందరూ తమ ఆశ్రమాలకు వెళ్ళారు.

రాముడు సత్య ధర్మకవచంతో రాజ్యం పాలిస్తున్నాడు.

ఒకనా డాయన రాత్రివేళ తన ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకుందామని తిరుగుతూండగా ఒక చోట, ఒక పురుషుడు తన భార్యతో!

ఓసి, దుర్బుద్ధీ! పరాయయింట యింతకాలం గడిపి వచ్చిన నిన్ను ఏలడానికి నేను వెర్రిరాముణ్ణి కాను, ఫో! నీ యిష్టం వచ్చిన చోటికి, అన్నాడు.

విన్నాడు రాముడు. భవనానికి వస్తూనే రాత్రికి రాత్రి నిద్రలో వున్న సీతను వాల్మీకి మహర్షి ఆశ్రమంలో విడిచిపెట్టి రమ్మన్నాడు.

అప్పటికే గర్భవతిగా వున్న సీతాదేవి ఆ ఆశ్రమంలో లవ కుశలను ప్రసవించింది. వారికి మహర్షి జాతకర్మాదులు జరిపించి వేద వేదాంగవిద్యలుబోధిస్తున్నాడు.

అయోధ్యలో లక్ష్మణునికి అంగదుడు, చంద్రకేతుడు పుట్టారు. భరతునికి దక్షుడు, పుష్కలుడు కలిగారు. శత్రుఘ్నుని కుమారులు సుబాహు, శ్రుతసేనులు వీరందరూ కుల గురువులవద్ద సర్వవిద్యలూ అభ్యసిస్తున్నారు.

వాల్మీకి మహర్షి సన్నిధిని అన్నివిద్యలూ నేర్చిన కుశ లవులు మధురగంభీరగళంతో మహర్షిఉపదేశించిన రామకథ గానం చేస్తూ ఒకనాడు రామునియజ్ఞశాలలోకూడా గానంచేశారు.

వింటూన్న రామునిహృదయం ద్రవించి, కన్నుల నీరు నిండగా:

చిన్నియన్నలార! శీతాంశు ముఖులార
నళినదళ విశాల నయనులార!
మధురభాషులార! మహిమీద ఎవ్వరు
తల్లి తండ్రి మీకు ధన్యులార!

అనగా వారు :

రాజచంద్రా! మేము మహర్షి వాల్మీకి మనుమలము, రాఘవేశ్వరులయాగం చూడాలని వచ్చాం, అన్నారు.

రాముడునవ్వి : రేపుఉదయం మీ తండ్రిని చూడవచ్చు. ఈ పూటకు విశ్రాంతి తీసుకోండి, అని విశ్రాంతిభవనానికి పంపాడు.

మరునాడు ఉదయం వాల్మీకి సీతతో కుశ లవులను వెంటబెట్టుకుని రామునిచేరి :

సీత ముద్దరాలు చిత్త వాక్కర్మంబు
లందు సత్యమూర్తి అమలచరిత
పుణ్యసాధ్వి విడువ బోలదు చేకొను
రవికులాబ్ధిచంద్ర! రామచంద్ర!

అన్నాడు.

ఆక్షణంలో సీత తనబిడ్డలను వాల్మీకికి అప్పగించి, భూమిలోకి వెళ్ళిపోయింది.

అదిమొదలుగా రామభద్రుడు బ్రహ్మచర్యనియమంతో, కొంతకాలం రాజ్యం పాలించి వైకుంఠం చేరాడు.

నల్లని వాడు పద్మనయనంబులవాడు
మహాశుగంబులున్ విల్లును దాల్చువాడు
కడు విప్పగువక్షమువాడు మేలు పై జల్లెడువాడు
నిక్కిన భుజంబులవాడు యశంబు దిక్కులం
జల్లెడువాడునైన రఘుసత్తము డిచ్చుత మాకభీష్టముల్

రఘువంశం అలా సాగిసాగి చివరకు మరువు అనే రాజయోగితో ఆగింది. ఈయన యోగసిద్ధితో కలాపగ్రామంలో వున్నాడు. కలి యుగాంతంలో ఈయన రఘువంశాన్ని మళ్ళీ ఉద్ధరిస్తాడు.

# చంద్రవంశీయులు

ప్రజాపతిబ్రహ్మకు అత్రి మహర్షి కలిగాడు. ఆయనకు చంద్రుడు ఉదయి
ఈయన తారామండలానికి రాజుగా, ఓషధులకు అధీశుడుగా ప్రఖ్యాతుడయాడు.
రాజసూయం చేసి ముల్లోకాలూ గెలిచాడు,

ఈ చంద్రుడు దేవగురుని భార్య తారను కామించాడు. ఆమె గర్భవతి
కుమారునికన్నది. ఆ సుందరాకారుని చూచి బృహస్పతి తన కుమారునిగా
ననగా వివాదంరేగింది. బ్రహ్మవచ్చి విషయం గ్రహించి వానిని చంద్రుని పు
పంపించాడు. ఆ కుమారుడే బుధుడు.

బుధునిభార్య ఇళ. వీరి కుమారుడు పురూరవుడు. వీని రూపురేఖా
విని ఊర్వశి శాపగ్రస్థయై మానవజన్మయెత్తి భూలోకానికి వచ్చి ఆమహారాజును ఏక
దర్శించింది.

ఊర్వశీ సౌందర్యమోహితుడై పురూరవుడు ఆమెను చేరి తనకోరిక తెలిపా

ఊర్వశి నవ్వుతూ : రాజేంద్రా! నాకు రెండు నియమాలున్నాయి. అవి
పాటిస్తే నిన్ను వరిస్తాను. నియమం తప్పినక్షణంలో నిన్ను విడిచిపోతాను. నాకు
గొర్రె లున్నాయి. వానిని నిరంతరం నువ్వు రక్షిస్తూండాలి. రెండవది - ఎన్న
ముందు నువ్వు దిగంబరంగా కనపడకూడదు, అంది.

మోహమత్తుడైన పురూరవుడు ఆమోదించి, ఆమెతో నిర్విరామ శృంగా
సాగిస్తున్నాడు.

సాగుతూండగా అమరావతిలో దేవేంద్రుడు, తన సభలో యింతకాలంగా
లేక పోవడం లోటుగా ఉన్నదని గంధర్వులను పంపించాడు

గంధర్వులు వచ్చి ఒకనాటి రాత్రి అత్యంత రహస్యంగా ఊర్వశి
గొర్రెలను అపహరించబోగా అవి రోదనం చేశాయి, వాని అరుపు సాగుతున్నా పు
గాఢనిద్రలోనే వుండిపోయాడు.

ఊర్వశి లేచి : నా కన్నబిడ్డలవంటి పొట్టేళ్ళను దొంగలు అపహరిస్తున్నా
నిద్రపోయే నువ్వూ మగవాడివేనా! నోరులేని పశువులను రక్షించలేవు. ప్రియురా

తప్ప మరేమీ ఎరగని మగవాడై పుట్టడంకంటె ఆడ జన్మ మేలు, అని అనేకవిధాల నిందించగా, భరించలేక శయ్యదిగిన వాడు దిగినట్లేపోయి ఆ దొంగలను సంహరించి గొర్రెలు తోలుకు వచ్చాడు.

రాత్రి నిద్రమైకంలో శరీరంమీద వస్త్రం ఉన్నదీ, లేనిదీ చూసుకోకుండా పోయి వచ్చి దిగంబరంగా నిలబడగా, తక్షణం ఊర్వశి అంతర్థానం అయింది.

ప్రియురాలు కనిపించక దీనంగా విలపిస్తూ తిరిగి తిరిగి సరస్వతీ నదీ తీరాన చెలికత్తెలతో వున్న ఊర్వశిని చూసి, పరిపరివిధాల వేడగా ఆమె :

మహారాజా తియ్యతియ్యని మాటలతో వంచించడమే తప్ప, మన్మథునికూడా మనసారా ప్రేమించని వేశ్యలతో నీకెందుకయ్యా.

సరే, ఒక్క సంవత్సరం ఆగి నా దగ్గరకురా. అప్పుడు నీకు యోగ్యులయిన పుత్రులను అందిస్తాను, అనగా ఆమె గర్భవతి యని గ్రహించి పురూరవుడు తరలివెళ్ళాడు.

సంవత్సరం గడిచాక ఊర్వశి దగ్గరకు పోగా ఆమె గంధర్వులను వేడుకో అంది. వారు అగ్నిస్థాలి యిచ్చారు. అదే ఊర్వశిగా భావించి కొంతకాలం గడిపాక విషయం తెలిసి దానిని విడిచిపెట్టాడు.

అయినా ఆయన మనస్సు ఆమె మీదనే ఉంది.

అంతలో కృతయుగం గడిచి త్రేతాయుగం ప్రవేశించింది. ఆయన మనస్సులో వేదధర్మం మూడు విధాలుగా గోచరించగా, జమ్మిచెట్టులో పుట్టిన రావిచెట్టు కొమ్మలు రెండు అరణులు చేశాడు. మొదటి అరణి తానుగా, రెండవది ఊర్వశిగా నడుమనున్న కర్ర కుమారుడుగా మథనం చేయగా జాతవేద రూపంతో అగ్ని సంభవించి ఆహవనీయాగ్నిగా ప్రఖ్యాత మయింది.

ఆ అగ్నితో పురూరవుడు శ్రీహరిని ఆరాధించాడు. అనంతరం గంధర్వలోకంలో ఊర్వశిని చేరి ఆయువు, శ్రుతాయువు ఆదిగా ఆరుగురు కుమారులను కన్నాడు.

ఆ వంశంలో కుశాంబుడికి గాధి పుట్టి రాజ్యం పాలిస్తున్నాడు. గాధికూతురు సత్యవతిని ఋచికుడు భార్యగా అర్థించాడు.

ఆరాజు : మృదువయిన దేహాలతో, నల్లనిచెవులతో అలరారే వెయ్యి గుర్రాలిస్తే పిల్లనిస్తాను. అనగా ఆయన వరుణునివేడి గుర్రాలుతెచ్చి పిల్లను పెళ్ళి చేసుకున్నాడు. కొంతకాలం జరిగింది.

భార్య సత్యవతి, ఆమె తల్లి తమకు పుత్రసంతానం కావాలని ఋచికుని వేడగా ఆయన క్రతువు సాగించి, విప్రమంత్రపూతంగా ఒకహవిస్సు, రాజమంత్రాలతో ఒక హవిస్సు సిద్ధంచేసి నదీస్నానానికి వెళ్ళాడు.

అనమయాన సత్యవతి విప్రమంత్రపూతమయిన దొన్ని తల్లి కిచ్చి, రెండవది తాను ఆరగించింది.

స్నానంచేసి వచ్చిన ఋచికుడు విషయం గ్రహించి:

అమాయకురాలా! మీరిద్దరూ చేసిన తెలివితక్కువవల్ల మీ అమ్మకు బ్రహ్మవేత్త పుడతాడు. నీ గర్భాన పరమక్రూరుడు పుడతాడు, అనగా దీనంగా ప్రార్థించింది.

ఆయన కరుణించి: నీ కొడుకు సాధువుగా ఉండి, నీ మనుమడు క్రూరుడవుతాడు, అని పంపించాడు.

సత్యవతికి కలిగిన కుమారుడే జమదగ్ని. ఆయనభార్య రేణుక. వీరికి పురుషోత్తమాంశతో పరశురాముడు పుట్టాడు. ఆయన కథ వివరిస్తాను.

# పరశురాముడు

బ్రహ్మనిష్ఠాగరిష్ఠుడైన జమదగ్ని కుమారుడుకదా! ఈయనకు రాజవంశనిర్మూలనమనే తామసప్రవృత్తి ఎలా వచ్చిందీ, అని అనుమానం కలుగుతుంది; దానికి కారణంగా సాగిన వృత్తాంతం వినిపిస్తా అని శుకయోగీంద్రుడు:

రాజేంద్రా! హైహయవంశీయుడైన కార్తవీర్యార్జునుడనే రాజు దత్తాత్రేయుని ఆరాధించి ఆయన అనుగ్రహంతో వెయ్యిచేతులూ, శత్రుసంహారసామర్థ్యమూ సాధించాడు. అణిమాది సిద్ధులుకూడాసంపాదించి ఆశక్తితో గాలివలె ఎక్కడికయినా అవలీలగా పోయి తన ప్రతాపంతో కీర్తి నంపాదించాడు.

అలా ఆయన రాజ్యంపాలిస్తూ, ఒకనాడు భార్యలతో కలసి రేవానదిలో జలక్రీడలు సాగించేసమయంలో, విలాసంగా తన వెయ్యిచేతులు అడ్డంపెట్టి, నదికి ఆనకట్ట చేశాడు.

అదే వేళకు దిగ్విజయయాత్రలో ఆనదిఒడ్డున విడిసిన రావణుడు, నదిపొంగి ప్రవహించడం చూసి క్రోధంతో కార్తవీర్యార్జునుని ఎదుర్కొనబోగా, ఆ సహస్రబాహువు సునాయాసంగా రావణుని జుట్టుపట్టి మోకాళ్ళమీద నడిపించి చెరసాలలో పెట్టాడు.

తన జలక్రీడ అయాక నగరంలో చెరసాల దగ్గరకుపోయి.

రావణా! ఇప్పుడు విడిచి పెడుతున్నాను. ఇకముందెన్నడూ యిటురాకు, అని ంందలించి పంపేశాడు.

కాలచక్రం తిరుగుతోంది.

ఒకనాడాయన పరివారంతో వేటకు వెళ్ళి, బాగాఅలసి ఆకలిబాధ అధికంకాగా కేరువనున్న జమదగ్నిముని ఆశ్రమం చేరాడు.

ఆశ్రమప్రాంగణంలో అంజలించి నిలబడ్డ రాజును ఆదరంగా లోపలకి తీసుకువెళ్ళి ఆయనకూ ఆయన పరివారానికీ తృప్తిగా పంచభక్ష్యాలతో భోజనం పెట్టాడు.

ఆశ్రమవాసి యింత ఆర్భాటం ఎలా చెయ్యగలిగాడో ఎరుగుదువా!

ఆయన కొక ధేను వుంది ఆ గోవు ఆయన మనసులోని కోరికలు తీరుస్తుంది.

అంత అనాయాసంగా అన్నిసుఖాలూ యిచ్చే ఆగోవు తనకు కావాలన్నాడు.

మాట్లాడ లేదు జమదగ్ని.

పరివారానికి ఆజ్ఞ యిచ్చాడు రాజు.

రాజు శాసనంతో వారు ఆ గోవును తోలుకు పోయారు. తరువాయి కొంతసేపటికి వనంనుంచి ఆశ్రమంచేరిన పరశురాముడు జరిగిన కథవిని.

ఔరా! ఆదరించి అన్నంపెడితే తినిపోలేక నా తండ్రిని ధిక్కరించి హోమ ధేనువునే తోలుకుపోతాడా! మన సంగతి ఎరుగడు కాబోలు, అని ప్రళయకాలాగ్నిలా సర్వాయుధధారియై మాహిష్మతీనగరంచేరి నిప్పులు కక్కుతూ నిలబడగా చూచి, కార్త వీర్యార్జునుడు అపహాసంతో:

బాలుడు వెర్రి బ్రాహ్మణుడు
బ్రాహ్మణుకైవడి నుంటమాని
భూపాలురతోడ భూరిబలభవ్యులతోడ
భయంబు దక్కి కయ్యాలకు వచ్చినాడు
మనయందిక పాపములేదు లెండు
లెండేల సహింప భూసురుని
ఏయుడు వ్రేయుడు గూల్చు డిమ్మహిన్

అని సేనానులకు ఆజ్ఞ యిచ్చాడు.

చతురంగ బలాలతో వారు పరశురాముని వేధించారు. కొంతసేపు వారి ఆట సాగనిచ్చి కన్నుల నిప్పులు జిమ్ముతూ, వజ్ర సదృశమయిన ఖండ పరశువుతో చెట్లు నరికి నట్లు వారి తలలు నరుకుతూ, తాటిపళ్ళవలె అవి నేలకు రాలుతూంటే అట్టహాసంచేస్తూ కొందరి దేహాలు పనసపెచ్చుల్లా చెక్కుతూ, కొంతసేపు ధనుస్సుతో బాణవర్షం కురిపించి ఆ ప్రాంతమంతా రక్త మాంస సముద్రం చేశాడు. ఆ వార్త విని కార్తవీర్యార్జునుడురాగా గండ్ర గొడ్డలితో సహస్రకరాలూ నరికి చివరకు శిరస్సు నేలకూల్చాడు.

తమ తండ్రిని సంహరించిన పరశురామునితో యుద్ధం చేసే సాహసంలేక రాకుమారులు పలాయనం చేశారు.

అప్పుడు పరశురాముడు హోమధేనువును తెచ్చి తండ్రికిచ్చి నిలిచి జరిగిన గాథ చెప్పగా, ఆయన విచారించి నాయనా! భూనాథుని చంపటం మంచిదికాదు. పయిగా మనకు ఓరిమి ఉండాలి కాని ఆగ్రహం పనికిరాదు.

క్షమ కలిగిన సిరి కలుగును

క్షమ కలిగిన వాణి కలుగు

సౌరప్రభయున్ క్షమ కలుగ తోన కలుగును

క్షమ కలిగిన మెచ్చు శౌరి సదయుడు తండ్రీ!

మహారాజును చంపిన పాప పరిహారార్థం పుణ్యతీర్థాలు సేవించిరా, అని పంపగా పరశురాముడు ఒకసంవత్సరం తీర్థయాత్రలు చేసి వచ్చాడు.

ఒకనాడు తల్లి రేణుక గంగానదికి నీరు తేవడానికి వెళ్ళి, అక్కడ అప్సరసలతో క్రీడలు సాగించే చిత్రరథుని చూస్తూ ఉండిపోయి, హోమసమయం దాటి యింటికిరాగా ముని కోపించి కొడుకులను పిలిచి రేణుక శిరస్సు ఖండించమనగా జమదగ్ని నందనులు మాతృహత్యకు సాహసించలేకపోయారు. పరశురాముని పిలిచి నీ సోదరులతో తల్లిని కూడా సంహరించు, అనగా తండ్రిమాట కాదనలేక అందరినీ గండ్రగొడ్డలితో నేల కూల్చాడు.

జమదగ్ని సంతోషంతో కొడుకువైపు చూడగా పరశురాముడు ఆయన పాదాలవ్రాలి: వీరందరికీ పునర్జన్మ ప్రసాదించండి, అనగా అనుగ్రహించారు.

అయితే వారితో సగంమంది తండ్రి పాదాలపై వ్రాలి: మే మందరం నీనిని అన్నగా ఆరాధిస్తాం, అనడంతో వారిని అనుగ్రహించాడు.

ఇందువల్లనే విశ్వామిత్రగోత్రులలో రెండు ప్రవరలు వినిపిస్తాయి.

ఇక పురూరవవంశంలో ఎందరో రాజ్యపాలనం చేసి దివి చేరారు. ఆవంశీయుడయిన నహుషుడు నూరుయజ్ఞాలుచేసి యింద్రపదవి అధిష్ఠించినా అహంకారం, కామం చావక శచీదేవిని భార్యగా గ్రహించాలని మునులుచేత తన వాహనం మోయించి వారిశాపంతో అజగరం (కొండచిలువ) అయాడు.

నహుషుని పెద్దకొడుకు యతి. ఈయన రాజ్యపాలనం బహుపాతకహేతువని ముక్తిమార్గాన వనాలకు వెళ్ళగా యయాతి రాజుగా సింహాసనం అధిష్ఠించాడు. ఈయన కథ రసవత్తరంగా ఉంటుంది, విను, అని శుకయోగి చెపుతున్నాడు.

# యయాతి చరిత్ర

ఆరోజులలో దానవచక్రవర్తి వృషపర్వుడు వాని కులగురువులు శుక్రాచార్యులు. వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ. నవయౌవనశోభతో అలరారే శర్మిష్ఠ ఒకనాడు ఉద్యానవనంలో చెలికత్తెలతో, గురుపుత్రి దేవయానితో కలసి విహరిస్తూ, కొంతసేపు పూలుకోసి, మరికొంతసేపు పూలతీగెల ఉయ్యాలలూగి, అలసి పద్మసరోవరంలో చెలికత్తెలతో ఈదుతూ ఆడుకుంటున్నది.

ఆసమయానికి గౌరీసహితుడై పరమశివుడు ఆప్రాంతానికి విహారానికిరాగా, జలక్రీడలో వున్న తరుణీమణులందరూ చకచక గట్టుమీదికి వచ్చి త్వరత్వరగావస్త్రాలు ధరించారు. ఆతొందరలో దేవయాని పొరపాటున శర్మిష్ఠ ధరించిన చీనాంబరం కట్టుకుంది.

అదిచూసి శర్మిష్ఠ: నా దువ్వలువ కట్టే సాహసం యీ దాసీకి ఎక్కడిది? అని నిందించింది.

అప్పుడు దేవయాని మరింతకోపంతో:

అఖిలలోకాలూ సృష్టించినవాడు ప్రజాపతి బ్రహ్మ. ఆ బ్రహ్మవంశంలో పుట్టిన భృగువంశీయుడు నా తండ్రి భార్గవుడు. ఆయన కుమార్తెను నేను. సర్వలోక పూజ్యుడయిన ఆచార్యశుక్రుని కుమార్తెను. నా వస్త్రాలు ధరించే దుస్సాహసం నీకెక్కడిదే!

నాతండ్రి అనుగ్రహంతో జీవించే తండ్రి బిడ్డవు నువ్వు. బంగారుగొలుసులు దిగవేసు కున్నంతలో శునకానికి హవిస్సు తినే అర్హత వస్తుందా! ఈమాత్రం తెలియకనన్ను అవమానిస్తావా! అని తీవ్రంగా దూషించింది.

మహారాజుకుమార్తె ఆ దూషణ భరించలేక, త్రాచుపాము బుసకొడుతున్నట్లు నిట్టూర్పులు విడుస్తూ, పటపట పళ్ళుకొరికి, పెదవులు కదిలించి:

దీనితండ్రి మానాన్న దగ్గర యాచకుడు. ఆ దరిద్రుని కూతురైన దీని కింత కావరమా! అని చెలికత్తెలతో:

దీన్ని ఆనూతిలోకి తోసెయ్యండి, అంది.

రాకుమారి ఆదేశానుసారం చెలికత్తెలు ఆమెను నూతిలో పారేశారు. సంతోషంతో శర్మిష్ఠ యింటికి వెళ్ళింది.

మరికొంతసేపటికి యయాతి మహారాజు ఆ వనానికి వేటకువచ్చి, ఆనూతిసమీపాన తిరుగుతూ, ఆర్తనాదం విని లోపలకుచూసి, దీనంగావున్న తరుణిని రక్షించే సంకల్పంతో, తన ఉత్తరీయం ఆమెకు కట్టుబట్టగా యిచ్చి, చేయూతతో దేవయానిని పైకిలాగాడు.

సప్తాంభోనిధిమేఖలావృత మహాసర్వం సహా
కన్యకా ప్రాప్తోద్యత్ వరదక్షదక్షిణకర్ణపాలంబముంజేసి
ప్రోత్క్షిప్తంజేసె, యయాతి, కట్టుకొన పై చేలంబు మున్నిచ్చి
పర్యాప్త స్వేదజలాంగి నాళి సముదాయ స్వర్గవిన్ భార్గవిన్

ఆబావినుండి కుడిచేతితో తన్ను పైకిలాగిన యయాతిని చూస్తూ దేవయాని:

ఆర్యా! నా పాణిగ్రహణం చేసిన నిన్ను తప్ప మరొకరిని నేనుభర్తగా స్వీకరించను. పద్మాలలో మకరందం ఆస్వాదించే తుమ్మెద మరొక పువ్వుమీద వ్రాలుతుందా; అని సిగ్గుతో:

నేను రాక్షసగురుడైన శుక్రాచార్యులవారి బిడ్డను. నన్ను దేవయాని అనిపిలుస్తారు. కొంతకాలం దేవగురునందనుడు కచుడు మా పితృపాదులదగ్గర మృతసంజీవనీ విద్య నేర్చుకుందుకు వచ్చాడు. ఆయనయందు నా మనసు లగ్నమయిందికాని గురుపుత్రినని నన్ను విడిచిపెట్టాడు. ఆకోపంతో నేను శపించాను. ఆయన మరింత ఆగ్రహంతో నన్ను మా వంశీయుడు పెళ్ళిచేసుకోడు, అని శపించాడు. అందువల్ల నేను మిమ్ము భర్తగా గ్రహిస్తున్నాను, అంది.

దైవం యిలా జరగాలని భావించి ఉంటాడు, అనుకుని అంగీకరించాడు. యయాతి.

అనంతరం దేవయాని ఆశ్రమానికి వచ్చి తండ్రితో శర్మిష్ఠ చేసిన అకార్యమూ, ఆడిన అవమానకర వాక్యాలూ వివరించి :

నాన్నా! ఇంతటి క్రూరులసేవ చేసి బ్రతకడంకంటె పావురాలవలె రాళ్ళుతిని బ్రతకడం మేలు, అనగా బిడ్డమీది అనురాగంతో శుక్రుడు రాక్షస రాజధాని విడిచి పోవడానికి నిశ్చయించాడు.

ఈవార్త తెలిసి వృషపర్వుడు పరుగు పరుగున వచ్చి శుక్రాచార్యుల పాదాల వ్రాలి, తప్పు మన్నించుమని ప్రార్థించగా ఆచార్యుడు :

దానవేంద్రా! ఇది మొదలుగా నీ కుమార్తె శర్మిష్ఠ తన దాసీజనంతో నా బిడ్డను సేవించాలి. అందుకు సిద్ధపడితే నేను నీ దగ్గర ఉంటాను, అన్నాడు.

అంగీకరించాడు వృషపర్వుడు.

అనంతరం యయాతిని రావించి శుక్రాచార్యులు తన కుమార్తె నిచ్చి విధ్యుక్తంగా వివాహం జరిపించాడు.

యయాతి మహారాజుతో దేవయానినీ, ఆమె చెలికత్తెలనూ పంపుతూ :

యయాతీ! ఈరాక్షసరాజపుత్రితో నీకు సంగమం ఉండరాదు, అని శర్మిష్ఠను చూపి ఆదేశించాడు.

యయాతి దేవయానితో విలాస విహారాలు చేస్తూ, ఆమెకు సంతోషం కలిగిస్తూ యిద్దరుపిల్లలను కన్నాడు. వారు యదు, తుర్వసులు.

అలాఉండగా ఒకనాడు శర్మిష్ఠ ఏకాంతంలో యయాతిని కలిసి తనవాంఛ వ్యక్తం చేయగా యయాతి ఆమెతో శృంగారక్రీడలు జరుపుతూ ఆనందపరిచాడు.

శర్మిష్ఠకు ముగ్గురుకొడుకులు కలిగాక దేవయానికి ఆరహస్యం తెలిసింది. యయాతి ఎంతవేడినా దేవయాని వినక తండ్రికి చెప్పింది.

ఆయన కోపించి : తక్షణం వార్ధక్యం అనుభవించు, అన్నాడు.

యయాతి దీనంగా ఆయన పాదాల వ్రాలి: ఆర్యా! ఈ నాటికీ నాకు దేవయాని మీద మనసుతీరలేదు. అనుగ్రహించండి అని ప్రార్థించాడు.

# శకుంతల

ఈ వంశంలో పుట్టిన దుష్యంత మహారాజు కథ వినదగ్గది. ఆ మహారాజు ఒకనాడు సేనాసమూహంతో అరణ్యానికి వేటకు వెళ్ళాడు

వేటలో బాగా అలసి దాహశాంతికై సమీపంలో వున్న కణ్వమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ ఆశ్రమ ప్రాంగణంలో:

నెమళ్ళు తమ రెక్కలతో చల్లగా విసురుతూంటే త్రాచుపాములు విశ్రాంతి తీసుకుంటున్నాయి.

ఏనుగుగున్నలతో ముద్దులాడుతూ, వాటికి మేత పెడుతున్నాయి సింహాలు.

తోడేళ్ళు రక్షణగా నిలబడ్డాయి, లేళ్ళు క్రీడలు సాగిస్తూంటే:

పెద్దపులులు ఆవుల మెడలమీద దురదతీర గోకుతున్నాయి. పిల్లులు, ఎలుకలు కలిసి ఆడుతున్నాయి.

ఈ విధంగా సర్వవన్యమృగాలూ జాతివైరాలు విడిచి ప్రశాంత జీవనం సాగించే ఆశ్రమం చేరుతూ, మహర్షికి అభివాదంచేసి ఆశీర్వాదం పొంది వస్తానని సైన్యాన్ని దూరంగా వుంచి లోపల ప్రవేశించాడు దుష్యంతుడు.

ఆశ్రమంలో పద్మాలతో నిండిన కొలను.

కొలను సమీపంలో సువాసనలీనే పూలపొదలు.

ఎన్నో రకాల చెట్లు, చెట్ల నిండా శుక, పిక, శారికలు.

చల్లని గాలి వీచే వాతావరణంలో అరటిమొక్కల మధ్యలో ఒకానొక ప్రదేశంలో భువికిదిగిన దేవకాంతలా వున్న యువతీమణిని చూశాడు.

చూసిన క్షణంలో దుష్యంతుని మనస్సు ఆమెయందు లగ్న మయింది.

చిన్ననాటినుండీ బ్రహ్మచర్యదీక్షతో ఇంద్రియాలను జయించి, వనవాసం చేస్తూ, బ్రహ్మవేత్తగా ప్రఖ్యాతి పొందిన కణ్వమహామునికి సంతానం కలిగే అవకాశం ఎక్కడిది!

చూడగా చూడగా ఈ తరుణి రాచబిడ్డవలె కనిపిస్తున్నది. రాకుమార్తె కాకపోతే నా మనస్సు ఆమెపైప మరలడానికి వీలులేదే, పురువంశీయుల హృదయాలలో అన్యాయానికి ఆస్కారంలేదు, అని పరి పరి విధాల చింతించి, సాహసంతో:

కళ్యాణీ! నిన్ను చూస్తుంటే రాచకన్యలా కనిపిస్తున్నావు. ఎవరి బిడ్డవు? పేరేమిటి? అని ప్రశ్నించగా ఆమె సిగ్గుతో :

ఆర్యా! విశ్వామిత్రులవారి పేరు విని ఉంటారు. వారు మేనకాదేవితో కలిసి వున్న రోజులలో నన్ను బిడ్డగా కన్నారు. మహర్షి కణ్వులు నన్ను పెంచారు. మిగిలిన కథ అంతా వారికి తెలుసు. మీరు మా ఆతిథ్యం స్వీకరించండి, అంది.

ఆ మాటలతీరులో శకుంతల మనసు తనయందు లగ్నమైనట్లు గ్రహించి దుష్యంతుడు.

తరుణీ! రాజకన్యలు తమకు యోగ్యుడైన వరుని వివాహమాడడానికి అధికారం కలవారు. దానినే గాంధర్వ మంటారు. ఈ వివాహానికి ఎవరి అనుమతీ అవసరం లేదు, అని నెమ్మదిగా ఆమెను ఒప్పించి, కొంతసేపు గడిపి, రాజధానికి చేరగానే సేవకులను పంపుతానని వెళ్ళాడు.

రోజులు గడిచాయి.

శకుంతల గర్భంపండి బాలుడు కలిగాడు.

కణ్వమహర్షి వానికి జాతకర్మాదులు జరిపించాడు.

పెరిగి పెద్దవాడవుతూన్న ఆ యువకునికి వివిధ విద్యలూ నేర్పించాడు మహర్షి.

సంవత్సరాలు గడిచినా దుష్యంతుని నుండి వార్త రాకపోవడంవల్ల ఒకనాడు కణ్వుడు :

అమ్మాయీ! నువ్వు పట్టమహిషిగా రాజభోగాలతో ఉండవలసిన, దానివి. నీ కొడుకు తండ్రితో సమమయిన పరాక్రమ, విద్యలు సంపాదించాడు. ఇన్నీకాక పెళ్ళి అయిన బిడ్డ పుట్టినింట చిరకాలం వుండడం ఉచితం కాదమ్మా, అని వారిని సాగనంపాడు.

కుమారునితో శకుంతల దుష్యంతుని ఆస్థానానికి వచ్చింది. వారిద్దరినీ చూసికూడా దుష్యంతుడు ఏమీ మాట్లాడకుండా వుండిపోయాడు.

శకుంతలకు కన్నీరు మున్నీ రయింది.

అప్పుడు అశరీరవాణి;

మహారాజా! ఈమె నీ భార్య శకుంతల, వీడు నీ తనయుడు, అని ఘోషించింది. దుష్యంతుడు వారిని చేరదీశాడు.

అనంతరం కొంతకాలం రాజ్యం చేసి, కుమారుడైన భరతునికి పట్టంగట్టి పరమే పదధ్యానరతో దుష్యంతుడు తనువు చాలించాడు.

భరతుడు ధర్మపరిపాలనం సాగిస్తూ. దుష్టజనశిక్షణ ధ్యేయంగా ఎందరో రాక్షః సంహరించి, వారు బంధించిన యువతీ బృందాలను వారి వారి నివాసాలకు సర్వప్రజారంజకుడు అనే పేరు పొందాడు.

అసంఖ్యాకంగా అశ్వమేధయజ్ఞాలు చేసి అఖిలదేవతలను సంతుష్టులను చే బంగారు తొడుగులతో గజదానాలు చేశాడు.

బృహస్పతి తనయుడైన భరద్వాజుని తన పుత్రుడుగా గ్రహించాడు భర భరతుని అనంతరం యిది భరతవంశం అయింది.

భరతవంశంలో పుట్టిన రంతిదేవుని చరిత్ర ఆలకించు, అని శుకయోగిం చెపుతున్నాడు.

# రంతిదేవుడు

ఈ మహారాజు ఉదారుడు. దాన ధర్మాలతో సర్వసంపదలూ చెల్లిపోగా ; బిడ్డలతో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాడు.

దొరికిన కాయ, పండు, ఆకు తిని నీరుత్రాగి వారు జీవయాత్ర సాగిస్తున్నార

ఒకనా డింత అన్నం, నీరు దొరికాయి. అది తిందా మనుకుంటుండగా బ్రాహ్మణుడు వచ్చి భిక్షకోరగా తన అన్నంలో నగం యిచ్చి, మిగిలింది ఆరగిద్ద కుంటుండగా మరొక పేదవాడు ఆకలితో రాగా సగం పెట్టాడు. అంతలో మ వేట కుక్కలతో వచ్చాడు. మిగిలిన అన్నం వాని కిచ్చి జలపానం చేద్దామనుకుంటు మరొకడు వచ్చి: స్వామి! దాహం అన్నాడు. మంచినీరు వానికి పోసి దప్పికతీర

అంతవరకూ అన్ని వేషాలతో వానిని పరీక్షించిన బ్రహ్మాదిదేవతలు ప్రత్య వరం కోరుకోమనగా, రంతిదేవుడు:

'నా మనస్సు నిరంతరం పరమేశ్వరపాదారవింద సేవయందే లగ్నం కావాలి' అర్థించి వారి అనుగ్రహంతో పరమపదం చేరాడు.

భరతవంశీయుడైన సుహోత్రునికి హస్తి పుట్టాడు. ఈయన నిర్మించిన నగరం హస్తినాపురం.

ఈ వంశీయులలో కొందరు విప్రులయారు. వారిలో ముద్గలునికి దివోదాసు, అహల్య అని యిద్దరుబిడ్డలు. అహల్య గౌతమ పత్నియై శతానందుని కన్నది. ఈయన కొడుకు సత్యధృతి ధనుర్విద్యావిదుడు. ఈయన ఒకనాడు అడవిలో తిరుగుతూ ఊర్వశిని చూసి విచలితేంద్రియు డయాడు. తత్ఫలంగా యిద్దరు శిశువులు పుట్టారు. అరణ్యానికి వేటకు వచ్చిన శంతనుడు ఈ బిడ్డలను తెచ్చి పెంచి పెద్దచేశాడు. వారే కృపాచార్యుడు కృపి. కృపి ద్రోణాచార్యుల భార్య అయింది. కృపాచార్యుడు కురువంశగురు వయాడు.

దివోదాసు వంశం సాగి సాగి పాంచాలాధిపతు లయారు. ద్రుపదుడు ఆ వంశీయుడు.

భరతవంశీయులైన రాజు లెందరో గతించారు. వారిలో ప్రతీపమహారాజుకు దేవాపి, శంతనుడు, బాహ్లికుడు అని ముగ్గురు కుమారులు. పెద్దవాడు రాజ్యంమీద యిచ్ఛలేక వనవాసానికి వెళ్ళగా శంతనుడు రాజయ్యాడు.

ఈ దేవాపి యోగియై కలాపపురంలో నేటికీ వున్నాడు.

ఈయన కలియుగాంతంలో చంద్రవంశాన్ని ఉద్ధరిస్తాడు.

శంతనమహారాజుకి గంగాదేవికి కలిగిన భీష్ముడు పరమభక్తాగ్రేసరుడు. పరశురామునితో సమమయిన పరాక్రమం కలవాడు. సర్వధర్మవిదుడు.

శంతనమహారాజుకి సత్యవతివల్ల చిత్రాంగద, విచిత్రవీర్యులు కలిగారు. వివాహోత్పూర్వమే సత్యవతికి పరాశరుని అనుగ్రహవిశేషంవల్ల వ్యాసమహర్షి జన్మించారు. ఆయన సాక్షాత్తూ నారాయణాంశ భవుడు. ఆయన కుమారుడను నేను. నా మీది అనుగ్రహంతో నాకు భాగవతం విశదం చేశారాయన.

చిత్రాంగదుడు అకాలమృత్యువు వాతబడ్డాడు. విచిత్రవీర్యుడు ప్రభువయాడు. ఈయనకు కాశీరాజుపుత్రికలు అంబిక, అంబాలిక అని యిద్దరు భార్యలు. ఈయన నిరంతరం శృంగారక్రీడలతో క్షయవ్యాధిగ్రస్తుడై కన్నుమూశాడు.

అప్పుడు సత్యవతి ఆజ్ఞ ప్రకారం వ్యాసులవారు ధృతరాష్ట్ర, పాండురాజు, విదురులను కన్నారు.

ధృతరాష్ట్రునికి గాంధారి భార్య. వీరికి నూరుగురు కొడుకులు, ఒక క
పాండురాజుకు యిద్దరు భార్యలు. అందులో కుంతికి ధర్మరాజు. భీమార్జునులు, :
నకుల సహదేవులు కలిగారు.

అన్న దమ్ము లయిదుగురికీ ద్రౌపది భార్య. ఆమెకు వీరివల్ల ప్రతివింధ్య
సేన, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతకర్ములు పుట్టారు.

ధర్మరాజుకి పౌరవతి అనే భార్యవల్ల దేవకుడు కలిగాడు; భీమునికి హిడి
ఘటోత్కచుడు, కాళివల్ల సర్వగతుడు పుట్టారు. నకులునికి రేణుమతి యందు నిరమి
సహదేవునికి విజయ వల్ల సుహోత్రుడు కలిగారు.

అర్జునునికి నాగకన్య ఉలూపివల్ల ఇలావంతుడు, చిత్రాంగద వల్ల బభ్రువాహ
సుభద్రవల్ల అభిమన్యుడు కలిగారు.

అభిమన్యునకు ఉత్తరగర్భాన నువ్వు జన్మించావు. నీ కుమారులు జన:
శ్రుతసేన, భీమసేన, ఉగ్రసేనులు.

నువ్వు తక్షకసర్పదష్టుడ వయాక ప్రతీకారంగా నీ కుమారుడు జనమేజయు
యాగం చేస్తాడు.

ఆయనకొడుకు శతానీకుడు వేద వేదాంగాలతో ధనుర్వేదవేత్త అవుతాడు.
కొడుకు సహస్రానీకుడు. అలా ఆ వంశం సాగి సాగి బ్రహ్మక్షత్రునితో మీ వం
సమాప్త మవుతుంది.

యయాతినందనుడైన అనువు వంశం సాగి సాగి రోమపాదుడు పుట్టాడు. ‹
సంతానంలేక దశరథపుత్రి శాంతను దత్తపుత్రిగా తెచ్చుకున్నాడు.

ఈయన రాజ్యంలో కొంతకాలం వానలు లేక కరువు ఏర్పడింది. విభాం
కుమారుడైన ఋశ్యశృంగుడు కాలు పెడితే వానలుపడి దేశం సుభిక్షంగా ఉం
విద్వాంసులు చెప్పగా ఆయనను తీసుకు రావడానికి అత్యంత రూప యౌవనాలు క
బృందాన్ని పంపాడు.

ఈ బ్రహ్మచారి జన్మించింది మొదలు ఆడువారిని చూసి ఎరుగడు. ‹
నిష్ఠాగరిష్ఠుని తమ అంద చందాలతో మోసగించి తేవడం చాలా కష్టం అని తె
వారు రాజాజ్ఞ వెరవేర్చడానికి సాహసించి వచ్చారు.

విభాండకుడు ఆశ్రమంలో లేనిసమయం కనిపెట్టి వారు ఋశ్యశృంగుని ఎదుట నృత్య, గానాలు ఆరంభించారు.

చిత్ర విచిత్రమయిన వారి కేశాలంకరణాలు విచిత్రమైన జటాజూటాలుగా, వారి చీనాంబరాలు తనకు తెలియని చర్మపుదుప్పట్లుగా, వారి మణి రత్నహారాలు రుద్రాక్ష మాలలుగా, కస్తూరికాది లేపనాలు విభూతిపూతగా, వారి గానం వేదగానంగా భావించి ఆ బ్రహ్మచారి వారిని సమీపించి నమస్కరించి కుశల ప్రశ్నలు ఆరంభించాడు.

వారు తమ చాకచక్యంతో వానిని వంచించి నెమ్మదిగా రాజధానికి తీసుకువచ్చారు. ఆయన అడుగుపెట్టిన వేళ కుంభవృష్టి ఆరంభమయింది.

రోమపాదుడు సంతోషంతో శాంతనిచ్చి ఋశ్యశృంగునికి వివాహంచేసి సుఖంగా ఉన్నాడు. అదీ వారి కథ.

# యదువంశం

యయాతి మహారాజు పెద్దకొడుకు యదువు. ఈయనకు సహస్రజిత్తు, క్రోష్టువు, నలుడు, రిపుడు అని నలుగురు కొడుకులు. ఈ వంశీయుడైన కార్తవీర్యార్జునుని కథ విన్నావుకదా. పరశురాముని క్రోధాగ్నికి ఆహుతి కాకుండా ఆయన కొడుకులలో అయిదుగురు బ్రతికి వంశాభివృద్ధిచేశారు.

ఆ వంశంలో పుట్టిన భోజునిపేర భోజవంశం వృద్ధిపొందింది. వృష్ణిపేర వృష్ణి వంశం ప్రవృద్ధ మయింది. వీరిలో శిని కుమారుడు సాత్యకి. ఈ వంశంలోపుట్టిన ఉగ్రసేనుని కూతురు దేవకిని వసుదేవుడు వివాహం చేసుకున్నాడు. వసుదేవుడు శూరసేనుని కొడుకు. శూరసేనుని పుత్రి కుంతి. ఈమె కుంతిభోజుని దత్తపుత్రియై పాండురాజును పెళ్ళి చేసుకుంది.

వసుదేవుని భార్యలలో రోహిణికి బలరామ, గద, సారణ, దుర్మదాదులు పన్నెండుగురు కలిగారు. అలాగే మిగిలిన భార్యలకు కూడా కుమారులు కలిగారు.

దేవకీ వసుదేవులకు శ్రీమన్నారాయణుడు కృష్ణుడై పుట్టాడు. ఆయన అనంతరం మీ మామ్మగారు, సుభద్ర పుట్టింది.

రాజేంద్రా! ఇది యదువంశం గాథ. ఈ వంశీయుడైన వాసుదేవునిస్మరి ముందుకు సాగుదాం.

నగు మొగమున్ సుమధ్యమును నల్లనిదేహము,
లచ్చి కాటపట్టగు ఉరమున్ మహాభుజము,
లంచితకుండల కర్ణముల్, మదేభగతియు,
నీలవేణియు, కృపారసదృష్టియు కల్గు
వెన్నుడిమ్ముగ పొడసూపుగాత
కనులు మూసిన యప్పుడు విచ్చునప్పుడున్

# దశమస్కంధము
## (పూర్వభాగము)

జనక సుతాహృచ్చోరా!
జనక వచోలబ్ధ విపిన శైల విహారా!
జనకామిత మందారా!
జనకాది మహేశ్వరాతిశయ సంచారా!

శ్రీకంఠచాప ఖండన
పాకారి ప్రముఖ వినుత భండన
విలసత్ కాకుత్స్థ వంశమండన
రాకేందు యశో విశాల రామనృపాలా!

భాగవత కథాశ్రవణపరాయణుడైన పరమభాగవతోత్తముడు పరీక్షిన్మహారాజు కథా కథనదక్షుడైన శుకయోగీంద్రునకు నమస్కరించి, వినయవినమితశీర్షంతో :

వ్యాసనందనా! ఇంతవరకూ మీరు సూర్య, చంద్రవంశాల చరిత్రలు వినిపించారు. పురుషోత్తముడైన నారాయణుడు యదువంశంలో ప్రభవించి నడిపించిన విశేషాలు సమగ్రంగా వినిపించండి. ఆయన అనుగ్రహంవల్లకదా నేను రక్షణపొంది యీ జీవితం సాగించగలిగాను. అటువంటి జగద్రక్షకుని గాథ మీ నోట వింటుంటే అన్నపానాలమీదకు దృష్టి పోవడంలేదు.

గాథ పవిత్రము.

మీ వాక్కు పరమగంభీరమధురము.

నా జన్మ చరితార్థం కావడానికి ఇంతకంటె ఏం కావాలి, అని అర్థించాడు.

చిరునవ్వుజల్లుల మోముతో శుకయోగీంద్రుడు ;

రాజా! శ్రీమహావిష్ణువును స్మరించడం, ఆయన కథలువినడం, ఆయనయందే మనసులగ్నం చేయడం కంటె మానవజన్మకు మరొక అవసరంలేదు. అటువంటి నారాయణుడు కృష్ణావతారం ధరించి నడిపించిన లీలలు వినిపిస్తాను. సావధానంగా విను.

మధురానగరం రాజధానిగా శూరసేనుడనే యదువంశీయుడు సర్వప్రజారంజకంగా పరిపాలన సాగిస్తున్నాడు. ఆయనకు వసుదేవుడనే కుమారుడు. ఈ వసుదేవుడు ఉగ్ర

సేనమహారాజుకూతురు దేవకీదేవిని వివాహం చేసుకుని వస్తున్నాడు. చెల్లెలినీ బావ
వారి పట్టణంలో విడిచి రావడానికి ఉగ్రసేనసుతుడు కంసుడు రథంనడుపుతున్నాడు.

రథం మధురానగరం వయిపు వస్తున్నది.

వచ్చేదారిలో అశరీరవాణి :

"ఓ కంసా! సంతోషంతో నీ సోదరిని అత్తవారింటికి పంపుతున్నావు.
ఈమె ఎనిమిదవ కుమారుడు నీ ప్రాణాలు తీస్తాడు" అంది :

ఆమాట వింటూనే కంసుడు రథం ఆపి, చెల్లెలు జుట్టుముడి పట్టి, క్రిందికిదింపి
పై కెత్తాడు. అదిచూసి వసుదేవుడు కన్నీటితో :

'బావా! సాక్షాత్తూ నీ సహోదరి ఈదేవకి. అటువంటిచెల్లెలిమీద ప్రేమ
ఆమెకు నగలూ, నాణ్యాలూ, వస్త్రాలూ యివ్వాలి కాని, ఏదో గాలికబురువిని ఆమె
కత్తిదూయడం న్యాయమా! కాదంటే ఈమెకడుపున పుట్టిన పిల్లలందరినీ ఎప్పటికప్పుడు
కప్పగిస్తాను' అనగా అంగీకరించి కంసుడు వారిని విడిచివెళ్ళాడు.

ఆడిన మాటప్రకారం వసుదేవుడు తనభార్య దేవకి ప్రసవించిన మగబిడ్డను తీ
వెళ్ళి కంసునికి అప్పగించాడు. కంసుడు వసుదేవుని సత్యవాక్పాలనకు సంతోషించి :

బావా! నా చెల్లెలికడుపున పుట్టిన ఎనిమిదవబిడ్డకదా నాకు శత్రువు. అంద
వీనిని తీసుకు వెళ్ళు, అన్నాడు. వసుదేవుడు తిరిగివచ్చాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఒకనాడు నారదుడు కంసుని సమీపించి, వానిచేత పూజలుపొంది

నాయనా! మరచిపోయి నట్లున్నావు, నువ్వు పూర్వజన్మలో కాలనేమి అనే రా
డవు. ఈ యాదవులందరూ దేవతలు. ఆదినారాయణుడు దేవకీదేవి గర్భాన
సంహరించడానికి పుట్టబోతున్నాడు, అని వివరాలన్నీచెప్పి వెళ్ళాడు.

అంతతో కంసుడు క్రోధోద్రిక్తుడై కరవాలం పుచ్చుకు వెళ్ళి దేవకిబిడ్డలందరినీ
పారేశాడు. దేవకీ వసుదేవులను కారాగారంలో పెట్టించాడు. తన తండ్రియైన
సేనునికూడా బందిఖానాలో పెట్టి, తనే రాజుగా పరిపాలన ఆరంభించాడు.

అప్పటికి దేవకీదేవి ఏడవమారు గర్భం ధరించగా, శ్రీమన్నారాయణుడు యోగ
యను పంపి ఆ గర్భంలోని బాలుని నందవ్రజంలో రహస్యంగా కాలంగడుపుత

వసుదేవుని మరొకభార్య రోహిణిగర్భంలో నిక్షేపింపజేశాడు. ఆమె ప్రసవించినబాలుడే బలరాముడు.

ఇక్కడి వారందరూ దేవకీదేవికి గర్భం పోయిందనుకున్నారు. కంసుడు సంతోషించాడు.

కొంతకాలానికి దేవకి ఎనిమిదవమారు గర్భవతి అయింది. ఆమెకునెలలు నిండుతున్నాయి. కంసుని గుండెలో మృత్యుభీతి సుడితిరుగుతున్నది.

తిరుగుచు కుడుచుచు ద్రాగుచు
అరుగుచు కూర్చుండి లేచు చనవరతంబున్,
హరి తలచి తలచి జగమా హరి మయమని
చూచె కంసు డారని యలుకన్.

ద్వేషంతో ఉన్న కంసునికి ఏపనిచేస్తున్నా శ్రీమన్నారాయణుడే అంతటా కనిపిస్తున్నాడు. హృదయానికి శాంతి లేదు, మనస్సు ప్రశాంతంగా ఉండదు. ఏ క్షణంలో ఎటునుంచి ఏ రూపంతో ఆ లక్ష్మీనాథుడు తననుసంహరిస్తాడో అనే భయమే వేధిస్తున్నది.

దేవకీదేవికి నెలలు నిండుతూన్నవేళ బ్రహ్మాదిదేవతలందరూ, కారాగారంలో ప్రత్యక్షమై గర్భస్థుడై ఉన్న మహావిష్ణువును పరిపరివిధాలప్రార్థించి దేవకిని ఆశ్వాసించి వెళ్ళారు.

నెలలు నిండాయి.

భాద్రపద శుక్ల అష్టమీ తిథినాడు రోహిణీనక్షత్రంలో అర్థరాత్రి కాబోతూన్నవేళ పరమేశ్వరుడు ఆవిర్భవించాడు. ఆ సమయంలో

పాడిరి గంధర్వులు, వర్షించిరి పూలవాన అమరగణాలు.

ఆడిరి రంభాది అప్సరసలు.

ఆనందనాట్యంచేశారు సిద్ధులు.

హాయిగా విహరించారు చారణులు.

పరమసంతోషం పొందారు సజ్జనులు.

సంకట హృదయులయారు రాక్షసప్రకృతులు.

తన కడుపు పంటను చూసి, సంతోషంతో దేవకీదేవి :

విలయకాలమందు విశ్వంబు
నీపెద్ద కడుపులోన దాచు కడిమి మేటి నటుడవీవు
నేడు నాగర్భజుడవౌట పరమపురుష వేడబంబుగాదె.

అని స్తుతించింది.

అంతలో వసుదేవుడు దైవప్రేరణతో ఆ బిడ్డను పొత్తిళ్ళలో పెట్టుకుని, నిద్రించే కావలివారి భీతిలేకుండా చకచకసాగి, పాయలుగాచీలిన యమునానదిలో నడిచి నందుని యింటికిపోయి, అప్పుడే ప్రసవించిన ఆమెప్రక్కలోని యోగమాయాశిశువును తనచేతులలోనికి తీసుకుని తనబిడ్డను ఆమె ప్రక్కనుంచి, గుట్టుచప్పుడు కాకుండా ఆ పాపతో కారాగారానికి చేరాడు.

(దేవకీ వసుదేవులు కృతయుగంలో స్వాయంభువమనువు కాలాన పృశ్ని సుతపుడు అనేపేర్లతో దంపతులై మహావిష్ణువుకు జననీజనకులయ్యారు. అనంతరం అదితి, కశ్యప నామంతో వీరే వామనునికి జననీజనకులయ్యారు. మూడవమారు వారి గర్భాన శ్రీమన్నారాయణుడు కృష్ణుడై ఆవిర్భవించాడు.)

వసుదేవుడు ఆ పసిపాపను కారాగారంలో దేవకి ప్రక్కపరుండబెట్టాడు. పాప కెవ్వు కెవ్వున ఏడిచింది. పసిబిడ్డరోదనం వింటూనే కావలివారు పరుగు పరుగున కంసునికి వార్త అందించారు.

విన్న కంసుడు విన్నపట్టునే కరవాలం చేబూని చరచర కారాగారానికి వచ్చి దేవకి చేతులనుండి ఆ పాపను లాగి నరకడానికి కత్తి పైకెత్తగా, దేవకీదేవి గోలు గోలున విలపిస్తూ అన్న పాదాలమీద పడి :

అన్న! శమింపు మన్న తగదల్లుడుగా డిది మేనకోడలా
మన్నన సేయుమన్న, విను, మానిని చంపుట రాచపాడి
గాదన్న సుకీర్తివై మనగదన్న మహాత్ములు పోవు
త్రోవబోవన్న భవత్సహోదరి గదన్న నినున్ శరణంబు వేడెదన్.

నీ మేనల్లుడు కదా నీకు ప్రాణాపాయం తెచ్చేది. ఇది ఆడబిడ్డ. దీన్నెందుకు సంహరిస్తావు, అని బిడ్డను అందుకోవడానికి ప్రయత్నిస్తుండగానే కంసుడు ఆపాపను పైకెగరవేసి కత్తి పెట్టాడు.

గాలిలో ఎగిరిన పాప అక్కడే ఎనిమిది చేతులతో శంఖ, చక్ర, గదా, శూలాలతో నవ్వుతూ;

"కంసా! పరమక్రూరుడవై కోడబుట్టిన చెల్లెలి బిడ్డలందరినీ నరికావు. అదిచాలక ఆడశిశువును నన్ను కూడా నరుకుదా మనుకున్నావు. కాని, నిన్ను చంపేవాడు నాతోనే పుట్టాడు. నీ కాలం మూడగానే ఆ మహాపురుషుడు వచ్చి నీ తల తరుగుతాడు." అని అంతర్ధానం అయింది.

ఆ మాటలు విన్న కంసునికి క్రోధం జారిపోయి భయం ఆవహించింది. కత్తి విసిరేసి, చేతులు కట్టుకుని, చెల్లినీ, బావనూచేరి.

నేను మహాపాపిష్ఠివాణ్ణి, శిశువులను సంహరించిన ఘాతకుణ్ణి, క్రూరుణ్ణి, బ్రతికి చచ్చినవాణ్ణి. నన్ను క్షమించండి. ఈ ప్రపంచంలో ప్రాణికోటి అంతా కర్మానుసారం పుడుతూ గిడుతూ ఉంటుందని తెలిసికూడా బుద్ధిలేక మీ బిడ్డలను హతమార్చిన యీ నీచుణ్ణి మన్నించండి.

శత్రువును నాశనం చేశాననీ, శత్రువులు నాశనం చేశారనీ అనుకోవడం అవివేకం, అదంతా మన కర్మబంధం, అంటూ వారి పాదాలమీదపడి, శరణువేడి, కారాగార విముక్తులను చేశాడు.

నిజభవనానికి వచ్చిన కంసుడు మంత్రులతో విచారించి, తన రాజ్యంలో యిరుగు పొరుగు ప్రాంతాలలో ఎక్కడయినా సరే శిశువు కనిపిస్తేచంపి పారేయవలసిందిగా ఆజ్ఞాపించాడు. వారితోపాటు నిరంతరం నారాయణస్మరణతో జీవితం నడిపే సాధువులను కూడా సంహరించడానికి అనుమతియిచ్చాడు. అంతతో కంసుని అనుచరులు రెచ్చిపోయి సాధు సజ్జనహత్యలతో సర్వశక్తులూ కోలుపోయారు.

## గోకులం

అక్కడ గోకులంలో నందుడు తనభార్య యశోదకు కుమారుడు కలిగాడని విన్నాడు. పరమానందంతో వేద విదులను రావించి స్వస్తి పుణ్యాహవాచనలు చేయించి, జాతకర్మ జరిపించి, ఆ విద్వాంసులందరికీ సంతోషంతో గోదానాలు, సువర్ణ, రత్నదానాలు చేశాడు.

నిండయిన తలపాగాలతో, పొడుగాటి చొక్కాలుధరించి గోపకులంలోని వారందరూ తమ ప్రభువుగారి కుమారుని చూడడానికి ఎన్నెన్నో కానుకలుతెచ్చారు. ఇక గోపకాంతలు:

ఏమినోముఫలమొ యింతప్రొద్దొకవార్త
వింటి మబలలార వీనులలర!
మన యశోద చిన్ని మగవాని గనెనట
చూచి వత్త మమ్మ నుదతులార!

అనుకుంటూ వారందరూ వచ్చి కనులార కాంచి:

పాపనికి నూనె తలయంటి పసుపు పూసి
బోరుకాడించి హరిరక్ష పొమ్మటంచు
జలము లొకకొన్ని చుట్టిరా జల్లి
తొట్ల నునిచి దీవించి పాడి రయ్యువిదలెల్ల.

జో జో కమల దళేక్షణ
జో జో మృగరాజమధ్య జో జో కృష్ణా!
జో జో పల్లవకర వద
జో జో పూర్ణేందువదన జో జో యనుచున్

పాటలుపాడి నిద్రపుచ్చారు.

చతుర్దశభువనాలనూ జోకొట్టి నిద్రపుచ్చగల, ఆ పరాత్పరుడు వారి జోలపాటల నవ్వుకుంటూ నిద్రిస్తున్నట్టు పరున్నాడు. అలా ఆ బాలునికి ఎన్నో వేడుకలు జరుపుకుంట లాలించి పాలిచ్చి పెంచుకుంటున్నది యశోద.

క్రమ క్రమంగా శుక్లపక్షచంద్రునివలె బాలుడు పెరుగుతూ క్రీడలు సాగిస్తున్నాడు.

నందుడు తన రాజయిన కంసునికి ఏటేటా యివ్వవలసినకానుకలిచ్చి, ఆప్తమిత్ర డయిన వసుదేవుని యింటికివెళ్ళి, అతిథిమర్యాదలు పొందిన అనంతరం, వసుదేవుడు కుశ ప్రశ్నలు సాగించి:

నందా! మీయింట నా బిడ్డ కుశలంగా ఉన్నాడా? అనిఅడిగాడు.

అప్పుడు నందుడు: చెలికాడా! నీవంటి వివేకి యింతఅజ్ఞానంలో ఉండకూడద మీకు కలిగిన బిడ్డలందరినీ ఈ క్రూరకంసుడుహతమార్చినట్లు విని మేమెంతో బాధపడ్డా నువ్వు ఆ శోకంతో నాబిడ్డను నీబిడ్డ అనుకునే వెర్రిలో పడ్డావు, అన్నాడు.

వసుదేవుడు తన తెలివితక్కువతనానికి చింతించి, కన్నీరు తుడుచుకుని :

నందా ! నువ్వు చెప్పింది నిజమే. నాదే పొరపాటు. సరే, నువ్వు వచ్చినపని అయిందికదా. ఇంక త్వరగా మీపల్లెకు వెళ్ళడం మంచిది. అక్కడ ఏంజరుగుతున్నదో చూసుకోవాలికదా, అని సాగనంపాడు.

# పూతన

కంసుని పరివారంలో ఒకతె పూతన.

ఆమె వాడ వాడలా తిరుగుతూ పసిపాప ఏడుపువినిపించిన ఇంటికిపోయి, ఆబిడ్డకు పాలిచ్చే నెపంతో విషంనిండిన చనుబాలు త్రాగించి శిశుహత్యలు చేస్తూ, నందుని గోకులం చేరింది. చేరి వీధులలో తిరుగుతూండగా, నందుని యింటినుండి శిశువు ఏడుపువినిపించింది. వినిపించగానే సంతోషంతో తన రూపం మార్చుకుని. పరమసుందరాంగివేషం ధరించి హంసనడకలతో, లేడిచూపులతో, చూచినవారి కన్ను చెదిరే శృంగారంతో నందుని యింట ప్రవేశించి ఏడుపు వినవచ్చేచోట ఉయ్యాల దగ్గరకుపోయి, అందులో ఉన్న బాలుని ఎత్తుకుని ముద్దాడి :

బాబూ, పాపం, నీకు పాలిచ్చేవారే లేరా ! ఏడవకు బాబూ, మా చిట్టితండ్రీ.

ఒక్కగుక్కెడుపాలు త్రాగు నాయనా అంతతో నా జన్మసఫలం అవుతుంది, అని ఒడిలో కూర్చుండ బెట్టుకుని పైటతొలగించి పాపని పెదవులు తన చనుమొనలదగ్గరకు చేరుస్తున్నది.

అదిచూసిన యశోద, రోహిణి :

ఎవరమ్మానువ్వు ? మా బిడ్డ అందరిదగ్గరా పాలు త్రాగరు; అని గోలచేస్తున్నా వినకుండా బాలుని గట్టిగా పట్టుకుంది. దొంగనిద్రలోవున్న బాలకృష్ణుడు ఆవులించి, రెండుచేతులతో ఆమె చన్నులు బిగబట్టినోటపెట్టుకుని గుటుకు గుటుకున పాలు గుడుస్తూ, దాని శరీరంలోని శక్తినంతాపీల్చేశాడు.

ఆ బాధ భరించలేక !

ఛీ ! ఏం పిల్లాడమ్మా ! పీల్చేస్తున్నాడు అని విదలించబోయింది. కాని ఆ నందనందనుడు మరొక్క పీల్పుతో జీవధాతువులు లాగేయగా, కెవ్వున అరిచి నేలకూలింది

పూతన. ఆ అరపువిన్న యశోదా, రోహిణులతో పాటు గ్రామంలోని వారం
అదరిపడ్డారు.

కొంత సేపటికి మూర్ఛతేరుకున్న యశోదమ్మ కనులు తెరచి చూచేసరికి, రా
పూతన దేహంమీద హాయిగా ఆడుకుంటూ కనిపించాడు, గోపాలకృష్ణుడు. అం
రోహిణిలేచింది.

ఇద్దరూ గుండెలు బాదుకుంటూ బాలకృష్ణుని దగ్గరగా తీసుకుని గోమయంతో
తీసి, గుండెలకు హత్తుకుని వెన్నుదువ్వారు. యశోద తన బిడ్డకు పాలిచ్చి జోల
నిద్రవుచ్చింది. అప్పటికి యిల్లుచేరిన నందాదులు ఆ రాక్షస శరీరం చూసి తెల్ల
విషయం తెలుసుకొని, దానికి దహన సంస్కారం చేశారు.

నారాయణునికి చన్నుగుడిపి ఆయనకు తన దేహాన్ని క్రీడారంగం చేసిన పూ
సర్వపాపాలూ నశించి వైకుంఠం ప్రాప్తించింది.

# శకటాసురుడు

బాలకృష్ణునికి ఎన్నెన్నో వేడుకలు జరుపుతూ ఒకనాడు ఆ ఉత్సవంలో య
దేవి అందరికీ కానుకలూ దానాలూచేస్తున్నది.

అటువంటి సమయంలో ఆకలిగొన్న కృష్ణుడు తన పాదంతో ఒక బండిని త
అది ఆకాశాని కెగిరి, గిరగిర తిరిగి నేలకూలింది.

అన్న పానాలతో నిండిన కడవలున్న బండి అలా ఆకాశాని కెగిరి, క్రిం
తుక్కుతుక్కుకాగా అందరూ ఆశ్చర్యంతో బాలుని దగ్గరకు చేరారు.

తన బిడ్డ భయపడి ఉంటాడని యశోద వానిని గుండెలకు హత్తుకుని, జ
పుణుకుతూ పాలిచ్చింది.

మరికొన్నాళ్ళకు, యశోద ఒడిలో కూర్చుని పాలుత్రాగుతూన్న బాలుడు అ
కొండంత బరువనిపించగా, ఆ యిల్లాలు భరించలేక క్రిందికి దింపింది.

# తృణావర్తుడు

కంసుడు పంపిన తృణావర్తుడనే రాక్షసుడు ఆ సమయానికి పెద్దసుడిగాలిలా వచ్చి గోకులం అంతా దుమ్మురేపి మనిషికి మనిషి కనపడ రానంత చీకటి చేశాడు. యశోద చేతులతో తడివి తన బిడ్డ కనిపించక గోలుగోలున విలపిస్తున్నది.

ఆ (సుడిగాలి) రాక్షసుడు బాలకృష్ణుని బరువు భరించలేక బాధపడుతూన్న సమయాన ఆ బాలుడు తన రెండుచేతులతో వాని మెడబిగించాడు. అవి ఏనుగుతొండాలవలె తన కంఠాన్ని బిగించగా వాడు విలవిల తన్నుకుంటూ రెక్కలుతెగిన పక్షిలా క్రిందపడ్డాడు. అప్పటికి గాలివిసురు తగ్గి దుమ్ము అణగారింది. ఆ వెలుగులో గోపికలు రాక్షసుని శరీరం మీద ఆడుకునే కృష్ణుని తెచ్చి యశోదకు అప్పగించారు. యశోద సంతోషంతో బిడ్డను చెంగుచాటున చేర్చి పాలిస్తూ, జోలపాడి, నిద్రపుచ్చింది.

రోజులు గడుస్తున్నాయి.

ఒకనాడు—

వసుదేవుడు తమ యాదవకుల పురోహితుడయిన గర్గులవారిని నందుని దగ్గరకు పంపాడు.

నందుడాయనను చూస్తూనే నమస్కరించి :

ఊరకరారు మహాత్ములు, మీరాక మాకు మంగళకరం, తమవంటి వేద, శాస్త్ర కోవిదులదర్శనంతో మా జన్మ ధన్యమయింది. ఈ బిడ్డలకు నామకరణ మహోత్సవం తమ చేతిమీదుగా జరిపించండి, అని ప్రార్థించాడు.

రోహిణీనందనునికి బలరాముడనీ దేవకీసుతునికి కృష్ణుడనీ నామకరణం చేశా డాయన.

క్రమ క్రమంగా ఆ బాలకులు అడుగులు వేయడం నేర్చారు.

నడక వచ్చింది.

ఆటలు ఆరంభమయాయి.

తమ యీడు బాలురతో ఆ బాలకు లిద్దరూ ఎన్నెన్నో క్రీడలు సాగిస్తూ తల్లి దండ్రులకు సంతోషం కలిగిస్తున్నారు.

దాగుడుమూతలు, బంతులాటలు, ఉయ్యాలలు, దొంగాటలు....

అలా ఎన్నెన్నో.

వివిధక్రీడలతో వారు ఆనందిస్తూన్న రోజులలో....

ఒకనాడు ఆ వాడలోని గోపికలందరూ యశోదను చేరి :

తల్లీ! విన్నావా! పిల్లలకు తల్లిపాలు చాలక అవస్థపడుతుంటే మీ కుర్రాడు లేగదూడలను ఆవు పొదుగుల దగ్గర వదిలేశాడు.

అదేం చోద్యమమ్మా! మా యింటిలో కమ్మగా కాగి మీగడకట్టిన పాలకు పూర్తిగా మీ వాడు తన చెలికాండ్రకు తాగబోశాడమ్మా

అంతకంటె విడ్డూరం యశోదమ్మా! మా యింట్లో పాలకుండలులేవని స్నేహిత తెచ్చి ఎంత అల్లరిచేశాడమ్మా

ఇదివిన్నావా, మా యింట్లో ఉట్టిమీద కడవ అందనేలేదని దానికి చిల్లుకొ మీగడపాలు ధారగా కారుతూంటే తన స్నేహితులతో ఆరగించాడు తల్లీ

అంతకంటె అన్యాయం! మా పొరుగింట్లో పెరుగుత్రాగి, ఎదురుగా వచ్చిన మూతికి ఆ పెరుగు రాసిపోయాడు. దాని అత్తగారువచ్చి ఈ కోడలే పెరుగు త్రాగే దెప్పిపొడిచింది.

ఇంకా ఉన్నాయమ్మా! వారింట నేతికడవతెచ్చి త్రాగి వీరింట్లో పారేస్తే వీరూ జుట్లు! పట్టుకున్నారు.

వెన్న తింటూండగా పట్టుకున్న మా చిన్నదాన్ని మీ వాడు ఎంత అల్లరిపెట్టా

పసివాడు ముద్దుగా వున్నాడని దగ్గరగా పిలిచి :

బాబు! నీ పే రేమిటని అడిగితే దాని బుగ్గ కొరికేశాడు, యిదేం పిల్లవా

మా అబ్బాయి నిద్రపోతూంటే, అక్కడికి లేగదూడను తెచ్చి దానితోకకు జుట్టు ముడిపెట్టి గంతులేయించాడు. ఏం న్యాయమమ్మా! ఎంత రాచబిడ్డ అయినా జలకమాడే వయసు పడుచులదగ్గరగావెళ్ళి ఆగడం చేస్తాడా!

పాలు, పెరుగు, వెన్నకడవలు గదులలో పెట్టి తాళాలువేసి, కాప గుమ్మాలలో కూర్చున్నాం.

ఎలా వచ్చాడో, ఎప్పు డొచ్చాడో అంతా పూర్తిచేసి మా ఎదుటవడి, పక్షి జంతువుల అరుపులతో అల్లరి చేసేశాడు, అని అందరూ ఎవరి బాధలు వారు విని

ఓ యమ్మ నీ కుమారుడు
మా యిండ్లను పాలు పెరుగు
మన నీడమ్మా!
పోయెద మెక్కడి కైనను
మా యన్నల నురభు లాన!

మంజులవాణీ!

అంటూంటే విన్న యశోద :

ఏం చిత్రమమ్మా! ఉదయంనుంచి బిడ్డ ఆకలితో ఈ చెంగుచాటున పాలు త్రాగుతూవే ఉన్నాడు. చూశారా, గడప దాటలేదు వీడు. ఎందుకమ్మా నా బిడ్డమీద అలా నింద వేస్తారు. వాడి ఆట లేవిటో, వాడి పాట లేవిటో వాడివే తప్ప నా బిడ్డ ఆవలకు కదిలి వెళ్ళడే? ఎప్పుడూ నా చెంగుపుచ్చుకు తిరుగుతూంటాడు, అనగా విని వారు ఎదురు సమాధానంలేక వెళ్ళిపోయారు.

ఒకనాడు బాలకృష్ణుడు మన్ను తిన్నాడని వచ్చి చెప్పారు యశోదతో బలరాముదులు.

అప్పుడావిడ మందలించింది.

ఆమాటలు విని నవ్వుతూ :

అమ్మా! నేను మన్ను తినే పిచ్చివాడినా! వీళ్ళందరూ నామీద కిట్టక చెపుతున్నారమ్మా. కావాలంటే నా నోరు వాసనచూడు, అని తెరిచేసరికి ఆ వదనంలో బ్రహ్మాండం అంతా గిరగిర తిరుగుతూ కనిపించగా :

కలయో, వైష్ణవమాయయో
యితర సంకల్పార్థమో, సత్యమో,
తలపన్ నేరకయున్నదాననొ!
యశోదాదేవిగానో,
వరస్థలమో! బాలకుడెంత
యీతని ముఖస్థంబై అజాండంబు ప్రజ్వలమై
యుండుట కేమి హేతువొ! మహాశ్చర్యంబు చింతింపగన్!

అలా ఆ యిల్లాలు పరమేశ్వరభావంతో బాలుని చూస్తూండగానే కృష్ణుడు మాయ మామూలుగా నిలబడగా, ఆవిడ తనబిడ్డను ఒడిలోకి తీసుకుని చెంగుకప్పి పాలిచ్చి, దువ్వి జోకొట్టింది. అన్నాడు శుకయోగి.

శుకయోగీంద్రా! ఏ పుణ్యఫలంవల్ల యశోదాదేవికి ఆ అదృష్టం లభించింది? తల్లి దేవకి కాగా, పాలిచ్చి పాటలు పాడుతూ పరమేశ్వరుని ఆరాధించే అదృష్టాని యిల్లాలు ఎన్ని నోములు నోచిందో,

అని పరీక్షిన్మహారాజు ప్రశ్నించగా, శుకమహర్షి :

పూర్వజన్మలో ద్రోణుడనే వసువు, ఆయనభార్య ఈ భూమిమీద ప్రభవిం ప్రజాపతి బ్రహ్మకోరగా, వారు విష్ణుసేవాభాగ్యం అనుగ్రహిస్తే ఆజ్ఞ శిరసావహిస్తామన అదీ వారి పూర్వగాథ.

ఇక ప్రస్తుతానికివస్తే వారే నంద - యశోదలు.

పిల్లలందరూ చల్దులు తిని ఆటలను పోగా యశోదాదేవి పెరుగు చిలుకుతూ, తీస్తూన్నది. ఆ సమయానికి కృష్ణుడు వచ్చి రెండుకాళ్ళూ చుట్టుకుని పైటలాగుతూ :

అమ్మా, పాలు, ఆకలి, పాలియ్యవే, అని ఆగడంచేసి, తనచేతుల్లోకి అందుకోగా, చేసేదిలేక ఆ తల్లి, బిడ్డను ఒడిలోకి తీసుకుని పాలిచ్చింది. ఈలోగా పొయ్యిలో పాలు పొంగడం చూసి దింపడానికి వెళ్ళింది.

ఆ సందుచూసి, ఉట్టిమీద కుండకు చిల్లుపెట్టి, వెన్న తినడంమొదలు పె కృష్ణుడు.

ఈ అల్లరి భరించలేక కృష్ణు డెక్కిన రాతి రోలుకి తాడు బిగించి ఆ బ బంధించింది యశోదమ్మ.

ఆవిడ కన్ను గప్పి ఆ బాలుడు రోలు ఈడ్చుకుంటూ పోయి పోయి నా శాపంవల్ల మద్దిచెట్లుగా పుట్టిన నలకూబర మణిగ్రీవులకు విమోచనం కలిగించాడు.

వారిద్దరూ కృష్ణుని పరి పరి విధాల ప్రార్థించి తమ నివాసాలకు వెళ్ళారు.

*　　　*　　　*　　　*

రోజులు గడుస్తున్నాయి. కొంతకాలం యీ ప్రాంతం విడచి బృందావనానికి కంసుని సేవకుల బాధలు తగ్గుతాయని కులవృద్ధులు సూచించగా నందుడు ప సమేతం బయలుదేరాడు.

అందరూ బృందావనం చేరి, అర్ధ చంద్రాకారంగా బళ్ళు నిలిపి క్రీడలు సాగించే బాలకులను చూసి ఆనందిస్తున్నారు.

అక్కడకు లేగదూడ రూపంలో వచ్చిన వత్సాసురుడనే రాక్షసుని పసిగట్టి, ఒక్క అంగలో వెళ్ళి దాని కాళ్ళూ, తోక కలిపి చుట్టబెట్టి దగ్గరలో ఉన్న పెద్ద చెట్టుకి విసిరికొట్టగా, చెట్టుకూలి, రాక్షసుడు తన రూపంతో అరిచి ప్రాణాలు విడిచాడు.

ఆసాహసానికి గోకులం వారందరు కృష్ణుని అభినందించారు.

ఒకనాడు సమీపంలో చెరువుగట్టున భయంకర రూపంతోవున్న కొంగను చూచి అందరూ బెదరగా, ఆ కొంగ చరాలున వచ్చి కృష్ణుని మ్రింగేసింది. అయితే ఆ బాలుడు గొంతుకి అడ్డుపడగా బైటకి వదిలి, పొడిచి తిందామని వస్తూంటే దాని ముక్కు చీల్చి రెండు ముక్కలు చేసి విసిరేశాడు.

బకాసురుని చావువిని వాని సోదరుడు అజగర రూపంలో వచ్చి గోపబాలురందరినీ కబళించడానికి సన్నద్ధుడయ్యాడు. యోజనం పొడవున్న ఆ కొండ చిలువ బుసకొడుతూంటే వేడిగాలులు పుడుతున్నాయి. దాని కన్నుగుడ్లు నిప్పుకుండలవలె కనిపిస్తున్నాయి.

పెద్ద పర్వతంలా వున్న ఆ కొండచిలువ గోపబాలురందరనూ మ్రింగడం మొదలు పెట్టింది. అది గమనించి కృష్ణుడు దాని నోట ప్రవేశించి కంఠద్వారం దగ్గర నిలిచి తన శరీరాన్ని పెంచడంతో ఆ పాము ఊపిరిసలపక గిలగిలలాడి చచ్చింది. కంసుని అనుచరుడయిన అఘాసురుడు ఆ రూపంలోవచ్చి ప్రాణాలు విడిచాడు.

ఆ తరువాయి ఒకనాడు గోపబాలురందరూ చల్దులు మూటకట్టుకుని వనంలో విందులు చేసుకుంటూ గడుపుతున్నారు.

మాటి మాటికి వ్రేలు మడిచి యూరించుచు
ఊరుగాయలు దినుచుండు నొకడు
ఒకని కంచములోని దొడిసి చయ్యనమ్రింగి
చూడు, లేదని నోరు సూపునొకడు
ఏగు, గార్గుర చల్దు లెలమి పన్నిదమాడి
కూర్కొని కూర్కొని కుడుచు నొకడు
ఇన్నియుండగ పంచియిడుట నెచ్చెలితనమనుచు
బంతెన గుండు లాడు నొకడు

కృష్ణు చూడు మనుచు గికురించి పరుమ్రోల
మేలి భక్ష్యరాశి మెసగు నొకడు
నవ్వు నొకడు సఖుల నవ్వించు నొక్కడు
ముచ్చటాడు నొకడు మురియు నొకడు

ఇలా వీరు వినోదాలలో ఉండగా వారి గోవులన్నీ అరణ్యంలో పచ్చికమేస్తూ వా
కంటబడనంత దూరానికి వెళ్ళాయి.

భోజనా లయాక చూసుకుంటే ఒక్క లేగదూడకూడా చుట్టుప్రక్కల కనిపించ
వారు బాధపడుతూంటే కృష్ణుడు వారందరినీ ఓదార్చి, గోవులను వెదకడానికి బయ
దేరాడు.

ఇచ్చో పచ్చికమేసిన
విచ్చో త్రావినవి తోయము(లు)
ఏగిన విచ్చో, ఇచ్చోట మందగొన్నవి
ఇచ్చో బాసినవి, జాడ యిదె యిదె యనుచున్.

ఆ పరిసరాలకొండలు, తోటలు, కొలనులు వెదకినా కనిపించక, తిరిగివచ్చి చూడగా గో
బాలురుకూడా కనుపించలేదు. అప్పటికి తెలిసింది, యిది బ్రహ్మ చేసిన యింద్రజాల
అని.

తెలియగానే గో, గోపబాలరూపాలు తనే ధరించి, అందరినీ వారివారియింట విడి
వచ్చాడు. అలా ఒక సంవత్సరం గడిచింది. అప్పటికి బ్రహ్మమానం ఒక త్రు
అయింది. అయాక బ్రహ్మవచ్చి చూడగా తనగుహలో గో, గోపబాల గణాలుండగానే
ఈవల వనంలో అదేజనం, గోవులు కనిపించగా ఆశ్చర్యపోయి కృష్ణుని మహిమక
ముగ్ధుడై పరిపరివిధాల ప్రార్థనలుచేసి తనలోకానికి వెళ్ళాడు.

# ధేనుకాసురవధ

ఒకనాడు వీరందరూ దూరాన తాలవనానికి విహారానికి వెళ్ళారు. అక్కడ తా
చెట్లనిండా ముగ్గినవండ్లు కనిపించగా బలరాముడు ఆ చెట్లను ఊపి పళ్ళు రాలుస్తున్నాడు
ఆ ధ్వని విని ఆ వనంలోవున్న ధేనుకాసురుడు గాడిదరూపంతో బలరామునిమీదికి రాగా

దాని నాలుగుకాళ్ళూ ఒక చేత్తో పట్టుకొని గిరగిర త్రిప్పి విసిరి పారేశాడు. ఆ అసురుడు రక్తం కక్కుకుని చచ్చాడు. అది చూచి రాక్షసుని సేవకులు కోపంతో రాగా వారందరినీ అవలీలగా తాటిచెట్లకు విసిరికొట్టి హతమార్చాడు. గోపబాలకులు సంతోషించారు.

# కాళియ మర్దనం

రోజులు గడిచాయి.

ఒకనాడు కృష్ణుడు తన స్నేహితులతో కలిసి బలరాముడు తోడులేకుండా కాళిందికి విహారానికి వెళ్ళాడు. ఆటలతో అలసి వారందరూ ఆ కాళిందిలో నీరు త్రాగుతూనే ప్రాణాలు విడిచారు. అది చూసి కృష్ణుడు తన చల్లని చూపుల అమృతం ప్రసరించి వారిని జీవింపజేసి, కాళియుని విషం కారణంగా మానవుల ప్రాణాలు హరించే ఆ కాళింది మడుగులో దూక, ఆ మహా విషసర్పాన్ని సంహరించడానికి ఉద్యుక్తుడై:

కటి చేలంబు బిగించి,
పింఛమున చక్కం గొప్ప బంధించి
దోస్తట సంస్ఫాలన మాచరించి,
చరణ ద్వంద్వంబు గీలించి
తత్కుట శాఖాగ్రముమీది నుండి యురికెన్
గోపాల సింహంబు దిక్తటముల్ మ్రోయ
హ్రదంబులో గుభగుభ ధ్వానం బనూనంబుగాన్,

అలా దూకుతూనే కాళియునివైపు పోబోగా, ఆ కాళియుడు మరింత రోషంతో ఎదురువచ్చి కరిచి, కృష్ణుని చుట్టుకుని బుసకొడుతూండగా గోపగణం అంతావచ్చి భయంతో గోలు గోలున విలపిస్తున్నారు. వారుకూడా ఆ మడుగులోపడి ప్రాణాలు వదులుదాం అనుకుంటుం డగా బలరాముడు వారికి ధైర్యం కలిగించాడు.

అప్పుడు కృష్ణుడు తన అరచేతితో కాళియుని పడగమీద పిడిగ్రుద్దు పెట్టగా, అది కన్నులనుండి విషంగ్రక్కింది. అప్పుడు దాని తోకపట్టి గిరగిర త్రిప్పి, తిరిగి దాని పడగ మీద నిలబడి హాయిగా నాట్యం ఆరంభించాడు.

# వస్త్రాపహరణం

అలా ఎన్నెన్నో లీలలుచూపుతూ, గో, గోపగణాలకు కలిగే ఆపదలను తొలగిస్తూ, యశోదాదేవికి పసిబిడ్డగా వేడుకలు చూపుతున్నాడు.

ఆకాలంలో—గోపికలందరూ కాత్యాయనీవ్రతంచేసి కృష్ణునే తమభర్తగా అనుగ్రహించమని ఆ శక్తిని ప్రార్థించి, మాసాంతాన యమునానదిలో స్నానంచేస్తున్నారు.

వారందరూ యమునగట్టున విడిచిన వారి చీరలు దొంగిలించి గోపబాలుడు ఒక చెట్టుఎక్కి కూర్చున్నాడు. అది గమనించిన గోపికలు :

మా మా పలుపలు ముట్టకు
మామా! కొనిపోకు పోకు మన్నింపు తగన్
మా మాన మేల కొనియెదు
మా మానస హరణమేల! మానుము కృష్ణా!

అని అనేక విధాల అర్థించారు.

అప్పుడు కృష్ణుడు నవ్వుతూ :

మీరందరూ ఎవరిని భర్తగా కోరి వ్రతంచేశారో చెప్పండి. సిగ్గుపడకుండా మీ మనసులో ఉన్నది చెప్పి, అలానే ఇటువస్తే మీచీరలిస్తాను, అన్నాడు.

వారందరూ కొంతసేపు గుసగుసలతో గునుగుళ్ళుపడి చివరకు నదిలోంచి ఈవలకు వచ్చారు.

చంచత్పల్లవ కోమల
కాంచన నవరత్న ఘటిత
కంకణ రుచి రోదంచిత
కర సంఛాదిత పంచాయుధగేహ
లగుచు వడతులు వరుసన్,

ప్రౌఢలు ముందునడువగా, ముగ్ధలు వెనుకవచ్చి నిలువగా :

మీరంతా చేతులుజోడించి నమస్కరించాలి, అన్నాడు గోపబాలుడు.

అందరూ చేతులెత్తి నమస్కరించగా, వారి చీరలు వారికిచ్చి :
మీనోముఫలం సిద్ధిస్తుంది, అని అభయమిచ్చాడు.

*   *   *   *

అలా వారందరికీ ఆనందం కలిగిస్తూ, ఒకసారి గోవర్ధనం ఎత్తి, వరుణుడు అపహరించుకు పోయిన నందుని విడిపించి తెచ్చి, శరద్రాత్రులలో పరిసరవనంలో వేణుగానంతో

గోపికాజనాన్ని సంతోషతరంగాలలో తేలియాడిస్తూ, అంతలో అదృశ్యంకాగా వారందరూ ఆవేదనాభర హృదయాలతో :

నల్లనివాడు, పద్మనయనంబులవాడు
కృపారసంబు పై జల్లెడువాడు,
మౌళి పరిసర్పిత పింఛమువాడు
నవ్వు రాజిల్లెడు మోమువాడొకడు
చెల్వల మానధనంబు తెచ్చె,
ఓ మల్లియలార ! మీ పొదలమాటున
లేడుగదమ్మ చెప్పరే !
అంగజునైన చూడ హృదయంగముడై
కరగించువాడు శ్రీరంగదురంబువాడు
మధురంబగు వేణురవంబువాడు
మమ్మంగజు పువ్వుతూపులకు అగ్గముసేసి
లవంగ లుంగ నారంగములార !
మీ కడకు రాడుగదా ! కృపనున్నజూపరే !

అంటూ గోపికాగీతలు వినిపించారు. అనంతరం రాసక్రీడలు నడిపించాడు. సుదర్శన గంధర్వునికి శాపవిమోచనం కలిగించాడు. శంఖచూడుడనే గుహ్యకుని సంహరించాడు. వృషభాసురుని యమసదనం చేర్చాడు.

* * * *

కృష్ణుడు దేవకీనందనుడని తెలిసి కంసుడు తన ముఖ్యభటుడైన కేశిదానవుని పంపగా వాడుకూడా కృష్ణునిచేతులలో ప్రాణాలు వదిలాడు.

అది విని కంసుడు తన కనుసన్నలలో నడిచే చాణూరముష్టికులనే మల్లయుద్ధ విశారదులతో సంప్రదించి, అక్రూరుని రావించి, గోకులానికివెళ్ళి బలరామ, కృష్ణులనూ, నందునీ యిక్కడ జరిగే మల్లయుద్ధానికి రమ్మని కబురు పంపాడు.

అక్రూరుడు కంసుని మూర్ఖత్వానికి విచారించి, కృష్ణదర్శన సంతోషంతో రథారూఢుడై బృందావనంచేరి బలరామ కృష్ణులను చూచి వారితో నందుని యింటికి చేరాడు.

స్వాగత సత్కారాలు పూర్తి అయాక, కంసుడు ధనుర్యాగంపేరిట పంపిన ఆహ్వాన విషయం వివరించాడు. ఈ వార్తవింటూనే గోపికాజనం అందరూ కన్నులనీరుపెట్టారు. ఎలా అయినా కృష్ణుని కదలకుండా ఆపాలని ప్రయత్నించారు. వారందరినీ ఓదార్చి బలరామసహితుడై కృష్ణుడు యదువంశపు పెద్దలతో ప్రయాణమయాడు.

రథాలు సాగిసాగి మధురానగరానికి చేరి రాజవీధులలో వెడుతుంటే, ఆ భవనాలలోని కాంతాజనం కృష్ణ సందర్శనాభిలాషతో ఎలావున్నవారు అలా వచ్చి గడపలలో నిలబడి :

వీడటే! రక్కసి విగతజీవగ
చన్ను బాలు ద్రావిన మేటి బాలకుండు
వీడటే! నందుని వెలదికి
జగమెల్ల ముఖమున జూపిన ముద్దులాడు
వీడటే! మందలో వెన్నలు దొంగిలి
దర్పించి మెక్కిన దావరీడు
వీడటే! అలయించి వ్రేతల మానంబు
సూరలాడిన లోక సుందరుండు
వీడు లేకున్న పుర మటవీస్థలంబు
వీని పొందని జన్మంబు విగతఫలము
వీని పలుకని వచనంబు విహగ రుతము
వీని చూడని చూడ్కులు వృథలువృథలు

అనుకున్నారు, ఆనందతన్మయులై.

కొంత దూరం సాగిసాగి ఒక రజకుని యిల్లుచేరి, అక్కడున్న చీని చీనాంబరాలు తమకు కావాలనగా, వాడు కోపంతో కంసమహారాజు ధరించే విలువయిన వస్త్రాలు కట్టే తాహతు మీ కెక్కడుంది? అని గద్దించగా, వానిని మర్దించి ఆ వస్త్రాలు ధరించి, అక్కడి నాయకు డిచ్చిన అమూల్యాంబరాలు కూడా స్వీకరించి, పూలమాలలు కట్టడంలో నేర్పరి అయిన సుదాముని యింట స్వాగతమర్యాదలు స్వీకరించి, వాడిచ్చిన సుగంధ సుమమాలలు అలంకరించుకుని ముందుకు సాగుతూండగా ఎదురుగా కుబ్జ కనిపించింది.

దానిని చూసి కృష్ణుడు :

ఎవరి దానవమ్మాయీ! నీపేరేమిటి? ఇన్ని చందనలేపనాలు ఎవరికోసం తీసుకెడుతున్నావు! ఓ పద్మదళనయనా! అవి మాకిస్తే నీకు చక్కదనం వస్తుంది. అన్నాడు.

కుబ్జ :- ఓ మనోహరాకారా! అందరికీ అందా లెక్కడినుంచి వస్తాయి. నేను కంసుని దాసిని, నన్ను త్రివక్ర అంటారు. లేపన విద్యలో నాకు మంచి నేర్పున్నది. ఈ చందనపు పూతలతో మీరు కూడా సంతోషించగలరు, అంది.

కృష్ణుడు సంతోషంతో చందనాలేపనాలన్నీ పూసుకుని, ఆమెను చేరి ఒక కాలితో ఆమె పాదం త్రొక్కిపట్టి రెండు వ్రేళ్ళతో ఆమె చుబుకం పట్టి పైకి లాగాడు. అంతే! దాని వంకర లన్నీపోయి చక్కని చుక్కలా నిలబడింది.

దాని ఆకారం దానికే పరమసంతోషం కలిగించగా,

కుబ్జ :- పంచశరాకారా! నన్నింతచేసిననువ్వు ఒకమారు నా యింటికి వచ్చి సంతోషపెట్టు, అని ఉత్తరీయంపట్టగా, ఆమెను లాలించి, మళ్ళీ వస్తానని ముందుకుసాగాడు.

నెమ్మదిగా నడచి నడచి, కంసుని ఆయుధశాలలో అడుగుపెట్టి అక్కడ దేవేంద్రుని ధనుస్సులా వెలిగే చాపాన్ని విరిచాడు కృష్ణుడు. ఆ ధ్వనికి మధురానగరం గజగజ లాడింది. కంసుని గుండె నిబ్బరం జారింది.

ఆ రాత్రికి విశ్రమించి ఉదయమేలేచి ఉత్సాహంతో ధనుర్యాగమండపానికి వచ్చారు, బలరామకృష్ణులు.

ఆ రంగస్థలముఖద్వారంలో వున్న కువలయాపీడం అనే మత్తగజాన్ని వారి మీద్కి నడిపించాడు మావటీడు.

చూస్తూనే కృష్ణుడు జుట్టుముడివైచి, కాసెకోకగట్టిగాకట్టి, నుదురుమీదజారే ముంగురులు వెనుకకు త్రోసి, యుద్ధోత్సాహంతో ముందుకుదూకి, సింహగర్జనచేసి దాని రెండు దంతాలూ ఊడబెరికి, తొండంపట్టి గిరగిరత్రిప్పి విసరగా అది గిలగిల తన్నుకుంటూ నేలకూలింది.

చచ్చిన మత్తేభాన్నీ, చంపి వచ్చిన యదువంశ యోధులనూ చూచిన కంసుని మనస్సు వ్యాకుల మయింది.

మల్లయుద్ధ విశారదుడైన చాణూరుడు వారిని చూచి, జెబ్బ చరిచాడు. అప్పుడు కృష్ణుడు నవ్వుతూ!

నీతో నే నుంటాను, మా బలరాముడు ముష్టికునితో పోరాడుతాడు, అనగా వాడు అట్టహాసం చేసి, వ్రేలెడులేని మీకు మాతో యుద్ధమా! అంటూ మీదికి రాగా, అన్నదమ్ము లిద్దరూ వారితో కొంతసేపు పోరాడి నేలకూల్చారు. వారు నెత్తురు కక్కుతూ కూలిపోగా కంసుడు ఆవేశంతో:

# కంసవధ

ఈ యాదవ బాలు రిద్దరినీ కోట ఆవలకు తరిమికొట్టండి.

నందుణ్ణి బంధించి, వసుదేవుని సంహరించి, నా తండ్రి ఉగ్రసేనుని కూడా బంధించండి.

అని అరుస్తున్నాడు.

చూశాడు కృష్ణుడు.

కొండమీద తిరిగే జింకను పట్టడానికి దూకే సింహంలా మల్లయుద్ధ రంగస్థలంలో వున్న కంసుని మీదికి దూకి, గరుత్మంతుడు నాగేంద్రుని పట్టినట్లు జుట్టు బిగబట్టి ఒక్క ఊపు ఊపగా, ఆ తలమీద మణికిరీటం నేలకు జారింది. అంతతో ఆగక విదిలించి విసిరేసరికి ప్రాణాలు వదలి అల్లంతదూరాన పడ్డాడు.

అదిచూసి క్రోధోద్రిక్తులై కంసుని సోదరులు ఆయుధాలతో మీదికిరాగా బలరాముడు పరిఘాయుధంతో వారిని నేలకూల్చాడు.

మరణించినవారి దహనసంస్కారాలకు ఆజ్ఞాపించి, చకచక చెరసాలకు వెళ్ళి దేవకీ వసుదేవులను విడిపించి, నమస్కరించి, కొంతసేపు వారితో ఇష్టాగోష్ఠి సాగించి, తాతగా రయిన ఉగ్రసేనుని చేరి,

తాతా! యయాతి మహారాజు శాపం కారణంగా మా యదువంశానికి సింహాసనాధి కారంలేదు. మీరే ఈ ఆసనం అలంకరించి ప్రజారంజకంగా పరిపాలించండి, అని అందరినీ సంతృప్తులను చేశాడు.

కొన్నాళ్ళయాక నందునితో:

ఇంతకాలం మేము మీదగ్గరే ఉన్నాం. కొంతకాలం మా కన్నతల్లిదండ్రులను సేవించి వారికి సంతోషం కలిగించి మళ్ళీ బృందావనానికి రాగలం. మీరు వెళ్ళి రండి.

అని వారందరిని వారి వారి నివాసాలకు పంపుతూ ఎన్నెన్నో కానుక లిప్పించాడు.

అనంతరం వసుదేవుడు తన కుమారులకు సముచితకాలంలో పురోహితులు గర్గుల వారిచేత ఉపనయన సంస్కారంచేయించి, గోదానాలూ, సువర్ణదానాలూ జరిపించి, సర్వ జనులకూ తృప్తిగా అన్నదానం చేశాడు

తరువాయి బలరామ, కృష్ణులు కాశీనగరం వెళ్ళి అక్కడ సాందీపని అనే గురువు వద్ద వేద, ధర్మశాస్త్రాలూ, ధనుర్వేదమూ అభ్యసించారు.

విద్యాభ్యాసం పూర్తి చేసుకొని వారు గురుదక్షిణగా ఆయన కోరిక ననుసరించి జరిపారు. గురువుగారి అనుమతితో మధురానగరానికి తిరిగి వచ్చిన అనంతరం ఒకనాడు ఉద్ధవుని పిలిచి :

ఆర్యా! నందవ్రజంలోని గోపకాంత లందరూ ఈ లోకవాంఛలేమీ లేకుండా నిరంతరం నా మీదనే మనసు నిలుపుతూంటారు. వారిదగ్గరకు పోయి నేను త్వరలోనే వస్తున్నానని చెప్పి వారికి ఆశ్వాసన కలిగించు, అని పంపాడు.

ఉద్ధవుడు నందవ్రజం చేరగానే అక్కడి పెద్దలందరూ వానికి ఆదర సత్కారాలు జరిపించి, కుశల ప్రశ్నలు పూర్తిచేసి, అన్న పానాలతో సంతృప్తుని చేశారు.

త్వరలోనే కృష్ణుడువచ్చి యశోదనూ, నందునీ సంతోషింపజేస్తాడని చెప్పి వారికి ఆనందం కలిగించాడు.

ఆరాత్రి సుఖంగా నిద్రించాడు.

ఉదయమే గోపకాంతలు చల్ల చిలికేవేళకు లేచి స్నానాదికాలు పూర్తిచేసి, ఒకానొక పవిత్ర ప్రదేశంలో సుఖాసీనుడై ఉన్న ఉద్ధవునిచూసి గోపభామలు కొందరు, నర్మగర్భంగా కృష్ణునిమీద తమకు కలిగిన పొలయలుక వ్యక్తం చేశారు.

# భ్రమర గీతలు

భ్రమరా! దుర్జనమిత్ర!
ముట్టకుము మా పాదాబ్జముల్
నాగరప్రమదాళీ కుచకుంకుమాంకిత
లసత్ప్రాణేశ దామప్రసూనమరందారుణితానను౦డ
వగుటన్ నాథుండు మన్నించుగాక మమున్నేపుచు
పౌరకాంతల శుభాగారంబులన్ నిత్యమున్

ఒకపువ్వందలి తేనెద్రావి మధుపా !
ఉత్సాహివై నీవు వేరొకటిం పొందెడుభంగి
మన్మధర పీయూషంబునం దేల్చి
మా అకలంకోజ్జ్వల యౌవనంబుగొని
అన్యాసక్తుడయ్యెన్ విభుం డకటా
ఆతని కెట్లు దక్కె సిరి ! మిథ్యాకీర్తి నమ్మెంజుమీ !

* * * *

కాంచనరత్న సంఘటిత సౌధంబులే
మా కుటీరంబులు మాధవునకు
వివిధ నరేంద్ర సేవిత రాజధానియే
మా పల్లె యదువంశ మండనునకు
సురభిపాదప లతా శోభి తారామమే
మా అరణ్యము సింహ మధ్యమునకు
కమనీయ లక్షణ గజ తురంగంబులే
మా ధేనువులు కంస మర్దనునకు
రూప విభ్రమ నైపుణ రూఢలైన
మగువలమె మేము మన్మథ మన్మథునకు
ఏల చింతించు మము కృష్ణు డేల తలచు
పృథివి నధిపులు నూతనప్రియులు గారె !

అలా గోపికలందరూ తమ విరహవ్యధను నర్మగర్భంగా వ్యక్తంచేశారు. అంతావిని

ఉద్ధవుడు :

దానాలూ, వ్రతాలూ, జపాలూ, యజ్ఞాలూ చేసేవారుకూడా మీ అంత నిష్ఠగా ఆ పరమేశ్వరునిమీద మనసు నిలపలేరు. మీఏకాగ్రత చూస్తూంటే నాకు ఆనందమూ, ఆశ్చర్యమూ కలుగుతున్నాయి.

ఆయన మీ అందరికీ పంపిన సందేశం వినండి. పంచభూతాలు ఈ ప్రపంచం అంతానిండి ఉన్నట్లే నేను సర్వత్రా ఉన్నాను, కనక మీరు వియోగబాధ పడ నవసరం లేదు

ఇంకో రహస్యం ఉంది.

మనకు కలవస్తుంది. అందులో ఏమేమో చూస్తాం. మెలకువ వస్తుంది. ఆ వస్తువులన్నీ లేవే అని బాధపడతామా! ఈ ప్రపంచంకూడా అంతే! అనే జ్ఞానం ఎవరికి కలుగుతుందో వారికి ఏ బాధలూ ఉండవు.

పయిగా-దగ్గర ఉన్నవారికంటె దూరంగా ఉన్నవారిమీదనే మనస్సు ఎప్పుడూ లగ్నమయి ఉంటుంది. నిరంతరం మీరు నన్నే తలచుకోవాలి అనే సంకల్పంతోనే నేను దూర ప్రాంతానికి వెళ్ళాను. మీ నిత్యధ్యానం కారణంగా నిశ్చయంగా మీరు నన్ను పొందుతారు. అన విని.

ఉద్ధవా! ఆయన కుశలంగా వున్నాడా! ఇక్కడి కెప్పుడు వస్తాడు. ఆయనకు రావాలని ఎంతగా ఉన్నా మధురానగర భామలు వదులుతారా; అటుండగా

కొందరు: బాబూ! ఆయన యిక్కడ కాళింది ఒడ్డున మమ్మల్ని ఆడించిన విషయాలు ఎప్పుడయినా రహస్యంగానీతో చెప్పాడా! మేము స్నానాలు చేస్తుంటే మా చీరలు దొంగిలించి ఆడిన ఆటలు ముచ్చటించాడా! కాళిందిలో సాగించిన రాసక్రీడలు ప్రస్తావించాడా!

సరే! ఇవన్నీ దేనికి. ఇంతకాలమూ ఎలానో భరించాం. ఇంక మా తరం కాదు. ఆయన ఆలస్యం చేసేకొద్ది మా ప్రాణాలుండవని చెప్పు. మళ్ళీ యీ వ్రేపల్లెలో ఆయన తిరగడం చూస్తామా! మా అందరితో సరసాలాడే అదృష్టం వున్నదా. ఆయన ఆలింగన భాగ్యం మాకున్నదా!

అలా పరిపరి విధాల విలపించే వారిని ఓదార్చి కొన్నాళ్ళుండి ఉద్ధవుడు మధురకు జేరి కృష్ణుని కలిసి విషయాలన్నీ వివరించాడు.

మధుర విడిచేలోగా ఒకనాడు కుబ్జ గృహానికి వెళ్ళి ఆనందతరంగిత హృదయంతో ఆమె జరిపిన అతిథి సత్కారాలు అందుకుని ఆమెను తృప్తిపరచి వీడ్కొలిపాడు, కృష్ణుడు.

## జరాసంధుడు

ఇక్కడ యిలా సాగుతూండగా-

కంసుని మరణానంతరం వాని భార్యలగు అస్తి, ప్రాప్తి అనే వారిద్దరూ తమ తండ్రి

జరాసంధుని దగ్గరకు వెళ్ళి జరిగిన కథలన్నీ చెప్పారు. తన కూతుళ్ళ వైధవ్యం చూసి వంతలో క్రోధం పెల్లురేగి సైన్యసమేతం మధురమీదికి దాడి వచ్చాడు జరాసంధుడు.

అది గ్రహించి కృష్ణుడు యుద్ధానికి రాగా చూసి జరాసంధుడు. అబ్బాయీ! నువ్వు చిన్నవాడివి. మీ అన్నయ్యను పంపు. మన సంగతి నీకు తెలీదు. నిష్కారణంగా ప్రాణాలు పోగొట్టుకోకు, అన్నాడు.

అదివిని కృష్ణుడు: అనవసర ప్రసంగం దేనికి. నీ శక్తి చూపించు, అన్నాడు.

పోరు ప్రారంభమయింది.

ఉభయ పక్షాలూ నిశితంగా యుద్ధం సాగిస్తూంటే మగధ సేనధాటికి మధురబలం ఆగలేకపోయింది.

అప్పుడు బలరాముడు తన హలాయుధంతో సంగరరంగంలో అడుగుపెట్టి మగధ సేనలను చీకాకు పరచి, జరాసంధుని మెడపట్టాడు.

జరాసంధుడు ఉక్కిరి బిక్కి రవుతూంటే రెండు పిడిగుద్దులు గుద్ది విడిచి: పోరా! అధికప్రసంగాలు కాదు, వీరప్రదర్శనంకావాలి. నీసేనలు పలాయనం చేస్తున్నాయి; వెళ్ళి వారందరికి ధైర్యంచెప్పి మళ్ళీరా, అని జుట్టుపట్టి జాడించి వదిలాడు.

సిగ్గుతో తలయెత్తలేక జరాసంధుడు వెళ్ళిపోయాడు.

వెళ్ళిన జరాసంధుడు తనవంటి దుష్టచక్రవర్తులెందరినో పురికొల్పి మళ్ళీ యుద్ధానికి వచ్చాడు. అలా పదిహేడుసార్లు పరాభవంపొంది పద్దెనిమిదవ పర్యాయం మళ్ళీ సన్నద్ధుడు కాగా, నారదమహర్షి కాలయవనుని దగ్గరకు వెళ్ళి,

ఓ కాలయవనా! నీ శక్తి సామర్థ్యాలతో అన్ని దేశాలు జయించావు, కాని యదు వంశీయుల మధురానగరం వయిపు నీ సేనలు నడవలేదు. ఆ యాదవులు జరాసంధుని ఓడించి గర్వంతో విర్రవీగుతున్నారు. ఆలోచించగా నువ్వుకూడా వారికి భయపడినట్టే అని పిస్తున్నది, అన్నాడు.

అది విని వాడు క్రోధంతో:

మహర్షీ! ఎవరిమాట నువ్వుచెప్పేది! వాడిబలం ఏమిటి? వాడి స్నేహితులెవరు? నేను కత్తిదూసివస్తే నిలబడతాడా! పిక్కబలంచూపుతాడా?

అని ప్రశ్నించగా నారదుడు :

ఏం చెప్పమంటావు! వాడు నీలమేఘశరీరుడు. శ్రీవత్సలాంఛనుడు. పీతాంబరధారి. మకరకుండల శోభితకర్ణుడు. అంత వా డింత వాడనలేము. ఎక్కడ పడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు కనిపిస్తాడు! అన్నాడు.

ఆమాటలకు పౌరుషం వచ్చి కాలయవనుడు తన సర్వసేనతో మధురా నగరం మీదికి దాడిరాగా కృష్ణుడు :

ఓహెూ! వీడు కాలయవనుడు. వీడిటువస్తే అటు మళ్ళీ రేపు జరాసంధుడు వస్తాడు. ఇద్దరూ రెండుప్రక్కలా పోరు ఆరంభిస్తే మన నగరవాసుల బ్రతుకు దుర్భరమవుతుంది. అందుచేత వీరిద్దరికే అందుబాటులోవుండని నగరం నిర్మించాలి, అని విశ్వకర్మను పిలిచి సముద్రంలో మహానగరం నిర్మింపజేసి మధురాపుర వాసులందరినీ అక్కడకు తరలించాడు.

శ్రీ కరములు జనహృదయ వశీకరములు
మందపవన శీర్ణ మహాంభశ్శీకరములు
హంస విహంగాకరములు
నగరి కుపల యాజ్ఞాకరముల్

ఆ ద్వారకానగరంలో తన వారందరినీ సుఖంగా ఉంచి, వాసుదేవుడు నిరాయుధుడయి కాలయవనుని ఎదుర్కొనడానికి ముందుకు సాగాడు. వస్తూన్న కృష్ణుని చూచి కాలయవనుడు ఆశ్చర్యపోయాడు.

నారదముని చెప్పిన లక్షణాలన్నీ కనిపించగా సంతోషంతో కాలయవనుడు కృష్ణుని మీదికి దూకి పట్టబోగా ఆ లీలామానుషదేహుడు చిరునవ్వుతో పరుగు ప్రారంభించాడు.

కాలయవనుడు వాని వెనుకనే పరుగుపెడుతూ :

ఓ యదువంశీయుడా! యుద్ధంప్రారంభం కాకుండానే వెన్నుచూపి పరుగుపెట్టే నువ్వు రాజకుమారుడవేనా? సిగ్గుచేటు! నిలు, నిలు, అని తరుముతూంటే కృష్ణపరమాత్మ చిరునవ్వులు జల్లుతూ :

అధికప్రసంగా లెందుకు రా! నా వెనకనే రా, అంటూ చిత్ర విచిత్ర గమనాలతో వానిని ఆడిస్తూ, ఆడిస్తూ సాగి సాగి చరాలున ఒక కొండ గుహలో దూరాడు.

ఆ గుహలోనే వానిని సంహరించాలని కాలయవనుడు తీవ్రక్రోధంతో లోపలకు పోయి చూడగా, అక్కడ గుర్రుపెట్టి నిద్రించే వ్యక్తి కనిపించాడు.

ఓహెూ! ఈ పన్నాగం పన్ని నిద్ర పోతున్నావా! ఇదిగో నాకాలితాపుతో నీ ప్రాణాలు తీసేస్తాను చూడు, అంటూ కాలయవనుడు ఒక్క తన్ను తన్నాడు.

గాఢనిద్రానమాధిలోవున్న ఆ పురుషుడు కనులు విప్పి చూశాడు. అంతే ఆ చూపులవేడికి కాలయవనుడు భస్మమయాడు, అని చెప్పగా:

శుకయోగీంద్రా! ఆ మహాపురుషుడెవరు? ఆయన కథ ఏమిటి? అని అడిగాడు పరీక్షిత్తు.

# ము చి కుం దు డు

శుకయోగి: మహారాజా! ఇక్ష్వాకువంశీయుడైన మాంధాతపేరు విన్నావు కదా! ఆయన కుమారుడు ముచికుందుడు. ఈయన దేవతలకు రాక్షసులవల్ల నిరంతరం కలిగే బాధలను తొలగించడానికి దీక్షపూని, కొన్నిసంవత్సరాలపాటు రాక్షససంహారమే తన కర్తవ్యంగా నడిచాడు.

దేవతలకు రాక్షసబాధ తగ్గింది. అప్పుడు వారందరూ ఆయనను చేరి, నమస్కరించి:

స్వామీ! మీ అనుగ్రహంవల్ల మే మందరం ఆనందంతో జీవించగలుగుతున్నాం. లోకకళ్యాణ కాంక్షతో మీరు యింతకాలం మీ సంసారవిషయాలే చూడలేదు. మీ వంశీయు లందరూ ఈమధ్యకాలంలో దేహయాత్ర చాలించారు. అందుకు విచారించ వలసిన పనిలేదు. ఏమంటే-పుట్టిన ప్రాణికి చావు తప్పదుకదా!

ఇప్పుడింక మా యందు అనుగ్రహించి మీకు కావలసిన వరం కోరుకోండి. మోక్షం తప్ప ఏదయినా మీకివ్వగలం, అన్నారు.

అప్పుడు ముచికుందుడు: నాకు గాఢనిద్ర యివ్వండి, అన్నాడు. వారు అంగీకరించి వెళ్ళారు.

అది మొదలు ముచికుందుడు ఆ కొండగుహలో నిద్రిస్తూనే ఉన్నాడు. కాలవశాన కాలయవనుడు ఆ గుహలో ప్రవేశించి భస్మమయాడు.

అప్పుడు ఎదురుగావున్న వాసుదేవుని చూచి ముచికుందుడు చేతులు జోడించి:

మహానుభావా! నీవెవరవు! శివుడవా! ప్రజాపతివా! చక్రధారివా! నాకు నీ సేవ చెయ్యాలని ఉంది, అని అర్థించాడు

వాసుదేవుడు నవ్వురాజిల్లెడు మోముతో:

ఓ రాజనందనా! నే నెవరినని చెప్పను. ఇప్పుడు రాక్షససంహారార్థం వాసుదేవ నామంతో వసుదేవనందనుడుగా నాలీల నడుపుతున్నాను. ఆదినుంచీ నువ్వు నా భక్తుడవని ఎరుగుదును. అందుకే నిన్ను అనుగ్రహించటానికి యిలా వచ్చాను. ఏం కావాలో కోరుకో, అనగా ముచికుందుడు పరమ సంతోషంతో:

పురుషోత్తమా! నీకిదే నా నమస్కారం. ఈ ప్రపంచంలో మానవులందరూ భార్యా బిడ్డలతో సంపదలతో తులతూగాలనే మత్తులోపడి క్లేశాలనుభవిస్తారేకాని నీ నామస్మరణమే సర్వోత్కృష్టఫలదాయిని అని ఎరుగరుకదా! ఆ వ్యామోహంలో చిక్కుకుని ఏమేమో భోగాలు వాంఛిస్తూ ఆ వలయంలో కొట్టుమిట్టాడుతుంటారు.

నా అదృష్టవశాన నీ దర్శన భాగ్యం లభించింది. నాకే కోరికాలేదు. నీవే నాకు శరణు, అని తలవంచి నిలబడ్డాడు.

వాసుదేవుడు: మహారాజా! నీ జన్మ ధన్యమయింది. ఒక్కమాట, ఎవరయినా కర్మఫలం అనుభవించక తప్పదు కనుక, ఈ జన్మలో నువ్వు వినోదంగా వేటాడి జీవహింస చేసిన పాపం ఉంది. తపస్సుతో ఆ పాపం ప్రక్షాళన చేసుకొని మరొక జన్మలో ఉత్తమ సంస్కారం పొంది నన్ను చేరుతావు, అనగా ముచికుందుడు సంతోషించాడు.

గుహ వెలుపలకు వచ్చి చూశాడు. మనుషులు, పశువులు, పక్షులు అన్నీ చిన్ని చిన్ని దేహాలతో కనిపించాయి. ఓహో! కలియుగం వస్తున్నది కాబోలు, అల్పప్రాణులు పుడుతున్నాయి, అని బదరికాశ్రమానికిపోయి తపోదీక్ష వహించాడు, మహామహుడు ముచికుందుడు.

ముచికుందుని అనుగ్రహించి వాసుదేవుడు తిరిగి వచ్చేసరికి జరాసంధుని సేన మధురానగరాన్ని ముట్టడించి ఉంది. అదిచూసి కృష్ణుడు బలరామసమేతం భయపడిన వానివలె పరుగు ప్రారంభించగా జరాసంధుడు వెంటతరుముతూ:

ఓ పిరికిపందలారా! మీ రెక్కడ దాగినా మిమ్ము సంహరించి తీరుతాను, అని సేనతో సాగుతున్నాడు.

అన్న దమ్ము లిద్దరూ తీవ్రగమనంతో పోయిపోయి ప్రస్రవణగిరి శిఖరం ఎక్కి నిల బడ్డారు. వారెక్కడ దాగినదీ గ్రహించలేక జరాసంధుడు ఆ కొండగుహలలో ఎండుకట్టెలు, గడ్డి దట్టింపించి నిప్పు పెట్టించాడు. అంతతో పర్వతంనిండా మంటలు బయలుదేరాయి.

ఆ వేడికి పర్వతం మీద నివసించే సర్వప్రాణికోటి మండిపోయింది. అదే సమయంల బలరామ కృష్ణు లిద్దరూ శత్రువుల కంట బడకుండా కొండచివర నుండి దూకి ద్వారక నగరం చేరుకున్నారు.

మంటలలో వారిద్దరూ భస్మమయారని సంతోషించి జరాసంధుడు తన నగరాని వెళ్ళాడు.

# రుక్మిణీ కళ్యాణం

పరీక్షిన్మహారాజా !

బలరామునికి యుక్తవయను రాగానే రైవతుడనే రాజు తన కుమార్తె రేవతిని యిచ్చి వానికి వివాహం జరిపించాడు. అనంతరం కృష్ణుడు భీష్మక మహారాజు కుమార్తె అయిన రుక్మిణీదేవిని రాక్షస వివాహం చేసుకుని తన యింటికి తీసుకు వచ్చాడు, అని శుక యోగీం ద్రుడు చెప్పగా ఆ మహారాజు :

యోగీంద్రా !

లోకకల్యాణదాయకా లయిన ఆ మహామహుని గాథలు వింటున్న కొద్దీ ఆసక్తి పెరుగుతూనే ఉంటుంది. అందునా, యదువంశంలో ప్రభవించి స్వామి, రుక్మిణీదేవిని వివాహం చేసుకున్న కథ సంపూర్ణంగా వినాలని ఉంది. అనుగ్రహంతో ఆ గాథ వినిపిం చండి.

భూషణములు సెవులకు
బుధతోషణము లనేకజన్మ దురితౌఘ
వినిశ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమను గుణ భాషణముల్.

అని ప్రార్థించగా, శుకయోగి :

మహారాజా ! విదర్భదేశాన్ని భీష్మకుడనే రాజు పాలించేవాడు. ఆయనకు రుక్మి రుక్మరథ, రుక్మకేత. రుక్మబాహు, రుక్మనేత్ర అనే అయిదుగురు కుమారులు. ఈ అయిదు గురికీ సోదరిగా రుక్మిణి అనే బాలిక పుట్టింది. ఆమె జన్మించింది మొదలు ఆ రాజు ఆనం దం అవధులు దాటింది.

క్రమ క్రమంగా ఆమె శరత్కాల చంద్రబింబంవలె పెరుగుతూన్నది. తల్లి దండ్రుల ఆజ్ఞతో, గురువుల సన్నిధానంలో ఆమె విద్యా, గుణ, శీలాలలో ఎంతోపేరు తెచ్చుకున్నది.

ఈ విషయాన్ని విన్న వసుదేవనందనుడు రుక్మిణిని తన భార్యగా తెచ్చుకోవాలని నిశ్చయించుకున్నాడు.

అలానే — కృష్ణుని గుణ గణాలు విన్న రుక్మిణికూడా ఆయననే తనభర్తగా భావించి, మనసులో ఆరాధిస్తున్నది. రుక్మిణి తల్లిదండ్రులు, బంధువులూకూడా కృష్ణునికే ఆమెనిచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయాలు సాగిస్తున్నారు.

కాని — అన్నగారు రుక్మి మాత్రం తన చెల్లెలిని శిశుపాలుని కిచ్చి పెళ్ళిచెయ్యాలని నిశ్చయించాడు. అందుకు తగ్గ ప్రయత్నాలుకూడా నడుపుతూ సుముహూర్తం పెట్టించాడు.

ఆ వార్తవిన్న రుక్మిణీదేవి చాలాసేపు విచారించి, తన శ్రేయస్సుకోరే అగ్నిద్యోతనుడనే విప్రవరుని రావించి, విషయం అంతా చెప్పి:

విప్రవరా! మీరు ఎలాగయినా ద్వారకానగరంవెళ్ళి నా మనస్సు ఆయనకు తెలియజేసి సుముహూర్తం అతిక్రమించకుండా ఆయన యిక్కడకు రావడానికి తగిన సదుపాయం కలిగించాలి, అని ప్రార్థించింది.

అగ్నిద్యోతనుడు హుటాహుటి ద్వారక చేరి వాసుదేవుని దర్శించి, ఆయన జరిపిన పూజ లందుకొని తాను తెచ్చిన సందేశం వినిపించి:

యదువంశభూషణా! వారి వంశాచారప్రకారం పెండ్లికుమార్తె వివాహాత్పూర్వం గౌరీపూజ చెయ్యాలి. అందుకోసం ఆమె నగరం సరిహద్దులలో ఉండే ఆలయానికి వస్తుంది. ఆ సమయంలో ఆమెను రథంమీద తీసుకువెళ్ళవచ్చు. అక్కడ బంధు, మిత్రుల నెదిరించి పోరాడవలసిన అవసరం ఉండదు, అన్నాడు.

బ్రాహ్మణోత్తమా! మీ ఆదేశానుసారం నేను రుక్మిణీ పాణిగ్రహణం చేస్తాను. ముహూర్తంకూడా దగ్గరలోనే ఉంది కనక మనం త్వరగా బయలుదేరుదాం, అని సారథిని పిలిచి, రథం సిద్ధం చేయించి, ఆ బ్రాహ్మణునితో బయలుదేరాడు.

విదర్భనగరంలో వివాహమహోత్సవానికి సన్నాహాలు పూర్తి అయాయి. శిశుపాలుడు చక్కగా పెళ్ళికొడుకువలె అలంకరించుకుని సిద్ధంగా ఉన్నాడు. భీష్మకమహారాజు బంధు, మిత్రులందరికీ మర్యాదలు నడుపుతూ దాన ధర్మాలు సాగించాడు.

ఇవన్నీ జరుగుతూంటే అంతఃపురంలో రుక్మిణీదేవి విచారంతో బ్రాహ్మణుని ర
కోసం ఎదురుచూస్తున్నది. తెల్లవారితే పెళ్ళి.

ఈ భూసురశ్రేష్ఠుడు వెళ్ళాడో, లేదో !

ఆ యదువంశభూషణుడు నా యందు అనుగ్రహంతో ఉన్నాడో, లేదో !

ఇంతకూ నా అదృష్టం ఎలా ఉన్నదో !

అని పరి పరి విధాల చింతిస్తున్న సమయానికి అగ్నిద్యోతనుడువచ్చి :

అమ్మా ! నువ్వు అదృష్టవంతురాలివి. నందనందనుడు పరమసంతోషంతో ద
చేశాడమ్మా, రేపు నిన్ను పెళ్ళిచేసుకుంటాడు తల్లీ, అని ఆశీర్వదించాడు.

రుక్మిణీదేవి హృదయం ఆనందతరంగితం అయింది.

* * * *

అటు కృష్ణుడు బయలుదేరిన వార్తవిని బలరాముడు యదుసేనను వెంటబెట్టుకు
కృష్ణునికి సహాయంగావచ్చాడు.

బలరామ, కృష్ణులు వచ్చిన వార్తవిని భీష్మకమహారాజు వారికి సముచితసత్కా
రాలు జరిపి విడిది ఏర్పాటుచేశాడు.

కళ్యాణ ముహూర్తసమయానికి ముందుగా రుక్మిణీదేవి గౌరీపూజకునగరం వెలుప
ఆలయానికి వెళ్ళి ఆ సర్వలోకేశ్వరిని అర్చించి, ప్రార్థించి తిరిగివస్తూండగా, రాజవీధి
నానా దేశాల రాజులు చూస్తుండగా వాసుదేవుడు రుక్మిణీదేవిని తన రథంమీదికి ఎక్కించ
కుని హుటాహుటి రథం ద్వారకవయిపుతోలించాడు.

అదిచూసి ఆశ్చర్యపడిన రాజులందరూ యుద్ధసన్నద్ధులు కాగా, బలరామా
యదువీరులందరూ వారిని నిరోధించి, చెల్లాచెదరు చేశారు. వా రందరూ వెనుదిరిగి పా
పోయి, శిశుపాలుని చూసి :

నాయనా ! మన అదృష్టం బావుండి బ్రతికి పోయాం. జీవించి ఉంటేకదా భార్య
ఇప్పుడు హాయిగా యింటికిపోయి మరొక రాచకన్యను పెళ్ళిచేసుకోవచ్చు, అని ఓదార్చార

అందరూ ఎవరి దారిన వారు తిరిగిపోయినా రుక్మి ఒక్కడూ తనసేనతో దూకుడు
పోయి కృష్ణుని ఎదిరించాడు. ఎదురువస్తూనే అనేకవిధాల దుర్భాషలాడి బాణాలు విడువగ
కృష్ణుడు నవ్వుతూ ఒక్కబాణంతో వాని ధనుస్సు ఖండించి, మరికొన్ని నిశితశరాలత

గుర్రాలనూ, రథాన్నీ నేలకూల్చగా వాడు పరిఘపట్టిసాది ఆయుధా లందుకున్నాడు. అన్నింటినీ ముక్కలు చేసి కవచం ఛేదించి శిరస్సు ఖండించడానికి ఖడ్గం పై కెత్తగా :

ప్రాణేశ్వరా! మీ శక్తి తెలియక వీడు చేసిన అపరాధం మన్నించండి. ఈ సంహారం వల్ల నా తల్లిదండ్రులు పుత్రశోకంతో బాధపడతారు. వారికి ఆ కష్టం కలిగించక మా అన్నను విడిచి పెట్టండి, అని రుక్మిణీదేవి ప్రార్థించగా, వాసుదేవుడు శాంతించి, తలగొరిగి మీసాలు తీసేసి పొమ్మన్నాడు.

అదిచూసి రుక్మిణిదేవి విచారించగా బలరాముడు వేదాంతబోధచేసి ఆమెను ఓదార్చాడు.

ఆ విధంగా రుక్మిణీదేవిని ద్వారకానగరానికి తెచ్చి అక్కడ వైభవోపేతంగా వివాహ మాడాడు, వాసుదేవుడు.

సాక్షాత్తూ లక్ష్మీదేవి అవతారమయిన రుక్మిణీదేవితో నారాయణమూర్తి వాసుదేవుడు సంసారయాత్ర సాగిస్తున్నాడు. ఆ నగరవాసు లందరూ వారినిచూచి ఆనందాంబుధిలో ఓలలాడుతున్నారు, అని శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు భాగవతంలోని దశమస్కంధం పూర్వభాగం వినిపించి, ఉత్తరభాగం ప్రారంభిస్తున్నాడు.

# దశమస్కంధము

## ( ఉత్తరభాగము )

శ్రీకర పరితోషిత
రత్నాకర కమనీయ గుణ గణాకర
కారుణ్యాకర! భీకర శరధారా
కంపిత దానవేంద్ర! రామ నరేంద్రా!

పరీక్షిన్నరేంద్రా! అలనాడు పార్వతీ పరిణయానికి ముందు పరమేశ్వరుని ఫా నేత్రాగ్నికి మన్మథుడు దహనమైనాడని విన్నావుకదా! ఆ మదనుడే రుక్మిణీదేవి గర్భా వాసుదేవుని అనుగ్రహంతో ప్రద్యుమ్ననామంతో ప్రభవించాడు.

ప్రద్యుమ్నుడు తనపాలిట యముడని గ్రహించిన శంబరాసురుడు ఒకనాటిరాత్రి పురిటింట్లో ప్రవేశించి ఆ శిశువును దొంగిలించి సముద్రంలో వదిలేశాడు. అక్కడ ఉన్న ఒక పెద్దచేప ఆ శిశువును మింగింది. ఆ సమయాన వేటకువచ్చిన జాలరులు ఎన్నోచేపల వేటాడి యింత పెద్దచేపను రాజుగారికి బహుమానంగా యివ్వాలని సంతోషంతో తీసుకుపోం తమ ప్రభువయిన శంబరుడి కిచ్చారు. ఆయన దానిని వంటశాలకు పంపాడు.

అక్కడవారు చేపను తరిగారు. దివ్యకాంతితో బాలుడు బయటపడగా వా ఆశ్చర్యంతో ఆ విషయం మాయావతికి తెలియజేశారు.

ఈ మాయావతి అసలుపేరు రతీదేవి. నాడు తనభర్త హరనేత్రాగ్నిలో భస్మమైనది మొదలు పాతివ్రత్య నియమంతో యిక్కడ రహస్యంగా కాలం గడుపుతున్నది వారు వచ్చి చెప్పి వెళ్ళగానే నారదమహర్షివచ్చి అసలుకథ చెప్పగా, ఆవిడ శంబరు సమీపించి; తనకొక శిశువును పెంచుకోవాలనే కోరిక ఉన్నదని చెప్పి, ఆ బిడ్డను పెంచడ మొదలుపెట్టింది.

బాలుడు పెరుగుతున్నాడు. శుక్లపక్షచంద్రునివలె దిన దిన ప్రవర్ధమాను డవుతు యౌవనప్రాంగణంలో అడుగుపెట్టాడు. ఆ వయసులోవున్న ప్రద్యుమ్నుని చూచిన సుంద రాంగు లందరూ అతడు తమవైపు ఒక్క చూపు చూస్తే చాలు, జన్మచరితార్థం అవుతు దనుకునేవారు.

ఆరోజులలో ఒకనాడు —

మాయావతి ప్రద్యుమ్నునిచేరి తనకు ఆలింగనసుఖం అనుగ్రహించమని వేడింది. అప్పుడు ప్రద్యుమ్నుడు తెల్లబోయి: ఎంత అవివేకం! ఇంతకాలం నన్ను బిడ్డగా పెంచి, యీ నాడిలా కోరడం చూస్తే కామపిశాచి ఏదో నిన్ను ఆవహించి నట్లుంది, అన్నాడు.

అదివిని, రతీదేవి పూర్వగాథ అంతా వివరించి, నిన్ను సంహరించాలని యీ శంబరాసురుడు ఎదురు చూస్తున్నాడు. వీడు మహామాయావి. వీణ్ణి కడతేర్చాలంటే మరిన్ని మాయలు కావాలి, అని ఆ విద్యలన్నీ నేర్పింది.

సర్వశత్రుమాయలనూ నశింపజేసే మహామాయావిద్య గ్రహించి, ప్రద్యుమ్నుడు శంబరునిమీదికి యుద్ధానికి రాగా, వాడు కోపోద్దీపితుడై, గదాదండం విసిరాడు. ప్రద్యుమ్నుడు తన గదాఘాతంతో దానిని ముక్కలు చేశాడు.

శంబరుడు అదృశ్యుడై శరవర్షం కురిపించగా, ప్రద్యుమ్నుడు మహామాయ ప్రయోగించి నిరోధించాడు. అలా వాని మాయలన్నీ పటాపంచలు చేసి నిశితఖడ్గంతో వాని శిరను ఖండించాడు. శంబరసంహారంతో సంతోషించి దేవతలు పూలవాన కురిపించారు.

ఆనందంతో రతీ సమేతం ప్రద్యుమ్నుడు గగనమార్గాన బయలుదేరి ద్వారకా నగరంలో దిగి రాజవీధిలో వెడుతూంటే కొందరు వాసుదేవుడే అనుకున్నారు. మరికొందరు "కృష్ణుని లక్షణాలన్నీ లేవే" అని పరిశీలించి చూశారు.

అలా వస్తున్న వానిని చూచి రుక్మిణీదేవి, తన పురిటిరోజుల కథలన్నీ త్రవ్వుకుంటూ వాడే వీడై ఉండాలి అని ఆనందిస్తున్నది. అప్పటికి కృష్ణుడు కూడా అటువచ్చి, దేవకీ వసుదేవులను రప్పించాడు. అదే సమయానికి నారద మునీంద్రుడు విజయంచేసి జరిగిన కథ అంతా వివరించగా, రుక్మిణీదేవి ఆనందభరితహృదయంతో కొడుకునూ, కోడలినీ దగ్గరగా తీసుకుని ఆశీర్వదించింది. ఈ వార్తవిన్న ద్వారకానగరవాసు లందరూ రుక్మిణీ దేవి అదృష్టాన్ని కొనియాడారు.

## సత్యభామ

ద్వారకానగరంలో వాసుదేవుడు రుక్మిణీ సమేతం కాలం గడుపుతూన్న సమయంలో ఒకనాడు సత్రాజిత్తు నగరానికి వచ్చాడు. ఈ సత్రాజిత్తు సూర్యభగవానుని భక్తుడు.

వీని భక్తికి మెచ్చి సూర్యుడు స్యమంతకమణిని బహూకరించాడు. ఆ మణిని కం
ఠమును అలంకరించుకొని వచ్చిన సత్రాజిత్తును చూసి ద్వారకావాసు లందరూ సూర
భగవానుడే తమ నగరానికి వచ్చాడని సంతోషించి కృష్ణునికి నివేదించగా, ఆయ
విషయం గ్రహించి, వచ్చినవాడు సత్రాజిత్తుకాని సూర్యుడు కాదని వారికి తెలిపి పంపించాడ

సత్రాజిత్తు సగర్వంగా తన మందిరానికి వెళ్ళి శాస్త్రప్రకారం ఆ మణికి పూజ
చేయించాడు అది రోజూ ఎనిమిది బారువుల బంగారాన్ని యిస్తూ ఉంటుంది. అటువం
మణి ఏ దేశంలో ఉంటే ఆ ప్రాంతప్రజలు ఆరోగ్యంతో, ఆనందంతో ఉంటారు.

అది తెలిసిన వాసుదేవుడు సత్రాజిత్తు దగ్గరకు వెళ్ళి దానిని ఉగ్రసేన మహా
రాజుకు యిమ్మని చెప్పాడు. సత్రాజిత్తు అంగీకరించలేదు. వాసుదేవుడు మౌనం
తిరిగి వచ్చాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఒకనాడు సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనజిత్తు ఆ మణిహారం ధరించి అరణ్యాని
వేటకు వెళ్ళగా, అక్కడ ఒక సింహం వానిని సంహరించి ఆ మణి తీసుకువెడుతూండ
ఆ అరణ్యంలో నివసించే జాంబవంతుడు చూసి సింహాన్ని చంపి మణి తీసుకుపోయి త
కుమార్తె జాంబవతి పరుండే ఉయ్యాలకు వ్రేలాడదీసి, ఆమెకు ఆనందం కలిగించాడు.

వేటకు వెళ్ళిన ప్రసేనుడు తిరిగి రాకపోవడంతో సత్రాజిత్తు :

ఈ పని అంతా కృష్ణుడే చేసి ఉంటాడు. తనకు స్యమంతకమణి యివ్వలేద
కోపంతో నా సోదరుని సంహరించి ఉంటాడు, అని నిందవేశాడు.

ఆ మాటవిన్న కృష్ణుడు తక్షణం బయలుదేరి అడవిఅంతా తిరిగిప్రసేనజిత్తు
చంపిన సింహం కాలిజాడను పట్టిపోయి, సింహాన్ని చంపినభల్లూకపతి అడుగుజాడల
వెళ్ళి గుహలో ప్రవేశించి, దివ్యకాంతులీనే మణిని చూసి, మెల్లగా అడుగులువేస
ఉయ్యాల సమీపించబోగా అక్కడ ఉన్న దాది గట్టిగా కేకపెట్టింది.

అదివిని జాంబవంతుడు ఒక్కదూకులో వచ్చి కృష్ణునితోద్వంద్వయుద్ధానికి సన్న
ద్ధయాడు.

ఉభయులూ తమ బాహుబలం చూపుతూ పోరు నడుపుతున్నారు. పిడుగు
పడుతున్నట్లు పిడికిళ్ళతో పొడుచుకుంటూ ఒకరి కొకరు లొంగకుండామల్లయుద్ధం సాగించా
అలా కొన్నిరోజులు పోరాటం సాగాక, జాంబవంతుడుచేతులు జోడించి :

పురాణపురుషా! ఇంతకాలం అజ్ఞానం వల్ల నిన్ను గ్రహించలేకపోయాను. నన్ను మన్నించు. సృష్టిస్థితి లయ కారకుడ వయిన నీకు నమస్కరిస్తున్నాను. అలనాడు సముద్రానికి సేతువుకట్టి దశకంఠుని పరిమార్చిన పురుషోత్తమా! నీకు వందనం, అని పరి పరి విధాల ప్రార్థించగా కరుణామయుడైనవాసుదేవుడు తన కరపల్లవాలతో వాని శరీరశ్రమ తగ్గించి :

జాంబవంతా! ఈ మణిని మేము దొంగిలించామని సత్రాజిత్తు అపనింద వేయడం వల్ల యింత జరిగింది. అనగా జాంబవంతుడు వినయంగా స్యమంతకమణినీ, తనకుమారీ రత్నాన్నీ కృష్ణుని కర్పించి సంతోషంతో ఆయనకు వీడ్కోలిచ్చాడు.

వాసుదేవుడు జాంబవతిని వెంటబెట్టుకుని స్వగృహానికివచ్చి, మరునాడు సత్రాజిత్తును రాజసభకు రప్పించి జరిగిన విషయాలన్నీ చెప్పి వాని మణి యిచ్చి పంపించాడు.

అకారణంగా అపనింద వేసినందుకు బాధపడుతూ సత్రాజిత్తు బాగాయోచించి యోచించి తనకుమార్తె సత్యభామతో ఆ స్యమంతకమణి కూడా కృష్ణునికి సమర్పించగా వసుదేవనందనుడు తనకు సత్యభామ చాలుననీ, మణి అవసరంలేదనీ పంపించాడు.

కొన్నిరోజులు గడిచాయి.

ఆదిలో సత్రాజిత్తు తనకుమార్తెను శతధన్వుని కిచ్చి వివాహం చేస్తానన్నాడు. ఆమెను కృష్ణుని కివ్వడంతో వాడు మండిపడి ఒకనాటి రాత్రి నిద్రించే సత్రాజిత్తును నరికి మణి తీసుకువెళ్ళాడు.

తండ్రి మరణవార్త సత్యభామను విపరీత హృదయవ్యధ కలిగించగా కృష్ణుడు శతధన్వుని సంహరించడానికి బయలుదేరాడు. అదివిని వాడు భయంతో కృతవర్మనూ, అక్రూరునీ శరణువేడగా వారు వాసుదేవుని శక్తి కీర్తించి తమ వల్ల కాదన్నారు. అప్పుడు శతధన్వుడు మణిని అక్రూరుని వద్ద దాచి పలాయనం ప్రారంభించాడు.

వాసుదేవుడు వానిని తరిమి తరిమి శిరసు ఖండించాడు. వానివద్ద మణి కనిపించలేదు. వెంటవచ్చిన బలరాముడు :

కృష్ణా! వీడు మణిని ఎవరివద్దనో దాచిఉంటాడు, నగరానికి పోయి అన్వేషించు. మనం మిథిల సమీపానికి వచ్చాం కనక నేను జనకరాజర్షిని దర్శించి వస్తానన్నాడు.

కృష్ణుడు ద్వారక చేరాడు.

శతధన్వుని మరణవార్తవిని అక్రూర, కృతవర్మలు భయంతో నగరంవిడిచి
కృష్ణుడు అక్రూరుని రావించి, సౌమ్యవచనాలతో స్యమంతకమణిని తెప్పించి రాజు
ప్రజలందరికీ దానిని చూపి, తిరిగి అక్రూరునికే యిచ్చి నిర్భయంగా ఉండమన్నాడు.

ఈ విధంగా సాగిన స్యమంతకమణికథ విన్నవారికి యశో ధన సమృద్ధి
తుందని వ్యాసులవారి ఆజ్ఞ, అంటూ శుకయోగీంద్రుడు భాగవతకథాప్రవచనం కొ
స్తున్నాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఈ మధ్యకాలంలో శ్రీకృష్ణుడు కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర,
అను పేర్లుగల రాజపుత్రికలను వివాహం చేసుకున్నాడు. రుక్మిణి, సత్యభామ,
వతులతో కలిసి వీరు ఎనమండుగురు రాణులు.

అనంతరం నరకాసురుని సంహరించి ఆ క్రూరుడు చెరపట్టిన పదహారువేలమ
తన అంతఃపురకాంతలుగా తీసుకువచ్చాడని యోగివర్యుడు చెప్పగా మహారాజు నరక
వధ వినాలని కోరిక వెలిబుచ్చాడు.

# నరకాసురసంహారం

రాజేంద్రా! భూదేవి కుమారుడు నరకుడు. వీడు బలమదగర్వంతో అదితి
లాలు హరించాడు. వరుణదేవుని ఛత్రం అపహరించాడు. మణిపర్వతం ధ్వ
చేశాడు. ఈ బాధలు భరించలేక దేవేంద్రుడు వచ్చి, వాసుదేవునికి మొరపెట్టగా అ
నరకాసురసంహారానికి అంతా సిద్ధంచేయించాడు.

బయిలుదేరేవేళ సత్యభామ ఎదురువచ్చి. చిరునవ్వుతో :

స్వామీ! మీరు రాక్షసులెందరినో అవలీలగా ఓడించారని వినడమేకాని
సంగ్రామకేళి చూసే అదృష్టం కలగలేదు. ఈ మారు నేను మీతో వచ్చి ఆ వినో
తిలకించి వచ్చి జరిగింది జరిగినట్లుగా నీ రాణులందరికీ చెప్పాలని ఉంది, అని అడి

నవ్వురాజిల్లెడు మోముతో వాసుదేవుడు :

భామామణీ! యుద్ధరంగంలో తుమ్మెదల ఝుంకారాలుండవు, మత్తేభ ఘీంక
తప్ప. అప్పుడే వికసించే పూలమీది పుప్పొడి కనబడదు, తీవ్రవేగంతోసాగే గు

డెక్కలతోరేగే దుమ్ము తప్ప. చిన్నచిన్న కెరటాల సరోవరాలుండవు, బాణ వర్షమే. రాజహంసల కలస్వనా లుండవు. సైనికుల వీరగర్జనలే. అటువంటిచోటికి నీవంటి సుకుమారులు రాకూడదు,. అని అనునయించాడు.

వినలేదు సత్యభామ.

మరిచెప్పి ప్రయోజనం లేదని అనురాగంతో అంగీకరించి గరుడ వాహనారూఢుడై వాసుదేవుడు నరకాసురుని రాజధాని ప్రాగ్జ్యోతిషం మీదికి దాడి బయలుదేరాడు.

ప్రాగ్జ్యోతిషనగరానికి రక్షగా ఉన్న గిరిదుర్గ, శస్త్రదుర్గ, జలదుర్గ, అగ్నిదుర్గ, వాయుదుర్గాలు ధ్వంసంచేసి మురాసురుడు పన్నిన పాశాలను కూడా ఛిన్నాభిన్నం చేశాడు.

చేసి పాంచజన్యం పూరించగా, మురాసురుడు నిద్రలేచి నిశిత శూలంతో గరుత్మంతుని వేధించబోగా దానిని వాసుదేవుడు అవలీలగా చేతబట్టి మూడు ముక్కలు చేసి విసిరేశాడు.

విసురుతూనే బాణవర్షం కురిపించగా వాడు కుపితుడై గదాదండం విసిరాడు. తీవ్రవేగంతో వచ్చే ఆ గదను తన గదాదండంతో ముక్కలు చేసి, వాని అయిదు శిరస్సులను చక్రంతో ఖండించాడు. అదివిని వాని కుమారులు ఏడుగురు ఎత్తిరాగా అందరినీ ముక్కలు ముక్కలు చేశాడు వాసుదేవుడు.

వార్త వింటూనే నరకాసురుడు శర వేగంతో రణరంగానికి వచ్చి, ఎదురుగా గరుడ వాహనం మీద వాసుదేవునితో రణరంగవిశేషాలు ముచ్చటించే భామామణిని కూడా చూశాడు.

వానిని చూసిన సత్యభామకు తానై యుద్ధం చేయాలనే కోరిక కలిగింది.

జుట్టుముడి బిగించింది; నడికట్టు గట్టిగా సవరించింది.

అలంకారాలన్నీ సరిజేసింది. పైట చెంగు బొడ్డులో దోపింది.

అంతా క్షణాలలో ముగించి ముందు లేచి నిలబడింది.

అది చూసి వాసుదేవుడు నవ్వుతూ!

భామా! దనుజుల గెలువగ లేమా!

నువ్వు వెనక్కిరా! రానంటావా! ఇదిగో ఈ ధనుస్సందుకో, అని బాణం అందించాడు.

అందుకుంటూ అల్లెత్రాడు బిగించి వాడిబాణం తోడిగి, నిప్పులుకురిసే క
శత్రుసేనను చూస్తూ నారి మ్రోగించింది. ప్రతిపక్షంలోని మత్తేభాలు సైతం
మ్రోతకు దద్దరిల్లాయి.

భర్తమయిపు అనురాగం కురిపిస్తూ, దానవభర్తపై ఆగ్రహవర్షం నడిపిస్తూ
భామ యిటు శృంగార దేవతలా, అటు వీర రౌద్రమూర్తిలా కనిపిస్తూ శరపరంపర
తున్నది. ఆవిడ విడిచే బాణాల ధాటికి ఆగలేక దానవసేనలు నరకాసురుని
పోగా నరకుడు తీవ్రరోషంతో బాణం పట్టాడు.

అదిచూసి వాసుదేవుడు :

భామా! క్రూరులయిన అసురులు పిక్కబలం చూపుతున్నారు. కొంతసేపు
విశ్రాంతి తీసుకో. ఈ నరకుడి వ్యవహారం నేను చూస్తాను, అన్నాడు.

నరకుడు ముందువచ్చి :

మగువ! మగవారి ముందర
మగతనములు నూవ రణము మానుట నీకున్
మగతనముగాదు - దనుజులు
మగువల దెన జనరు
మగలమగలగుట - హరీ!

అంటూండగానే వాసుదేవుడు శరవర్షంతో అసురసంహారానికి ఉపక్రమిం
సత్యభామా కృష్ణులను తన వీపున మోస్తూనే గరుత్మంతుడు తన వాడిముక్కుతో,
గోళ్ళతో నరకాసురుని గజబలాన్ని ఛిన్నాభిన్నంచేశాడు. అదిచూసి నరకుడు శక్తి అ
ప్రయోగించాడు. చలించలేదు గరుత్మంతుడు.

కొంతసేపు పోరునడిపి వాసుదేవుడు నరకుని శిరసు ఖండించి, నేలకూ
సర్వలోకాలలోని ప్రాణులూ నరకునిపీడ వదలిందని సంతోషించాయి.

అనంతరం భూదేవి పరిపరివిధాల కృష్ణుని స్తుతించి, నరకుని కుమారుడైన
దత్తుని తీసుకువచ్చి శరణు వేడగా ఆయన అభయం యిచ్చి, నరకుడు బంధించిన
కన్యలు పదహారువేలమందినీ చెర విడిపించి, అందరినీ రథాలమీద ద్వారకానగ
పంపి, ఆ రాక్షసుడు దొంగిలించి తెచ్చిన కర్ణకుండలాలు అతిథికి మర్యాదగా అ

దేవేంద్రుని సౌధంలో అతిథిమర్యాదలు పొంది, నందనవన విహారవేళ సత్యభామ కోరిన పారిజాతాన్ని అవలీలగా పెకలించి, గరుడారూఢుడై ద్వారకకు ప్రయాణ మయాడు.

అది చూసిన అమరగణం అడ్డురాగా వారందరినీ నిరోధించి సుఖంగా ద్వారకచేరి అక్కడ సత్యభామ ఉద్యానవనంలో పారిజాతంనాటి ఆమెకు ఆనందం కలిగించాడు.

అనంతరం నరకుని చెరనుండి విడిపించికొనివచ్చిన కన్యాసహస్రాన్ని విధ్యుక్తంగా వివాహం చేసుకొని అందరినీ అనురాగంతో ఆదరిస్తూ రోజులు గడుపుతున్నాడు. ఎవరికి వారు తమయందే వాసుదేవుడు అనురాగంతో ఉన్నాడని సంతోషంతో గడుపుతున్నారు.

కాలం గడుస్తున్నది.

ఒకనాడు వాసుదేవుడు రుక్మిణీదేవి మందిరంలో విలాసగోష్ఠి సాగిస్తూ ;

విదర్భరాజపుత్రీ! నువ్వు ఎంత తెలివి తక్కువపని చేశావో చూశావా! దిక్పాలకులను మించిన చక్రవర్తులు కదా శిశుపాల జరాసంధాదులు. అటువంటి గొప్పవారికి నిన్ను పెళ్ళిచేద్దామని మీ అన్నయ్య సంకల్పిస్తే అమాయకంగా నావెంట బడ్డావు.

మా నివాసమేమో, జలరాశి మధ్యంలో
మా ప్రవర్తనలు లోకానికి తెలిసేవికావు.
ప్రపంచంలో బల మద గర్వం కలవా రందరూ మాకు శత్రువులే.
రాజసింహాసనాలు మా కవసరంలేదు.
నిధి నిక్షేపాలున్న సంపన్నులమూ కాము
మా చుట్టాలు మా కంటే దరిద్రులు.
అటువంటివారి వెంటనే తిరుగుతాము.

అంద చందాలూ, సిరి సంపదలూ, కుల గోత్రాలూ తూగేవారితో వియ్యాలు సాగాలి కాని, ఎందునా పోలికలేవి మా యింట చేరావు నువ్వు.

ఇంతకూ శత్రుగణాన్ని నిర్జించి, గర్వాంధుడైన మీ అన్నగారికి పరాభవం చెయ్యడానికి నిన్ను తెచ్చాను కాని నాకు దారా పుత్ర వ్యామోహం ఉండికాదు. ఇప్పటికయినా మించిపోలేదు. ఆలోచించుకో అని నర్మగర్భంగా పలికాడు.

ఆ మాటలు వినే రుక్మిణీదేవికి కన్నీరు మున్నీ రయింది. వంచిన తలయెత్తలేక వేడినిట్టూర్పులతో వడగాలి దెబ్బతిన్న పువ్వులా వాలిపోయింది:

అదిచూసి కృష్ణుడు, త్వర త్వరగా పన్నీరు ముఖాన చల్లి, కన్నీరు ఒత్తి జడముడి సవరించి, పైట సరిదిద్ది, సేదదీర్చి, కౌగిటజేర్చి పరిపరివిధాల ఆమెను అనునయించి. లాలించి అనురాగవర్షంతో ఆనందింపజేయగా, ఆమె చిరునవ్వు వెన్నెలతో వాసుదేవుని కీర్తించి:

స్వామీ! నిఖిలలోక నాథుడవయిన నువ్వు అనుగ్రహించావు కనక నా జన్మ ధన్య మయింది. నా మనస్సు నిరంతరం నీ నామస్మరణతో, రూపదర్శనంతో సంతృప్తి పడుతూ ఉంటుందని ఎరుగని వాడవా! అని ప్రార్థించింది.

వాసుదేవుడు దరహసిత వదనంతో ఆమె కపోలాలు దువ్వుతూ:

బాలా! పరిహాసానికి పలికిన పలుకులే యింత ములుకు లవుతా యనుకోలేదు: అయినా అప్పు డప్పుడు ఛలోక్తులు లేకపోతే సంసారం నిస్సారం కాదా!

నాకు తెలీదా! నువ్వు పతివ్రతాశిరోమణివని! నిరంతరం త్రికరణ శుద్ధిగా నువ్వు నన్నే ఆరాధిస్తావనీ ఎరుగుదును అని మరికొంతసేపు ముచ్చటలాడి హంసతూలికాతల్పం మీద విశ్రాంతి తీసుకున్నాడు.

లీలామానుషవిగ్రహుడైన వాసుదేవుని అనుగ్రహంతో రుక్మిణికి ప్రద్యుమ్నాదులు పదిమంది కుమారులు కలిగారు. అలానే మిగిలిన రాణులకు కూడా పుత్రోదయ సంతోషం కలిగించాడు.

ప్రద్యుమ్నుడికి రుక్మి కుమార్తె నిచ్చి పెండ్లి జేశారు. ఆమెకు అనిరుద్ధుడనే కుమారుడు కలిగాడు.

అన విని పరీక్షిత్తు సందేహం వెలిబుచ్చగా, శుకయోగి:

మహారాజా! వాసుదేవుని శత్రువు కదా రుక్మి. ఈ పెళ్ళి ఎలా జరిగిందని కదా నీ సందేహం. సావధానంగా విను.

రుక్మి తన కుమార్తెకు స్వయంవరం ప్రకటించగా ప్రద్యుమ్నుడు రథారూఢుడై వెళ్ళి, వచ్చిన రాకుమారులందరినీ ఓడించి, పెళ్ళి కుమార్తెను తన రథంమీద ఎక్కించుకొని చక్కా వచ్చాడు. ఆయన వాసుదేవుని కుమారుడు కదా!

రుక్మి మనుమరా లయిన రుక్మలోచనను అనిరుద్ధుని కిచ్చి వివాహం చేశాడు

ఆ పెళ్ళి వేడుకలలో రుక్మి స్నేహితులు కొందరు చేరి వానికి ఇతఃపూర్వం జరిగిన పరాభవానికి ప్రతీకారంగా బలరామునితో జూదమాడి ఓడించవచ్చు నన్నారు. వానిశక్తి

ఎరుగని రుక్మి సంతోషంతో జూదానికిదిగి సర్వస్వం కోలుపోయి నోటికి వచ్చిన కూతలు కూయగా బలరాముడు కుపితుడై రుక్మితో వాని స్నేహితులనుకూడా యమపురికి పంపాడు. అహంకార గర్వ వంచితుల బ్రతుకులంతే అని నిశ్చయించి కృష్ణుడు వధూవరులతో బంధు కోటితో ద్వారకకు తిరిగి వచ్చాడు.

## ఉ షా ప రి ణ య ం

మహారాజా ! ఇదివరలో నీకు నారాయణుడు వామనుడై బలిని పాతాళానికి పంపిన కథ వినిపించాను.

బలికి నూరుగురు కుమారులు. వారిలో పెద్దవాడు బాణుడు. వీడు తన భక్తితో పరమశివుని మెప్పించి ఆయనను పరివారసమేతం తన రాజధానియైన శోణపురానికి రక్షకుడుగా తెచ్చాడు.

అంతతో తృప్తిపడక ఒకనాడు ఆయన ఎదుటనిలిచి :

పరమేశ్వరా ! నీ అనుగ్రహంవల్ల నాకు లభించిన భుజశక్తికి ఎదురునిలిచి పోరాడ గలవాడు కనిపించడంలేదు. రోజు రోజుకీ నాకు యుద్ధం చేయాలనే దురద ఎక్కువవు తున్నది. నువ్వుతప్ప నా ఎదుట నిలిచేవాడే లేడా అనగా ఆయన కోపంతో :

ఓరి మూర్ఖుడా ! ఏనాడు నీ రథంమీది జెండా క్రింద పడుతుందో ఆనాడు నిన్ను గెలిచేవానితో యుద్ధం జరుగుతుంది, ఫో ! అన్నాడు.

అది మొదలుగా ఆ పతాకం ఎప్పుడు నేలకు రాలుతుందా ! అని ఎదురుచూస్తూనే ఉన్నాడు.

ఈ బాణాసురుడికి ఉషాదేవి అనే కూతురుంది. ఆ బాలిక అతిమనోహర రూపిణి. సాక్షాత్తూ సౌందర్యం అంతా రాసిచేసి ఆ కన్యకను బ్రహ్మదేవుడు సృష్టించాడా అన్నట్టు ఉండేది.

నవయౌవనంలో విలాసంగా ఆట పాటలతో కాలం గడుపుతూన్న ఆమెకు ఒకనాటి రాత్రి కల వచ్చింది.

గ్రహించిన చెలికత్తె చిత్రరేఖ తన చిత్రలేఖనకౌశలంతో సర్వలోకాలలోని సుం
రూపాలూ చిత్రించి తెచ్చి చూపగా ఆమె ఒక చిత్తరువును చూపి "వీ రె వ రే" అం

ఓహో ! ఈయనా నీ మనోహరుడు. యదువంశీయుడయిన వాసుదేవుని
రుడు ప్రద్యుమ్నుడు. ఆయన పుత్రు డీయన అనిరుద్ధుడు, అని

ఆకాశమార్గాన ద్వారక చేరి, మాయావిద్యతో రాత్రికి రాత్రి అనిరుద్ధుని
ఉషాదేవి ఎదురుచూస్తూన్న అంతఃపురంలో హంసతూలికాతల్పంమీద వదలి వెళ్ళింది

అది మొదలుగా ఉషా-అనిరుద్ధులు హాయిగా కేళీవిలాసాలలో తేలియాడుతున

కొంతకాలానికి ఉషాదేవి గర్భవతి అయింది. అది కనిపెట్టిన అంతఃపుర
కులు హుటాహుటి బాణునిచేరి పాదాలమీదపడి విషయం విన్నవించగా బాణాసురుడ
యోధులను పంపాడు.

యదువంశవీరుడు శత్రువులందరినీ కడతేర్చగా బాణుడు తీవ్రక్రోధంతో
పాశంతో అనిరుద్ధుని బంధించాడు. అదే సమయంలో వానిరథంమీది జెండా
కూలింది. బాణుడు యింతకాలానికి నా యుద్ధకండూతి తీర్చే వీరుడు వస్తున
సంతోషంతో ఎదురు చూస్తున్నాడు.

ఇక్కడ ద్వారకలో —

అనిరుద్ధుడు అదృశ్యమయిన నాటినుంచీ అందరూ ఆందోళన పడుతున
ఒకనాడు నారదుడు వచ్చి సముచిత మర్యాదలు పొంది, కుశలప్రశ్నల సందర
అనిరుద్ధుని గురించి చెప్పగా కృష్ణుడు బాణాసురునిమీద దండయాత్రకు బయలుదేరా

ఆయనవెంట బలభద్ర, సాత్యకి, ప్రద్యుమ్నాదులతో యదు, వృష్ణి,
అంధకవీరు లందరూ సాగుతూంటే భగీరథుని వెన్నంటి వచ్చే గంగాతరంగిణిలా కనిపిం
యోధవరులందరూ మహోత్సాహంతో శోణపురం చేరి రణభేరీ మ్రోగించి పరాక్రమించ
బాణాసురుడు క్రోధోద్రిక్తుడై సంగ్రామసన్నద్ధుడుకాగా భక్తజనవశంకరు డయిన శంకరుడ
భూత ప్రేత పిశాచగణంతో తోడువచ్చాడు.

ఉభయబలాలూ యుద్ధం ఆరంభించాయి. ప్రతిపక్షంలోని సమబలులను య
వీరులు ఎదుర్కొన్నారు.

పరమ శివ గణాలను చెల్లాచెదరుచేసి వాసుదేవుడు విజృంభిస్తున్నాడు.

వీరుల సింహనాద హుంకారాలు.

మదమత్తేభాల భీకర ఘీంకారాలు.

వీరయోధుల శింజినీ టంకారాలు.

హయ హేషారవాలు.

పటహ కాహళ భేరీ భాంకారాలు.

భూ నభోంతరాలు దద్దరిల్లుతున్నాయి.

హరి, హరుల సంగ్రామ కేళి చూచే కుతూహలంతో, సుర,గరుడోరగ,చారణ,సిద్ధ, సాధ్య,కిన్నెర,కింపురుష,గంధర్వగణాలు గగనవీధిలో నిలిచాయి.

పరమశివుని బ్రహ్మాస్త్రాన్ని దానితోనే ఉపసంహరించాడు వాసుదేవుడు. ఆయన వాయవ్యం కృష్ణుని పర్వతాస్త్రంతో తగ్గింది. శివుని ఆగ్నేయం కృష్ణుని ఐంద్రాస్త్రంతో నిలబడింది. ఆయన పాశుపతం సంధించగా నారాయణాస్త్రంతో నిరోధించాడు.

క్రీడ చాలించి కృష్ణుడు సమ్మోహనం ప్రయోగించగా పరమశివుడు వృషభవాహనం మీదనే మూర్ఛపోయాడు. అదేసమయంలో యాదవవీరులు విజృంభించి శత్రుసేనను పరాభూతంచేశారు.

బాణుడే స్వయంగా ధనుస్సు సంధించి రాగా వాసుదేవుడు ప్రళయ భీకరంగా పాంచజన్యం పూరించాడు. శత్రుసేనలు చెదరి బెదరి పారిపోయాయి.

బాణుడు సహస్రకరాలతో ఎదురువచ్చి శరవర్షం కురుపించగా వాసుదేవుడు అన్ని శస్త్రాస్త్రాలనూ తుత్తునియలు చేశాడు. ఆ సాహసచర్యకు బాణాసురుడు తెల్లబోయి చేసేదిలేక కొయ్యబారి నిలబడ్డాడు.

అప్పుడు బాణునితల్లి కోటర జుట్టు విరబోసుకుని వివస్త్రయై కృష్ణునియెదుట నిలబడగా ఆయన ముఖం వెనుకకు తిప్పుకున్న అదనులో బాణుడు పలాయనం చిత్తగించాడు.

అప్పటికి మూర్ఛతేరిన పరమశివుడు శైవజ్వరం ప్రయోగించగా కృష్ణుడు వైష్ణవ జ్వరంతో దాన్ని పరాస్తం చేశాడు.

అంతతో అది కేశవుని పరిపరి విధాల స్తోత్రం చేయగా ఆయన అనుగ్రహించి పంపాడు.

బాణాసురుడు మళ్ళీ మధ్యందిన మార్తాండునివలె యుద్ధ భూమికిరాగా వాసుదేవ సుదర్శనం ప్రయోగించాడు. అది బాణుని వేయికరాలలో నాలుగింటిని విడిచి మిగి వాటిని ఖండించింది. ఈ దృశ్యం చూసి పరమశివుడు స్వయంగా కృష్ణుని ఎదుటని అనేక ప్రార్థనలు చేయగా వాసుదేవుడు :

నా భక్తుడయిన ప్రహ్లాదుని వంశీయులను సంహరించనని వానికి వరం యిచ్చా కనక బాణుని విడిచి పెడుతున్నాను. ఇది మొదలుగా ఈ బాణుడు శివభక్తులలో అ సరుడుగా కీర్తి పొందుతాడు; అని సాగనంపాడు.

బాణాసురుడు వాసుదేవునికి అంజలి ఘటించి సముచిత మర్యాదలతో నగరా కొనిపోయి తనకుమార్తె ఉషాదేవిని అనిరుద్ధుని కిచ్చి విధ్యుక్తంగా వివాహం జరిపిం అందరికీ యథోచితంగా కానుక లర్పించి తృప్తి పరిచాడు.

అప్పుడు వాసుదేవుడు నవ వధూవరులతో యదువీరులతో రథారూఢుడై ద్వార నగరానికి విజయం చేశాడు, అని శుకయోగీంద్రుడు ఉషానిరుద్ధ వివాహ గాథను ముగిం అనంతర కథ ఆరంభిస్తున్నాడు.

* * * *

కాలచక్రం తిరుగుతూన్నది.

తిరుగుతూండగా ఒకనాడు ప్రద్యుమ్న, సాంబ, గద ఆదిగాగల యదువంశ రాకుమరులు విహారార్థం ఉద్యాన వనానికి వెళ్ళి, హాయిగా క్రీడలు సాగించి, అలసి, దాహంతో ఒకచోట పెద్దనుయ్యి చూశారు. సమీపించి లోపలకు చూడగా ఆ బావిలో నీరు లేకపోగ పర్వతమంత ఊసరవెల్లి కనిపించింది. దాన్ని పైకి తియ్యాలని వారందరూ కలిసి ప్రయత్నించి, ప్రయోజనంలేక వెళ్ళి వాసుదేవునికి చెప్పారు.

వింటూనే ఆయన ఆశ్చర్యంతో ఆ బావి దగ్గరకు వచ్చి చూసి, దాని తోకపట్టి గడ్డిపరకలా బయటవడేశాడు.

ఆయన కరస్పర్శతోనే అమర పురుషరూపంతో అది యీవలకు రాగా అందరూ ఆశ్చర్యచకితులై చూస్తూంటే, సర్వలోక విషయకోవిదుడైన వాసుదేవుడు వారి కుతూహలం చూసి ఆ పురుషుని కథ అడిగాడు.

నేను ఇక్ష్వాకు మహారాజు కుమారుడను. నన్ను నగ్నుడంటారు. ఈ పృథివిలో ఎవ్వరూ చేయనన్ని గోదానాలు, భూదానాలు, హిరణ్యదానాలు చేశాను. వాపీ, కూప తటాకాలు నిర్మించాను. నిరతాన్నదానంతో పంచమహా యజ్ఞాలు చేశాను. ఆత్మస్తుతి ఉచితంకాదు.

ఇలా ఉండగా ఒకసారి ఒక వేదవేత్తకు దానం చేసిన గోగణంలో ఒకటి దారి తప్పి వచ్చి నా మందలో కలిసింది. అది తెలియక నేను ఈ గోవుతో మరికొన్ని గోవులను యింకొక ద్విజశ్రేష్ఠునికి దానం చేశాను.

వారిరువురూ దారిలో కలిసి ఆ గోవుకోసం పోట్లాడుకొని నా దగ్గరకురాగా నాఅజ్ఞానాన్ని మన్నించి లక్షగోవులు తీసుకోమని ప్రార్థించాను. వారు వినక ''నా అపరాధం నన్నే వేధించుగాక'' అని వెళ్ళారు.

నా ఆయువు చెల్లి నేను పరలోకానికి పోగా, నీ అధర్మానికి ప్రాయశ్చిత్తంచేసుకు రా, అని భూలోకానికి పడద్రోశారు.

అది మొదలుగా ఈ ఊసరవెల్లి జన్మతో యింతకాలం గడిపాను. నీ అనుగ్రహంతో హస్తస్పర్శతో నేను ధన్యుణ్ణయ్యాను, అని అనేకవిధాల ప్రార్థనలు చేసి, దేవతా విమానంమీద అమరపురి చేరాడు.

పరీక్షిన్నరేంద్రా! తెలిసికాని తెలియకకాని వేదవిదుల విషయంలో ధర్మంతప్పి చరించటంకంటే ప్రమాదంలేదు. అంతకన్న విషపానం చేయడం మేలు. ఎందుకంటే గరళానికి విరుగుడుంది కాని అధర్మానికి లేదు, అన్నాడు శుకయోగీంద్రుడు.

* * * *

బలరాముడు బంధుజనదర్శనార్థం వ్రేపల్లెకు పోయి అక్కడి ఆత్మీయులతో సుఖంగా ఉన్నరోజులలో, ఒకనాడు—

కరూశదేశాధిపతియైన పౌండ్రకవాసుదేవునిదూత ద్వారకానగరానికివచ్చి, రాజసభా మధ్యంలో :

మా మహారాజుపేరునే పెట్టుకుని, ఆయనవలెనే అలంకరించుకునే వారి గర్వం అణచాలో పేరు మార్చుకుంటావో తెలుసుకు రమ్మన్నారు, అని అతిగా ప్రేలడంతో వాసు దేవుడు కుపితుడై :

అధిక ప్రసంగాలు అనవసరం. ఎవరెంతటివారో యుద్ధంలో తేల్చుకుందాం అని సేనాసమేతం దాడి బయలుదేరాడు.

పౌండ్రకుడు పరిఘ, పట్టిస, ముసల, ముద్గర, పరశు, భిందివాలాద్యాయుధాలతో వాసుదేవుని నిరోధించగా ఆ పురుషోత్తముడు విలాసంగా సర్వశస్త్రాలను తుత్తునియలు చేశాడు

శత్రురథాన్ని ముక్కలుచేసి, అశ్వాలతో సారథిని వేలకూల్చి, పౌండ్రకుని శిరస్సును దూదిపింజలా తేలించి వాని నగరంలో పడగొట్టాడు.

అదిచూసి వాని కుమారుడు సుదక్షిణుడు తండ్రికి పరలోకక్రియలు పూర్తిచేసి, వాసుదేవునిపై ప్రతీకారం తీర్చుకోవడానికి నిశ్చయించి, పరమశివుని భక్తితోపూజించి తన కోరిక తెలిపాడు.

పరమశివుడు : నాయనా! సక్రమంగా అభిచారహోమం సాగిస్తే అగ్నిహోత్రుడు నిన్ను అనుగ్రహించగలడు, వెళ్ళిరా అన్నాడు.

సుదక్షిణుడు తీవ్రనిష్ఠతో సాగించిన అభిచారహోమంతో తృప్తుడైన అగ్ని ప్రళయ వేళ పుట్టే అనలజ్వాలలతో ద్వారకను చుట్టుముట్టగా యాదవులందరూ కృష్ణుని శరణు వేడారు.

ఆయన సుదర్శనజ్వాలలతో సుదక్షిణుని అనలజ్వాలలు చల్లార్చి సుదక్షిణుని హతమార్చాడు; ద్వారకావాసులందరూ వాసుదేవుని పరిపరి విధాల అభినందించారు.

# బలరాముడు

పరీక్షిన్మహారాజా!

వాసుదేవుడే కాదు బలభద్రుడుకూడా యీ విధంగా ఎందరో బల, మదగర్వితులను కడతేర్చిన గాథ లున్నాయి, విను.

శ్రీరామచంద్రుని అనుగ్రహంతో కిష్కింధాపురాధీశుడైన సుగ్రీవునికథ తెలుసుకదా! ఆయనకు మంత్రులైన మైంద ద్వివిదుల పేర్లు విని ఉంటావు. వారిలో ద్వివిదుడు నరకాసురుని స్నేహితుడు.

వీడు తన స్నేహితుని సంహరించిన యాదవవీరులపై పగ తీర్చుకునే సంకల్పంతో బయలుదేరి యాదవ నగరాలు ధ్వంసం చేస్తూ బలరాముడు రైవతగిరిమీద కేళీవిలాసాలలో

తెలియాడుతూండగా అక్కడి మహావృక్షశాఖలమీద విహరిస్తూ అక్కడి వారిని వానర చేష్ట లతో భయపెట్టడం సాగించగా, బలరాముడు రాయి విసిరాడు. తప్పించుకుని ద్వివిదుడు దగ్గరలో ఉన్న సురాభాండం అందుకుని చెట్టుమీదనుండి క్రిందికి విసిరాడు. అంతతో ఆగక యదువంశీయులు కట్టిన వస్త్రాలు చించడం ఆరంభించగా బలరాముడు కోపంతో ముసలాయుధం ధరించి నిలువగా ద్వివిదుడు పెద్దచెట్టు పెకలించి విసిరాడు.

బలభద్రుని ఆవేశం పెరిగింది.

ఆయన చేతిలోని సునంద అనే పేరుగల ముసలాయుధం కదిలింది. అంతే! అది కదిలిన మరుక్షణంలో ద్వివిదుని శిరసు తాటిపండులా నేలకు రాలింది. దుష్టవానర సంహారం చూసిన యాదవు లందరూ సంతోషంతో బలరాముని అభినందించారు.

బలరాముడికి ఆగ్రహం వచ్చినా అనుగ్రహం వచ్చినా అంతే;

ఒకసారి జాంబవతి కుమారుడైన సాంబుడు విహారార్థం దేశాలు తిరుగుతూ హస్తినా పురంచేరి, అక్కడ సర్వలక్షణలక్షితాంగియై అలరారే దుర్యోధనుని కుమార్తె లక్షణ అనే యువతిని చూసి, ఎవరికీ చెప్పకుండా ఆమెను వివాహమాడే సంకల్పంతో రథంమీదికి ఎక్కించి వస్తున్నాడు.

ఆ వార్త తెలిసిన దుర్యోధనుడు కర్ణ శకుని శల్యభూరిశ్రవసులతో ఎదుర్కొగా ఆయువకుడు వారందరి ఆయుధాలనూ చిత్తు చేసాడు. అంతతో వారుమరింత ఆగ్రహంతో ఒక్కుమ్మడిగా కలసి యుద్ధం సాగించి, ఒకరుగుర్రాలను చంపగా, మరొకరు సూతుని సంహరించారు. ఇంకొకరు రథాన్ని ధ్వంసంచేశారు. అంతతో సాంబుడు విరథుడుకాగా వానిని బంధించారు.

వార్త ద్వారక చేరింది.

చేరినక్షణంలో యదువీరులు యుద్ధసన్నద్ధులుకాగా, బలరాముడు, వారిని వారించి: ఎంతయినా వారు మన బంధువులు. బంధుప్రీతి విడనాడి యుద్ధానికి వెళ్ళడంకంటె ముందు చుట్టపు చూపుగా వెళ్ళి మర్యాదగా విషయం కదిలిస్తాను, మీరంతా యిక్కడే ఉండండి, అని బయలుదేరి హస్తినాపురం చేరి, నగరం వెలుపల ఉద్యానవనంలో శిబిరం వేయించి, కురుసభాభవనానికి దూతను పంపాడు.

దూతగావచ్చిన ఉద్ధవుడు వినయంగా బలరాముని రాక ఎరిగించగా, కురు గురు వృద్ధు లందరూ ఆ యాదవజ్యేష్ఠుని చూడడానికి ఉచితమయిన సత్కారసామగ్రితో వెళ్ళి, అర్ఘ్య పాద్యాదులతో అర్చించి, కుశలప్రశ్నలు సాగించారు.

అప్పుడు సావధానంగా బలరాముడు అందరిని తిలకించి దుర్యోధనునివైపుచూ నిలిపి: మా ఉగ్రసేనమహారాజు మాటలు మీకు వినిపిస్తున్నాను. మీ యోధులందరూ కలసి మా వీరయువకుని పరాజితుని చేసి బంధించడం అన్యాయం, కనుక విడిచిపెట్టండి బంధుమర్యాదానుసారం యీ మాట ముందుగా మీకు చెప్పడం న్యాయం కనుక చెప్తున్నాం, అని మౌనం వహించాడు.

అది విన్న దుర్యోధనుడు తీవ్రావేశంతో: భేష్, కాలికి తొడగవలసిన పాదరక్షల తలమీది కెక్కడం అంటే యిదే కాబోలు. కురుకుల బాంధవ్యం కారణంగా కదా మీ యాదవులకు లోకంలో నామ రూపాలు వచ్చింది. అది మరచిపోయి చిత్తంవచ్చినట్లు మాట్లాడుతున్నారు. పాలు పోసి పెంచినంతలో పాము విషం ఎక్కడికి పోతుంది. ఇక్కడి వీరుల సంగతి తెలియక మాట్లాడుతున్నారు తమరు, అని మరింత తీవ్రరోషంతో వెను దిరిగి తన భవనానికి వెళ్ళిపోయాడు. చూసిన బలరాముడు తనతో వచ్చిన యాదవ ప్రముఖులందరినీ చూసి :

విన్నారుగా! రాజ్యవైభవ శ్రీమదాంధత ఎలా ఉంటూందో. సరే, వీరికి మాటలు తలకెక్కవు. మనశక్తి చూపించాలి. బంధుప్రీతికారణంగా మన వీరులందరినీ రావద్దని వచ్చాను. ఆపని నేనే చూస్తాను, అని రోషారుణనయనుడై, లాంగలం భుజాన ధరించి, హస్తినాపురం చివరకు నడిచి, అక్కడ ఆ నాగలికర్రు నగరమధ్యందాకా నడిచేటట్లు పొడిచి :

ఎవరిశక్తి ఎంతటిదో తెలుస్తుంది. ఈ నాగలితో హస్తినాపురాన్ని గంగలోకి పెళ్ళగించి, కురువంశంలో పురుగులేకుండా చేస్తున్నాను, అని ఒక్కసారినాగలి అటూ యిటూ తిప్పాడు. సముద్రమధ్యంలో పెనుగాలిలో ఊగినలాడే నౌకలాహస్తినాపురం ఊగిపోయింది. నగరం నగరం అంతా నడివీధిన పడి, కురువృద్ధులతో కలిసివచ్చి, బలరాముని కాళ్ళ మీదపడి క్షమాభిక్ష వేడారు.

బలరాముడు శాంతించి :

మీ అహంకారానికి ప్రతీకారంగా యిది తలపెట్టాను. మీ పొగరు తగ్గింది కనుక కరుణించి వదులుతున్నాను, అని తన నాగలి బుజాన వైచుకుని అందరివైపు సంతోషంతో చూశాడు.

అప్పుడు దుర్యోధనుడు స్వయంగా తనకుమార్తె లక్షణనూ అల్లుడుసాంబునీ రథం మీద ఎక్కించి తీసుకువచ్చి, ఉభయులకూ చీని చీనాంబరాలు, రత్నమాణిక్యభూషణాలూ యిచ్చి పంపించాడు.

బలరాముడు వారిద్దరినీ వెంటబెట్టుకుని సంతోషంగా ద్వారక చేరాడు.

మహారాజా! ఆనాడు బలరాముడు పైకెత్తిన భూభాగం అలానే ఉంది, నేటికీ హస్తినాపురం ఒకవైపు యెత్తుగా, రెండవవైపు వాలుగా ఉంటుంది, అన్నాడు శుక యోగీంద్రుడు.

# కృష్ణలీలా విలాసం

మహారాజా! నరకుని సంహరించి వాసుదేవుడు పదునారువేలమంది రాజకుమార్తెలను తెచ్చాడనివిన్నావు. వీరందరినీ ఆయన ఏవిధంగా అనురాగంతో చూడగలుగుతున్నాడో తెలుసుకోవాలనే కుతూహలంతో నారదమునీంద్రుడు ఒకనాడు ద్వారకానగరానికి వచ్చి అన్ని భవనాలూ దర్శించాడు.

ఒకభవనంలో ఆ లీలామానుషరూపుడు తనప్రియురాలు వింజామర వీస్తూంటే హాయిగా గోష్ఠి సాగిస్తున్నాడు.

మరొకచోటికి వెళ్ళేముందు కృష్ణుని సభామంటపానికి రాగా అక్కడ బంగారు సింహాసనంమీద నవ్వురాజిల్లెడు మోముతో కూర్చున్నాడు. నారదుని చూస్తూనే లేచి ఎదురేగి అర్ఘ్య పాద్యాలర్పించి కుశలప్రశ్నలతో, ఆమునీంద్రుని పాదాలు కడిగిన నీటిని శిరసున జల్లుకున్నాడు. అనంతరం వినయంగా చేతులు జోడించి:

మునీంద్రా! ఈ సేవకుడు తమ ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్నాడు, అనగా నారదుడు: పురుషోత్తమా! నామనస్సు నిరంతరం నీ నామపారాయణమందే నిమగ్నం అయే వరం అనుగ్రహించు, అని లేచి, ఆ యోగీశ్వరేశ్వరుని మాయలు చూచే ఉత్సాహంతో మరొక చంద్రవదన భవనానికి వెళ్ళాడు. అక్కడాయన విలాసక్రీడలో ఉన్నాడు.

ఒకచోట సంధ్యావందనంలో ఉన్నాడు.

మరొకచోట ఆసక్తితో పురాణశ్రవణంలో, యింకొకచోట యజ్ఞనిర్వహణలో, యింకో చోట స్నానమాడుతూ, మరోచోట వస్త్ర భూషణాలు అలంకరించుకుంటూ, ఒకచో గోదానం చేస్తూ తనకుమారులతో మాట్లాడుతూ, సంగీతశ్రవణంతో, బలరామునితోకూడి చర్చిస్తూ అలా ఎక్కడికి వెడితే అక్కడ ఆ పురాణపురుషుడు కనిపిస్తున్నాడు.

భవనాలలోకి వెడితే——

ఒకచంద్రవదన అందిచ్చే తాంబూలం అందుకుంటూ, ఒక సరసిజాక్షితో సంభాష సాగిస్తూ, మరొక ప్రియురాలికి ముత్యాలహారం కట్టిపెడుతూ, ఒకభార్యదగ్గర భోజన చేస్తూ, మరొకభార్యదగ్గర చదరంగక్రీడ నడుపుతూ, ఇంకొకచోట మత్తేభంమీద సాగుతు ఎక్కడికక్కడ ఆయన లీలలే కనిపించాయి, నారదునికి.

ఆ పురుషోత్తముని అనంతలీలలు దర్శించి నారదమునీంద్రుడు వాసుదేవుని దర్శించి స్తుతి ఆనందపారవశ్యంతో నిష్క్రమించాడు.

*　　　*　　　*　　　*

ఋతుచక్రం పరిభ్రమిస్తున్నది.

ఒకనాడాయన సభాభవనంలో స్వర్ణసింహాసనంమీద మందహాససుందరవద విందుడై కొలువుతీరి ఉండగా ఒక విప్రశ్రేష్ఠుడు వచ్చి :

వసుదేవనందనా ! నీచేత పద్దెనిమిదిసార్లు పరాజితుడైన జరాసంధుడు గత విస్మరించి, తనభుజబలంతో ఎందరో రాజశ్రేష్ఠులను ఓడించి తెచ్చి తనకారాగార బంధించాడు. వారందరూ నీవల్లనే తమకు విమోచనం లభించగలదని ఆశతో : వంపారు. వారియందు అనుగ్రహం ఉంచి జరాసంధుని కడతేర్చి వారిని రక్షించు ప్రార్థించాడు. సరిగ్గా అదేసమయానికి సర్వలోకవిషయ విశారదుడైన నారదమహర్షి వాసుదేవుడు ఆయనను ఆరాధించి, ఉచితాసనం చూపి,

మునీంద్రా ! ఎక్కడనుండి రాక ? విశేషమేమి ? పాండురాజనందనుల కుశ లేమైన తెలిపెదరా ?

అని ప్రశ్నించగా, నారదుడు చిరునవ్వుతో :

పురుషోత్తమా ! నీకు తెలియని విషయాలేమిటి ? అయినా అడిగావు కనక చెప్ప వారు సుఖంగా ఇంద్రప్రస్థంలో రాజ్యపాలనం సాగిస్తూ నిఖిల ప్రజాభిమానం సంపాదిం త్వరలో రాజసూయయాగం నిర్వహించాలని ధర్మరాజు తలపెట్టాడు. అక్కడకు రావాలి. వారందరూ నీ సమక్షంలో ఆ క్రతువు సాగించాలని నిర్ణయించారు.

వాసుదేవుడు తన సచివుడైన ఉద్ధవునివైపు సాభిప్రాయంగా చూశాడు.

ఉద్ధవుడు : కృష్ణా ! సత్క్రతువు ఎక్కడ జరుగుతున్నా నువ్వు ఉండాలి. వయిగా రాజసూయం పేరిట జరాసంధుని వధించడానికి సమర్థుడయిన వాయుసు

భీమసేనుని తీసుకువెళ్ళి, మాగధుని సంహరించి, నిన్ను శరణువేడిన రాజులకు బంధవిముక్తి చేయవచ్చు, అన్నాడు.

ఉద్ధవుని సూచనానుసారం వాసుదేవుడు ప్రయాణసన్నాహాలకు ఆజ్ఞయిచ్చాడు. నారదుడు గగనవీధిని నారాయణసంకీర్తనం చేసుకుంటూ వెళ్ళాడు.

మరునా డుదయాన మంగళవాద్యాలతో యదువంశీయులందరూ వీడ్కోలీయగా రథం మీద బయలుదేరి ఇంద్రప్రస్థం చేరి, నగరం పొలిమేరలలో వనంలో విడిదిచేశాడు. వార్త విని ధర్మరాజు సంతోషంతో తమ్ములనూ, పరిజనులనూ వెంటబెట్టుకుని వెళ్ళి కృష్ణునికి సముచితరీతిని స్వాగత సత్కారాలు జరిపాడు. కుశలప్రశ్నలు ముగిసిన అనంతరం అందరూ నగరంలోకి వచ్చారు.

రాజవీధిలో వాసుదేవుని రథం సాగుతూంటే ఇరువంకల సౌధాలమీద నారీజనం ఉత్సాహంతో ఆ పురుషోత్తముని దర్శించి తమ జన్మ ధన్యం చేసుకున్నారు.

మర్యాదలన్నీ ఆచారానుసారం పూర్తిచేశాక అంతఃపురం చేరాడు వసుదేవనందనుడు. అక్కడ కుంతీదేవి ఆనందంతో ఎదురువచ్చి దగ్గరగా తీసుకుని, కుశలప్రశ్నలు ముగించింది. వాసుదేవుడు మేనత్తకు పాదాభివాదం చేశాడు.

కృష్ణుని వెంటవచ్చిన రుక్మిణి ఆదిగాగలవారందరికీ లాంఛనాలు జరిపించింది, కుంతి తనకోడలు ద్రౌపదిచేత. అందరకూ యోగ్యమయిన విడిదిభవనాలు ఏర్పాటుచేశారు.

సుఖంగా రోజులు గడుస్తున్నాయి.

ఒకనాడు ధర్మరాజు సభాభవనంలో కొలువుదీర్చి మంత్రి పురోహిత మిత్రబాంధవ రాజవీరు లందరూ వింటూండగా :

దేవకీనందనా ! నీ అనుజ్ఞఅయితే రాజసూయయాగం నిర్వహించాలనే సంకల్పం కలిగింది. సర్వలోకేశ్వరుడ వయిన నువ్వు దగ్గర ఉండి మాచేత యీసత్క్రతువు నిర్వహింప జెయ్యాలి, అని అర్థించాడు.

నందనందనుడు మందస్మిత వదనంతో :

పాండురాజనందనా ! సర్వదేవతాగణాలూ, మునిబృందాలూ, పితృదేవతలూ సంతోషించే యీ మహాక్రతువు తప్పకుండా సాగించు. శస్త్రాస్త్రకోవిదులయిన మహావీరులు నీ తమ్ములు నలుగురూ దిగ్విజయయాత్ర సాగించి వస్తారు. ఇంకా ఆలస్యందేనికి, త్వరగా యాగదీక్ష వహించు, అన్నాడు.

ధర్మజుని ఆజ్ఞానుసారం సహదేవుడు దక్షిణదిశకు, నకులుడు పశ్చిమదిశకు, ఉత్తరానికి అర్జునుడు, తూర్పుగా భీమసేనుడు విజయయాత్రకు బయలుదేరారు.

నాలుగు దిక్కులనుంచి విజయలక్ష్మీ సమేతులై వచ్చి, తమ తమ యాత్రా విశేషాలు వివరించారు.

ఒక్క జరాసంధుడు మాత్రం అహంకారంతో ఉన్నాడనగా విని, వాసుదేవుడు: పాండవాగ్రజా! జరాసంధుని దగ్గరకు నేను భీమార్జునులతో వెళ్ళి విప్రవేషంతో రణభిక్ష అడుగుతాను. వాడు అంగీకరిస్తాడు. అప్పుడు మన భీమసేనుడు మల్లయుద్ధం సాగించి వానిని కడతేరుస్తాడు, అన్నాడు.

ధర్మరాజు అంగీకరించాడు.

ముగ్గురూ విప్రాకృతితో వెళ్ళి జరాసంధుని సమీపించి, అనుకున్నప్రకారం సంగ్రామభిక్ష వేడగా ఆ వీరుడు తనతో మల్లయుద్ధానికి భీముని ఆహ్వానించాడు. ఆ యుద్ధంలో వాసుదేవుని సూచనానుసారం భీముడు జరాసంధుని శరీరాన్ని నిలువునా చీల్చి విసిరేశాడు.

అంతతో కృష్ణుడు లోనికిపోయి కారాగార బంధితు లయిన రాజులందరినీ విడిపించి, వారికి ఆశ్వాసన కలిగించి ఎవరి రాజ్యానికి వారిని పంపి జరాసంధుని కుమారుడైన సహదేవుని సింహాసనం ఎక్కించి, భీమార్జునులతో తిరిగివచ్చి యింద్రప్రస్థంలో ధర్మరాజు చేత రాజసూయం నిర్వహింప జేశాడు.

ఆ యాగావసానవేళ అగ్రపూజ వాసుదేవునికి జరపబోతుండగా, శిశుపాలుడు, కృష్ణునితోపాటు అక్కడి వారందరినీ నానా దుర్భాషలూ ఆడగా గురుజన దూషణం సహించలేక కృష్ణుడు చక్రంతో వాని శిరసు ఖండించాడు. సజ్జనలోకం కృష్ణుని కీర్తించింది.

అనంతరం కొంతకాలం బంధుజనంతో అక్కడే గడిపి, ధర్మజుని అనుమతితో తన నివాసానికి చేరాడు కృష్ణభగవానుడు.

# సాల్వునివధ

జరాసంధ, శిశుపాలాదుల మరణవార్త విని వారి మిత్రుడైన సాల్వుడు పరమశివుని ..ర్చి ఘోరతపస్సుచేసి, కామగమనంకల సౌభకం అనే విమానం పొంది, దానిమీద

ద్వారకను వచ్చి దాడి సాగించాడు. యదువీరు లెందరో వానితో పోరుసాగించి పరాజితులు కాగా వాసుదేవుడు స్వయంగా రణరంగానికి వచ్చి, సాల్వుని ఇంద్రజాలాన్ని పటాపంచలు చేసి, వానిని నేల కూల్చి బంధుకోటికి ఆనందం కలిగించాడు.

ఆ వార్త విని దంతవక్త్రుడనే వాడు కృష్ణునిమీదికి యుద్ధానికి వచ్చాడు. కృష్ణుడు గదాధారియై ఎదురురాగా వాడు అట్టహాసంతో తన గదాదండం ఎడమచేత త్రిప్పుతూ: ఈ రోజు నిన్ను యమపురికి పంపి మిత్రఋణం తీర్చుకుంటాను, అంటూ తన గదతో కృష్ణుని శిరసు మీద కొట్టగా, అంకుశం పోటు తిన్న మత్తేభంలా వాసుదేవుడు విజృంభించి తన గదాఘాతంతో వాని గుండె బ్రద్దలుకొట్టాడు.

అన్నగారి మరణవార్తవిని విదూరధుడు ప్రళయకాలాగ్నిలా కృష్ణునిమీదికి వచ్చాడు. వచ్చిన విధూరధుని శిరసు ఖండించాడు సుదర్శనంతో వసుదేవనందనుడు.

ఈ విధంగా క్రూరమతులను సంహరించిన వాసుదేవుని అనేకవిధాల కీర్తించి యాదవు లందరూ ఉత్సవాలు జరుపుకున్నారు.

## బలరాముని తీర్థయాత్ర

కాలచక్రం గిర గిర తిరుగుతోంది.

ఈ మధ్యకాలంలో కురు పాండవుల వైరం పెరిగింది. జూదంలో సర్వంకోలు పోయిన ధర్మరాజు సతీ, సోదరసమేతం అరణ్యవాస అజ్ఞాతవాసాలు పూర్తిచేసి, తమ రాజ్యభాగం తమ కిమ్మని రాయబారాలు నడిపి. విఫలుడై యుద్ధ సన్నద్ధుడయాడు.

బంధుజనం మధ్య యుద్ధం చూడలేక బలరాముడు తీర్థయాత్రలకువెళ్ళి అక్కడ ప్రభాసతీర్థంలో ప్రశాంత జీవనం సాగించే మునిజనులను హింసిస్తూన్న ఇల్వలుని కుమారుడైన పల్వలుని సంహరించి వారికి సంతోషం కలిగించాడు.

వారి సూచనానుసారం, కౌశిక, సరయూనదులలో స్నానంచేసి, ప్రయాగలో దేవ, పితృ తర్పణాలువదలి, గోమతి; గండకి, విపాశ, శోణ నదులలో పవిత్రస్నానం చేసి, గంగా సాగరసంగమం దర్శించి, మహేంద్రగిరిమీద పరశురామునికి నమస్కరించి; కృష్ణ

చలంమీద అగస్త్యమునికి అభివాదంచేసి, దక్షిణసముద్రతటాన, కన్యాదుర్గకు అంజలి ఘటించి, నిర్వింధ్యదాటి దండకారణ్యం మీదుగా తిరిగి ప్రభాసతీర్థంచేరాడు.

అప్పటికి కురుక్షేత్రంలో నిఖిల రాజవీరులూ నిహతులైనట్లు విని, అక్కడకువెళ్ళాడు. అప్పటికి భీమసేన-దుర్యోధనులు తీవ్ర రోషోన్మత్తులై గదాయుద్ధం సాగిస్తున్నారు.

వారిని సమీపించి: ఎందుకీ యుద్ధం! మీలో ఒకనికి అనమాన భుజబలంవుంది. రెండోవానికి నిరంతరాభ్యాస కౌశలం వుంది. ఇటువంటి సన్నివేశంలో ఎవరూ గెలవరు, అని చెప్పినా వారు వినక పోవడంతో విసిగి, తిరిగి నైమిశారణ్యానికి చేరి, అక్కడ క్రతువు సాగించి భూరిదక్షిణలతో తృప్తిపరచి, భార్య రేవతితో కలిసి ద్వారకానగరం చేరాడు

# కుచేలోపాఖ్యానం

శుకయోగీంద్రా!

హరి పాద తీర్థ సేవాపరుడై
విలసిల్లునట్టి భాగవతుని
విస్ఫురితాంగము లంగము
లా పరమేశ్వరు నెరుగ
నాకు పలుకు మునీంద్రా!

అని పరీక్షిన్మహారాజు ప్రార్థించగా వ్యాసనందనుడు:

మహారాజా! దేవకీనందనుడు చిన్ననాడు సాందీపనివద్ద విద్యాభ్యాసం చేసే రోజులలో కుచేలుడు అనే సహాధ్యాయి ఉండేవాడు.

ఈ విప్రుడు చిన్ననాటినుంచీ శాంతస్వభావుడు, ధర్మమార్గవిరతుడు, లౌకికవాంఛా రహితుడు. జితేంద్రియుడు. బ్రహ్మవిదుడు. నిష్కామయోగి. ఆయనకు వివాహం అయింది. చాలామంది పిల్లలు కలిగారు. దరిద్రబాధ ఎంతగావున్నా ఎవరినీ ఏదీ అడిగేవాడు కాదు. దొరికినదానితో సంసారభారం సాగిస్తున్నాడు. ఆయనభార్య ఎంతో ఓరిమితో, పాతివ్రత్య నియమం తప్పకుండా, దుస్సహమయిన దరిద్రబాధను సంతోషంతో అనుభవిస్తూ, అలానే జీవితం నడుపుతూన్నది.

ఒకనాడావిడ భర్తను చేరి:

వసుదేవనందనులు మీకు చిన్ననాటి స్నేహితులు కదా! ఒక్కమారు వారి దర్శనం చేస్తే మన కీ బాధలు తగ్గుతాయి. ఒకమారు వెళ్ళిరండి, అంది.

సాధుశీలయైన యిల్లాలి మాట కాదనలేక కుచేలుడు బయలుదేరి ద్వారక చేరాడు.

చేరుతూన్నవేళ, ఈ మహానగరంలో నన్ను లోపలకు రానిస్తారా. ఆయన ఎక్కడో అంతఃపురంలో ఉంటే ఈ పేదవాని రాక ఆయనకు తెలియజేస్తారా, అని కొంత సంశయించి, అన్నిటికీ ఆ పరాత్పరుడే ఉన్నాడు. అని ముందుకు సాగి నిరాతంకంగా కోట సింహద్వారం దాటి, లోపలి ప్రాకారాలు కూడా గమించి, రాజ మందిరంలో ప్రవేశించాడు.

ఎదురుగా బంగారు సింహాసనం మీద పీతాంబరధారియై, నవ్వురాజిల్లెడు మోముతో వున్న వాసుదేవుడు తన బాల్యమిత్రుని చూస్తూనే ఎదురేగి, కౌగలించి తెచ్చి, తన ప్రక్కన కూర్చుండ బెట్టి, పాదాలు కడిగి, ఆ జలాలు శిరసున జల్లుకుని, పన్నీట తడిపిన మంచి గంధం కుచేలుని శరీరానికి పూసి ఆయనకు శ్రమ తగ్గునట్లు విసనకర్రతో విసురుతూ, సువాసనల పూలమాలలతో అలంకరించి, కర్పూర తాంబూలం యిచ్చి కుశలప్రశ్నలు సాగిస్తూంటే, అక్కడి వారందరూ ఆశ్చర్యపోయి:

ఆహా! ఈ విప్రోత్తముడు ఎన్నిజన్మల తపఃఫలంతో యీ జన్మమెత్తినాడో! మహా మునులకు సైతం లభించని వాసుదేవుని ఆరాధనలూ, ఆలింగనభాగ్యమూ అందుకోగలిగాడు అనుకుంటున్నారు.

సురుచిరస్మితవదనంతో కృష్ణుడు: బాల్యమిత్రమా! మనం గురుకులంలో విద్యాభ్యాస కాలంలో గడిపిన రోజులూ ఆడిన క్రీడలూ నీకు గుర్తున్నాయా!

అడగడం మరిచాను. నీకు అనుకూలవతి అయిన అర్ధాంగి వల్ల యోగ్యులయిన పిల్లలు కలిగి సుఖంగా ఉంటున్నారా. నిన్ను చూస్తూంటే ఇల్లూ, యిల్లాలూ, పిల్లలూ వారి యోగక్షేమాలూ నీకేం పడుతున్నట్టులేదు. ఏదో లోకమర్యాదానుసారం విధ్యుక్త కర్మాచరణంతో జీవితం నడుపుతున్నట్టున్నావు. సంతోషం.

సరే, మనయందు మనగురువులు సాందీపని ఎంత అదరంతో ఉండేవారు.

ఒకనాడు మనం గురువుగారి భార్య ఆజ్ఞానుసారం కట్టెలకోసం అడవికి వెళ్ళాం.

ఆ సాయంత్రం నుంచి తెల్లవారే వరకూ కుండపోతగా వాన కురిసింది. కన పొడుచుకున్నా కనిపించని అడవిలో, చలిలో ఆ రాత్రి గడిపాం. తెలతెల వారుతూండ మనం ఆశ్రమాభిముఖంగా వెడుతున్నాం. అప్పటికే గురువుగారు ఆందోళనతో మనకో వెదుకుతూ ఎదురువచ్చి, మనలను దగ్గరగా తీసుకుని ఎంత బాధపడ్డారో జ్ఞాపకం ఉంద అని వరుసగా దేవకీనందనుడు ముచ్చటిస్తుంటే కుచేలుడు సంతోషంతో :

పురాణపురుషా! ముల్లోకాలకూ గురుస్థానీయుడవైన నువ్వు ఒకరి దగ్గర విద్యాభ్యా చెయ్యడం అంటే లోకానికి గురు శిష్య సంప్రదాయం నేర్పడానికే కాని నీకోసమా, ఽ నవ్వాడు.

అప్పుడు వాసుదేవుడు : ప్రాణమిత్రమా! ఇంతకాలానికి నన్ను చూడవస్తూ కేమయినా తెచ్చావా? అని అడుగగా, కుచేలుడు తన ఉత్తరీయపు చెంగున భార్య క అటుకులమూట విషయం చెప్పలేక సిగ్గుపడ్డాడు.

అది గమనించి కృష్ణుడు :

పత్రం పుష్పం ఫలం తోయం
యో మే భక్త్యా ప్రయచ్ఛతి
"దళమైన పుష్పమైనను
ఫలమైనను సలిలమైన
పాయనిభక్తిం కొలిచిన
జను లర్పించిన ఎలమిన్
రుచి రాన్నముగనె ఏను భుజింతున్."

అని కుచేలుని చెంగుమూటవిప్పి, గుప్పిటబట్టి, సంతోషంగా ఆరగిస్తూ :

'ఇవి సకలలోకాలకు తృప్తి కలిగిస్తాయి' అన్నాడు.
అని మరొకగుప్పెడు తియ్యబోతుండగా రుక్మిణీదేవి 'నాథా! ఇంకచాలు. ఇప్పటికే అత సర్వసంపదలూ లభించాయి', అంది.

ఆ రాత్రికి అక్కడే ఆగి వాసుదేవునితో ఆరగించి, యిష్టాగోష్ఠిసాగిస్తూ, నిద్ర తెల్లవారుతూనే లేచి, కాలకృత్యాలు ముగించి, సంధ్యావందనాదులు పూరిచేసి, బ

తన పూరిపాక ఉండవలసిన స్థానంలో ఉన్నతమయిన పాలరాతిమేడ, దానిచుట్టూ పద్మాలునిండిన సరోవరాలు, సువాసనలీనే పూలతోటలు, ఫలభరితవనాలు. అవిచూసి ఆశ్చర్యపోతుండగా అచ్చరలవంటి కన్యలువచ్చి కుచేలుని సగౌరవంగా లోపలికి తీసుకు వెళ్ళారు. ద్వారంలో కుచేలునిభార్య స్వాగత మర్యాదలు జరిపింది.

వాసుదేవుని కరుణాంతరంగానికి మనసా నమస్కరించి, ఆ సంపదలవల్ల అహంకార మదోన్మత్తుడు కాకుండా దాన ధర్మాలతో, సత్క్రతువులతో, నిరంతర పరాత్పరధ్యానంతో జీవితం గడిపి నిశ్చింతగా అమరపురి చేరాడు కుచేలుడు, అని శుకయోగీంద్రుడు ఆ భక్తుని చరితం వినిపించాడు.

# సూర్యగ్రహణం

శిష్టజన రక్షణకై దుష్టశిక్షణ వ్రతం పూనిన కృష్ణభగవానుడు ద్వారకానగరంలో కాలం గడుపుతున్నాడు.

ఆరోజులలో సంపూర్ణ సూర్యగ్రహణం రానున్నదని తెలిసి యదువంశీయు లందరూ గ్రహణసమయాన పవిత్ర తీర్థస్నానానికి ప్రయాణ సన్నాహా లారంభించారు.

నగరరక్షణార్థం యువవీరులను నియమించి వాసుదేవుడు వృద్ధజనులతోపాటు నారీ మణులనూ, బాల బాలికలనూ వెంటబెట్టుకుని స్యమంతపంచకక్షేత్రం చేరాడు.

ఇరువదియొక్కమారు ధరణీంద్రుల మీదికి దాడిపోయి, తన భుజాదండమండిత ఖండపరశువుతో వారి శీర్షాలు తెగనరికి ఆరక్తంతో అయిదుమడుగులు నిర్మించాడు, మహా వీరుడు పరశురాముడు. అనంతరకాలంలో అదే స్యమంతపంచకక్షేత్రంగా ప్రసిద్ధమయింది.

గ్రహణసమయాన అక్కడ పుణ్యతీర్థజలాలలో స్నానంచేసి ధన, కనక, భూదా నాలతో విప్రశ్రేష్ఠులను సత్కరించాడు.

గ్రహణసూర్యుని కిరణాలు పడని పొన్నచెట్లనీడలలో చేరి పవిత్రగాథలుచెప్పుకుంటు న్నారు. అంతకు ముందే ఆ పవిత్రక్షేత్రానికి చేరిన మత్స్య, ఉశీనర, కోసల, విదర్భ, సృంజయ, కాంభోజాది దేశాల అధిపతులూ, వ్రేపల్లెవాసులయిన నందాదులూ, ధర్మరాజుతో వచ్చిన ధృతరాష్ట్ర, గాంధారీ, కుంతీ, సంజయ, విదుర, కుంతిభోజాదులూ అందరూ వాసుదేవుని దర్శించి ఆరాధించారు.

అప్పుడు కుంతీదేవి తన కష్టాలు చెప్పగా అన్నగారు వసుదేవుడు మెల్లని మాటల
ఓదార్చాడు.

అనంతరం యశోదాదేవితో గోపికాజనం రాగా అందరూ వారికి స్వాగతంపలికా
యశోదాదేవి బలరామ కృష్ణు లిద్దరినీ తొడమీద కూర్చోబెట్టుకొని ఆనందంతో వారి చి
నాటి కథలు తలుచుకు సంతోషించింది.

దేవకీదేవి, రోహిణితో (బలరామునితల్లి) కలిసి యశోదను సమీపించి అలనా
బలరామ కృష్ణులను కన్నబిడ్డలవలె సాకి పెంచిన ఆమె పుణ్యాన్ని అభినందించారు.

ఇక్కడ వీరు మాట్లాడుకుంటూండగా గోపికాజనం కృష్ణునిజేరి విచారించగాఅం
వారందరినీ దగ్గరగా తీసుకుని ఆదరించి, నెమ్మదిగా వేదాంతబోధ చేసి వారి మనస్సు
పారమార్థిక బీజాలు వేశాడు.

మరొక పొన్ననీడ చేరిన కృష్ణుని భార్యలతో ద్రౌపదీదేవి కుశలప్రశ్నలుసాగి
నారి వారి వివాహ విశేషాలు అడుగుతూన్నది. వారిలో బృహత్సేన పుత్రి లక్ష
నన్ను మావారు మత్స్యయంత్రం కొట్టి తెచ్చారు, ఆ స్వయంవరానికి సర్వదే
రాజులూ వచ్చారు. కాని దేవకీనందనులే ఆ మత్స్యాన్ని పడగొట్టి నన్ను చేపట్టారు,
వివరించింది.

బంధు మిత్రులు సుఖంగా కథలు చెప్పుకుంటున్నారు.

ఆ సమయాన కృష్ణసందర్శనకాంక్షతో వ్యాస, నారద, దేవల, కణ్వ, గౌ
గాలవ, అంగీరస, వశిష్ఠ, అగస్త్య, యాజ్ఞవల్క్యాది మహర్షులందరూ విజయం చే
వారందరినీ నందనందనుడు విధ్యుక్తంగా అర్చించి, సుఖాసీనులను చేశాడు.

అప్పుడు వాసుదేవుడు: మహామునులారా! మీ దర్శనంతో మా జన్మపావనమై
తీర్థాలలో, పుణ్యక్షేత్రాలలో చిరకాలం ఉండి సేవలు చేస్తేనే పుణ్యఫలం లభిస్తు
మీ వంటి పవిత్ర చరిత్రుల దర్శనంతో లభించే పుణ్యం ఎన్ని జన్మలెత్తినా, యేం
రాదు. అటువంటి అవకాశం మా కందరికీ కలిగింది, అన్నాడు.

అప్పుడు వారు: పురుషోత్తమా! నీ వల్లకదా బ్రహ్మ, రుద్ర, ఆదిత్య, యిం
లందరూ ప్రభవించి తమ తమ కర్తవ్యాలు నిర్వర్తిస్తున్నారు. అటువంటి నీ అను
జితేంద్రియులమై ధన్యులమయాం.

తప స్స్వాధ్యాయాలతో పరిశుద్ధమైన హృదయంకల పురుషరూపంతో వేదధర్మాన్ని లోకాని కందించిన మహామహుడవు. సర్వలోక సాధుజన రక్షణార్థం అవతారాలు ధరించి, లీలామానుషరూపంతో అందరినీ సమ్మోహితులను చేసే నీ దివ్యమంగళవిగ్రహ దర్శన భాగ్యం లభించి మా జన్మ చరితార్థం అయింది, అని ప్రార్థించారు.

అనంతరం వసుదేవుడు: మహనీయులారా! అజ్ఞానంలో చేసిన పాపం నాశనం కావడానికి నా కేదయినా మార్గం చూపండి, అనగా వారు ఒక మహాక్రతువు సాగించు అన్నారు.

వారందరి అధ్వర్యంలో వసుదేవుడు వేదోక్తంగా క్రతువుసాగించి నిరతాన్న దానంతో, భూరిదక్షిణలతో విప్రశ్రేష్ఠులను సంతృప్తిపరిచాడు.

కొంతకాలం అక్కడగడిపి వర్షాకాలం రానున్నదనగా అందరూ తమతమ నగరాలకు తరలివెళ్ళారు.

* * * *

ఒకనాడు దేవకీదేవి బలరామ కృష్ణులను చేరి:

నాయనా! పరమేశ్వర స్వరూపులయిన మీరు మా పుణ్యవశాన మా బిడ్డలుగా పుట్టారు. తల్లిగుండె మీ రెరుగనిదికాదు. పుత్రశోకం ఎంత వేధిస్తుందో ఎరిగిన మీరు నా అన్నగారు వధించిన నా బిడ్డలను నాకు అనుగ్రహించాలి, అని కోరగా వారుభయులూ రసాతలానికి వెళ్ళి అక్కడ బలిచేత పూజితులై, వాని మర్యాదలకు సంతోషించి:

బలీ! కృతయుగం నాటిమాట. మరీచిమహర్షి పేరెరుగుదువు. ఆయన భార్య వర్ష. వారికి ఆరుగురు కుమారులు. ఒకానొక దుర్ముహూర్తంలో బ్రహ్మ వీరిని శపించగా వారు హిరణ్యకశిపుని కుమారులై పుట్టారు. యోగమాయ వారిని తెచ్చి దేవకీదేవి గర్భంలో ఉంచింది. వారిని దుష్టకంసుడు సంహరించాడు. ఆ బిడ్డలను చూడాలని మా అమ్మ దేవకీదేవి కోరింది, అనగా బలి వారిని వాసుదేవునికి అప్పగించాడు.

ఆరుగురు శిశువులనూ తల్లి కిచ్చి సంతోషింపజేశాడు వాసుదేవుడు. బిడ్డలను చూచినక్షణంలో, వాత్సల్యభరితహృదయ దేవకికి.

చన్నులు దిగ్గన చేపగ
కన్నుల ఆనంద బాష్పకణములు తొరగం
గ్రన్నన కౌగిట నిడి
కన్నన్నలు వచ్చి రనుచు కౌతుక మొప్పన్.

వారిని కౌగిటచేర్చి, ఒడిలోపెట్టుకుని, ముద్దాడి, బుగ్గలుపుణికి సంతోషించింది. కొంతసేప వారు శిశురూపంతో తల్లికి ఆనందం కలిగించి, కృష్ణ కరస్పర్శవల్ల శాపవిముక్తులై స్వర్గ ధామం చేరారు, అని శుకయోగీంద్రుడు అనంతరకథ ఆరంభిస్తున్నాడు.

# సుభద్రాపరిణయం

కృష్ణునిసోదరి సుభద్ర. ఆమెకు యుక్తవయసు వచ్చింది. నాటినుంచీ ఆమెన దుర్యోధనుని కిచ్చి పెళ్ళిచేయాలని బలరాముడు ఆలోచిస్తున్నాడు. ఈ వార్తవిన్నాడు అ నుడు. అప్పటికే ప్రభాసతీర్థంలో యతిగా కాలంగడుపుతున్న ఆ పాండురాజనందను సుభద్ర గుణ రూప విశేషాలు చూడాలనే కోరికతో యతీశ్వరవేషంతోనే యాదవరాజధాని వచ్చి అక్కడ విధ్యుక్తంగా యత్యాశ్రమాన్ని నిర్వహిస్తున్నాడు.

తమ నగరానికి యతీశ్వరుడు వచ్చిన వార్తవిని బలరాముడు ఉచితరీతిని ఆయన భిక్షకు ఆహ్వానించాడు; ఆ సమయంలో అర్జునుడు సుభద్రను చూశాడు. ఆమె వర రూప లావణ్యాలతో గుణసంపదకూడా తిలకించి, ఆమెను తన భార్యగా గ్రహించాల నిశ్చయించుకున్నాడు.

యతివేషంలో వచ్చిన అర్జునుని రూప విక్రమాలు చూసిన సుభద్ర వానినే తన భర్త వరించింది. ఆ రోజులలో ఒకనాడు యాదవు లందరూ ఉత్సవానికి బయలుదేరా అంతకుముందే అర్జునుడు కృష్ణునికి తన సంకల్పం తెలిపి, దేవకీ వసుదేవుల అనుజ్ఞపా ఉన్నాడు.

ఉత్సవానికి వెడుతూన్న సమయంలో సుభద్రను తన రథం మీదికి ఎక్కించు ఖాండవప్రస్థం వైపు గుర్రాలను పరుగు తీయించాడు. అదిచూసిన యాదవవీరులు ఎద రాగా వారిని వెనుదరిమాడు. వారీవిషయం బలరామునికి వివరించగా ఆయన క్రోధ క్షుడై యుద్ధ సన్నద్ధు డయాడు.

అప్పుడు వసుదేవనందనుడు విషయమంతా వివరించి శాంతచిత్తునిచేశాడు. అ తరం బలరాముడు తన చెల్లెలికి కానుకలు పంపి సంతోషించాడు.

# మిథిలానగరయాత్ర

మహారాజా! లోకవిఖ్యాత మయిన విదేహదేశానికి రాజధాని మిథిలానగరం. దాని ప్రభువు బహుళాశ్వుడు. ఆయన నిర్మలచిత్తంతో తామరాకుమీది నీటిబిందువులా పరమేశ్వరారాధనం చేస్తూ, రాజ్యపాలనం సాగిస్తున్నాడు. ఆ నగరంలో శ్రుతిదేవుడనే బ్రాహ్మణోత్తము డున్నాడు. ఆయన నిత్యసత్కర్మాచరణరతుడై అయాచితంగా లభించే గడ్డిపరకయే బంగారురాసిగ భావించి జీవయాత్ర సాగిస్తున్నాడు. అటువంటివారిని చూచి, వారిని తరింపచేసే సంకల్పంతో వాసుదేవుడు మిథిలకు ప్రయాణ మయాడు.

ఆయనవెంట నారద, వామదేవాది మును లెందరో వచ్చారు. తన నగరానికి వాసుదేవుడు విజయం చేస్తున్నాడనివిని బహుళాశ్వుడు, శ్రుతదేవ సమేతం ఎదురేగి కృష్ణునీ, మునిబృందాన్ని వినయంగా పూజించి పాదాభివాదం చేశారు.

అనంతరం వారందరినీ తన గృహానికి విచ్చేసి, తమ జన్మపావనం చేయవలసిందని అర్థించాడు. అలానే శ్రుతదేవుడూ ఆహ్వానించాడు.

వాసుదేవుడు చిరునవ్వుతో అంగీకరించి ఒకరికి తెలియకుండాఒకరితో బయలుదేరి తనమాయతో యిరువురిగృహాలలో ఏకకాలంలో ప్రవేశించి వారిని సంతోషచిత్తులను చేశాడు. రాజయోగ్యంగా మహారాజు పూజలు జరిపాడు.

తనయింటికి వచ్చిన వాసుదేవుని యథాశక్తి పూజించి బహుళాశ్వుడు:

కృష్ణ పరమాత్మ యదుకుల
క్షీరవార్ధి పూర్ణచంద్రమ
దేవకీపుత్ర సుజనవినుత!
నారాయణాచ్యుత వేదవేద్య
భక్తజనపోష పరితోష
పరమపురుష!

అని ప్రార్థించాడు.

అక్కడ కొంతకాలం ఉండి వారందరినీ అనుగ్రహించాడు.

అప్పుడు శ్రుతదేవుడు :

పురుషోత్తమా! నీ కథాగానమే మా వీనులకు విందు. నీ దివ్యనామసంకీర్తనంతో, పూజలతో, పాదారవింద సేవతో, సర్వేంద్రియాలూ నీ అధీనంలో ఉంచినవారి జన్మ చరితార్థం. నిర్మలహృదయులకు నీ దర్శనం బహుసులభం!

అని వాసుదేవుని చరణపద్మాలకు సాష్టాంగప్రణామం చేశాడు. మిథిలను విడచి రథారూఢుడై వాసుదేవుడు సుఖయాత్ర చేసి కుశస్థలంచేరాడు.

# శ్రుతి గీతలు

మహారాజా! ఇంతవరకూ నీకు నిఖిలభువనభవనరక్షకుడైన పురుషోత్తముని లీలలు వినిపించాను. ఆ విరాట్పురుషుని గురించి శ్రుతిగీతపేర ప్రసిద్ధమయిన నిగూఢ విషయం చెపుతాను, సావధానంగా విను.

ఒకనాడు నారదమునీంద్రుడు నారాయణాశ్రమంలో మునిబృందమధ్యంలో వున్న నారాయణఋషిని అర్థించగా ఆయన చెప్పిన దానిని దేవముని మా పితృపాదులు వ్యాసుల వారికి వివరించారు. ఆయన నన్ను అనుగ్రహించి విశదం చేశారు.

ఈ ప్రపంచంలో కొందరు ఆ అవతారపురుషుని కథాసుధారసంగ్రోలుతూ తన్మయులవుతూంటారు. మరికొందరు పురుషోత్తముని పాదాబ్జసేవలో హంసలవలె చరిస్తూంటారు. మరికొందరు ఆయన యందు భక్తితో నిరంతర సేవాపరాయణులై ఉంటారు. మిగిలిన కొందరు నిశ్చలధ్యానసమాధిలేక పుడుతూ గిడుతూవుంటారు. ఇంతకూ మూలం ఆ మహాపురుషుని స్వరూపం ఎరుగక పోవడమే.

కణ్వ గౌత మాదులు పరమాణువే సృష్టికారణం అన్నారు. ప్రకృతియే దీనికి కారణ మన్నారు సాంఖ్యులు. దేహాన్నిమించిన ఆత్మలేదంటారు బౌద్ధులు. ఈ విధమయిన వాదాలతో వారు సాగుతున్నారే తప్ప పరమేశ్వరతత్వం వారెవరికీఅందలేదు. ఆ అనుగ్రహంపొందిన యోగీంద్రులు వీరి మాటలలోని అసత్యం గ్రహిస్తారు. చరాచర జీవకోటితో నిండివున్న ఆ పరంజ్యోతిని గుర్తించలేని కొందరు అది నిత్యమనీ అనిత్యమనీ తర్కంతో జీవితం వ్యర్థం చేసుకుంటారు.

నిఖిలజగత్స్వరూపుడు కనక అలానే భావిస్తారు మరెందరో. వీరందరి వాదాలు ఎందుకూ కొరగానివి.

ఆ పురుషోత్తముడు దేహగతుడై వున్నా ఆ దేహి సాగించే దేనితోనూ నిమిత్తం లేకుండా సాక్షీభూతుడుగా ఉంటాడు. అయితే కంఠాన్ని అలంకరించుకున్న మణిమాల అలంకరించుకున్నవానికి కనిపించనట్లే సన్నిహితుడై హృదయాంతర్యామియైన ఆయన అజ్ఞులకు కనిపించడు. సకలబ్రహ్మాండ నాయకుడైన ఆయనయందే వేదాలు ప్రవర్తిల్లుతూంటాయి, అన్నాడు యోగి శుకుడు.

# వృకాసురుడు

మహారాజా! ఆ పురుషోత్తముడు ఎప్పుడు ఏది ఎలా చేస్తాడనేది ఎవరికీతెలీదు.

ఒకనాటి మాట!

వృకాసురుడనే క్రూరుడు సజ్జనహింస జీవితలక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆ హింస నిరంతరాయంగా సాగే మార్గంకోసం ఆలోచిస్తూ, ఒకనాడు నారదమునిని దర్శించి:

మహర్షీ! బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో ఎవరిని ఆరాధిస్తే త్వరగా ప్రత్యక్షమవుతారు? అని ప్రార్థించగా, ఆయన నవ్వుతూ:

నాయనా! ప్రతిప్రాణిలోనూ దుర్గుణ, సుగుణాలు కొద్దిపాళ్ళ తేడాలో ఉంటాయి. అలాకాక దుర్గుణంకానీ, సుగుణంకానీ ఏదో ఒకటే మూటకట్టుకు కూర్చునే వారికి ఆగ్రహాను గ్రహాలు ప్రసాదించే వాడు ఫాలలోచనుడు. ఆయనను ఆరాధించు, అని వెళ్ళాడు.

నారదుని మాట వింటూనే వాడు కేదారతీర్థానికివెళ్ళి తీవ్రనిష్ఠతో శివుని ఆరాధిస్తూ, తన శరీరం ముక్కలు ముక్కలు చేసి ఈశ్వరప్రీతిగా అగ్నిలో ఆహుతి చేస్తున్నాడు. అయినా ఆయన కదుణించలేదు. అంతతో మరింత నిష్ఠహూని, అక్కడి పవిత్రజలాలలో స్నానంచేసి, మృత్యుదేవత నోటిలోని కోరవలె ఉండే గండ్రగొడ్డలి చేబూని తన శిరస్సు నరికి ఆహుతి చెయ్యడానికి సన్నద్ధుడయాడు.

ఆ క్షణాన అంబికాపతి ప్రత్యక్షమై వరం కోరుకోమనగా, వృకాసురుడు: -

పరమేశా! నమస్కారం. నాకేమీ అవసరం లేదు. నా చెయ్యి ఎవని తల మీద పెడితే ఆ తల నూరు ముక్కలు కావాలి, అన్నాడు.

అనుగ్రహించాడు పరమశివుడు.

ఉత్తరక్షణంలో వృకాసురుడు తన చేతినెత్తి శివుని మీదికి నడువగా, ఆయన హుటాహుటి వైకుంఠం చేరాడు. చూసిన శేషశాయి అదే క్షణంలో చిన్న బ్రహ్మచారి వేషం ధరించి వృకాసురుని కెదురుపోయి :

ఎందు కింత ఆయాసంతో పరుగు పరుగున వస్తున్నావు, అని అడుగగా వాడు జరిగిన కథ అంతా చెప్పాడు.

అప్పు డా మాయా బ్రహ్మచారి నవ్వుతూ :

ఓయి వెర్రివాడా ! దక్షుని శాపంవల్ల శివుడు భూత, పిశాచాలకు అధిపతి అయిన నాటి నుంచీ నిజం చెప్పడం మానేశాడు. అందువల్లనే నీకు వరమిచ్చి, పరీక్షకు నిలవ కుండా పారిపోయి వచ్చాడు. ఎందు కింకా శ్రమ. ఫో, అన్నాడు.

అంటూనే మాయా విమోహితుని చేయగా వృకాసురుడు తన చెయ్యి తన తల మీదనే ఉంచుకున్నాడు.

మరుక్షణంలో నూరువ్రక్కలయింది. అప్పుడు పరమశివుడు మహావిష్ణువును అనేక విధాల కొనియాడి కైలాసం చేరాడు.

అలా ఉంటాయి ఆయన లీలలు, అన్నాడు,

* * * *

శుక యోగీంద్రా !

ఎక్కడవిన్నా శివభక్తులు సర్వసంపదలతో సుఖభోగాలతో అలరారుతున్నారు. కాని విష్ణుభక్తులు దుర్భర దారిద్ర్యంతో క్లేశా లనుభవించడమే కనిపిస్తుంది : ఏమిటి దీని రహస్యం అని పరీక్షిన్మహారాజు ప్రశ్నించగా వ్యాసనందనుడు :

మహారాజా ! పరమశివుడు సత్వ రజస్తమోగుణాన్వితుడు కనక రాగద్వేషాలు కల వారు ఆయనను సేవించి యిహలోక సుఖభోగాలు పొందుతారు. నారాయణుడు వీటికి అతీతుడు కనక ఆయనను ఆరాధించేవారి సంపదలన్నీ ఆయనే హరిస్తాడు. దానితో వాని బంధు మిత్రులు వానిని విడిచిపెడతారు. ఎవరయినా సంపదలుంటేనే ఆశ్రయిస్తారు. కాని లేనివాని దగ్గరకు పోరుకదా ! అందరూ విడిచిపెట్టడంతో వారు సర్వబంధాలూ వదిలి నిరంతరం నారాయణ పాదసేవతో ఆయనసన్నిధికి చేరుతారు. వారికి భవ బంధాలుండవు.

మరొక యితిహాసం ఉన్నది.

ఒకప్పుడు సరస్వతీనదీరాన మును లందరూ చేరి ఒక క్రతువుసాగిస్తూ త్రిమూర్తులలో శ్రేష్ఠు డెవరు? అనే మీమాంస సాగించారు. అదినిర్ణయించడానికి భృగుమహర్షి బయలు దేరాడు. ముందుగా బ్రహ్మలోకానికి వెళ్ళి చేతులు జోడించకుండా నిలబడగా బ్రహ్మ కుపితుడై అంతలో శాంతించాడు.

అక్కడినుంచి కైలాసానికి వెళ్ళగా పరమశివుడు సంతోషంతో కౌగిట చేర్చబోయాడు. భృగువు చలించకుండా గంభీరంగా నిలబడ్డాడు. ఆయన క్రోధంరేగి త్రిశూలం ఎత్తాడు. అప్పుడు పార్వతీదేవి భర్తను సమీపించి, అంత ఆవేశం అనవసరం అని అనునయించింది.

భృగువు వైకుంఠానికి వస్తూనే మహావిష్ణువును సమీపించి ఆయనఉరఃస్థలం గట్టిగా తన్నాడు.

పాదతాడనం చేసినా చిరునవ్వుతో వచ్చి, ఆయన పాదాలకు నమస్కరించి:

మునీంద్రా! తమవంటి వారి దర్శనం అవుతుందని తెలియక విశ్రాంతిలోవున్న నా తప్పు మన్నించండి, అని కాళ్ళు కడిగిన నీళ్ళు చెత్తిన జల్లుకుని:

నన్ను అనుగ్రహించండి, అనగా ఆనందతరంగితహృదయంతో భృగుమహర్షి ఆయ నను అభినందించి తిరిగివచ్చి తన అనుభవాలన్నీ వివరించాడు.

అప్పుడు వారందరూ మహావిష్ణువే సర్వదేవతాధీశుడని నిశ్చయించారు.

* * * *

కుశస్థలిలో కృష్ణుడు వున్న రోజులలో ఒకనాడొక విప్రుడు తన మృత శిశువును గొని వచ్చి రాజద్వారంలో పెట్టి:

ఏదేశంలో ప్రభువు వేదవేత్తలను హింసిస్తూ, అన్యాయమార్గాన రాగద్వేషాలకు లొంగి చరిస్తాడో అక్కడే శిశుమరణాలు సంభవిస్తాయి, అని గోలు గోలున ఏడ్చి వెళ్ళాడు. ఆవిధంగా ఎనమండుగురు పుత్రులు మరణించారు. ప్రతిమారూ అలావచ్చి రోదిస్తూనే ఉన్నాడు. తొమ్మిదవకుమారుని మృతదేహం తెచ్చి శోకిస్తుండగా విన్న అర్జునుడు వాని పుత్రులను తానురక్షించగలననీ, లేకపోతే అగ్నిలో దూకుతాననీ శపథంచేశాడు.

శిశువు జన్మిస్తూనే మరణించాడు. ఆ విప్రవరుడు మళ్ళీ పోయి కృష్ణునితో మొర పెట్టుకుంటూ అర్జునుని నిందించగా ఆవేశంతో కౌంతేయుడు సర్వలోకాలు తిరిగి ఎక్కడా ఆ విప్రుని బిడ్డలు కనిపించక విచారంతో వచ్చి అగ్నిగుండంలో దూకడానికి సన్నద్ధుడయాడు.

నవ్వురాజిల్లెడు మోముతో వాసుదేవుడు వారించి, కాంచనరథారూఢుడై అర్జునుని వెంట బయలుదేరాడు. రథం వాయువేగంతో నదీ, నద; నగ, నగర, సాగరాలుదాటి వెడు తుండగా అక్కడ దట్టమైన చీకటి ప్రదేశం వచ్చింది. దారి కానక గుర్రాలు ఆగిపోగా, వాసుదేవుడు సుదర్శనం వదిలాడు. దాని కాంతిచ్ఛటలు మిరుమిట్లు గొలుపగా అర్జునుడు కన్నులు మూసుకున్నాడు. రథం ముందుకుసాగి, గంభీరసాగరమధ్యంలో కొంతదూరం ప్రయాణించింది.

అక్కడ మణిఖచితములైన వేయిస్తంభాలతో, రత్నకాంతులతో, తోరణాలతో, అద్భుతతేజఃపుంజంతో అలరారే భవనం కనిపించింది.

ఎందరో యోగీంద్రులూ, భాగవతోత్తములూ ఆనందంతో వున్నారు. వేయిపడగల ఆదిశేషునిమీద నీలమేఘశ్యామకాంతితో పీతాంబరధారియై లక్ష్మీసమేతుడై సనక, సనందనాది మునిమండలశోభితుడై శంఖ, చక్ర, గదా, శార్ఙ్గాలతో అలరారే నారాయణుడు గోచరించాడు.

ఆ దివ్యమంగళవిగ్రహునికి యిద్దరూ చేతులు జోడించి నిలిచారు.
అప్పు డా పురుషోత్తముడు :

భూలోకంలో ప్రబలిన క్రూర దానవగణసంహారానికీ, ధర్మప్రతిష్ఠాపనకూ మీ రిద్ద రూ నరనారాయణులుగా నా అంశతో జన్మించారు. మిమ్మల్ని చూడాలని యీ ముని బృందం కోరగా రప్పించడంకోసమే, ఆ విప్రబాలకులను అలాచేశాను. అరుగో ఆ బాలకులు. తీసుకు వెళ్ళండి, అన్నాడు.

కృష్ణార్జునులు ఆ పురుషోత్తముని పరిపరివిధాల కీర్తించి ఆ బాలకులనుతెచ్చి విప్రున కర్పించి, సంతోషింపజేశారు.

అనంతరం వాసుదేవుడు భూలోకంలోని దుష్టులను శిక్షిస్తూ, శిష్టజన రక్షణచేస్తూ సత్క్రతువులనేకం సాగిస్తూ తన భార్యామణు లందరికీ వారివారి అభిమతానుసారం సర్వ వాంఛలూ యీడేరుస్తూ అందరినీ పుత్రపౌత్రవృద్ధితో అలరింపజేశాడు. ఈ కృష్ణకథా శ్రవణం చేసిన వారికి సర్వక్లేశాలూ తొలగి, సుఖ సంతోషాలు లభిస్తాయి, అని శుక యోగీంద్రుడు ముందుకు సాగుతున్నాడు.

# ఏకాదశస్కంధము

తరణంబులు భవజలధికి
హరణంబులు దురిత లతల
కాగమముల కాభరణంబులు
ఆర్తజనులకు శరణంబులు
నీదు దివ్య చరణములిలన్

మాయామానుషవిగ్రహుడై దేవకీ తనయుడుగా ప్రభవించి నారాయణుడు అఖిలదుష్ట జనసంహారంచేస్తూ చివరకు కురుక్షేత్రంలో కురు పాండవ యుద్ధంలో క్రూరప్రవృత్తు లందరినీ కడతేర్చి, అహంకార మదోన్మత్తు లయిన యాదవులను కూడా ఉపసంహరించే సంకల్పంలో ఉన్నాడు.

ఆవార్త తెలిసి ఆయనను దర్శించడానికి కశ్యప, అంగిరస, భృగు, వామదేవ, విశ్వామిత్ర, దుర్వాసాది ముని లందరూ వచ్చారు.

వచ్చినవారందరినీ అర్ఘ్య పాద్యాదులతో సత్కరించి, ఆరాధించినఅనంతరం వారు :

వాసుదేవా ! మానవజీవితంలోని సర్వరోగాలకూ దివ్యౌషధం నీ నామం అని తెలియక దుర్బుద్ధులై లంపటాలలో పడి కొట్టుకుంటూంటారు. సర్వబ్రహ్మాండంలో అణురూపంలో ఉన్న నీకు నమస్కారం, అని అనేకప్రార్థనలు చేసి, సెలవుతీసుకుని, ద్వారకకు సమీపంలో వున్న పిండారక తీర్థానికి వచ్చారు.

అప్పటికే గర్వాంధులైవున్న యాదవులు తమతో వున్న సాంబుడికి ఆడవేషంవేసి, మునులను చేరి :

స్వాములూ, ఈ యువతి గర్భవతియై ఉంది. ఈమెకు ఆడపిల్ల పుడుతుందా ! మగవాడు కలుగుతాడా ! అని ప్రశ్నించగా, వారి కపటనాటకం గ్రహించిన మునులు :

నాయనలారా ! యదువంశ నాశనం చేసే ముసలం ( రోకలి ) యీబాలిక గర్భంలో ఉంది, పొండి, అని వెళ్ళిపోయారు.

ఆ మాటతో యాదవులు గజగజలాడి సాంబుని వస్త్రాలు విప్పుతూండగానే రోకలి బైటపడింది.

ఆ రోకలి పట్టుకుని అందరూ కృష్ణుని సమీపించి జరిగినకథ చెప్పగా ఆయన : విప్రశాపానికి తిరుగులేదు. మీ మదమత్తతకు అదే ప్రాయశ్చిత్తం అన్నాడు.

వారు పరిపరివిధాలవేడగా : సరే, సముద్రతీరంలో ఒక పర్వతంమీద దీన్ని అరగ దీసి, ఆ పొడి సముద్రంలో కలపండి, అని పంపాడు.

వారు హుటాహుటిపోయి అహెరాత్రాలు అరగదీసి, చివరకు ముక్క మిగలగా విసరి పారేశారు.

ఆ ముక్కను చేప మింగింది. చేపను పట్టిన జాలరి దానిని కోసి, ఆ ముక్కను చూసి యింత వాడిములుకు తన బాణానికి తొడిగితే వేట బాగా సాగుతుందని పట్టుకు పోయాడు.

* * * *

# పరీక్షిన్నరేంద్రా!

ఈ ప్రపంచంలో అన్నిటికంటె ఉత్కృష్టమైనది మానవ జన్మ. అందుకు కారణం ఈ మానవప్రాణికే నారాయణచరణారవింద సేవాభాగ్యం లభిస్తుంది. కాని యీ అదృష్టానికి నోచుకోగల వా రెందరు ! కళ్ళుమూసుకు నడిచే వానికి సరయిన దారి కనిపించనట్లే నిర్మల చిత్తంతో పరాత్పరపదధ్యానం చెయ్యని వారికి మోక్షపదవి లభించదు.

నిరంతరం హరినామస్మరణంతో హరికథా శ్రవణంతో, ఆ పురుషోత్తముని లీలలు గానం చేసుకుంటూ సర్వమూ ఆయనే అని విశ్వసించాలి. మన ఆత్మ విష్ణుమయం అని భావించే భాగవతులు ఆయన సన్నిధానం చేరి భవబంధ విముక్తు లవుతారు.

సూర్యకిరణాలు అంధకారాన్ని పారద్రోలే రీతిగా విష్ణుపాదరజం సర్వాన్నీ పవిత్రం చేస్తుంది. అందువల్లనే యోగీంద్ర, మునిగణాలు ఆయన పాదరజోలేశం కోసం నిర్విరామ ధ్యానం చేస్తూంటాయి.

ప్రళయం ఎలా వస్తుందని మహనీయులు చెపుతున్నారంటే —

ఆ సమయానికి నూరుసంవత్సరాలు ముందునుంచీ వానలు పడవు. దానితో సూర్యునివేడి లోకాలను భస్మం చేస్తుంది. క్రింది లోకాలలో సంకర్షణముఖం నుండి మహా వేగంతో అగ్నిజ్వాలలు ప్రభవిస్తాయి. ఆ తరువాయి నూరేళ్ళు కుంభవృష్టి. అప్పు డా విరాణ్మూర్తి అవ్యక్తంలోప్రవేశిస్తాడు. భూమి పూర్తిగా నీటిలో కలుస్తుంది. నీరు అగ్నిగా మారుతుంది. అది వాయురూపం పొందుతుంది. వాయువు గగనంలో లీన మవుతాడు.

మానవుడు దారా పుత్ర వ్యామోహంలోపడి సుడిగుండంలో గడ్డిపరకలా తిరుగుతూండక, సాధుసాంగత్యంతో, సజ్జనమైత్రితో, సుఖదుఃఖాలకు పొంగుతూ, వంగిపోకుండా, దొరికిన దానితో తృప్తిపడుతూ శమ, దమ సంపత్తితో సర్వం పరమేశ్వరార్పణబుద్ధితో జీవితం సాగించి భాగవతోత్తముడు కావాలి.

నరేంద్రా! వేదధర్మానుసారం పవిత్రశరీరంతో నారాయణసన్నిధానంలో నిర్మలమయిన మనస్సుతో ఆసీనుడై షోడశోపచారాలతో ఆరాధించి భక్తిహృదయంతో ఉండేవారు ఆయనను చేరుతారు.

బదరికాశ్రమంలో తపోదీక్షలోవున్న నారాయణమహర్షికి తపోభంగం కలిగించాలని దేవేంద్రుడు అప్సరసలను పంపుతూ, వారివెంట మన్మథునికూడాపంపాడు. వారు అనేక విధాల ఆయన మనస్సు వికలం చెయ్యడానికి ప్రయత్నించగా ఆయన చిరునవ్వుతో:

పాపం! మీ దేవేంద్రుని ఆజ్ఞానుసారం వచ్చినట్టున్నారు, చాలా సంతోషం, అంటూ తన దేహంనుండి వీరికంటె అందకత్తెలయిన వారిని సృష్టించగా వారు తలలువంచి, ఆయన శరీరంనుండి పుట్టిన ఊర్వశిని వెంటబెట్టుకుని దేవలోకానికి పోయి జరిగినకథ చెప్పారు. దేవేంద్రుడు తలవాల్చి ఊరుకున్నాడు.

ఆదినారాయణుడు కృతయుగంలో శుక్లవర్ణంతో నాలుగు చేతులతో, జటావల్కలాలు ధరించి దండ కమండలపాణియై హంస, సువర్ణ, ధర్మ, వైకుంఠాదినామాలతో విరాజిల్లుతాడు.

త్రేతాయుగంలో రక్తవర్ణుడై, సువర్ణకేతుడై, వేదత్రయరూపుడై, విష్ణునామంతో నడుపుతాడు. ద్వాపరంలో శ్యామలదేహం, పీతాంబరం, బాహుద్వయం, దివ్యాయుధాలు, రాజలక్షణ లక్షితుడు. వాసుదేవ, జనార్దన, సంకర్షణనాముడు.

కలియుగంలో కృష్ణవర్ణం, కృష్ణనామం, భక్తరక్షణదీక్ష. ఈ కాలంలో హరి రామ, నారాయణ, నృసింహ, కంసారి నామాలతో ఆరాధనలు పొందుతాడు.

ఆ పురుషోత్తముడు కృష్ణావతారం పరిసమాప్తం చేయడానికి నిశ్చయించుకున్నాడు. ఆ సమయాన ద్వారకానగరానికి ప్రమాదసూచనలు రాగా యాదవులందరినీ ప్రభాసతీర్థానికి తరలించాడు. విషయం గ్రహించి ఉద్ధవుడు వాసుదేవుని చేరగా ఆయన చిరునవ్వుతో:

ఉద్ధవా! నేటికి వారం రోజుల్లో ద్వారక సముద్రంలో కలుస్తుంది. యదువంశం క్షయ మవుతుంది. కలియుగం ప్రవేశిస్తుంది. కలియుగంలో ధర్మనిరతి ఉండదు. ఆచారం పనికిరాదు, అన్యాయాలు పెరుగుతాయి. మందబుద్ధులూ తీవ్రక్రోధులూ,

అల్పాయుష్కులూ, బహురోగపీడితులూ పెరుగుతారు. ఎదుటివారిని సహించలేని నాస్తికులు బలుస్తారు.

నీవంటివానికి చెప్పవలసిన యితిహాసం ఉంది.

ఒక అరణ్యంలో ఒకపావురం దాని జతపక్షితో అన్యోన్యంగా ఉంటూ పిల్లలనుకని మమకారంతో ఉన్నది. ఒకనాడొక బోయ ఆ ఆడపిట్టను దానిపిల్లలను వేటాడిపోయాడు, అప్పుడీ కపోతం దారా సుతులమీది మమకారంవీడక చిక్కినశించింది. అందుచేతనే దారా పుత్రవ్యామోహం పనికిరాదు.

మరొక మాట—

మిథిలానగరంలో పింగళ అనే వేశ్య ఉంది. అది తనను నమ్మిన ప్రియుని మోసగించి, మరొక ప్రియుని ద్వారా అధికధనం సంపాదించాలని రాత్రులు నగరంఅంతా తిరుగుతూ నిద్రలేక అలసటతో నానాయాతనలూ పడి, ఆత్మశాంతిని మించిన ఐశ్వర్యం లేదని నారాయణ చరణసేవతో మోక్షపదవి పొందింది.

అంతేకాదు ఉద్ధవా! భగవత్సేవను మించినది భాగవతసేవ, అని ఉద్ధవునకు ముక్తిమార్గం ఉపదేశించగా ఆ పుణ్యపురుషుడు బదరికావనానికి వెళ్ళాడు.

అనంతరం బలరామ కృష్ణులు ద్వారక విడిచి వచ్చేవేళకు యాదవులు 'మదిరాపాన మత్తులై సముద్రం ఒడ్డున కొట్టుకుంటూ రోకలి పొడికలిసిన తరంగాలతాకిడికి అందరూ ప్రాణాలు వదిలారు. అదిచూసి బలరాముడు యోగమార్గాన అనంతునిలో లీనమయాడు. వాసుదేవుడు ఒక నికుంజం దగ్గర విశ్రాంతిలో ఉండగా, ఆయన ఆడించే పాదం లేడి చెవిగా భ్రమించి ఒకబోయ బాణం విడిచాడు. అంతతోఆయన అవతారం చాలించాడు.

అవతారం చాలించే వేళకు వచ్చిన దారుకుని చూచి :

నువ్వు త్వరగావెళ్ళి మిగిలిన మనవారి కీవార్త చెప్పి, తక్షణం అర్జునుని రప్పించి, యాదవ గురు, వృద్ధ, స్త్రీ, బాలకులను హస్తినాపురంతీసుకుపొమ్మని చెప్పు, అన్నాడు.

కోటిసూర్యకాంతితో గగనమార్గాన వచ్చే నారాయణుని చూచి నిఖిలదేవ, ముని గణాలూ జయ జయ ధ్వానాలు చేశారు.

# ద్వాదశస్కంధం

రాజీవసదృశనయన విరాజితసుగుణా
విదేహరాజ వినుత విభ్రాజిత కీర్తిసుధావృత
రాజీవభవాండభాండ రఘుకులతిలకా!

ధర్మపాలననిష్ఠాగరిష్ఠా!

ఇంతవరకూ నీకు పూర్వకాలకథలు వినిపించాను. ఇప్పుడు భావికాలగతి వివరిస్తాను.

బృహద్రథుడనే రాజుకి పురంజయుడు పుడతాడు. వీని మంత్రి శునకుడు. వీడు రాజును చంపి తానే ప్రభు వవుతాడు. వాని కుమారుడు ప్రద్యోతనుడు. వాని కుమారుడు విశాఖుడు. నందివర్ధనుడు వాని సుతుడు. వీరయిదుగురూ నూట ముప్పదిఎనిమిది సంవత్సరాలు పాలిస్తారు.

ఆ తరువాయి శిశునాగ, కాకవర్ణ, క్షేమవర్మ, క్షేత్రజ్ఞ, విధిసార, అజాతశత్రు, దర్భక, అజయ, నందివర్ధన, మహానందులు, మూడువందలఅరవై యేళ్ళు పాలించాక, మహానందికి శూద్రస్త్రీయందు మహాపద్మవతి అనే వాడు పుడతాడు. వీనికి ఎనమండుగురు పుత్రులు. అయితే వానితోనే రాజవంశాలు అంతరిస్తాయి. ఈ ఎనమండుగురూ నూరేళ్ళు పాలిస్తారు. ఆ తరువాయి నవనందులు పాలిస్తారు. వీరిని ఒక విప్రశ్రేష్ఠుడు పదభ్రష్టులను చేసి మౌర్యులను సింహాసనం ఎక్కిస్తాడు. మౌర్యచక్రవర్తి చంద్రగుప్తుడు.

వారిసారుడు ఈయన కుమారుడు. ఈయన తరువాయి అశోకవర్ధన, సుయతస్స, సంయుత, శాలిశూక, సోమశర్మ, శతధన్వ, బృహద్రథులు నూటముప్పైయేడు సంవత్స రాలు రాజ్యం చేస్తారు.

బృహద్రథుని సేనాపతి శుంగుడు తనరాజును చంపి సింహాసనం అధిష్ఠిస్తాడు. వాని అనంతరం అగ్నిమిత్ర, సుజ్యేష్ఠ, వసుమిత్ర, భద్రక, పుళింద, ఘోష, వజ్రమిత్ర భాగవంత, దేవభూతులు పాలిస్తారు. ఈ శుంగులు నూటపన్నెండేళ్ళు ఏలుతారు.

దేవభూతిని ఆయనమంత్రి వసుదేవుడు సంహరించి రాజ్యాధిపత్యం వహిస్తాడు. అనంతరం వాని కుమారుడు భూమిత్రుడు, వీని పుత్రుడు నారాయణుడు. ఇలా ఈ కణ్వవంశీయులు మూడువందల నలభైఅయిదేళ్ళు రాజ్యపాలనం సాగిస్తారు.

ఈ కణ్వవంశీయుడైన సుశర్మను వాని సేవకుడు ఆంధ్రజాతీయుడు వృషలుడు సంహరించి రాజవుతాడు, వీని కొడుకు కృష్ణుడు, వీనిసుతుడు శాంతకర్ణుడు. అలా వారి సంతానం పౌర్ణమాస, లంబోదర, జిబిలక, మేఘస్వాతి, దండమాన, హాలేయ, అరిష్టకర్మ, తిలక, పురీషసేతు, సునంద, వృక, జటాప, శివస్వాతి, అరిందమ, గోమతి, పురీమంత, దేవశీర్ష, శివస్కంధ, యజ్ఞశీల, శ్రుతస్కంధ, యజ్ఞశత్రు, విజయాదులు నాలుగు వందలయాభైయారు సంవత్సరాలు పాలిస్తారు.

ఇలా వేలసంవత్సరాలు ఎన్నెన్నో రాజవంశాలు భూమండలం పాలించి, అన్యోన్య వైరంతో, అసహనంతో, సత్య-ధర్మదూరులైపోతారు. ప్రజలకు దైవభక్తి ఉండదు. పాపభీతి అసలే కానరాదు.

అలా కొంతకాలం జరిగాక నారాయణుడు అశ్వవాహనారూఢుడై అవతరించి క్రూర జన గణాన్ని సంహరించి, శిష్టజనరక్షణతో ధర్మపరిపాలనం సాగిస్తాడు.

శంతనుని సోదరుడు దేవాపి, ఇక్ష్వాకువంశీయుడైన మరుత్తు వీరుభయులూ యోగశక్తి యుక్తులై కలాపిగ్రామంలో ఉండి ప్రజలకు సత్య, ధర్మమార్గాలు ఉపదేశించి సదాచారం నేర్పుతారు.

మహారాజా ! ధర్మం అంటే ఏమీకాదు. సత్యమూ, భూతదయ, దానమూ, తపస్సు-ఈ నాలుగూ దాని పాదాలు. కృతయుగంలో ఈ నాలుగింటినీ అందరూ అనుష్ఠిస్తారు. దయా, దాన, తపస్సులు త్రేతాయుగంలో నడుస్తాయి. దయ, తపస్సు, ద్వాపరంలో ఉంటాయి. కలియుగంలో మానవులకు ఇవేవీ ఉండవు. దురాచారులు, దుష్టసేవానిరతులు, అసత్యవాదులు, మాయోపాయకోవిదులు, రోషైకదృక్కులు, నిర్దయులు, ప్రబలుతారు. ప్రభువులందరూ పాపాచారులే ! అందరూ కాముకులే. తల్లీ, తండ్రీ, కొడుకూ, కూతురూ, ఆదిగాగల మానవత్వలక్షణాలన్నీ నశిస్తాయి. కరువులూ, ఉప్పెనలూ ఇటువంటి ఉపద్రవాలు పెరుగుతాయి.

అందువల్లనే కలియుగంలో ఒకక్షణమయినా నారాయణనామస్మరణ చేస్తే నూరు యజ్ఞాలు చేసిన ఫలం సిద్ధిస్తుంది.

# ప్రళయం

ఇక ప్రళయం ఎప్పుడెప్పుడు వస్తుందని కదా నీ సందేహం.

కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగుకలిసి మహాయుగం. వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు పగలు. అనంతరం వెయ్యి మహాయుగాలు ఆయన కొకరాత్రి. అప్పుడు నిమిత్తప్రళయం ఏర్పడుతుంది. అప్ప డీ లోకాలన్నీ బ్రహ్మలో లీనమవుతాయి. దీనినే ప్రాకృతప్రళయం అంటారు.

ఇటువంటి మహాయుగాలు మూడువందలఅరవై గడిస్తే బ్రహ్మకు సంవత్సరం. అవి వందసాగితే ఆయనకు నూరేళ్ళు నిండుతాయి. అప్పుడు మహాప్రళయం వచ్చి అంతా జలార్ణవం అవుతుంది.

నిత్య, నైమిత్తిక, ప్రాకృతిక, ఆత్యంతిక రూపాలతో ప్రళయాలు నాలుగు విధాలుగా వస్తూంటాయి. ఈ ప్రళయ కాలాలలో కూడా నిశ్చలంగా ఉండే పరాత్పరుని నిరంతరం ధ్యానించే వారు భవజలధిని దాటుతారు.

రాజేంద్రా ! ఇంతవరకూ మృత్యుభీతితోకదా నువ్వు బాధపడుతున్నావు. జన్మమువెన్నాడుతూ మృత్యువు వస్తూనే ఉంటుంది. ఈ విషయం గ్రహించి ఆ పురుషోత్తముని నిరంతరం ధ్యానించే వారికి జనన మరణభీతి ఉండదు.

మరొక రహస్యం ఉంది. నీళ్ళకుండలో ఆకాశం ప్రతిబింబిస్తుంది. కుండ బద్దలయితే ఈ ఆకాశం ఏమవుతుంది. అంతే ! దేహంలో ఉండే జీవుడు దేహనాశనంతో పరమాత్మను చేరుతాడు. అందుచేత సర్వబంధాలూ, వాంఛలూ విస్మరించి, హరిస్మరణలో ఉండు. అదే సర్వప్రాణి శరణ్యమార్గం, అని శుకయోగి నిష్క్రమించాడు, అంటూ శౌనకాదిమహామునులకు భాగవతకథానుధారసం అందిస్తున్న మహనీయుడు సూతుడు :

మునిశాపప్రకారం తక్షకుడు బయలుదేరి విప్రవేషంలో వస్తున్నాడు. పరీక్షిన్మహారాజును సర్పవిషంనుండి ఉద్ధరించడానికి వస్తున్న కశ్యపుడనే మంత్రవేత్తను దారిలోకలిసి వానిని వెనుకకు మరలించి పరీక్షిత్తును సమీపించి ఒకఫలం యిచ్చాడు. ఆయన దానిని ఆస్వాదించగా ఆ పండునుండి మహాసర్పంపుట్టి ఆయననుకాటువేసింది. క్షణంలో పరీక్షిత్తు దేహం భస్మమయింది.

అనంతరం ఆయన కుమారుడు జనమేజయుడు తనతండ్రిని సంహరించిన పాములపై క్రోధంతో సర్పయాగం ఆరంభించాడు. అగ్నికుండంలో వందలు, వేలసంఖ్యలో సర్పాలు

చుట్టలు చుట్టుకు పడుతున్నాయి. భీతితో తక్షకుడు ఇంద్రునిశరణువేడగా యజ్ఞం చేయించే అధ్వర్యులు ఇంద్రసమేతం తక్షకుని అగ్నికుండానికి స్వాహా చేయబోగా, అంగీరసుడు వచ్చి :

జనమేజయమహారాజా! ఇంక ఈ యాగం ఆపు. చావుపుట్టుకలు సహజాలు. అందుకు ఎవరినో బాధ్యులను చేసి హింసించ నవసరంలేదు, అని శాంతచిత్తుని చేశాడు.

అంతతో జనమేజయుడు సర్పయాగం సమాప్తంచేసి, నిర్మలహృదయుడై హరిపద సేవా తత్పరుడయాడు.

# వేదవ్యాసుడు

మహామునులారా! భాగవతపురాణం ముగించబోయే ముందు మీకందరికీ సర్వ పురాణేతిహాసస్రష్ట అయిన వ్యాసమహర్షిని గురించిచెప్పాలి.

ప్రప్రథమంగా చతుర్ముఖప్రజాపతి హృదయంలో ఒక నాదం పుట్టింది. ఆనాదాన్ని ఉపాసించి యోగీశ్వరులు ముక్తులయ్యారు. ఆ నాదం అకార ఉకార మకార రూపమయిన 'ఓం' కారంగా ప్రకాశించింది.

దానినుండి ప్రజాపతి అకారాది క్షకారాంతం వర్ణసమామ్నాయం సృష్టించి, ఆ అక్షరాలతో నాలుగువేదాలూ అందించాడు. ప్రజాపతి కుమారు లయిన బ్రహ్మవాదు లందరూ వేదాధ్యయనంచేస్తూ,తమశిష్యులకు ఉపదేశిస్తూ వచ్చారు.

ఈవిధంగా ప్రతి యుగంలోనూ మహర్షులు వేదాధ్యయనంతో గడిపేవారు. అయితే నాలుగువేదాలూ అభ్యసించగల శక్తి అందరికీ ఉండదని గ్రహించి, వ్యాసమహర్షి వేదాలను ఋగ్యజు స్సామ అధర్వాలుగా విభజించి పైల, వైశంపాయన, జైమిని, సుమంతులనే శిష్యులకు ఉపదేశించాడు.

పైలుడు ఋగ్వేదాన్ని తన శిష్యుడైన బాష్కలునికి, ఈయన తన శిష్యులయిన బోధ్య, యాజ్ఞవల్క్య, పరాశర, అగ్నిమిత్రులకు నాలుగు భాగాలుగా అందించాడు.

వైశంపాయనుని శిష్యులు యజుర్వేదపారగులై నిఖిల క్రతువులకూ అధ్వర్యు లవుతూవచ్చారు.

జైమిని అందించిన సామవేదాన్ని వాని శిష్యులు వేయిశాఖలు చేశారు. సుమంతుడు అధర్వవేదాధ్యాపనం చేశాడు.

ఇక పురాణాల విషయం—

బ్రహ్మ, పద్మ, విష్ణు. శివ, భాగవత, భవిష్యోత్తర, నారద, మార్కండేయ, అగ్ని, బ్రహ్మకైవర్త, లింగ, వరాహ, స్కాంద, వామన, కూర్మ, మత్స్య, బ్రహ్మాండ గరుడనామాలతో పద్దెనిమిది పురాణాలు. ఇవన్నీ పరమేశ్వర గుణకీర్తనం చేసేవే. కనక యివి చదివినా విన్నా పరమ పురుషలోకం చేరుతారు

మహాపురుషులకూ, యోగులకూ లభించని చిరంజీవిత్వం సాధించిన మహర్షి మార్కండేయు డొక్కడే. ప్రళయవేళ ఆయన పరమాత్మ హృదయంలో లీనమై సృష్టి ప్రారంభవేళకు మళ్ళీ అవతరిస్తూ ఉంటాడు.

ఇక మనకు కనిపించే సూర్యు డున్నాడే, ఈయన చైత్రమాసంలో ధాత అనే పేరుతోనూ, వైశాఖంలో అర్యమనామంతో, జ్యేష్ఠమాసంలో మిత్ర అనే పేరుతోనూ, ఆషాఢంలో వరుణ, శ్రావణంలో ఇంద్ర, భాద్రపదంలో వివస్వంతుడు, ఆశ్వయుజంలో పూష, కార్తీకంలో విష్ణు, మార్గశీర్షంలో అర్యమ, పుష్యమాసంలో భగ, మాఘంలో పూష, ఫాల్గుణంలో క్రతునామాలతో విరాజిల్లుతాడు. ఇన్ని రూపాలతో లోకానికి కాంతి వెదజల్లే ఆ సూర్యభగవానుడు సాక్షాన్నారాయణ స్వరూపుడే అని గ్రహించి ఆరాధించాలి, అని సూతుడు శౌనకాదులకు కలిపాపహరమయిన భాగవత మహాపురాణం వినిపించి సంతుష్టులను చేసి తాను కృతార్థుడయాడు.

జనకసుతా హృచ్చోరా
జనకవచోలబ్ధవిపిన, శైలవిహారా
జనకామిత మందారా
జననాదిక నిత్యదుఃఖచయ సంహారా!

బమ్మెర పోతనామాత్యుల భాగవతం ఆధారంగా
పురాణపండ రామమూర్తి, కాశీ అన్నపూర్ణమ్మల తనూజుడు
సూర్యనారాయణప్రకాశదీక్షితులు చేసిన వచనానుసరణం
సంపూర్ణం.

---

# గజేంద్రస్తుతి

ఎవ్వని చేజనించు జగ మెవ్వనిలోపలనుండు లీనమై
యెవ్వనియందు డిందు పరమేశ్వరు డెవ్వడు మూలకారణం
బెవ్వ డనాది మధ్య లయు డెవ్వడు సర్వము తానయైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్.

ఒకపరి జగములు వెలినిడి
ఒకపరి లోపలికి గొనుచు నుభయము దానై
సకలార్థసాక్షియగు నయ్య
కలంకుని ఆత్మమయుని నర్థి దలంతున్.

లోకంబులు లోకేశులు
లోకస్థులు తెగిన దుది నలోకంబగు
పెంజీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగు నతనినే సేవింతున్.

నర్తకుని భంగి పెక్కగు
మూర్తులతో నెవ్వడాడు మునులు దివిజులుం
కీర్తింప నేర రెవ్వని
వర్తన మొరు లెరుగ రట్టివాని నుతింతున్.

ముక్తసంగులైన మునులు
దిదృక్షులు సర్వభూతహితులు
సాధుచిత్తు లసదృశవ్రతాఢ్యులై
కొల్తు రెవ్వని దివ్యపదము వాడు దిక్కునాకు.

భవము దోషంబు రూపంబు గర్మంబు
నాహ్వయములు గుణము నెవ్వనికిలేక

జగముల గలిగించు నమయించు కొరకునై
నిజమాయ నెవ్వ డిన్నియును దాల్చు
ఆ పరేశునకు అనంతశక్తికి
బ్రహ్మ కిద్ధరూపికి రూపహీనునకును
చిత్రచారునికి సాక్షికి ఆత్మరుచికిని
పరమాత్మునకు పరబ్రహ్మమునకు.

మాటలను నెరుకల మనముల జేరంగగాని
శుచికి నత్యగమ్యు డగుచు
నిపుణుడైన వాని నిష్కర్మతకు
మెచ్చువాని కే నొనర్తు వందనములు.

శాంతున కపవర్గసౌఖ్యసంవేదికి నిర్వాణభర్తకు నిర్విశేషునకు
ఘోరునకు గూఢునకు గుణధర్మికి సౌమ్యున కధిక విజ్ఞానమయున
కఖిలేంద్రియద్రష్ట కధ్యక్షునకు బహుక్షేత్రజ్ఞునకు దయాసింధుమతి
మూలప్రకృతి కాత్మమూలున కఖిలేంద్రియజ్ఞాపకునకు దుఃఖాంతకృతి

నెరి నసత్య మనెడి నీడతో
వెలుగుచునుండు నెక్కటికి మహోత్తరునకు
నిఖిలకారణునకు నిష్కా
రణునకు నమస్కరింతు నన్ను మనుచుకొరకు.

యోగాగ్నిదగ్ధకర్ములు
యోగీశ్వరు లే మహాత్ము నొండెరుగక
నద్యోగ విభావిత మనముల
బాగుగ వీక్షింతు రట్టి పరము భజింతున్.

సర్వాగ మామ్నాయ జలధికి నపవర్గ మయునికి నుత్తమ మందిరున
నకల గుణారణిచ్ఛన్న బోధాగ్నికి తనయంత రాజిల్లు ధన్యమతికి

గుణ లయోద్దీపిత గురుమానసునకు సంవర్తిత కర్మ నిర్వర్తితునకు
దిశలేని నాబోటి పశువుల పాపంబు లడచువానికి సమస్తాంతరాత్ముడై

వెలుంగు వాని కచ్ఛిన్నునకు భగవంతునకు తనూజ పశునివేశ
దారసక్తు లయినవారి కందగరాని వాని కాచరింతు వందనములు.
ఎర ధర్మ కామార్థ వర్జితకాములై విబుధు లెవ్వాని సేవించి యిష్ట
గతి బొందుదురు చేరి కాంక్షించు వారి కవ్యయదేహ మిచ్చు వెవ్వాడు కరుణ
ముక్తాత్ము లెవ్వని మునుకొని చింతింతు రానందవార్ధి మగ్నాంతరంగు
లేకాంతు లెవ్వని నేమియు గోరక భద్రచరిత్రంబు పాడు చుందు
రా మహేశు నాద్యు నవ్యక్తు నధ్యాత్మయోగగమ్యు పూర్ణు నున్నతాత్ము
బ్రహ్మమయిన వాని పరుని అతీంద్రియు ఈశు స్థూలు సూక్ష్ము నే భజింతు.

పావకుం డర్చుల భానుండు దీప్తుల నెబ్బంగి నిగిడింతు రెట్లడంతు
రాక్రియ ఆత్మకరావళిచేత బ్రహ్మాదుల వేల్పుల నఖిల జంతు
గణముల జగముల ఘన నామ రూప భేదములతో మెఱయించి తగనడంచు
నెవ్వడు మనము బుద్ధీంద్రియములు తానయి గుణ సంప్రవాహంబు నెరపు

స్త్రీ నపుంనక పురుషమూర్తియును గాక
తిర్య గమర నరాది మూర్తియును గాక
కర్మ గుణ భేద సద సత్ప్రకాశిగాక
వెనుక నన్నియు తానగు విభు దలంతు.

కల డందురు దీనుల యెడ
కల డందురు పరమయోగి గణముల పాలన్
కల దందు రన్నిదిశలను
కలడు కలండనెడు వాడు గలడో లేడో?

కలుగడే నాపాలి కలిమి సందేహింప కలిమి లేములు లేక కలుగువాడు
నా కడ్డపడ రాడె నలినసాధువులచే పడిన సాధుల కడ్డ పడెడువాడు

35L79



చూడడే నాపాటు జూపుల జూడక చూచువారల గృప జూచువాడు
లీలతో నా మొరాలింపడే మొరుగుల మొర లెరుంగుచు తన్ను మొరగువాడు

అఖిల రూపముల్ తన రూపమైనవాడు
ఆది మధ్యాంతములు లేక యడరువాడు
భక్తజనముల దీనుల పాలివాడు
వినడె చూడడె తలపడె వేగరాడె!

విశ్వకరు విశ్వదూరుని
విశ్వాత్ముని విశ్వవేద్యు విశ్వ నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు
ఈశ్వరునిం బరమపురుష వే భజియింతున్.

లావొక్కింతయులేదు ధైర్యమువిలోలంబయ్యె
ప్రాణంబులున్ ఠావుల్దప్పెను మూర్ఛవచ్చె తనువుల్ డస్సెన్
శ్రమంబయ్యెడిన్ నీవేతప్ప నితఃపరం బెరుగ
మన్నింపం దగున్ దీనునిన్ రావే యీశ్వర కావవే వరద!
సంరక్షింపు భద్రాత్మకా!

వినుదట జీవుల మాటలు
చనుదట చనరాని చోట్ల
శరణార్థుల కో యనుదట
పిలిచిన సర్వము కనుదట
సందేహ మయ్యె కరుణావార్ధీ!

ఓ కమలాప్త యో వరద
యో ప్రతిపక్ష విపక్ష దూర
కుయ్యో కవి యోగి వంద్య
సుగుణోత్తమ యో శరణాగ[illegible]
యో మునీశ్వర మనోహర [illegible]విమలప్రభావ!
రావే కరుణింపవే తలపవే శర[illegible]ని నన్ను [illegible]

36253
CENTRAL LIBRARY ... TIRUPATI.